
www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
హైదరాబాద్ సిటీ
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 65
సంచిక (Issue) : 1
బుధవారం | 17-4-2024
శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం; తిథి: నవమి మ. 3.15 తదుపరి దశమి; నక్షత్రం: ఆశ్లేష పూర్తి; వర్జ్యం: రా. 7.29 నుంచి 9.16 వరకు; దుర్ముహూర్తం: ఉ. 11.49 నుంచి 12.39 వరకు; అమృతఘడియలు: ఉ. 6.10 నుంచి 7.57 వరకు; రాహుకాలం: మ. 12.00 నుంచి 1.30 వరకు; సూర్యోదయం: 6.01, సూర్యాస్తమయం: 6.28
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


శంకర్‌రావు(ఫైల్)

ఘటనా స్థలంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆయుధాలు




అబూజ్‌మడ్‌లో ఎన్‌కౌంటర్ జరిగిన అటవీ ప్రాంతం


మావోయిస్టుల కాల్పుల్లో గాయపడిన పోలీస్

అబూజ్‌మడ్‌లో భారీ ఎన్‌కౌంటర్..
29 మంది మావోయిస్టుల మృతి

నక్సల్స్ చరిత్రలోనే భారీ ప్రాణనష్టం!

మృతుల్లో డీవీసీఎం నేత శంకర్‌రావు.. ఆయన భార్య సుమన కూడా..!

శంకర్‌రావుపై రూ.10 లక్షల రివార్డు.. ఆయన స్వస్థలం భూపాలపల్లి జిల్లా

మావోయిస్టులు వినోద్ బావ్డే, లలిత, మాధవి, రాజు మృతదేహాల గుర్తింపు

వీరిపైనా 10 లక్షల రివార్డులు.. నక్సల్స్ కాల్పుల్లో ఇద్దరు పోలీసులకు గాయాలు

హెలికాప్టర్‌లో రాయ్‌పూర్ ఆస్పత్రికి.. ఆపరేషన్‌కు తెలుగు అధికారి నేతృత్వం

ఏకే 47, ఎస్ఎల్ఆర్, ఇన్సాస్ తుపాకుల సీజ్.. ఎన్నికల్లో విధ్వంసానికి కుట్రలు

సకాలంలో సమాచారం, కూంబింగ్.. మృతదేహాలను ఇంకా తరలించాల్సి ఉంది

వెల్లడించిన కాంకేర్ సీనియర్ ఎస్పీ కళ్యాణ్

నెల వ్యవధిలో 54 మంది నక్సల్స్.. గడిచిన మూడున్నర నెలల్లో 79 మంది మృతి

చర్ల, ఏప్రిల్ 16: దండకారణ్యం మరోమారు నెత్తురోడింది. ఒకప్పుడు గూగుల్ మూడోకంటికి కూడా అందని విధంగా.. నక్సల్స్‌కు కంచుకోటగా ఉన్న అబూజ్‌మడ్‌లో మంగళవారం జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 29 మంది మావోయిస్టులు మృతిచెందారు. మృతుల్లో జయశంకర్-భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగకు చెందిన సిరిపెల్లి సుధాకర్ అలియాస్ శంకర్‌రావు ఉన్నారు. ఆయన భార్య, ఆదిలాబాద్ జిల్లా హత్నూర్‌కు చెందిన దాసర్వర్ సుమన అలియాస్ రజిత కూడా మృతి చెందినట్లు తెలుస్తోంది. బస్తర్ రేంజ్ ఐజీ పి.సుందర్‌కుమార్, కాంకేర్ సీనియర్ ఎస్పీ ఐ.కళ్యాణ్ ఎలిసెల కథనం ప్రకారం.. ఈ నెల 19న మొదటి దశ లోక్‌సభ పోలింగ్‌లో భాగంగా బస్తర్ రీజియన్‌లో ఎన్నికలు జరగనున్నాయి. నక్సల్స్ పరంగా ఈ రీజియన్‌లోని నారాయణ్‌పూర్ అత్యంత సమస్యాత్మక ప్రాంతం. రెండో దశ ఎన్నికల్లో భాగంగా కాంకేర్‌లో ఈ నెల 26న ఎన్నికలు జరగనున్నాయి. ఈ ప్రాంతాల్లో ఎన్నికలను బహిష్కరించాలని కొన్ని రోజులుగా మావోయిస్టులు కరపత్రాలు, లేఖలను విడుదల చేస్తున్నారు. సోమవారం దండకారణ్యంలో బంద్‌కు పిలుపునిచ్చారు. ఎన్నికల రోజు విధ్వంసాలకు కుట్రలు పన్నారనే సమాచారంతో చోటాబేటియా ఠాణా పరిధిలోని బినాగూడ, చోటాబేటియా అడవుల్లో సోమవారం నుంచి బీఎస్ఎఫ్, డీఆర్జీ బలగాలతో కూంబింగ్ ప్రారంభించినట్లు

మిగతా 2వ పేజీలో...


తల్లిదండ్రులు సురేష్‌రెడ్డి, మంజులతతో అనన్యరెడ్డి


టాపర్ శ్రీవాత్సవ


2వ ర్యాంకు అనిమేష్

అనన్య ప్రతిభ

సివిల్స్‌లో మూడో ర్యాంకు సాధించిన పాలమూరు యువతి

స్వీయ సన్నద్ధతతో తొలి ప్రయత్నంలోనే ఘనత.. తెలుగు రాష్ట్రాలకు చెందిన 40 మంది ఎంపిక!

టాపర్.. ఉత్తరప్రదేశ్ యువకుడు శ్రీవాత్సవ.. రెండో స్థానంలో ఒడిసాకు చెందిన అనిమేష్

కేరళ వాసి సిద్దార్థ్‌కు 4వ ర్యాంకు.. ప్రస్తుతం ఐపీఎస్.. ఇంట్లో చెప్పకుండానే సివిల్స్‌కు హాజరు

యూపీఎస్సీ ఫలితాల వెల్లడి.. దేశవ్యాప్తంగా అర్హత సాధించిన 1,016 మంది

మీ కృషి దేశ భవిష్యత్తును తీర్చిదిద్దుతుంది.. విజేతలను అభినందిస్తూ ప్రధాని మోదీ ట్వీట్

సేవే లక్ష్యం.. అది సివిల్స్ ద్వారానే సాధ్యం.. ఆత్మవిశ్వాసంతో లక్ష్యాన్ని అందుకున్నా

రోజుకు 12 నుంచి 14 గంటలు చదివా.. సొంత నోట్స్ ఆధారంగానే పరీక్షలకు

నా చిన్ననాటి కల నెరవేరింది: అనన్య.. ప్రత్యేక అభినందనలు తెలిపిన సీఎం రేవంత్

సివిల్స్‌లో మెరిసిన తెలంగాణ యువత

కరీంనగర్ వాసి సాయికిరణ్‌కు 27వ ర్యాంకు

తల్లి బీడీ కార్మికురాలు.. కొడుకు ఐఏఎస్!

వికారాబాద్ వాసి తరుణ్‌కు 231వ ర్యాంకు

పేద కుటుంబం.. తల్లిదండ్రులు రోజు కూలీలు

జనగామ వాసి కౌశిక్‌కు 82వ ర్యాంకు

నల్లగొండ కుర్రాడు ధీరజ్‌కు 173వ ర్యాంకు

14

సీఐ అవమానించడంతో.. ఉద్యోగానికి రాజీనామా

నాలుగో ప్రయత్నంలో సివిల్స్ 780వ ర్యాంక్

కానిస్టేబుల్ ఉదయ్‌కృష్ణారెడ్డి విజయగాథ

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

అఖిల భారత సర్వీసుల్లో నియామకాలకు నిర్వహించిన సివిల్స్‌లో తెలుగు రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులు ప్రతిభ చాటారు. మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలం పొన్నకల్ గ్రామానికి చెందిన దోనూరు అనన్య రెడ్డి మూడో ర్యాంకుతో మెరిశారు. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం వెలిచాల గ్రామానికి చెందిన నందాల సాయికిరణ్ 27వ, కేఎన్ చందన జహ్నావి 50వ, జనగామ జిల్లా యువకుడు మెరుగు కౌశిక్ 82వ ర్యాంకులు సాధించారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) మంగళవారం విడుదల చేసిన సివిల్స్-23 తుది ఫలితాల్లో తెలుగు రాష్ట్రాల నుంచి 40 మందిపైగా అభ్యర్థులు ఎంపికయ్యారు. అనన్యరెడ్డి స్వీయ సన్నద్ధతతో తొలి ప్రయత్నంలోనే 3వ ర్యాంక్ సాధించడం విశేషం. కాగా, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆదిత్య శ్రీవాత్సవ సివిల్స్ టాపర్‌గా నిలిచారు. అనిమేశ్ ప్రధాన్ (ఒడిశా) 2వ, పీకే సిద్ధార్థ్ రామ్‌కుమార్ (కేరళ) 4వ, రుహానీ (హరియాణ) 5వ ర్యాంకు సాధించారు. సృష్టి దబాస్ (ఢిల్లీ) 6వ, అన్మోల్‌రాథోడ్ (కశ్మీర్) 7వ, ఆశిష్ కుమార్ (8), నౌషీన్ (9), ఐశ్వర్యం ప్రజాపతి (10) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నారు. టాప్-10లో ఆరుగురు మహిళలే ఉన్నారు. కాగా, ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ సహా వివిధ

మిగతా 14వ పేజీలో...

కంటోన్మెంట్ బీజేపీ అభ్యర్థిగా టీఎన్ వంశా తిలక్

లోక్‌సభ ఎన్నికలకు 12వ జాబితా విడుదల

ఏడు సీట్లకు అభ్యర్థుల ప్రకటన 12


గల్ఫ్ కార్మిక సంఘాల నేతలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి

గల్ఫ్ కార్మికులకు ప్రత్యేక బోర్డు!

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వ్యవస్థ

సెప్టెంబరు 17లోగా ఏర్పాటు చేస్తాం

ఇప్పటికే పాలసీ ముసాయిదా సిద్ధం

ఏజెంట్ల మోసాలు అరికట్టేందుకు చర్యలు

గల్ఫ్ కార్మిక సంఘాల నేతలతో సీఎం రేవంత్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీలో చేరికల జాతర

హస్తం గూటికి వేణుగోపాలాచారి 13

రాజేశ్వర్‌రావు, రంగారెడ్డి డీసీసీబీ చైర్మన్ సత్తయ్య..

సీఎం రేవంత్ సుడిగాలి ప్రచారం

ప్రతి నియోజకవర్గానికి 3 సభలు

19న మహబూబ్‌నగర్, మానుకోటలో జనజాతర సభలు

ఇతర రాష్ట్రాల్లోనూ ప్రచారం

నేడు, రేపు కేరళలో.. 13

20న బెంగళూరుకు రేవంత్


14

3 కిలోవాట్లు దాటితే సబ్సిడీ బంద్

2 కిలోవాట్లకే 60 శాతం సబ్సిడీ

కేంద్రం 'సోలార్' మార్గదర్శకాలు

ఏడాది కూడా ఉండదు

లిల్లీపుట్‌గాళ్ల ప్రభుత్వం ఇది.. ముఖ్యమంత్రే జంప్ చేస్తాడేమో

మేం కట్టిన అంబేడ్కర్ విగ్రహం వద్ద జయంతిరోజు ఒక్క పువ్వు కూడా పెట్టలేదు

సిగ్గు లేకుండా సచివాలయంలో కూర్చున్నారు.. లిల్లీపుట్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భాషేమిటి!?

పోలీసుల అరాచకాలను రికార్డు చేస్తున్నాం.. మళ్లీ అధికారంలోకి వస్తాం.. మీ సంగతి చూస్తాం

మేం గెలవకపోతే మీకే నష్టం.. బీఆర్ఎస్‌కు నష్టం లేదు.. సుల్తాన్‌పూర్ సభలో మాజీ సీఎం కేసీఆర్



సంగారెడ్డి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): "కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కూడా ఉండేలా లేదు. కాంగ్రెస్‌లోని ఎమ్మెల్యేలే బీజేపీలో కలిసే పరిస్థితులు ఉన్నాయి. ఎవరు ఎప్పుడు బీజేపీలో చేరతారో తెలియదు. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే జంప్ కొడతారేమో తెలియదు. ఇటువంటి పరిస్థితుల్లో ఎవడు ఎవనికి బీ-టీమో ఆలోచించుకోవాలి" అని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ వ్యాఖ్యానించారు. తమకేమీ ఓర్వలేనితనం లేదని, ఐదేళ్లూ ఈ ప్రభుత్వం ఉండాలని కోరుకుంటున్నామని అన్నారు. అప్పుడే నలుపేందో తెలుపేందో ప్రజలకు తెలుస్తుందన్నారు. పాలిచ్చే బర్రెను వదిలి దున్నపోతును తెచ్చుకున్నట్టు లిల్లీపుట్‌గాళ్లకు అధికారం ఇచ్చారని వ్యాఖ్యానించారు. తన గుడ్లు పీకి ఆడుకుంటామని, తనను పండబెట్టి

మిగతా 12వ పేజీలో...

12

బీఆర్ఎస్ బీ ఫారాలు 18న

అభ్యర్థులకు రూ.95 లక్షల చెక్కులు కూడా

అదే రోజు పార్టీ నేతలతో కేసీఆర్ సమీక్ష

ఎన్నికల ప్రచారం, బస్సు యాత్రపై నిర్ణయం

ఇద్దరు హైకోర్టు అదనపు జడ్జిలకు శాశ్వత హోదా

కేంద్రానికి సుప్రీం కొలీజియం సిఫారసు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టులో అదనపు న్యాయమూర్తులుగా ఉన్న జస్టిస్ జే శ్రీనివాసరావు, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావులు శాశ్వత న్యాయమూర్తులుగా నియమితులు కానున్నారు. ఈ మేరకు వారి పేర్లను సీజేఐ డీవై చంద్రచూడ్, జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ బీఆర్ గవాయ్‌లతో కూడిన సుప్రీంకోర్టు కొలీజియం కేంద్ర ప్రభుత్వానికి మంగళవారం సిఫారసు చేసింది. వారిద్దరూ ఇచ్చిన తీర్పులను సుప్రీంకోర్టు జడ్జిల కమిటీ మదింపు వేసి, 'గుడ్' అన్న రేటింగ్ ఇచ్చిందని కొలీజియం పేర్కొంది. ట్రాక్ రికార్డులు పరిశీలించడంతోపాటు తెలంగాణ హైకోర్టు వ్యవహారాలతో సంబంధం ఉన్న కన్సల్టీ జడ్జిల అభిప్రాయాలు తీసుకున్న తర్వాత ఈ సిఫారసు చేసింది.


విద్యుద్దీపాల వెలుగులో భద్రాద్రి దేవస్థానం

కల్యాణ వైభోగమే!

నేడు భద్రాద్రిలో శ్రీ సీతారాముల కల్యాణం

మిథిలా స్టేడియంలో అన్ని ఏర్పాట్లు పూర్తి

ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు

సమర్పించనున్న సీఎస్ శాంతికుమారి

వేడుక ప్రత్యక్ష ప్రసారానికి ఈసీ అనుమతి

రేపు శ్రీరామ మహాపట్టాభిషేకం

భద్రాచలం, హైదరాబాద్, ఏప్రిల్ 16: భద్రాచల క్షేత్రంలో మహా కమనీయ ఘట్టం.. రాములోరు, సీతమ్మ కల్యాణమే! ఆ శుభ ముహూర్తం వచ్చేసింది. బుధవారమే సీతారాముల కల్యాణం! శ్రీరామ నవమి సందర్భంగా ఈ మహాద్భుత ఘట్టాన్ని వీక్షించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు భద్రాచలానికి

మిగతా 3వ పేజీలో...

నవమి వేడుకలు.. మోదీ వర్సెస్ దీదీ!

పండుగను అడ్డుకుంటున్న బెంగాల్ ప్రభుత్వం.. ప్రధాని మోదీ ఆరోపణ 2

రాష్ట్రంలో ఉద్రిక్తతలు సృష్టించే యత్నాలు.. బెంగాల్ ముఖ్యమంత్రి మమత


12

ఒవైసీ సోదరులను హతమార్చే కుట్ర!

మా ఇద్దరిని అరెస్ట్ చేసి చంపే యత్నాలు

తుపాకీతో కాల్చి లేదా జైల్లో విషం పెట్టి..!

అక్బరుద్దీన్ ఒవైసీ సంచలన వ్యాఖ్యలు

కాంగ్రెస్‌కు 10 బీజేపీకి 5

ఓట్ల పరంగా రెండో స్థానంలో ఉన్నా బీఆర్ఎస్‌కు దక్కేది ఒక్క సీటే

తెలంగాణ ఫలితాలపై ఏబీపీ న్యూస్-సీ ఓటర్ ఒపీనియన్ పోల్

ఏపీలో టీడీపీ కూటమి ప్రభంజనం

25 లోక్‌సభ స్థానాల్లో 20 కూటమికే!

5 సీట్లకే పరిమితం కానున్న వైసీపీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16: లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలోని మొత్తం 17 సీట్లలో అధికారపక్షం కాంగ్రెస్ 42 శాతం ఓట్లతో 10 సీట్లను కైవసం చేసుకుంటుందని ఏబీపీ న్యూస్-సీ ఓటర్ తాజా ఒపీనియన్ పోల్ వెల్లడించింది. మంగళవారం ఈ సర్వే ఫలితాలు వెల్లడయ్యాయి. వీటి ప్రకారం.. ఓట్ల పరంగా 27 శాతం వాటాతో కాంగ్రెస్ తర్వాత రెండో స్థానంలో ఉండే బీఆర్ఎస్ కేవలం ఒక్క సీటుకే పరిమితమవుతుంది. 26 శాతం ఓట్లను సాధించే బీజేపీ ఏకంగా ఐదు సీట్లను గెల్చుకుంటుందని, మజ్లిస్ తనకున్న ఒక స్థానాన్ని నిలుపుకొంటుందని ఈ సర్వే అంచనా

మిగతా 14వ పేజీలో...



మీరు అమాయకులేం కాదు

గత ఉత్తర్వుల్లో కోర్టు ఏం చెప్పిందో తెలియదా?

వారం రోజుల్లో బహిరంగ క్షమాపణలు చెప్పండి

అలాగని ఇప్పుడే మిమ్మల్ని వదిలిపెట్టినట్టు కాదు 2

పతంజలి రాందేవ్ బాబా, బాలకృష్ణపై సుప్రీం ధర్మాసనం

మరోసారి ఆగ్రహం.. విచారణ 23కు వాయిదా

మేడిగడ్డ 7వ బ్లాకు ఎగువన కాఫర్‌డ్యామ్

3

నిర్మాణానికి ముందుకొచ్చిన ఎల్ అండ్ టీ సంస్థ

ఈ ఏడాది బ్యారేజీకి వరద వచ్చేలోపే నిర్మాణం

అన్నారం, సుందిళ్లలో ఆఫ్రాన్ల కింద రంధ్రాలు

మూసివేయడానికి కూడా నిర్మాణ సంస్థ అంగీకారం

రోగులకు తప్పుడు ప్రిస్క్రిప్షన్లు!



» టాప్ ఇన్‌స్టిట్యూట్‌లో 45% మంది డాక్టర్ల తీరు ఇదీ

» వీరందరూ 4- 18ఏళ్ల సర్వీసు ఉన్నవారే: ఐసీఎంఆర్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16: దేశంలోని టాప్ ఇన్‌స్టిట్యూట్‌లలో సేవలందిస్తున్న కొందరు వైద్య నిపుణుల తీరుపై ఐసీఎంఆర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. వీరి తీరు రోగుల పాలిట ప్రాణాంతకంగా మారుతోందని ఆ సంస్థ ఇటీవల నిర్వహించిన తాజా అధ్యయనంలో వెల్లడైంది. ఢిల్లీలోని ఎయిమ్స్, సఫ్దర్‌జంగ్ ఆసుపత్రి సహా 13 ప్రముఖ వైద్యసంస్థల్లో నిర్వహించిన ఈ సర్వేలో 45% మంది వైద్యులు తమ రోగులకు ఇస్తున్న ప్రిస్క్రిప్షన్లు అసంబద్ధంగా ఉంటున్నాయని తేలింది. అధ్యయనంలో భాగంగా ఈ వైద్యసంస్థల్లో మొత్తం 7,800 మంది రోగుల నుంచి ప్రిస్క్రిప్షన్లు సేకరించి పరిశీలించారు. ఆ తర్వాత వారిలో 4,838 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి, 2,171 ప్రిస్క్రిప్షన్లలో లోపాలు ఉన్నట్లు గుర్తించారు. అందులోనూ 475 (9.8%) పూర్తి తప్పులతడకలు కాగా, మరో 102 ప్రిస్క్రిప్షన్లలో ఒకటి కంటే ఎక్కువ రోగ నిర్ధారణలు జరిగాయి. మరికొన్నింటిలో రోగానికి అసలు సంబంధమే లేని మందులు రాశారు. ఇలాంటి లోపభూయిష్ఠమైన ప్రిస్క్రిప్షన్లు ఇచ్చిన డాక్టర్లు అందరూ ఆయా విభాగాల్లో పోస్టు గ్రాడ్యుయేట్లు కావడంతో పాటు సగటున 4 నుంచి 18 ఏళ్లుగా ప్రాక్టీసు చేస్తున్నవారే కావడం విశేషం.

బ్రెస్ట్ కేన్సర్‌తో ఏటా పది లక్షల మరణాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16: బ్రెస్ట్ కేన్సర్ 2040 నాటికి ఏటా 10 లక్షల మరణాలకు కారణం కానుందని ఈ వ్యాధిపై అధ్యయనం కోసం కొత్తగా ఏర్పాటైన లాన్సెట్ కమిషన్ తెలిపింది. 2020కి ముందు ఐదేళ్లలో సుమారు 78లక్షల మంది మహిళలకు బ్రెస్ట్ కేన్సర్ నిర్ధారణ అయిందని, అదే సంవత్సరం 6,85,000 మంది ఈ వ్యాధి బారిన పడి మృతిచెందారని వివరించింది. ఇంకా, 2020లో ప్రపంచ వ్యాప్తంగా 75ఏళ్లు వచ్చేలోగా సగటున ప్రతి 12మంది మహిళల్లో ఒకరికి బ్రెస్ట్ కేన్సర్ నిర్ధారణ అయితే, రాబోయే రోజుల్లో ఈ ముప్పు మరింత పెరగనుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ వ్యాధి కేసులు 2020లో 23లక్షలు ఉండగా, 2040 నాటికి 30లక్షలు దాటుతాయని కమిషన్ అంచనా వేసింది. ఇప్పటినుంచి తగిన నివారణ చర్యలు తీసుకొంటే భవిష్యత్తులో ఇలాంటి కేన్సర్లలో చాలా వాటిని నివారించడం సాధ్యమేనని అభిప్రాయపడింది. ఇతర శరీర భాగాలకు కూడా వ్యాపించే మెటాస్టాటిక్ బ్రెస్ట్ కేన్సర్ సోకిన ఎంతోమంది మహిళలకు దానిపై సరైన అవగాహన లేకపోవడం ఈ చర్యలకు అవరోధంగా మారుతోందని పరిశోధకులు పేర్కొన్నారు.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	41.3	26.2
ఖమ్మం	41.0	25.0
హనుమకొండ	40.5	25.0
సంగారెడ్డి	39.0	27.0

నవమి వేడుకలపై మోదీ వర్సెస్ మమత!

» పండుగను అడ్డుకుంటున్న బెంగాల్ ప్రభుత్వం: ప్రధాని

» రాష్ట్రంలో ఉద్రిక్తతలు సృష్టించే యత్నాలు: బెంగాల్ సీఎం





కోల్‌కతా, ఏప్రిల్ 16: శ్రీరామనవమి వేడుకల విషయమై ప్రధాని మోదీ, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ మధ్య మాటల యుద్ధం సాగుతోంది. బెంగాల్‌లో శ్రీరామ నవమి వేడుకలను మమత ప్రభుత్వం అడ్డుకుంటోందని మోదీ ఆరోపించారు. దీనిని మమత తిప్పికొట్టారు. మత ఉద్రిక్తతలను రెచ్చగొట్టడానికి బీజేపీ ప్రయత్నిస్తోందని ఆమె విమర్శించారు. శ్రీరామ నవమి సందర్భంగా ర్యాలీ చేసుకోవడానికి వీహెచ్‌పీకి కోల్‌కతా హైకోర్టు అనుమతినిచ్చింది. అయితే, గత ఏడాది ర్యాలీ సందర్భంగా చోటుచేసుకున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రదర్శన మార్గాన్ని మార్చాలని బెంగాల్ ప్రభుత్వం సూచించింది. ఈ నేపథ్యంలో మోదీ, మమత మాటల యుద్ధానికి దిగారు. మంగళవారం బలూర్‌ఘాట్‌లో జరిగిన సభలో మోదీ మాట్లాడుతూ.. "కోర్టు ర్యాలీ చేసుకోవచ్చని చెప్పింది కాబట్టి బుధవారం భక్తి శ్రద్ధలతో ప్రదర్శనను విజయవంతం చేయాలి" అని పిలుపునిచ్చారు. నవమి వేడులకు అనుమతివ్వని తృణమూల్ ప్రభుత్వం.. ర్యాలీపై రాళ్లు వేసేవారికి మాత్రం అనుమతిస్తోందని మండిపడ్డారు. మరోవైపు, బీజేపీ ఒత్తిడితోనే ఎన్నికల సంఘం రాష్ట్రంలో అధికారులను మార్చేసిందని, ఇప్పుడేదైనా ఉద్రిక్తతలు తలెత్తితే దానికి ఈసీయే బాధ్యత వహించాలని మమత పునరుద్ఘాటించారు.

"నా పేరు కేజ్రీవాల్.. నేను టెర్రరిస్టుని కాదు"

» జైలు నుంచి ఢిల్లీ సీఎం సందేశం : ఆప్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 : "నా పేరు అరవింద్ కేజ్రీవాల్.. నేను టెర్రరిస్టును కాదు".. మద్యం కుంభకోణం కేసులో ప్రస్తుతం జైలులో ఉన్న ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ఈ మేరకు ఓ సందేశం పంపారని ఆమ్ ఆద్మీ పార్టీ మంగళవారం ప్రకటించింది. జైలులో ఉన్న ఆయనపై నిరంతర నిఘా కొనసాగుతుండడంతో కేజ్రీవాల్ ఈ విధంగా స్పందించారని పేర్కొంది. కేజ్రీవాల్ పంపిన సందేశం గురించి ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ సంజయ్ సింగ్ విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీకి కేజ్రీవాల్ అంటే ఎంత ద్వేషం ఉందో మరోసారి రుజువైందన్నారు. నిత్యం సీసీ కెమెరాల నిఘాలో పెట్టి కేజ్రీవాల్ ఎవరిని కలుస్తున్నారు, ఏం మాట్లాడుతున్నారు? భార్య, కుటుంబసభ్యులతో ఏం మాట్లాడుతున్నారు? అని తెలుసుకుంటున్నారని మండిపడ్డారు. ఓ రాష్ట్ర సీఎం పట్ల ఇలానేనా వ్యవహరించేదని ప్రశ్నించారు. కేజ్రీవాల్ సందేశంపై ఢిల్లీ బీజేపీ ఎంపీ మనోజ్ తివారీ స్పందించారు. తాము కేజ్రీవాల్‌ను టెర్రరిస్టు అనడం లేదని అవినీతిపరుడని మాత్రమే అంటున్నామని ఎద్దేవా చేశారు.

న్యాయప్రక్రియలో మేం జోక్యం చేసుకోం

» దర్యాప్తు సంస్థలను అడ్డుకోవాలన్న విజ్ఞప్తులపై ఈసీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16: ఎన్నికల సమయంలో అన్ని రాజకీయ పార్టీలకు, అభ్యర్థులకు సమాన అవకాశాలు లభించే పరిస్థితులు కల్పించటానికి తాము కట్టుబడి ఉన్నామని ఎన్నికల సంఘం(ఈసీ) స్పష్టం చేసింది. అయితే, న్యాయప్రక్రియలో జోక్యం చేసుకునే చర్యలు మాత్రం తాము తీసుకోబోమని తెలిపింది. అవినీతి పేరుతో తమ నాయకులను లక్ష్యంగా చేసుకొని కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను దుర్వినియోగపరుస్తోందని ప్రతిపక్ష ఇండియా కూటమికి చెందిన పలు పార్టీలు ఇటీవల ఈసీని కలిసి ఫిర్యాదు చేశాయి. దీనిపై జోక్యం చేసుకోవాలని, తమకు న్యాయం చేయాలని కోరాయి. అయితే, రాజకీయ నేతల మీద జరుగుతున్న దర్యాప్తులకు సంబంధించి కోర్టుల పరిధిలో ఉన్న అంశాలపై తాము రాజ్యాంగ మార్గదర్శకాల ప్రకారం వ్యవహరిస్తామని ఈసీ తెలిపింది. న్యాయప్రక్రియలో జోక్యం చేసుకోవటం సరైన పని కాదని పేర్కొంది.

300 కంటే తక్కువ స్థానాల్లోనే కాంగ్రెస్ పోటీ!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16: దేశంలో అతి పురాతన పార్టీ కాంగ్రెస్ ప్రభ క్రమంగా తగ్గుతూ వస్తోంది. ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ 300 స్థానాల్లోపే పోటీచేస్తోంది. సభలో మొత్తం 543 సీట్లు ఉండగా.. మిత్రపక్షాలతో సర్దుబాటు కారణంగా తక్కువ సీట్లకే పోటీచేయాల్సి వస్తోంది. స్వాతంత్ర్యానంతరం ఇన్ని తక్కువ స్థానాల్లో పోటీచేయడం ఇదే మొదటిసారి. 2004లో పొత్తుల కారణంగా అతితక్కువగా 417 స్థానాల్లో బరిలోకి దిగింది. ఇప్పుడు కేవలం 300 స్థానాల్లోపే పోటీ చేస్తోంది. ఇప్పటిదాకా 27 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాల్లో 278 మంది అభ్యర్థులను ప్రకటించగా.. ఏపీ, హరియాణా, బిహార్, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, యూపీ, బెంగాల్ రాష్ట్రాల్లో మరో 20 స్థానాలకు పేర్లు ఖరారు చేయాల్సి ఉంది.

గులకరాయి కేసులో హైడ్రామా!

» పోలీసుల అదుపులో ఐదుగురు మైనర్లు

» మా బిడ్డలకు ఏ పాపమూ తెలియదు

» వైసీపీ జెండాలు పట్టుకుంటే 200 ఇస్తామన్నారు

» మైనర్ల తల్లిదండ్రుల వెల్లడి.. రోడ్డెక్కి నిరసనలు

విజయవాడ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఏపీ ముఖ్యమంత్రి జగన్‌పై విజయవాడ అజిత్‌సింగ్ నగర్‌లో జరిగిన గులకరాయి దాడి కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. నిందితుల ఆచూకీ, ఘటనకు సంబంధించిన వీడియోలు అందజేసిన వారికి రూ.2 లక్షల నజరానాను ప్రకటించిన మర్నాడే కేసుతో సంబంధం ఉందంటూ అజిత్‌సింగ్ నగర్‌లోని వడ్డెర కాలనీకి చెందిన ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరంతా 15-17 ఏళ్ల మధ్య వయసున్న మైనర్లే. వీరిలో ఒక బాలుడు సీఎంపై దాడిచేశాడని, మిగతా నలుగురు అతడి పక్కనే ఉన్నారని పోలీసులు లీకులిస్తున్నారు. ఆ మైనర్ల తల్లిదండ్రులు మాత్రం తమ బిడ్డలకు ఏమీ తెలియదని, పోలీసులు అన్యాయంగా ఇరికిస్తున్నారని వాపోతున్నారు. ఇది మరో కోడికత్తి కేసు అవుతుందేమోనని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కాగా, వడ్డెర కాలనీ నుంచి 11 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. విచారణ అనంతరం వారిలో ఆరుగురిని ఇళ్లకు పంపేశారు. మిగిలిన ఐదుగురూ వారి అదుపులోనే ఉన్నారు. అయితే పోలీసులు ఏదో ఒక రకంగా కేసును ఛేదించామని చెప్పుకొనేందుకే తమ బిడ్డలపై నెపం మోపుతున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ మైనర్ల తల్లిదండ్రులు కూలీలు. పిల్లలు కూడా రోజూ ఏదో ఒక పనికి వెళ్తుంటారు. పనుల నుంచి వచ్చిన తర్వాత ఇంటి నుంచి కదలరని.. అలాంటి వారిని అన్యాయంగా తీసుకెళ్లారని.. గులకరాయి దాడి అభియోగం మోపుతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. జగన్ బస్సుయాత్రతో వచ్చినప్పుడు.. రోడ్డుకు రెండు వైపులా నిలబడి జెండాలు ఊపితే ఒక్కొక్కరికీ రూ.200 చొప్పున ఇస్తామని స్థానిక వైసీపీ నేతలు చెప్పారని, పురుషులకు, యువకులకైతే రూ.200తోపాటు క్వార్టర్ మందు బాటిల్ ఇస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. డబ్బులొస్తాయన్న ఉద్దేశంతోనే తమ పిల్లలనూ తీసుకెళ్లామని అన్నారు. పోలీసులు మాత్రం 'కేసును బ్రేక్ చేశాం' అని మాత్రమే ముక్తసరిగా జవాబిస్తున్నారు. తమ పిల్లలను విడుదల చేయాలని మధ్యాహ్నం నుంచి కాలనీవాసులు రోడ్డెక్కి నిరసన తెలిపారు. ఎన్నికల కోడ్ ఉందని, కేసులు పెడతామని పోలీసులు బెదిరించడంతో ఆందోళన విరమించారు.

29 మంది మావోయిస్టుల మృతి

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఆపరేషన్‌ను ముందుండి నడిపించిన సీనియర్ ఎస్పీ కళ్యాణ్(తెలుగు అధికారి) తెలిపారు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం 1.30 సమయంలో అబుజ్‌మడ్ ప్రాంతంలో పోలీసులపైకి మావోయిస్టులు కాల్పులు జరిపారు. పోలీసులు ఎదురుకాల్పులకు దిగారు. "సాయంత్రం 5.30 వరకు.. సుమారు 4 గంటల పాటు ఇరువైపులా కాల్పులు కొనసాగాయి. మావోయిస్టుల వైపు కాల్పులు ఆగిపోవడంతో.. మా బలగాలు గాలింపు చేపట్టాయి. ఈ క్రమంలో.. మొత్తం 29 మంది మావోయిస్టుల మృతదేహాలను కనుగొన్నాం. ఘటనా స్థలిలో ఒక ఏకే47 సహా 21 ఆయుధాలను సీజ్ చేశాం" అని ఆయన వివరించారు. మృతుల్లో శంకర్‌రావు, సుమన, లలిత, వినోద్‌బావ్డే, మాధవి, లలిత, రాజు ఉన్నట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. "శంకర్‌రావుపై రూ.8 లక్షల రివార్డు ఉంది. ఆయన వద్ద లభించిన ఆయుధం(ఏకే-47)తో కలిపితే.. రూ.10 లక్షల రివార్డు. అలాగే.. లలిత, వినోద్ బావ్డేలపైనా ఆయుధాలతో కలిపి చెరో రూ.10 లక్షల చొప్పున రివార్డు ఉంది" అని కళ్యాణ్ వెల్లడించారు. నక్సల్స్ కాల్పుల్లో బీఎస్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ రమేశ్ చౌదరి మోకాలికి, డీఆర్జీ కానిస్టేబుల్ సూర్యకాంత్ రెండు తొడల్లో తూటాలు దూసుకుపోయాయి. వారిద్దరినీ మెరుగైన వైద్యం కోసం హెలికాప్టర్‌లో రాయ్‌పూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగా ఉందని పోలీసులు వెల్లడించారు. "మాకున్న సమాచారం ప్రకారం ఎన్‌కౌంటర్‌లో 50 మంది నక్సల్స్ పాల్గొన్నారు. ఘటనాస్థలి నుంచి పరారైన వారి కోసం కూంబింగ్ చేపట్టాం. మావోయిస్టుల మృతదేహాలను బేస్‌క్యాంప్‌నకు తీసుకువచ్చే ఏర్పాట్లు చేస్తున్నాం" అని బస్తర్ రీజియన్ ఐజీ సుందర్‌రాజ్ తెలిపారు.

తొలిసారి భారీ ప్రాణనష్టం

నక్సల్స్ చరిత్రలోనే ఇది అతి భారీ ప్రాణనష్టంగా తెలంగాణకు చెందిన గ్రేహౌండ్స్ వర్గాలు చెబుతున్నాయి. గతంలో ఎక్కడ భారీ ఎన్‌కౌంటర్ జరిగినా.. గ్రేహౌండ్స్ ఉనికి ఉండేదని, మంగళవారం నాటి కాల్పుల్లో బీఎస్ఎఫ్, డీఆర్జీ మాత్రమే పాల్గొన్నట్లు వివరించాయి. "2016లో ఏఓబీలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 27 మంది మావోయిస్టులు చనిపోయారు. అంతకు ముందు గడ్చిరోలిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 26 మంది నక్సల్స్ మృతిచెందారు" అని పేర్కొన్నాయి. కాగా, ఈ ఏడాది మావోయిస్టులకు ప్రతికూలంగా ఉన్నట్లు తాజా ఘటనలు చెబుతున్నాయి. మంగళవారం నాటి ఘటనతో కలిపి.. ఈ మూడున్నర నెలల్లో మహారాష్ట్ర-ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర-తెలంగాణ సరిహద్దుల్లో జరిగిన ఎన్‌కౌంటర్లలో 79 మంది మావోయిస్టులు చనిపోయారు. ఛత్తీస్‌గఢ్‌లో మంగళవారం నక్సలైట్లకు వ్యతిరేకంగా విజయవంతమైన ఆపరేషన్ నిర్వహించినందుకు భద్రత బలగాలను కేంద్ర హోం మంత్రి అమిత్ షా అభినందించారు. నక్సలైట్ల సమస్య నుంచి ఛత్తీస్‌గఢ్‌ను, దేశాన్ని విముక్తి కలిగించడానికి మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కాగా, ఛత్తీస్‌గఢ్‌లోని నక్సల్ ప్రభావిత బస్తర్‌లో కట్టుదిట్టమైన భద్రత మధ్య ఎన్నికల సిబ్బందిని హెలికాప్టర్లలో పోలింగ్ బూత్‌లకు తరలించే ప్రక్రియ ప్రారంభమైంది. మొదటి దశలో ఈనెల 19న ఈ నియోజకవర్గంలో ఎన్నికలు జరగనున్నాయి. ఈ నియోజకవర్గ పరిధిలో ఉన్న బీజాపూర్, సుక్మా జిల్లాల్లోని సున్నితమైన ప్రాంతాలకు ఈవీఎంలను తరలించే ప్రక్రియను అధికారులు ప్రారంభించినట్లు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. గతంలో ఎన్నికల సందర్భంగా ఈ రెండు జిల్లాల్లోనూ నక్సల్స్ దాడి చేసిన ఘటనలు అనేకం ఉన్నాయి.



ఎన్‌కౌంటర్‌లో గాయపడిన భద్రతా అధికారికి ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం విజయ్ శర్మ పరామర్శ

సుమన మృతిపై ప్రకటన చేయని పోలీసులు

ఆదిలాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో ఆదిలాబాద్ జిల్లాకు చెందిన మావోయిస్టు దళ సభ్యురాలు, శంకర్‌రావు భార్య దాసర్వర్ సుమన అలియాస్ రజిత మృతిచెందినట్లు తెలుస్తోంది. అయితే.. ఆదిలాబాద్ జిల్లా పోలీసులు ఆమె మృతిని ఇంకా ధ్రువీకరించలేదు. జిల్లాలోని బజార్‌హత్నూర్ మండలం డేడ్రా గ్రామానికి చెందిన సుమన 30 ఏళ్ల క్రితం నక్సల్స్ ఉద్యమం పట్ల ఆకర్షితురాలయ్యారు. అలా అజ్ఞాతంలోకి వెళ్లిన ఆమె మళ్లీ స్వస్థలానికి రాలేదని తెలుస్తోంది. సుమనపై రూ.5 లక్షల రివార్డు ఉన్నట్లు ఆదిలాబాద్ పోలీసులు తెలిపారు.

ముగిసిన సిరిపెల్లి ప్రస్థానం

చిట్యాల, ఏప్రిల్ 16: ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన సిరిపెల్లి సుధాకర్ అలియాస్ శంకర్‌రావు స్వస్థలం జయశంకర్-భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని చల్లగరిగ గ్రామం. ఆయన తల్లిదండ్రులు సిరిపెల్లి ఓదెలు, రాజపోచమ్మ. శంకర్‌రావు స్థానిక పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న సమయంలోనే.. పీపుల్స్‌వార్ గ్రూప్(ప్రస్తుతం మావోయిస్టు పార్టీ) సిద్ధాంతాలకు ఆకర్షితుడై.. సానుభూతిపరుడిగా పనిచేసేవారు. తన చిన్నమ్మ కుమారుడు కలికోట శంకర్ అప్పటికే పీపుల్స్‌వార్‌లో చురుగ్గా ఉన్నారు. దాంతో.. శంకర్‌రావు కూడా 1997-98లో అజ్ఞాతంలోకి వెళ్లారు. అప్పటి నుంచి శంకర్‌రావు స్వగ్రామానికి రాలేదని స్థానికులు చెబుతున్నారు.

రాకెట్ ఇంజన్లకు తేలికపాటి సీ-సీ నాజిల్స్

ఇంజిన్ టెక్నాలజీలో ఇస్రో కీలక పురోగతి


బెంగళూరు, ఏప్రిల్ 16: రాకెట్ ఇంజన్ టెక్నాలజీలో ఇస్రో సరికొత్త పురోగతి సాధించింది. రాకెట్ ఇంజిన్ల కోసం తేలికపాటి కార్బన్-కార్బన్ (సీ-సీ) నాజిల్‌ను అభివృద్ధి చేసింది. తిరువనంతపురానికి చెందిన విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ (వీఎస్ఎస్‌సీ) ఈ సరికొత్త నాజిల్‌ను ఆవిష్కరించింది. ఇది రాకెట్ ఇంజిన్ల కీలక పారామీటర్లను, థ్రస్ట్ స్థాయిలను పెంచుతుందని తద్వారా లాంచ్ వాహనాల్లో పేలోడ్ సామర్థ్యాన్ని పెంచవచ్చని ఇస్రో తెలిపింది. ఈ సరికొత్త నాజిల్స్ పీఎస్ఎల్వీ రాకెట్లకు ఎంతో కీలకం కానున్నాయని, దీని వల్ల ఈ రాకెట్ల ద్వారా అంతరిక్షంలోకి పంపే పేలోడ్ల సామర్థ్యాన్ని మరో 15 కిలోల మేర పెంచవచ్చని ఇస్రో వెల్లడించింది. ఇదిలా ఉండగా, రోదసిలో అంతరిక్ష వ్యర్థాలను పూర్తిగా తగ్గించే దిశగా ఇస్రో అడుగులు వేస్తోంది. 2030 నాటికి శకలాలు లేని అంతరిక్ష యాత్రలు చేపట్టాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుందని ఇస్రో చైర్మన్ సోమనాథ్ మంగళవారం ప్రకటించారు. రాబోయే రోజుల్లో అంతరిక్ష ప్రయోగాలకు సంబంధించి ఇస్రో స్పష్టమైన ప్రణాళికను రూపొందించిందని, అంతరిక్షంలో వ్యర్థాలను తొలగించేందుకు జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు.

మీరు అమాయకులేం కాదు

» వారం రోజుల్లో బహిరంగ క్షమాపణలు చెప్పండి

» అలాగని ఇప్పుడే మిమ్మల్ని వదిలిపెట్టినట్టు కాదు

» రాందేవ్‌బాబా, బాలకృష్ణపై సుప్రీంకోర్టు ఆగ్రహం



న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పతంజలి ఆయుర్వేద సంస్థ వ్యవస్థాపకుడు రాందేవ్ బాబా, ఎండీ ఆచార్య బాలకృష్ణపై సుప్రీంకోర్టు మంగళవారం మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది. వారు గత ఉత్తర్వుల్లో కోర్టు ఏం చెప్పిందో తెలుసుకోలేనంత అమాయకులేం కాదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. వారం రోజుల్లోగా బహిరంగ క్షమాపణలు చెబుతూ ప్రకటన ఇవ్వాలని వారిని ఆదేశించింది. అల్లోపతి వైద్య విధానాల గురించి పతంజలి సంస్థ తప్పుదోవ పట్టించేలా మీడియా ప్రకటనలు చేసిందంటూ గత ఏడాది నవంబరులో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై అప్పుడే పతంజలి సంస్థను కోర్టు మందలించింది. ఆ తర్వాతా పతంజలి సంస్థ కోర్టు ఆదేశాలను ఉల్లంఘించడంతో ఇద్దరూ కోర్టులో హాజరుకావాలని ఆదేశించింది. ఏప్రిల్ 2న రాందేవ్ బాబా, బాలకృష్ణ కోర్టులో హాజరయ్యారు. ఈ క్రమంలో రాందేవ్ బాబా క్షమాపణలు చెప్పగా అంగీకరించబోమని ధర్మాసనం స్పష్టం చేసింది. ఏప్రిల్ 10న మళ్లీ హాజరై క్షమాపణలు చెప్పినా అంగీకరించలేదు. ఈ కేసుపై మంగళవారం జస్టిస్ హిమా కోహ్లీ, జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లా ధర్మాసనం విచారణ చేపట్టింది. 'కోర్టు ఆదేశాలను అగౌరవపర్చాలన్నది మా ఉద్దేశం కాదు. మేం చేసిన తప్పునకు బేషరతుగా క్షమాపణలు చెబుతున్నామ'ని ధర్మాసనం ముందు రాందేవ్ బాబా, బాలకృష్ణ తెలిపారు. దీనికి ధర్మాసనం అంగీకరించలేదు. 'సమాజంలో మీకు చాలా గౌరవం ఉంది. మీరు చేసే ప్రతి పనిని ప్రజలు గమనిస్తూ ఉంటారు. మన సంస్కృతిలో వివిధ వైద్య విధానాలు ఉన్నాయి. ప్రజలు అన్ని పద్ధతులూ పాటిస్తారు. అలాంటప్పుడు వేరే పద్ధతి సరికాదని మీరెలా చెబుతారు.. నయం చేయలేని వ్యాధులపై ప్రకటనలు ఇవ్వకూడదని మీకు తెలియదా? మీది బాధ్యతారాహిత్యం. మీరు చెప్పిన క్షమాపణలను పరిశీలిస్తాం. అయితే ఇప్పుడే మిమ్మల్ని వదిలిపెట్టినట్లు కాదు. ఈ వ్యవహారంలో తప్పును అంగీకరిస్తూ వారం రోజుల్లోగా బహిరంగ క్షమాపణలు చెబుతూ ప్రకటన ఇవ్వండి" అని ధర్మాసనం రాందేవ్, బాలకృష్ణను ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 23న చేపడతామని తెలిపింది.

బ్యాలెట్ పత్రాలంటే మళ్లీ పాత రోజులే

అప్పటి అక్రమాలను ఎలా మరిచిపోతాం.. మానవ జోక్యం ఉంటే లోపాలే

» వీవీప్యాట్ స్లిప్‌ల లెక్కింపుపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 16: ఓట్ల నమోదు, లెక్కింపులో పారదర్శకత సాధించే విషయమై మంగళవారం సుప్రీంకోర్టులో ఆసక్తికరమైన వాదనలు సాగాయి. తాము వేసిన ఓటు అనుకున్న అభ్యర్థికే పడిందని, దాని లెక్కింపు కూడా జరిగిందన్న నమ్మకం ఓటర్లలో కలిగించేందుకు ఈవీఎంలలో నమోదైన ఓట్లతో పాటు, వీవీప్యాట్ మిషన్లలోని పేపర్ స్లిప్‌లన్నింటినీ లెక్కించాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యాలపై వాదనలు జరిగాయి. ప్రస్తుతం ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని కేవలం అయిదు వీవీప్యాట్‌ల స్లిప్‌లను లెక్కిస్తుండగా, దానికి బదులుగా అన్ని పేపర్ స్లిప్‌లను లెక్కించాలని పిటిషనర్లు కోరారు. అసోసియేషన్ ఫర్ డెమొక్రాటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్)తో పాటు సామాజిక ఉద్యమకారుడు అరుణ్‌కుమార్ అగర్వాల్ ఈ వ్యాజ్యాలను దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాల ధర్మాసనం రెండు గంటల పాటు వాదనలు ఆలకించింది. తొలుత ఏడీఆర్ తరఫున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపిస్తూ.. కావాల్సిన విధంగా ఫలితాలు వచ్చేలా ఈవీఎంలలో చిప్స్‌ను అమర్చడం, మాల్‌వేర్ ప్రోగ్రాంల ద్వారా మ్యాన్యుపులేట్ చేయడం వంటివి జరగడానికి అవకాశం ఉందన్నారు. దీనిని నివారించడానికి మూడు అంశాలను పరిశీలించాలని కోరారు. మునుపటి బ్యాలెట్ పత్రాల ఓటింగ్ విధానానికి వెళ్లడం, వీవీప్యాట్ ద్వారా వచ్చిన పేపరు స్లిప్‌ను ఓటరే బ్యాలెట్ బాక్సులో వేయడం, వీవీప్యాట్‌లోని స్లిప్ బాక్సులో పడే విధానం ఓటరుకు కనిపించేలా గాజు పరికరాన్ని ఏర్పాటు చేయడం వంటి మార్గాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. ఈవీఎంలో లెక్కించిన ఓట్లకు, వీవీప్యాట్‌ల ద్వారా లెక్కించిన స్లిప్‌లకు తేడా వస్తే స్లిప్‌లనే ప్రామాణికంగా తీసుకోవాలని సూచించారు. స్లిప్‌లను లెక్కించడానికి ఒక్క రోజు సమయం పట్టినా పెద్ద నష్టమేమీ లేదని అన్నారు. ఇలాంటి కారణాల వల్లనే జర్మనీ, ఇతర యూరోపియన్ దేశాలు బ్యాలెట్ పేపర్లను వాడుతున్నాయని చెప్పారు. దీనిపై జస్టిస్ ఖన్నా స్పందిస్తూ గతంలో బ్యాలెట్ పేపర్ల ద్వారా కలిగిన సమస్యలను గుర్తుచేశారు. బూత్‌లను స్వాధీనం చేసుకోవడం వంటి సంఘటనలు జరిగాయని తెలిపారు. వాటిని మీరు మరిచిపోయారేమోగానీ తాము మరిచిపోలేదని అన్నారు. మానవ జోక్యం, పక్షపాతం వల్లనే సమస్యలు వస్తాయని, మానవ జోక్యం లేకపోతే యంత్రాలే కచ్చితమైన ఫలితాలను ఇస్తాయని వ్యాఖ్యానించారు. జస్టిస్ దీపాంకర్ దత్తా మాట్లాడుతూ.. యూరోపియన్ దేశాల ఉదాహరణలు ఇక్కడ పనిచేయవని, జర్మనీ జనాభా 6 కోట్లని, తన సొంత రాష్ట్రం పశ్చిమ బెంగాల్ జనాభా అంతకన్నా ఎక్కువని అన్నారు. "ఎవర్నో ఒకర్ని మనం నమ్మాలి. ఈ విధంగా వ్యవస్థను తక్కువచేసి చూపొద్దు" అని వ్యాఖ్యానించారు. 'మానవ జోక్యం ఉంటేనే సమస్యలు వస్తాయి. మానవ బలహీనతలు ఉంటాయి. అందులో పక్షపాతం కూడా ఉంటుంది. మానవ జోక్యం లేకపోతే యంత్రమే సరైన ఫలితాన్ని చెబుతుంది" అని జస్టిస్ ఖన్నా వ్యాఖ్యానించారు. కాగా, ఈవీఎంలను ట్యాంపరింగ్ చేస్తే కఠిన శిక్షలు విధించేలా ప్రత్యేకంగా ఎలాంటి నిబంధనలు లేకపోవడాన్ని జస్టిస్ ఖన్నా గుర్తించారు. "ఇది చాలా తీవ్రమైన విషయం. శిక్షిస్తారన్న భయం ఉండాలి కదా?" అని వ్యాఖ్యానించారు. తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేశారు.

ప్రతిదాడి లేకుండా ప్రతీకారం!



ఇరాన్‌కు వ్యతిరేకంగా కూటమి

» గాజాపై దాడులతో ఇజ్రాయెల్‌పై ఇప్పటికే తీవ్ర ఒత్తిడి ..అందుకే శాంతి వ్యూహం

తమ దేశంపై క్షిపణి వర్షం కురిపించిన ఇరాన్‌పై ప్రతిదాడి చేయబోమని ఇజ్రాయెల్ ప్రకటించింది. ఐక్యరాజ్య సమితిలో ఇజ్రాయెల్ శాశ్వత ప్రతినిధి గిలాడ్ ఎర్డాన్ ఈ విషయంపై స్పష్టతనిచ్చారు. ఆదివారం జరిగిన ఇజ్రాయెల్ క్యాబినెట్ అత్యవసర భేటీలో.. ప్రతిదాడికి సింహభాగం మంత్రులు డిమాండ్ చేసినా.. ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మాత్రం తొందరపాటు ప్రకటనలేమీ చేయలేదు. ప్రస్తుతానికి శాంతిమంత్రం పఠిస్తున్న ఇజ్రాయెల్.. దీర్ఘకాలిక వ్యూహంతో ఇరాన్‌పై ప్రతీకారం తీర్చుకునే అవకాశాలున్నాయని విశ్లేషకుల అంచనా.

వారించిన అమెరికా, ఐరోపా దేశాలు

ఇజ్రాయెల్ దాదాపు రెండు దశాబ్దాలుగా ఇరాన్‌లోని అణుస్థావరాలను టార్గెట్‌గా చేసుకుందనే వాదనలున్నాయి. నిజానికి ప్రపంచ మిలటరీ పవర్‌లో ఇరాన్ 14, ఇజ్రాయెల్ 17 స్థానాల్లో ఉన్నాయి. క్షిపణి రక్షణ కవచాల విషయంలో ఇజ్రాయెల్ ముందంజలో ఉందని శనివారం అర్ధరాత్రి ఇరాన్ దాడితో తేలింది. ఇజ్రాయెల్ ప్రతిదాడికి పాల్పడితే.. పశ్చిమాసియాలో సంక్షోభ పరిస్థితులు నెలకొంటాయి. ఇరాన్ తరఫున కొన్ని.. ఇజ్రాయెల్ తరఫున మరికొన్ని దేశాలు ప్రత్యక్షంగా రంగంలోకి దిగితే.. అది మూడో ప్రపంచ యుద్ధానికి దారితీసే ప్రమాదం ఉందనే ఆందోళనలు వ్యక్తమయ్యాయి. దీనికి తోడు.. ప్రపంచవ్యాప్తంగా చమురు సంక్షోభం తీవ్రమయ్యే పరిస్థితులున్నాయి. దీంతో.. ప్రతిదాడి వద్దంటూ అగ్రరాజ్యం అమెరికాతో పాటు.. బ్రిటన్, ఇతర ఐరోపా దేశాలు ఇజ్రాయెల్‌కు నచ్చజెప్పడంలో సఫలమయ్యాయని విశ్లేషకులు చెబుతున్నారు. గాజాపై భూతల దాడులు ప్రారంభించడంతో ఎదురైన మానవతా సంక్షోభం విషయంలో అంతర్జాతీయంగా విమర్శలనెదుర్కొంటున్న నేపథ్యంలో.. ఇప్పుడు కొంచెం వెనక్కి తగ్గడం వల్ల ప్రపంచ దేశాల సంఘీభావాన్ని పొందవచ్చని ఇజ్రాయెల్ భావిస్తున్నట్లు తెలుస్తోంది.

పరోక్ష ప్రతీకారం..!

పరోక్ష ప్రతీకారానికి ఇజ్రాయెల్ పన్నే వ్యూహాలను గుర్తించడం, ఛేదించడం అంత సులువు కాదు. తమ టార్గెట్‌గా ఉన్నవారు విదేశీ పర్యటనల్లో ఉన్నప్పుడు వారిని అంతమొందించడం తెలిసిందే.! ఇప్పుడు తమపై దాడి చేసిన ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్(ఐఆర్‌జీసీ) అగ్రనాయకులను కూడా ఇలాగే టార్గెట్‌గా చేసుకునే అవకాశాలున్నాయనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అంతేకాదు.. ఐఆర్‌జీసీని అమెరికా గతంలోనే ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది. తాజా దాడితో.. ఇప్పుడు ఆ సంస్థను అంతర్జాతీయ ఉగ్ర సంస్థగా ప్రకటించాలనే డిమాండ్‌ను ఐరాసలో ఇజ్రాయెల్ శాశ్వత ప్రతినిధి లేవనెత్తారు. భద్రతామండలిలో జరిగే ఓటింగ్‌లో.. తమకు అనుకూలంగా ఓట్లను రాబట్టుకోవడానికి ఇజ్రాయెల్ ఇప్పటికే ప్రయత్నాలను ప్రారంభించినట్లు తెలుస్తోంది. మరోవైపు దౌత్యపరంగానూ ఇరాన్‌ను దెబ్బతీసే అవకాశాలు ఇజ్రాయెల్ ముందు ఉన్నాయని అంతర్జాతీయ వ్యవహారాల విశ్లేషకులు చెబుతున్నారు. "హమాస్‌పై యుద్ధానికి ముందు వరకు ఇజ్రాయెల్‌తో సౌదీ అరేబియా సన్నిహితంగా మెలిగింది. ఇప్పుడు ఈ రెండు దేశాల మధ్య దూరం కొంచెం పెరిగినా.. పాత ఒప్పందాలను మళ్లీ పునరుద్ధరించే అవకాశాలున్నాయి. ఇక బహ్రెయిన్, యూఏఈ కూడా ఇజ్రాయెల్‌కు మిత్ర దేశాలుగా ఉన్నాయి. ఇలా అరబ్/గల్ఫ్ దేశాలతో ఇరాన్‌కు వ్యతిరేకంగా ఇజ్రాయెల్ ఓ కూటమిని ఏర్పాటు చేసే అవకాశాలున్నాయి" అని అభిప్రాయపడుతున్నారు. ఇరాన్ తాజా దాడిపైనా.. సౌదీ, యూఏఈ ఇంటెలిజెన్స్ వ్యవస్థలు ఇజ్రాయెల్‌ను ముందుగానే అప్రమత్తం చేయడం గమనార్హం.! -సెంట్రల్ డెస్క్

లారెన్స్ బిష్ణోయ్ అంతు చూస్తాం

» సల్మాన్‌ఖాన్‌ను కలిసిన తర్వాత మహారాష్ట్ర సీఎం శిందే కీలక వ్యాఖ్యలు

ముంబై, ఏప్రిల్ 16: బాలీవుడ్ అగ్రకథానాయకుడు సల్మాన్‌ఖాన్ ఇంటిపై కాల్పుల ఘటనలో గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ హస్తం ఉందని అనుమానాలు వ్యక్తమవుతున్న వేళ మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే కీలక వ్యాఖ్యలు చేశారు. తిహార్ జైల్లో శిక్ష అనుభవిస్తున్న లారెన్స్ బిష్ణోయ్ అంతు చూస్తామని అన్నారు. మంగళవారం ఏక్‌నాథ్ శిందే సల్మాన్‌ఖాన్‌ను ఆయన ఇంటి వద్ద కలిశారు. సల్మాన్‌తో పాటు ఆయన తండ్రి సలీంఖాన్‌ను కలిసి కాసేపు ముచ్చటించారు. అనంతరం సల్మాన్ ఇంటి బయట విలేకరులతో మాట్లాడుతూ, సల్మాన్ ఇంటిపై కాల్పుల ఘటనను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ప్రభుత్వం నుంచి పూర్తి భద్రత కల్పిస్తామని, ఏం భయపడాల్సిన అవసరం లేదని సల్మాన్‌ఖాన్‌కు భరోసా ఇచ్చినట్లు చెప్పారు. నిందితులను అరెస్టు చేశామని, వారిని పూర్తిగా విచారించి దీని వెనుక ఉన్న అసలు కారకులను త్వరలో పట్టుకుంటామని అన్నారు. తాము ఎటువంటి గ్యాంగ్‌లను కానీ గ్యాంగ్ వార్‌లను కానీ సహించమని వారి అంతుచూస్తామని గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్‌ను ఉద్దేశించి ఏక్‌నాథ్ శిందే పేర్కొన్నారు.

మేడిగడ్డ 7వ బ్లాకు ఎగువ భాగాన కాఫర్‌డ్యామ్

- నిర్మాణానికి ముందుకొచ్చిన ఎల్ అండ్ టీ సంస్థ
- ఈ ఏడాది బ్యారేజీకి వరద వచ్చేలోపే నిర్మాణం
- మిగతా బ్లాకులకూ సాంకేతిక పరీక్షలు.. నివేదిక

హైదరాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ బ్యారేజీలోని 7వ బ్లాకుకు ఎగువ భాగంలో కాఫర్‌డ్యామ్ (మట్టితో కట్ట) నిర్మాణానికి ఎల్ అండ్ టీ సంస్థ ఎట్టకేలకు ముందుకొచ్చింది. ఏడో బ్లాకుకు ఎగువన షీట్ పైల్స్(ఇనుప రేకుల)ను భూమిలోకి దించి.. వాటి సహాయంతో కాఫర్‌డ్యామ్ కట్టనున్నారు. గతేడాది అక్టోబరు 21న మేడిగడ్డ బ్యారేజీ కుంగిన విషయం తెలిసిందే. ఈ సందర్భంలో బ్యారేజీలోని 7వ బ్లాకులో 19, 20, 21 నెంబరు పిల్లర్లు పూర్తిగా దెబ్బతినగా.. ఇక్కడి గేట్లు కూడా కదిలిపోయాయి. ఏడో బ్లాకును కాపాడుకోవాలంటే ఈ ఏడాది బ్యారేజీలోకి వరద రావడానికి ముందే తాత్కాలికంగా షీట్ పైల్స్‌తో కాఫర్ డ్యామ్ కట్టడం ఒకటే మార్గమని అధికారులు సూత్రప్రాయంగా నిర్ణయించారు. బ్యారేజీ డిజైన్, నిర్మాణం, నిర్వహణలో లోపం వల్లే బ్యారేజీ కుంగిందని ప్రాథమికంగా తేల్చగా.. ప్రభుత్వం ఇచ్చిన డిజైన్ల ప్రకారమే బ్యారేజీని కట్టామని, నిర్మాణ లోపాల్లేవని ఎల్ అండ్ టీ చెప్తూ వచ్చింది. డిఫెక్ట్ లయబిలిటీ(లోపాలుంటే మరమ్మతులు చేయాల్సిన బాధ్యత) కాలం కూడా పూర్తైనందున పునరుద్ధరణ/మరమ్మతుల బాధ్యత తమది కాదని మొండికేసింది. అయితే, ప్రస్తుత ప్రభుత్వ సంప్రదింపులతో సంస్థ దిగివచ్చినట్లు తెలుస్తోంది. కాఫర్ డ్యామ్ నిర్మాణానికి అవసరమైన సాంకేతిక పరీక్షలను కూడా ఎల్ అండ్ టీ సంస్థ పూర్తి చేసింది. గోదావరి నదికి వరద వచ్చే లోగా ఏడో బ్లాకు ముందు(ఎగువ భాగంలో) కాఫర్ డ్యామ్ కడతామని, ఆ తర్వాత ఇతర బ్లాకులకూ పరీక్షలు నిర్వహించి ఆ నివేదికలను అందజేస్తామని ప్రభుత్వానికి సమాచారం ఇచ్చింది. ఆ నివేదికలు, ఎన్‌డీఎస్‌ఏ సిఫారసుల అనంతరం బ్యారేజీ శాశ్వత మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం ఉపక్రమించే అవకాశం ఉంది. వానాకాలం అంతా బ్యారేజీ గేట్లన్నీ తెరిచి.. వరద మొత్తం తగ్గాక శాశ్వత మరమ్మతులు చేయనున్నారు.

పంప్‌హౌస్‌ల ప్యానల్ బోర్డులు సురక్షిత ప్రదేశాల్లోకి

మేడిగడ్డతో పాటు అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో డౌన్‌స్ట్రీమ్, అప్‌స్ట్రీమ్ అప్రాన్ల కింద ఉన్న రంధ్రాలను యుద్ధప్రాతిపదికన మూసివేయాలని నిర్ణయించారు. ఈ పనులు చేపట్టడానికి నిర్మాణ సంస్థలు అంగీకారం తెలిపాయి. ఇవన్నీ ప్రాథమిక మరమ్మతులు కావడంతో మూడు బ్యారేజీల్లో వానాకాలం వచ్చేలోపు వీటిని పూర్తి చేయనున్నారు. అప్రాన్ల కింద రంధ్రాలు ఏర్పడి ఆ రంధ్రాల నుంచి ఇసుక జారడంతో బ్యారేజీల్లో సీపేజీలు ఏర్పడిన విషయం విదితమే. కాగా, రెండేళ్ల కిందట వరద నీటిలో మునిగిన మేడిగడ్డ, అన్నారం పంప్‌హౌస్‌లకు చెందిన ప్యానల్ బోర్డులను సురక్షిత ప్రదేశంలోకి మార్చే పనులు జరుగుతున్నాయి.




ఎదుర్కోలు ఉత్సవంలో శ్రీ సీతారామచంద్ర స్వామి, ఏపీలోని జంగారెడ్డిగూడెం నుంచి పాదయాత్రగా తరలి వచ్చిన రామ భక్తులు

కల్యాణ వైభోగమే!

(మొదటి పేజీ తరువాయి)

చేరుకుంటున్నారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ ఉండటంతో కల్యాణ మహోత్సవానికి సీఎం రేవంత్ రెడ్డి భద్రాచలం వెళ్లడం లేదు. కల్యాణం సందర్భంగా స్వామివారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీఎస్ శాంతికుమారి ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను సమర్పించనున్నారు. శ్రీరామ నవమి సందర్భంగా శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. కల్యాణ వేడుక జరిగే మిథిలా స్టేడియంలో శిల్పకళాశోభితమైన మండపాన్ని చక్కగా అలంకరించారు. ఎండలు, ఉక్కబోతతో భక్తులు ఇబ్బందులు పడకుండా స్టేడియంలో 50 టన్నుల ఏసీతో పాటు, వంద కూలర్లు, 270 ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు తిరుకల్యాణ మహోత్సవం ప్రారంభమవుతుంది. మధ్యాహ్నం అభిజిత్ లగ్నంలో కల్యాణం నిర్వహిస్తారు. కల్యాణ వేడుకలో భాగంగా మంగళవారం రాత్రి ఎదుర్కోలు ఉత్సవం సంప్రదాయబద్ధంగా సాగింది. ప్రభుత్వం తరఫున స్వామి వారికి శాంతి కుమారి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. దేవాదాయ శాఖ తరఫున ముఖ్యకార్యదర్శి శైలజరామయ్యర్ పట్టువస్త్రాలు అందజేశారు. కల్యాణ మహోత్సవం సందర్భంగా భక్తుల కోసం 2.50 లక్షల లడ్డూలను దేవస్థానం అధికారులు సిద్ధం చేశారు. వీటిని 19 ప్రసాద విక్రయ కౌంటర్ల ద్వారా వీటిని విక్రయించనున్నారు. మిథిలా స్టేడియంలోనే గురువారం శ్రీరామమహాపట్టాభిషేకం నిర్వహించనున్నారు. స్వామివారి కల్యాణం, పట్టాభిషేకాన్ని తిలకించేందుకు భద్రాద్రి తరలివచ్చే భక్తుల కోసం ఏర్పాట్లపై అధికారులతో సీఎస్ శాంతికుమారి భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. కల్యాణం సందర్భంగా కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ పర్యవేక్షణలో 1,800మందికి పైగా పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు. ఇదిలా ఉండగా శ్రీరామ నవమిని పురస్కరించుకొని భక్తులకు బుధవారం మూలవరుల దర్శనాన్ని ఉచితంగా కల్పించనున్నట్లు దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి ప్రకటించారు. కాగా రాములోరి కల్యాణ వేడుక ప్రత్యక్ష ప్రసారానికి ఎన్నికల కమిషన్ అనుమతించింది ఎన్నికల కోడ్ నేపథ్యంలో కల్యాణ వేడుక ప్రత్యక్ష ప్రసారానికి ఈసీ ఈనెల 4న నిరాకరించింది. తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశవ్యాప్తంగా కూడా భద్రాద్రి రామయ్యకు భక్తులు ఉన్నారని, కల్యాణ వేడుక ప్రత్యక్ష ప్రసారానికి అనుమతివ్వాలంటూ ఈసీకి రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. 2019లో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా శ్రీ వెంకటేశ్వర భక్తి చానల్‌లో స్వామివారి కల్యాణాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారని, రేడియోలో వ్యాఖ్యానం ప్రసారమైందని గుర్తుచేసింది. ప్రభుత్వ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకొని ఈసీ మంగళవారం సానుకూలంగా స్పందించింది.

రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్ శ్రీరామనవమి శుభాకాంక్షలు

రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. భద్రాద్రి సీతారాముల ఆశీస్సులతో దేశంలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని ఆయన భగవంతుడిని ప్రార్థించారు. భద్రాద్రి శ్రీరాముని క్షేత్ర ప్రాధాన్యాన్ని దేశమంతటికీ చాటేలా ఘనంగా నవమి వేడుకలు నిర్వహించాలని అధికారులను ఈ సందర్భంగా ఆదేశించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. కాగా రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కొండా సురేఖ, సీతక్క తెలంగాణ ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు.

కవిత బెయిల్ పిటిషన్ విచారణ 22కు వాయిదా

- ఈడీ, సీబీఐ కేసుల్లో విచారణ ఒకేరోజు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టై తిహాడ్ జైల్లో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. ఈడీ అరెస్టు చేసిన కేసులో తనకు రెగ్యులర్ బెయిల్ ఇవ్వాలని కవిత కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై మంగళవారం ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టులో విచారణ జరగాల్సి ఉంది. అయితే.. ప్రత్యేక జడ్జి కావేరి బవేజా సెలవులో ఉండడంతో పిటిషన్‌పై విచారణను ఈనెల 22వ తేదీకి వాయిదా వేశారు. సీబీఐ అరెస్టుకు సంబంధించి తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ రౌజ్ అవెన్యూ కోర్టులో సోమవారమే కవిత బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. అనారోగ్య కారణాల నేపథ్యంలో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ 664 పేజీలతో పిటిషన్ వేశారు. దీనిపై ఈనెల 20లోపు కౌంటర్ దాఖలు చేయాలని సీబీఐని న్యాయస్థానం ఆదేశించింది. ఆ తర్వాత 22న విచారణ చేపడతామని స్పష్టం చేసింది. ఇక, ఈడీ కేసులో బెయిల్ పిటిషన్‌పై విచారణను సైతం 22వ తేదీకే వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో ఈడీ, సీబీఐ రెండు కేసుల్లో కవిత బెయిల్ పిటిషన్లపై సోమవారమే విచారణ జరగనుంది. తిహాడ్ జైల్లో ఉన్న కవిత జ్యుడిషియల్ కస్టడీ ఈనెల 23తో ముగియనుంది.

రేపట్నుంచి ఎండలు తీవ్రం

వడదెబ్బతో నలుగురి మృతి.. ఈసారి వర్షాలు ఎక్కువే..

హైదరాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గురువారం నుంచి ఎండలు దంచనున్నాయి. దీంతో అన్ని జిల్లాలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. అన్ని చోట్లా సగటున 42 డిగ్రీలకు మించి ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని హెచ్చరించింది. ఇక, రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో వడగాడ్పులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరించింది. మంగళవారం రాష్ట్రంలో వడదెబ్బకు గురై నలుగురు మృత్యువాత పడ్డారు. కాగా, రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో ఈ ఏడాది సాధారణ కంటే కాలానుగుణ వర్షపాతం ఎక్కువగా ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. జూన్ నుంచి సెప్టెంబరు మధ్య కాలంలో రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతో పోల్చితే తూర్పు తెలంగాణలో వర్షపాతం ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది.

బాసర ట్రిపుల్‌ఐటీలో విద్యార్థి ఆత్మహత్య

- హాస్టల్ గదిలో ఉరేసుకుని బలవన్మరణం
- మృతుడి స్వగ్రామం సిద్దిపేట జిల్లా బండారుపల్లి



అరవింద్ (ఫైల్)

బాసర, ఏప్రిల్ 16 : నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్‌ఐటీకి చెందిన ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. హాజరు శాతం లేని కారణంగా అధికారులు పరీక్షలకు అనుమతించకపోవడంతో పీయూసీ సెకండియర్ విద్యార్థి బుచ్చుక అరవింద్(18) హాస్టల్ గదిలోని ఫ్యాన్‌కు మంగళవారం తెల్లవారుజామున ఉరి వేసుకున్నాడు. అరవింద్ స్వగ్రామం సిద్దిపేట జిల్లా తొగుట మండలం బండారుపల్లి. హాజరు శాతం తక్కువగా ఉన్న విద్యార్థులను పరీక్షలకు అనుమతించ వద్దని వర్సిటీ అధికారులు ఇటీవల ఆదేశించారు. ఈ క్రమంలో పరీక్షలు రాసేందుకు ఏప్రిల్ 12న ఇంటి నుంచి కళాశాలకు తిరిగొచ్చిన అరవింద్‌ను అధికారులు అడ్డుకున్నారు. హాజరు శాతం లేకపోవడంతో పరీక్షలకు అనుమతించమని, ఇంటికి వెళ్లిపోవాలని సూచించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన అరవింద్ హాస్టల్ గదిలో అఘాయిత్యానికి పాల్పడ్డాడు. మరోవైపు విద్యార్థి ఆత్మహత్య ఘటనపై నిర్మల్ జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, జిల్లా ఎస్పీ జానకి షర్మిల, ఇతర జిల్లా అధికారులు యూనివర్సిటీలోని వివిధ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. వేర్వేరు కారణాలతో ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటిదాకా వర్సిటీకి చెందిన ఆరుగురు విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడంపై ప్రశ్నించారు. కాగా, వర్సిటీ హాస్టల్‌లో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నప్పటికీ వైస్ చాన్సలర్ వెంకటరమణ మంగళవారం సాయంత్రం వరకు అందుబాటులో లేకపోవడం గమనార్హం.

మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడిపై ఎఫ్ఐఆర్

- జూబ్లీహిల్స్ రోడ్డు ప్రమాదం కేసు పునర్విచారణ
- ప్రమాద సమయంలో రాహిల్ కారులో ఉన్నట్టు గుర్తింపు

బంజారాహిల్స్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, జూబ్లీహిల్స్ ప్రాంతంలో రెండేళ్ల క్రితం జరిగిన ఓ రోడ్డు ప్రమాదం కేసులో పోలీసులు పునర్విచారణ చేపట్టారు. అంతేకాక, ఈ కేసులో బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు రాహిల్ పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. 2022 మార్చి 17న జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 45లో జరిగిన ఘటనలో మహారాష్ట్రకు చెందిన కాజల్ చౌహాన్ చేతిలో ఉన్న రణ్వీర్ అనే ఆరు నెలల వయస్సు ఉన్న బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. కారు మీద ఉన్న ఎమ్మెల్యే స్టిక్కర్ ఆధారంగా అది అప్పటి బోధన్ ఎమ్మెల్యే షకీల్‌కు చెందిన వాహనంగా పోలీసులు గుర్తించారు. అయితే, కారు నడిపి, ప్రమాదం చేసింది తానేనంటూ అఫ్నాన్ అనే యువకుడు పోలీసులకు లొంగిపోయాడు. ఇదిలా ఉండగా, రాహిల్ ఇటీవల నిర్లక్ష్యంగా కారును నడిపి ప్రగతి భవన్ వద్ద బ్యారికేడ్లను ఢీకొట్టాడు. ఈ కేసు విషయంలో నిందితుల తారుమారు వంటి ఘటనలు వెలుగు చూడడంతో.. జూబ్లీహిల్స్ రోడ్డు ప్రమాదం కేసుపై పోలీసులు మళ్లీ దృష్టి పెట్టారు. ప్రమాదం జరిగిన సమయంలో రాహిల్ కారులో ఉన్నట్టు గుర్తించారు. 2022లో ఈ కేసును దర్యాప్తు చేసిన అధికారుల పాత్రపై కూడా పోలీసులు దృష్టి సారించినట్టు సమాచారం.

హనుమాన్ మాలధారణలో విద్యార్థులు.. పరీక్షకు అనుమతించని బడి యాజమాన్యం

- పాఠశాలను ముట్టడించిన హనుమాన్ దీక్షాపరులు
- కార్యాలయం ధ్వంసం.. మంచిర్యాల జిల్లాలో ఘటన

దండేపల్లి, ఏప్రిల్ 16: హనుమాన్ మాల ధరించారని ముగ్గురు విద్యార్థులను పరీక్ష రాసేందుకు ఓ పాఠశాల యాజమాన్యం అనుమతించలేదు. దాంతో పెద్దసంఖ్యలో హనుమాన్ దీక్షాపరులు అక్కడికి చేరుకొని పాఠశాల కార్యాలయాన్ని, తరగతి గదుల అద్దాలను, ఆవరణలోని మదర్‌థెరిస్సా విగ్రహాన్ని ధ్వంసం చేశారు. ఈ ఘటన మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం కన్నెపల్లి మదర్ థెరిస్సా పాఠశాలలో జరిగింది. నంబాల గ్రామానికి చెందిన బంగారు దీవెన్, కన్నెపల్లికి చెందిన గొర్ల విద్యాదిత్యా, రాయపట్నం చెందిన హర్షవర్ధన్ అనే ముగ్గురు విద్యార్థులు ఆ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నారు. వారు ఇటీవల హనుమాన్ దీక్ష స్వీకరించారు. ఈ క్రమంలో సోమవారం వార్షిక పరీక్షలు ప్రారంభం కాగా పరీక్ష రాసేందుకు ఆ ముగ్గురు విద్యార్థులను పాఠశాల మేనేజర్ జైసన్ అనుమతించలేదు. కాషాయ వస్త్రాలు తొలగించి యూనిఫాం ధరిస్తేనే పరీక్షకు అనుమతిస్తామని ఆయన చెప్పారని ఆ విద్యార్థులు తెలిపారు. విషయం తెలుసుకున్న వారి తల్లిదండ్రులు, హనుమాన్ దీక్షాపరులు పెద్దసంఖ్యలో పాఠశాలకు చేరుకుని ఆందోళనకు దిగారు. పాఠశాలలో ఆఫీస్, తరగతి గదుల అద్దాలను, మదర్‌థెరిస్సా విగ్రహాన్ని ధ్వంసం చేశారు. పాఠశాల మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలని, బహిరంగ క్షమాపణ చెప్పాలని, పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చివరికి డీసీపీ అశోక్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని దీక్షాపరులతో మాట్లాడారు. పాఠశాల యాజమాన్యంపై చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

గుట్టువిప్పింది ఎవరు?

ఎన్నికలబాండ్ల పథకాన్ని సుప్రీంకోర్టు రాజ్యాంగ వ్యతిరేకమైనదిగా ప్రకటించి, రద్దుచేసిన తరువాత, ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆ పథకాన్ని వెనకేసుకొస్తూ వ్యాఖ్యానించడం ఇది రెండోసారి. సుప్రీంకోర్టులో వాదోపవాదాలు సాగుతున్నప్పుడూ, చివరకు తీర్పు వెలువడిన తరువాత కూడా బీజేపీ నాయకులు ఈ పథకాన్ని మించినదేదీలేదని అంటూనే ఉన్నారు. తీర్పువచ్చిన రోజు రవిశంకర్ ప్రసాద్ విలేఖరులతో చేసిన వ్యాఖ్యలు వినగానే విపక్షకాంగ్రెస్‌కు అనుమానం వచ్చి, కొత్త కుట్రలకు తెరదీయకండి అని హెచ్చరించింది కూడా. అయినా కూడా అనంతరం ఆ దిశగా కొన్ని ప్రయత్నాలు జరిగిన మాట అటుంచితే, నితిన్‌గడ్కరీ, అమిత్‌షా ఇత్యాది మంత్రుల వరుసలోనే ప్రధానమంత్రి కూడా రద్దయిన ఈ ఎన్నికల బాండ్ల పథకాన్ని మెచ్చుకుంటూ రెండు ఇంటర్వ్యూల్లో సుప్రీంకోర్టు తీర్పును పరోక్షంగా తప్పుబట్టారు. దేశాన్ని మళ్ళీ నల్లధనంలోకి నెట్టేశామని వాపోయారు, రాబోయేరోజుల్లో ప్రతీ ఒక్కరూ పశ్చాత్తాపపడాల్సి వస్తుందని శపించారు.

రేపటిరోజుల్లో నిజాయితీగా, గుండెలమీద చేయివేసుకొని ఆలోచిస్తే, ఈ పథకం రద్దయినందుకు ఈ దేశంలోని ప్రతీ ఒక్కరూ ఎంతో బాధపడేరోజులు వస్తాయట. ప్రతిపక్షాలను అడ్డుపెట్టుకొని ఈ పథకం రద్దుమీద ఆయన చేసిన విమర్శలన్నీ ఒక విధంగా సుప్రీంకోర్టును దృష్టిలో పెట్టుకొని చేసినవే. ఎన్నికలబాండ్లు ఉన్నందువల్లనే డబ్బు ఎవరినుంచి ఎవరికి చేరుతున్నదో తెలుస్తున్నదని, అవి లేనప్పుడు ధనప్రవాహం గతిని ఎవరైనా తేల్చిచెప్పగలరా? అని ఆయన మొన్న ఓ వార్తాసంస్థ ఇంటర్వ్యూలో ఓ ప్రశ్న వేశారు. గతంలో ఒక తమిళచానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సైతం ఆయన తాను ఈ బాండ్ల పథకాన్ని తెచ్చినందువల్లనే రాజకీయ విరాళాల మూలాలు, ముచ్చట్లు తెలుస్తున్నాయని అన్నారు. కానీ, ఆ గుట్టు విప్పింది సుప్రీంకోర్టే తప్ప, తాను తెచ్చిన పథకం దాతలు స్వీకర్తల వివరాలు రహస్యంగా ఉంచేందుకే తయారైందని ఆయనకు మాత్రం తెలియదా? ప్రజలకే కాదు, చివరకు ఎన్నికల సంఘానికి కూడా దాతల వివరాలు రహస్యమే. బాండ్లు అమ్మిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను బాండ్ల వివరాలు చెప్పాల్సిందేనని సుప్రీంకోర్టు ఆదేశిస్తే, అది చివరివరకూ గుట్టు విప్పకుండా విఫలయత్నాలు చేసిన విషయం తెలిసిందే. బ్యాంకును, ఎన్నికల సంఘాన్ని ముడిపెట్టి, సుప్రీంకోర్టు తీవ్ర హెచ్చరికలతో వెంటపడితే తప్ప రహస్యం బద్దలై ఆ వివరాలు ప్రజాక్షేత్రంలోకి ప్రవహించలేదు.

ఎన్నికల బాండ్ల రూపకల్పనలోనే పారదర్శకకు పాతరేశారు, గోప్యతకు పెద్దపీటవేశారు. అందుకే, గత ఆరేళ్ళకాలంలో ఏ పార్టీకి ఏ దాత ఎంతిచ్చాడన్న కనీసం ఒక్క లావాదేవీ కూడా ఈ దేశ ప్రజలకు తెలియలేదు. ఈ రాజకోట రహస్యాన్ని బద్దలు కొట్టేందుకు ఆర్టీఐ ద్వారా ప్రయత్నించినా విఫలమయ్యేట్టుగా విధానం రూపుదిద్దుకుంది. పాలకపక్షం నేతలు ఈ పథకాన్ని ప్రశంసిస్తూ, సమర్థించుకుంటూ చేసిన వ్యాఖ్యలన్నీ అసత్యాలు, అర్ధసత్యాలే. ఈ పథకం లేకపోవడంతో ఇకమీదట రాజకీయ విరాళాల్లో నల్లధనం ప్రవహించేస్తుందని మోదీ, అమిత్‌షాలు తెగవాపోతున్నారు. కానీ, అంతవరకూ రాతకోతలు, చిట్టాపద్దులు, బ్యాంకు లావాదేవీలతో అత్యంత పారదర్శకంగా ఉన్న 2013నాటి 'ఎలక్టోరల్ ట్రస్ట్' విధానం స్థానంలోకి ఈ బాండ్లు వచ్చిన తరువాతే, నల్లధనం తెల్లరంగుపులుముకొని, అడ్డుతోవలో రాజకీయపార్టీల ఖజానాల్లోకి చేరుకుంది. స్వదేశీ, విదేశీ కంపెనీలన్న తేడాలేకుండా, వాటి ఆదాయ వ్యయాలతోనూ లాభనష్టాలతోనూ నిమిత్తం లేకుండా ఎంతైనా దానం చేయగలిగే వెసులుబాటు ఇచ్చి మరీ రహస్యంగా విరాళాలు గుంజుకున్నారు. పన్నెండు లక్షల లాభాన్ని ఆర్జించిన ఒక కంపెనీ కేవలం రెండునెలల్లో 195కోట్లు కేంద్రంలోని అధికారపక్షానికి విరాళం ఇవ్వడం, ఒక లాటరీ నిర్వహణ సంస్థ, ఒక గేమింగ్ సంస్థ తమ వార్షికలాభానికి ఐదేసి, పదేసిరెట్లు దానం చేయడం, బాండ్లు కొన్నవారు ఈడీ బడితెపూజలనుంచి బయటపడటం వంటి చాలా రహస్యాలు సుప్రీంకోర్టు చొరవతోనే దేశప్రజలకు తెలిసొచ్చింది. ఎన్నికల వేళ ఈ బాండ్ల బాగోతం అధికారపక్షం పరువు తీసింది. ప్రపంచంలోనే అతిపెద్ద దోపిడీపథకం అని విపక్షాలు చేస్తున్న విమర్శలను అటుంచితే, ఈ పథకం ద్వారా జరిగిన క్విడ్‌ప్రోకో బాగోతాలన్నింటి మీదా సర్వోన్నత న్యాయస్థానం ఒక సమగ్రవిచారణకు ఆదేశించడం అత్యావశ్యకం.

భారత్‌కు గల్ఫ్ మీదుగా ఐరోపాకు చేరడం ఎంత ముఖ్యమో, ఆఫ్ఘానిస్తాన్, ఇరాన్, మాజీ సోవియట్ దేశాల మీదుగా ఐరోపాకు వెళ్లడమూ అంతే ముఖ్యం. ఇరాన్‌పై ఉన్న ఆంక్షలు, గల్ఫ్ దేశాలతో స్నేహ బంధం కారణంగా ఈ అంతర్జాతీయ రవాణా మార్గం విషయంలో ముందుకు వెళ్ళలేకపోతుంది. ఈ మార్గం విషయంలో పూర్తి పురోగతి సాధించినప్పుడే పాకిస్థాన్‌ను ఏకాకిని చేయడంలో భారత్ సఫలమవుతుంది.


ఇరాన్‌తో మైత్రి భారత్‌కు ముఖ్యం

ఇజ్రాయెల్‌పై ఇరాన్ సైనిక దాడులతో మధ్యప్రాచ్యంలో మళ్లీ మంటలు మొదలయ్యాయి. సువిశాల అరబ్ ప్రపంచం చుట్టుప్రక్కల తన అనుబంధ లేదా ప్రాయోజిత సాయుధ దళాల ద్వారా షియా ఇరాన్ విస్తరిస్తున్న తీరు సున్నీ అరబ్బు వర్గాలను విస్మయానికి గురిచేస్తోంది. మధ్య ప్రాచ్య ముస్లిం దేశాల మధ్య జరుగుతోన్న ఈ ప్రచ్ఛన్న యుద్ధ ప్రభావం ఆ ప్రాంతం పైనే కాకుండా భారత్ సహా అనేక దేశాలపై పడడమే ఇప్పుడు ప్రపంచానికి కలవరం కలిగిస్తున్న అంశం.

ప్రపంచ ఆర్థిక శక్తిగా ఎదగడానికి భారత్ ఉవ్విళ్లూరుతున్నది. భారత్ ఆకాంక్ష నెరవేరాలంటే మధ్యప్రాచ్య అరబ్బు ప్రపంచంలో సుస్థిర శాంతి నెలకొనాల్సిన అవసరం ఉన్నది. షియా ఫార్సీ ఇరాన్, సున్నీ అరబ్బు గల్ఫ్ దేశాల మధ్య ఉద్రిక్తతలు ఒక్క భారతదేశానికే కాకుండా ఐరోపా, అమెరికాల వాణిజ్యాభివృద్ధికి విఘాతం కలిగించేవిగా ఉన్నాయి. ఐరోపా నుంచి భారత్, ఇతర ఆసియా దేశాలకు జరిగే ఎగుమతులు దిగుమతులు అన్నీ కూడ ఈ ప్రాంతంలోని సముద్రజలాల ద్వారా జరుగుతాయి. ఉదాహరణకు హైదరాబాద్ నుంచి ఫ్రాన్స్‌కు ఎగుమతయ్యే ఔషధాలు లేదా గుజరాత్ నుంచి బ్రిటన్‌కు ఎగుమతయ్యే రసాయనాలతో అరబ్బు దేశాలకు ఎలాంటి సంబంధం లేకున్నా వాటిని రవాణా చేసే నౌకలన్నీ కూడ అరబ్బు దేశాల తీరాల గుండా వెళతాయి. అలనాటి కాలంలో స్వామి వివేకానంద, మహాత్మాగాంధీలు ఇదే మార్గాన బ్రిటన్, అమెరికా దేశాలకు వెళ్ళారనేది ఇక్కడ గమనార్హం.

ఐరోపా మధ్యధరా సముద్రం నుంచి ఈజిప్టు, సూడాన్, సౌదీ అరేబియా, యమన్, ఇథియోపియా దేశాల ఎర్ర సముద్రం మీదుగా అరేబియా, హిందూ మహాసముద్రాల ద్వారా భారత్‌కు, అటు నుంచి ఇతర ఆసియా దేశాలకు నౌకాయానం జరుగుతుంది. ప్రపంచ వాణిజ్య లావాదేవీలకు కీలకమైన ఈ మార్గంలో ఏ రకమైన ఉద్రిక్తత చెలరేగినా సరఫరా వ్యవస్థకు విఘాతం కలగడమే కాకుండా గల్ఫ్ దేశాల నుంచి రవాణా అయ్యే చమురు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. దీనివల్ల భారత్‌తో సహా ప్రపంచ స్టాక్ మార్కెట్లు అతలాకుతలమవుతాయి. ఇజ్రాయెల్‌కు వెళ్తున్న నౌకలపై ఇరాన్ సమర్థక హుతీ సాయుధ దళాలు చేస్తున్న దాడుల కారణాన ఇప్పటికే ప్రపంచ నౌకాయానంలో అనిశ్చిత పరిస్థితి నెలకొని ఉన్నది. మరో వైపు నౌకాయాన వ్యయం పెరిగి ధరల హెచ్చుదలకు దారి తీస్తోంది.

గల్ఫ్ లేఖ



ఇప్పటి వరకు అరేబియా సముద్ర తీరంలో చాల ఇరుకైన జలసంధిలో ఇరాన్‌కు భౌగోళిక అనుకూలత ఉండగా హుతీ దళాల ద్వారా ఎర్రసముద్రంలో సైతం నౌకలపై దాడులు చేసే సామర్థ్యం ఆ దేశానికి సమకూరింది. ఇది సహజంగా ఆందోళన కలిగించే అంశం. కౌటిల్యుడు 'అర్థశాస్త్రం'లో బోధించినట్లుగా సముద్రాలపై పట్టు ఉన్న వారికే ప్రపంచంపై అధిపత్యం ఎక్కువగా ఉంటుంది. అందుకే నౌకా యానంపై పట్టు కలిగిన పోర్చుగీసు, ఫ్రాన్స్ ఆ తర్వాత బ్రిటన్ తమ సామ్రాజ్య వాద విస్తరణలో సఫలీకృతమయ్యాయి. కొరకరాని కొయ్యగా మారిన ఇరాన్ ఈ రకంగా నౌకాయానంపై పట్టు బిగిస్తుండడానికి తోడుగా సైనికంగా అత్యంత శక్తిమంతమైన ఇజ్రాయెల్‌తో ఢీ కొనడానికి చేస్తోన్న హెచ్చరికలు సహజంగానే మధ్య ప్రాచ్యంలో అలజడిని రేపుతున్నాయి.

భారతదేశం, మధ్యప్రాచ్య అరబ్బు, ఇజ్రాయెల్ దేశాలతో సహా ఐరోపాను కలుపుతూ తలపెట్టిన నూతన రవాణా మార్గం ఒకటి భారత్ దశ, దిశను మార్చివేయగలదు. రైలు, రోడ్డు, నౌకాయానం ద్వారా ఈ దేశాల మధ్య దూరం తగ్గిస్తూ వాణిజ్యావకాశాలను పెంపొందించే ఈ బృహత్తర పథకాన్ని అమలుపరిచేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేస్తున్న ప్రయత్నాలు చాల వరకు సఫలీకృతమయ్యాయి. మోదీ విదేశాంగ విధాన విజయగాథలో ఈ కారిడార్ అగ్రగణ్యమైంది. అదానీ గ్రూప్ ఆధ్వర్యంలోని గుజరాత్‌లో అరేబియా సముద్ర తీరంలోని ఓడరేవుల నుంచి నేరుగా యునైటెడ్ అరబ్ ఏమిరేట్స్, సౌదీ అరేబియా మీదుగా విశాల ఐరోపా ఖండానికి సులభతరమైన రవాణా వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా అందరు ఆర్థికంగా బలోపేతం కావాలనేది ఈ పథకం ఉద్దేశ్యం. చైనా సిల్క్ రూట్‌కు ప్రత్యామ్నాయంగా ఇది ఉపయోగపడే అవకాశాలు ఉండడంతో అమెరికా కూడా ఈ అంతర్జాతీయ రవాణా మార్గానికి సానుకూలంగా ఉంది.

మధ్య ప్రాచ్య ప్రాంతంలో వివాదాలకు కేంద్రబిందువు అయిన ఇరాన్ కూడ భౌగోళికంగా ఐరోపాకు సమీపంలో ఉంది. పాకిస్థాన్, చైనా సహాయంతో ఇది సిల్క్ రూట్‌లో నల్లసముద్రం మీదుగా నేరుగా రష్యాకు చేరుకోగలుగుతుంది. భారత్‌కు గల్ఫ్ మీదుగా ఐరోపాకు చేరడం ఎంత ముఖ్యమో, ఆఫ్ఘానిస్తాన్, ఇరాన్, మాజీ సోవియట్ దేశాల మీదుగా ఐరోపాకు వెళ్ళే మార్గం కూడా అంతే ముఖ్యం. ఈ అంతర్జాతీయ రవాణా మార్గంపై భారత్‌కు ప్రత్యేక ఆసక్తి ఉన్నది. అయితే ఇరాన్‌పై ఉన్న ఆంక్షలు, అమెరికా దౌత్యం, గల్ఫ్ దేశాలతో స్నేహ బంధం కారణంగా సిల్క్ రూట్‌కు ప్రత్యామ్నాయమైన ఈ అంతర్జాతీయ రవాణా మార్గం విషయంలో ముందుకు వెళ్ళలేకపోతుంది. ఈ మార్గం విషయంలో పూర్తి పురోగతి సాధించినప్పుడే పాకిస్థాన్‌ను పూర్తిగా ఏకాకిని చేయడంలో భారత్ సఫలమవుతుంది. ఈ కారణంగానే ఇరాన్‌తో పటిష్ఠ మిత్రత్వాన్ని భారత్ కోరుకొంటుంది. గల్ఫ్, అమెరికా, ఇజ్రాయెల్‌ల పట్ల తన వైఖరి ఎలా ఉన్నా ఇరాన్ విషయంలో మాత్రం భారత్ సదా ఆచితూచి అడుగులు వేస్తోంది. ఆ మాటకొస్తే అనేక దేశాలు సైతం అటువంటి వైఖరినే అవలంబించడం గమనార్హం. తాజాగా ఇరాన్ – ఇజ్రాయెల్ ఉద్రిక్తతల మధ్య కూడ నేరుగా ఒక పక్షం వైపు మొగ్గకుండా భారత్ వ్యూహాత్మకంగా అడుగులు ముందుకు వేస్తుంది. మధ్య ప్రాచ్య పరిణామాలు భారత్‌కు దౌత్యపరంగా ఒక సంక్లిష్ట పరిస్థితిని కల్పించాయనడంలో సందేహం లేదు.

■ **మొహమ్మద్ ఇర్ఫాన్**
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

మోదీ పాలనలో అంతా సుభిక్షమేనా?



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

భారతదేశం 2047 నాటికి ప్రపంచంలో అమెరికాను సైతం తలదన్ని అగ్ర రాజ్యంగా మారడం ఖాయమని, ఈ లక్ష్యం సాధించేందుకు తాను ఒక్క క్షణం కూడా వృథా చేయదలుచుకోలేదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటించారు. 'మోదీకా గ్యారంటీ' పేరుతో ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేస్తూ ఆయన చేసిన ప్రసంగం విన్నవారెవరికైనా ఆయన ఆత్మవిశ్వాసం అబ్బురం కలిగిస్తుంది. కవర్ పేజీపై 'మోదీ కా గ్యారంటీ' క్రింద 'ఫిర్ ఏక్ బార్ మోదీ కా సర్కార్' (మరోసారి మోదీ ప్రభుత్వం) అన్న వాక్యాలతో ప్రింట్ చేసిన ఈ మేనిఫెస్టోలో మోదీ అన్న పదంతో పాటు అడుగడుగునా నరేంద్రమోదీ ఛాయా చిత్రాలు మనను అలరిస్తాయి. గ్యాస్ సిలిండర్‌లను మహిళలకు ఇస్తున్నట్లు, వృద్ధులను అలింగనం చేసుకుంటున్నట్లు, ఆడపిల్లలను దీవిస్తున్నట్లు, యువకులతో మాట్లాడుతున్నట్లు, మెట్రో రైలులో ప్రయాణిస్తున్నట్లు, ఆవులను నిమురుతున్నట్లు, విదేశీ నేతలతో చెట్టపట్టాలేసుకున్నట్లు, పార్లమెంట్‌లో రాజదండంతో నమస్కరిస్తున్నట్లు, పట్టుపంచెలతో తిరుగాడుతున్నట్లు ఊర్ధ్వ పుండ్రాలతో వెలిగిపోతున్నట్లు రకరకాల మోదీలు, రకరకాల హావభావాలతో ఎంతో హృద్యంగా మనకు దర్శనం ఇస్తారు. ఏ పేజీ తిప్పినా ప్రతి వాగ్దానం ముందు మోదీ గ్యారంటీ అన్న పదాలను చేర్చారు.

ఎవరు అవునన్నా, కాదన్నా 1951లో ఏర్పడిన జనసంఘ్, 1980లో రూపాంతరం చెందిన భారతీయ జనతా పార్టీలు రెండూ ఏడు దశాబ్దాలకు పైగా కొనసాగిన తమ అస్తిత్వాన్ని ఇవాళ నరేంద్రమోదీ అనే మహా అస్తిత్వంలో విలీనం చేసినట్లు కనపడుతోంది. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ, ప్రేమ్‌నాథ్ డోగ్రా, డిపి ఘోష్, బలరాజ్ మధోక్, దీనదయాళ్ ఉపాధ్యాయ, నానాజీ దేశ్‌ముఖ్, కుశాభావ్ ఠాక్రే, అటల్ బిహారీ వాజపేయి, లాల్ కృష్ణ ఆడ్వాణీ మొదలైన నాయకుల చారిత్రక పరంపర ఇవాళ ఒక మహా కేంద్ర బిందువు వద్ద ఆగిపోయినట్లు కనిపిస్తోంది. ఆ బిందువు ఎవరో కాదు నరేంద్రమోదీ. ప్రజలకు వాగ్దానాలను నెరవేరుస్తామన్న నమ్మకం కలిగించడం కోసమే 'మోదీ కా గ్యారంటీ' అన్న పదాలను ఉపయోగించామని ప్రధానమంత్రి చెప్పుకున్నారు. అంటే పార్టీ పేరు కన్నా తన పేరుకే ఎక్కువ విలువ ఉన్నట్లు ఆయన భావిస్తున్నట్లు స్పష్టమవుతోంది.

ఇక్కడే మోదీ ఆత్మవిశ్వాసం మనకు స్పష్టంగా కనిపిస్తుంది. ఏ దేవుడూ మనకు ఫలానా మేలు చేస్తానని వాగ్దానం చేయడు. కాని దేవుడి దగ్గరకు వెళితే తమకు మంచే జరుగుతుందని ఈ దేశంలో కోట్లాది ప్రజలు విశ్వసిస్తారు మోదీ కూడా ఆ విశ్వాసాన్ని మనకు కలుగచేసేందుకు ప్రయత్నిస్తున్నారు. దేవుడు కాకపోయినా దైవాంశ సంభూతుడు అనే అభిప్రాయాన్ని కలుగ చేస్తున్నారు. మోదీని విశ్వసిస్తే భారతదేశం భూతల స్వర్గంగా మారుతుందని, ఒక అందమైన కలల సామ్రాజ్యంగా మారుతుందని, ఆకలి దప్పులు లేని సమాజం ఏర్పడుతుందని, అంతటా అభివృద్ధి, సంపద విలసిల్లుతాయని, మోదీ అనే శక్తి ముందు పాకిస్థాన్, చైనాతో పాటు పలు దేశాలు మోకరిల్లుతాయని, ఎలాంటి ఉగ్రవాదమైనా తోకముడుస్తుందని, అవినీతిని పూర్తిగా రూపుమాపేందుకు ఆయన కంకణం కట్టుకున్నారని నమ్మించేందుకు అనేక గ్యారంటీలు ఇస్తున్నారు. ఈ గ్యారంటీలను మనస్ఫూర్తిగా నమ్మి 400కు పైగా సీట్లతో తనకు పట్టాభిషేకం చేస్తారని మోదీ స్వయంగా విశ్వసిస్తున్నారు. పార్లమెంట్ భవనాన్ని, అయోధ్యలో రామమందిరాన్ని తానొక్కడే ఆవిష్కరించినట్లు ఈ దేశంలో బీజేపీని తానొక్కడే గెలిపించగలనని ఆయన భావిస్తున్నారు. పోలింగ్ బూత్‌కు వెళ్లి ఈవీఎంలో బటన్ నొక్కే ప్రతి వ్యక్తి మనసులో తానే మెదలాలని ఆయన ఆశిస్తున్నారు.

ఎలాగూ ఎన్నికల సమయంలో తప్పదు కాబట్టి మొక్కుబడిగా బీజేపీ కూడా ఎన్నికల మేనిఫెస్టోను ఆవిష్కరించింది కాని కళ్ల ముందు మోదీ లాంటి మహావ్యక్తి ఉండగా వేరే మేనిఫెస్టోను ఆవిష్కరించాల్సిన అవసరం లేదు. అందువల్లే బీజేపీ మేనిఫెస్టోలో పెద్ద ఆర్భాటాలు లేవు. వివాదాస్పద, భావోద్వేగ అంశాలు లేవు. గత మేనిఫెస్టోలో చెప్పినట్లు జాతీయ పౌరుల రిజిస్టర్‌ను ఏర్పాటు చేసి అక్రమంగా వలస వచ్చిన వారిని ఏరి పారేస్తామన్న వాగ్దానం లేదు. ధరలను తగ్గిస్తామని, రైతుల ఆదాయం ఫలానా సంవత్సరానికల్లా రెట్టింపు చేస్తామన్న అలవిమారిన హామీలూ లేవు. మధుర, కాశీ వంటి వాటి జోలికి పోలేదు. రైతులకు మద్దతు ధరపై చట్టబద్ధత కల్పిస్తామని, యువకులకు శిక్షణతో పాటు భృతి కల్పిస్తామని, ప్రతి పేద మహిళకూ రూ. లక్ష నగదు ఇస్తామని, ఖాళీలుగా ఉన్న ప్రభుత్వ పోస్టులను భర్తీ చేస్తామని, కులజనగణన జరిపి అన్ని వర్గాలకు సరైన సామాజిక న్యాయం చేస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లాంటివేవీ బీజేపీలో మనకు కనపడవు. అసలు అలాంటి హామీలు ఇవ్వాల్సిన అవసరమే లేదని బీజేపీ భావిస్తున్నట్లు కనపడుతోంది, అంతేకాదు, ఎన్నికల సంస్కరణలు, పోలీసు సంస్కరణలు, న్యాయవ్యవస్థకు చెందిన సంస్కరణలు వంటి బృహత్తర ఆలోచనలు చేయాల్సిన అవసరం లేదని బీజేపీ భావిస్తోంది. ఉమ్మడి పౌర స్మృతి ఇప్పటికే ఉత్తరాఖండ్‌లో అమలు చేస్తున్నారు కనుక బీజేపీ ఈ స్మృతిని అమలు చేస్తుందన్న విషయంలో ఎవరికీ సందేహం లేదు. మొత్తంగా 78 పేజీల మేనిఫెస్టోలో చాలా వాగ్దానాలు పాతవే. ఈ మేనిఫెస్టోను చదివిన వారికి మోదీ రాజ్యంలో అంతా సుభిక్షంగా సంతోషంగా ఉన్నట్లు బీజేపీ బలవంతంగా విశ్వసిస్తున్నట్లు అర్థమవుతుంది. అందువల్ల కొత్తగా ఏమీ చేయనవసరం లేదని, ఇదే వేగంతో పనిచేసి దేశాన్ని అగ్రరాజ్యంగా మార్చగల శక్తి మోదీకే ఉన్నట్లు బీజేపీ నేతలు విశ్వసించకతప్పడం లేదు.

తాను చేస్తున్న పనులన్నీ సరైనవేనని ఒక నాయకుడు భావిస్తున్నారంటే ఆయనకు తనపై తనకే తిరుగులేని నమ్మకం ఉన్నట్లు అర్థమవుతుంది. ఈ దేశంలో ప్రతిపక్ష నేతలందర్నీ అవినీతిపరులుగా చిత్రించి ఈడీ, సీబీఐ సంస్థలు జైళ్లలో వేయడాన్ని సరైన చర్యగానే ఆయన భావిస్తున్నారు. అవినీతిపై పోరాటం చేస్తున్నానని చెప్పుకుంటున్నారు. ఈడీ, సీబీఐలు తాను చెప్పినట్లు నడుచుకుంటున్నాయన్న ఆరోపణలను ఆయన తాజాగా ఒక సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కొట్టి పారేశారు. ఎన్నికల బాండ్ల ద్వారా నిధులు సేకరించడం రాజ్యాంగ వ్యతిరేకమని, అక్రమమని సుప్రీంకోర్టు స్పష్టం చేస్తే అది న్యాయపూరితమేనని మోదీ భావిస్తున్నారు. నల్లధనాన్ని అరికట్టేందుకే తాను ఎన్నికల బాండ్లను ప్రవేశపెట్టానని ఆయన వాదిస్తున్నారు. దేశంలో ప్రజాస్వామ్యం సవ్యంగా ఉన్నదని, ప్రజల స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు



కొద్ది రోజుల్లో ప్రారంభమయ్యే లోక్‌సభ ఎన్నికలు మోదీ అనే మహా వ్యక్తికీ ప్రతిపక్షాలకూ మధ్య జరుగుతున్న ఒక మహా పోరాటం. మోదీ వశీకరణ శక్తికి, ప్రచార నైపుణ్యానికి, పార్టీ నేతలు, కార్యకర్తలు గత్యంతరం లేక లోబడవచ్చేమో కాని కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు భారతదేశం మోదీ మయం కాగలుగుతుందా? ప్రజలు తమ విచక్షణా శక్తిని, వివేచనను ఉపయోగిస్తారా? వాస్తవాలకూ, ప్రచారానికీ మధ్య తేడాను గమనిస్తారా అన్న ప్రశ్నలకు ఈ ఎన్నికల ఫలితాలు సమాధానమిస్తాయి.

అనుభవిస్తున్నారని ఆయన అన్నారు. ఇజ్రాయిల్–హమాస్, రష్యా–ఉక్రెయిన్ యుద్ధాలను కూడా ఉటంకించి దేశాన్ని సురక్షితంగా ఉంచగలిగిన దివ్యశక్తి తానేనని సంకేతాలు పంపుతున్నారు. తానెవర్నీ భయపెట్టడం లేదని కూడా చెప్పుకున్నారు. మోదీ తన విశ్వరూపాన్ని తానే పెంచుకుని ప్రతిపక్షాలను పిపీలికాలుగా భావిస్తున్నారు.

తాను జరిపే ఉధృత ప్రచార యుద్ధంలో ప్రతిపక్షాల హామీలు గాలికి కొట్టుకుపోతాయని, ద్రవ్యోల్బణం, అవినీతి, నల్లధనంపై తాను చెప్పే మాటల్నే జనం విశ్వసిస్తారని ఆయన అనుకుంటున్నారు. ఈ క్రమంలో తలెత్తే ప్రశ్నలకు జవాబివ్వడం అనవసరమని, అసలు తను ప్రశ్నలకే అతీతుడననేది ఆయన అభిప్రాయంలా కనపడుతోంది. మోదీ మహా బల సంపన్నుడనే సందేశం ప్రజలకు వెళ్లేందుకు, మానవమాత్రులైన ఏ ప్రతిపక్ష నేతకూ తనను ప్రశ్నించే యోగ్యతలేదని వారు భావించేలా చేసేందుకు ఆయన సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. ఆయనలోని గురుత్వాకర్షణ శక్తికి తిరుగులేదని బీజేపీ నేతలు సైతం భావిస్తున్నారు. అచ్ఛేదిన్ ఆయేగీ, సబ్ కా సాథ్ సబ్ కా వికాస్, హర్ హర్ మోదీ, విశ్వగురు, అమృతకాల్ అంటూ ఆయన ఇచ్చిన నినాదాలన్నీ వారు వల్లెవేస్తున్నారు.

విచిత్రమేమంటే ఏ పార్టీ ఎన్ని వాగ్దానాల వర్షం కురిపించినా అనంతపురం లాంటి కరువు ప్రాంతాల్లో యువకులు వలస వెళ్లకుండా ఉండలేరు. బిహార్‌లోని పల్లెల్లో వృద్ధులు ఢిల్లీలో పనిచేసే తమ పిల్లలు పంపించే కూలి డబ్బుల కోసం ఎదురు చూడకుండా ఉండలేరు. యూపీలో పిహెచ్‌డి చేసిన యువకులు సైతం రూ. 8 వేల జీతానికి ఏదో ఒక చిన్న ఉద్యోగం చేయక తప్పడం లేదు. ఉపాధి హామీ పథకాలు నిర్వీర్యమై కూలి గిట్టుబాటు అయ్యే పరిస్థితులు ఎక్కడా లేవు. గ్రామీణ నిరుద్యోగిత శాతం రోజురోజుకూ పెరుగుతోందని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ చెబుతోంది. ప్రపంచ ఆకలి సూచికలో భారతదేశ స్థానం 111 ర్యాంకు నుంచి పడిపోవడం లేదని, అతి వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత ఆర్థిక వ్యవస్థలో 80 కోట్ల మంది ఉచిత ఆహార ధాన్యాలపై ఆధారపడాల్సి రావడం కూడా వాస్తవాలే. ప్రతి ఏటా లక్షలాది విద్యాధికులు, వృత్తి నిపుణులు ఇతర దేశాల్లో ఉపాధి కోసం ఆశగా వెళుతున్నారు. అగ్రరాజ్యంగా మారనున్న మన భారతదేశంలో ఉపాధి కోసం వచ్చే వారెంతమంది? ఎందుకు ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు ఆదాయం కన్నా అప్పులు ఎక్కువై శ్రీలంక వంటి ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి?

అందువల్ల మరో కొద్ది రోజుల్లో ప్రారంభమయ్యే లోక్‌సభ ఎన్నికలు సాధారణ ఎన్నికలు కావు. ఇది మోదీ అనే మహా వ్యక్తికీ ప్రతిపక్షాలకూ మధ్య జరుగుతున్న ఒక మహా పోరాటం. మోదీ వశీకరణ శక్తికి, ప్రచార నైపుణ్యానికి, పార్టీ నేతలు, కార్యకర్తలు గత్యంతరం లేక లోబడవచ్చేమో కాని కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు భారతదేశం మోదీ మయం కాగలుగుతుందా? ప్రజలు తమ విచక్షణా శక్తిని, వివేచనను ఉపయోగిస్తారా? వాస్తవాలకూ, ప్రచారానికీ మధ్య తేడాను గమనిస్తారా అన్న ప్రశ్నలకు ఈ ఎన్నికల ఫలితాలు సమాధానమిస్తాయి.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

ఓటమి 'సిద్ధం'గా ఉంది!



వివేకా హంతకుడతడేనని నీ చెల్లి సునీత వేలెత్తి చూపుతున్నా
ఓ జగమొండీ అవివేకీ వినాశకాలే విపరీత బుద్ధి అన్నట్లు
అవినాశవాలేకు మళ్ళీ టికెట్ కట్టబెట్టి తెచ్చుకొంటివి చేటు
ఒక్క కడుపున పుట్టిన షర్మిలా ఉరుములురుముతూ
కదలి వచ్చింది కనకదుర్గయై
కడపలోనా కడప కడపా ఎక్కి దిగీ ఊరువాడా
ఎలుగెత్తి చాటుతున్నది హంతకుణ్ణి ఓడించడమే తన ధ్యేయమని
ఢంకా బజాయించి అతని ఓటమి తథ్యమని చెబుతుంటే
పంకాకు ఊపిరాడటం లేదు, నీ గద్దె గజగజ వణికి పోతున్నదిలే

జగన్ నీ లెక్కన 'లెక్క'ను చుక్కెత్తు
పోగు చేసుకున్న వాడున్నాడా ఈ జగాన
'మగన్'వైతే నీ తోడబుట్టిన చెల్లికి లెక్కాచారంగా పంచివ్వు
వంచించకు ఓటర్లను ఒట్టి బూటకం మాటలతోన
నీ ఇంటి చెల్లెళ్ల కంటినీరు తుడిచినంకనే
నా అక్క చెల్లెళ్లు అవ్వా తాతా అనే పల్లవెత్తుకో
ఇంట గెలిచి రచ్చ గెలవాలిరా నాయనా
ఊరూరా దివ్య హర్మ్యాలు కట్టుకొని
పూరి గుడిసెల మీద కురిపించకు మొసలి కన్నీరును



మళ్లీ గద్దె నెక్కడానికి రాష్ట్రాన్ని అప్పుల నిప్పుల కుంపటి చేశావే
ఖలేజా ఉంటే నీ సొంత ఖజానా నుంచి
ప్రజల సంక్షేమాలకు ఖర్చు పెట్టు
పుచ్చలపల్లి సుందరయ్యలా బీదసాదలకు పంచిపెట్టు
వావిలాలలా నిరాడంబరంగా నిజాయితీగా బతుకు
అపుడు ప్రజలు ప్రభంజనంలా కదలి వచ్చి
నీకు పట్టం కడతారురా పరమానందంతో
నీవు బతికినన్నాళ్లు నీవే ముఖ్యమంత్రి వంటారు



మీ ఇద్దరినీ తన రెండు కళ్ళలా భావించిన మీ తల్లి
ఎన్నికల్లో కత్తులు దూసుకుంటుంటే
చూడలేక కన్నతల్లి తరలిపోయింది అమెరికాకు
ఎవరు చెబుతారు 'వివేకాన్ని' పోగొట్టుకున్న నీకు
ఎవరు ఆపలేరు 'సిద్ధం'గా ఉన్న నీ ఓటమిని



– జి. చెన్నకేశవరెడ్డి

బాల సాహిత్య సమ్మేళనం

తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో మే 29, 30 తేదీల్లో హైదరాబాద్‌లో బాల సాహిత్య సమ్మేళనం జరుగుతుంది. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన పాఠశాల విద్యార్థులు, తెలుగు ఉపాధ్యాయులు, బాల సాహితీవేత్తలు, బాలల కోసం రచనలు చేస్తున్నవారు ఇందులో పాల్గొంటారు. పాఠశాల స్థాయిలో తెలుగు భాషావికాసం, బడి పిల్లల్లో రచనాభిరుచి పెంపొందించడం, పత్రికల్లో బాలల రచనలకు ప్రచురణావకాశాలు, కథలు చెప్పడంలో మెలకువలు, సంగీతం, నృత్యం, నాటకం, చిత్రలేఖనం, శిల్పం వంటి లలితకళల పైన ప్రాథమిక అవగాహన మొదలైన సదస్సులు, గోష్ఠులు జరుగుతాయి. శాంతా వసంతా ట్రస్టు వ్యవస్థాపకులు, పద్మభూషణ్ పురస్కృతులు డాక్టర్ కె.ఐ వరప్రసాదరెడ్డి వారి మాతృమూర్తి శాంతమ్మ గారి సంస్మరణార్థం గత కొన్ని సంవత్సరాలుగా ఈ కార్యక్రమాల నిర్వహణకు ఆర్థిక సౌజన్యం అందిస్తున్నారు. ఈ సమ్మేళనంలో ప్రతినిధులుగా పాల్గొనదలిచేవారు ఈ నెల 30వ తేదీలోగా 96037 27234 వాట్సాప్ నెంబర్‌కు వివరాలు పంపి పేర్లు నమోదు చేసుకోవాలి.

– **ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, డాక్టర్ జె.చెన్నయ్య**
తెలంగాణ సారస్వత పరిషత్తు

హిందూ మతాన్ని మాత్రమే మీ చరిత్ర అంగీకరించదా?

'మతాన్ని చరిత్ర అంగీకరించదు' అంటూ ఏప్రిల్ 7న కొప్పర్తి వెంకట రమణమూర్తి రాసిన వ్యాసంలో మతం చరిత్రగా, చరిత్ర మతంగా మారుతున్న నేటి పరిస్థితుల్లో చరిత్రకు మతానికి ఉండే వైవిధ్యాన్ని ప్రశ్నించి సమాధానం రాబట్టుకోవలసిన అవసరం ఉందని చెబుతూ, హిందువులకు సంబంధించిన ఆధ్యాత్మిక విషయాలను స్పృశిస్తూ, శ్రీకృష్ణుడు, శ్రీరాముని అవతార విషయాలను ప్రస్తావించారు. కానీ ఆ వ్యాసం ధోరణి చూస్తే కేవలం హిందూ మతాన్ని మాత్రమే చరిత్ర అంగీకరించదు అని చెప్పకనే చెప్పినట్లు ఉంది.

మతానికి వస్తువు దేవుడు, చరిత్రకు వస్తువు గతం – అంటే మానవునికి సంబంధించిన గతంలోని విషయాలు అని అర్థం. మతానికి వస్తువు దేవుడు అనేది క్రైస్తవం, ఇస్లాంలకు సంబంధించిన భాషణం. ముస్లింలను, క్రైస్తవులను మినహాయిస్తే (ప్రభుత్వ లెక్కల్లో చెప్పినట్లు) నానా కులాలుగా విడిపోయిన హిందువులు అనుసరించేది మతం



చరిత్రకు మతం లేకపోవచ్చు. కానీ చరిత్రను వ్యాఖ్యానించేది మానవులే కదా! చరిత్రను వ్యాఖ్యానించే వారిలో నిష్పాక్షికత లోపిస్తే ఒక మతంలోని విషయాలు మరుగునపడడమో, ఆ మతానికి దుర్వ్యాఖ్యలను జోడించడమో జరుగుతుంది కదా?

కాదు. ఇది ఒక జీవన విధానం. ఈ జీవన విధానంలో ఏ సాంప్రదాయం, ఏ ఆచారం ఒకరి సొత్తుగా లేదు. హిందువులు అనుసరించే ఆచారాలు, సాంప్రదాయాలు ప్రార్థనా విధానాలు, ఆరాధనా పద్ధతులను లోతుగా అధ్యయనం చేసిన సుప్రీంకోర్టు హిందువులు పాటించేది ఒక జీవన విధానమే కానీ మతం కాదని తేల్చి చెప్పింది. ఇందుకు కారణం లేకపోలేదు. యజ్ఞోపవీతం ధరించి, నిత్యం నియమానుసారంగా గాయత్రీ మంత్రం జపించే బ్రాహ్మణుడికీ, కొండల్లో జీవిస్తూ కొండ దేవరను పూజించే కోయ జాతి వాడికీ ఆరాధనా విధానంలో ఎంతో వ్యత్యాసం కనబడుతుంది. అయినప్పటికీ వీళ్లిద్దరిని హిందువులుగానే ఈ దేశ ప్రభుత్వం గుర్తిస్తుంది.

చరిత్రకు మతం లేదని చెప్పడం వాస్తవమేనా? ఇది వాస్తవమైతే క్రైస్తవ మతానికి సంబంధించిన క్రీస్తును చరిత్రను లెక్కించడానికి ప్రామాణికంగా ఎందుకు తీసుకుంటున్నారు? చరిత్రకు మతం లేకపోవచ్చు. చరిత్ర తనకు తాను చెప్పుకోదు! చరిత్రను వ్యాఖ్యానించేది మానవులే కదా! చరిత్రను వ్యాఖ్యానించే వారిలో నిష్పాక్షికత లోపిస్తే ఒక మతంలోని విషయాలు మరుగునపడడమో, ఆ మతానికి దుర్వ్యాఖ్యలను జోడించడమో జరుగుతుంది కదా?

ఈ దేశ చరిత్రను రాసింది బ్రిటిష్‌వాళ్ళు. వేద సాహిత్యంలో భాగాలైన వేదాలు, ఉపనిషత్తులు, అరణ్యకాలు, బ్రాహ్మణికాలను ఆంగ్లీకరించింది పాశ్చాత్యులు. ఈ విషయంలో భారతదేశానికి సంబంధించిన సంస్కృత పండితులకు ఏ మాత్రం పాత్ర లేదు. భారత రాజ్యాంగ రచనా సభ్యులు మన దేశ రాజ్యాంగాన్ని రూపొందించడంలో అమెరికా, బ్రిటన్, రష్యా ఆస్ట్రేలియా, జర్మనీ వంటి దేశాల రాజ్యాంగాలలోని ముఖ్య విషయాలను తీసుకున్నారనే విషయం సత్య దూరం కాదు. మన దేశానికి సంబంధించిన వేద సాహిత్యాన్ని విశ్లేషించే వామపక్షవాదులు ఇదే తంతును అనుసరించారు. ఈ వ్యాసంలోని నేపథ్యం కూడా అదే!


చరిత్ర నిజాన్ని ఆధారాలతో సహా తెలియజేస్తుందని చెప్పడం ఎంత వరకు వాస్తవం? 1922లో హరప్పా, మొహంజోదారో ప్రాంతాలలో సింధూ నాగరికత శిథిలాలు బయటపడేంత వరకు భారతదేశానికి పురాతన చరిత్ర లేదని బ్రిటిష్ చరిత్రకారులు వాదిస్తూ వచ్చారు. అంత వరకు భారతదేశ చరిత్ర గురించి చెప్పిన చారిత్రక విషయాలు అసత్యాలుగా మారిపోయాయి. 40 సంవత్సరాల క్రితం ప్లూటో సౌర కుటుంబంలో ఒక గ్రహం అని చెప్పింది చరిత్ర. ఇప్పుడు ఆ సత్యం కాస్తా అసత్యమై నిలబడింది. అంటే గతానికి అంటే చరిత్రకు సంబంధించిన విషయాలలో కొత్తవి చేరినప్పుడు పాతవి అసత్యాలుగా మిగిలిపోతాయి. ఋగ్వేద రచన క్రీస్తు పూర్వం 2000–1500 సంవత్సరాలలో జరిగి ఉండవచ్చునని, ఎవరో రస హృదయులు రాశారని చెప్పడం వాస్తవమేనా?

ఇక ఆధ్యాత్మిక సాహిత్యంలోని దేవాసుర సంఘర్షణను బ్రిటిష్‌వాళ్లు అల్లిన కట్టుకథల చరిత్ర అయిన ఆర్య ద్రావిడ వాదంతో అనుసంధానం చేయడం వ్యాసకర్త చేసిన విచిత్రమైన విన్యాసం. రెండవ ప్రపంచ యుద్ధంలో జర్మన్ జాత్యాహంకారం ఓడించబడటంతో ఆర్యులు ఒక జాతి అనే వాదం ప్రపంచంలో తిరస్కరించబడింది. కానీ భారతదేశంలోని వామపక్షవాదులు దానినే పట్టుకొని ఊగులాడుతున్నారు. ఇందుకు కారణం లేకపోలేదు. ఈ వాదాన్ని వదులుకుంటే వామపక్ష చరిత్రకారులకు, వామపక్ష మేధావులకు, వామపక్ష నాయకులకు మనుగడ ఉండదు.

ఈస్ట్ ఇండియా కంపెనీ పరిపాలనపై 1857లో భారతదేశంలో అన్ని ప్రాంతాల ఆచార సాంప్రదాయాలకు అతీతంగా తిరుగుబాటు చేశారు. దీనిని ప్రథమ భారత స్వాతంత్ర సమరం అంటారు. ఈ సమరం బ్రిటిష్ పాలకులు మేధావుల ఆలోచనలను మార్చింది. ఈ దేశంలో బ్రిటిష్ పాలనను స్థిరీకరించుకోవడానికి ఆర్య ద్రావిడ వాదాన్ని, హిందువులు ముస్లింలు వేరు వేరు జాతులవారు అనే ద్విజాతి సిద్ధాంతాన్ని (సర్ సయ్యద్ అహ్మద్‌ఖాన్ చేత చెప్పించి) భారతీయుల బుర్రల్లోకి ఎక్కించారు. ముస్లిం లీగ్, ద్రవిడ పార్టీలు బ్రిటిష్ వాళ్లకు అనుకూలంగా, స్వాతంత్ర్య ఉద్యమానికి వ్యతిరేకంగా పనిచేశాయనే విషయం చాలామంది భారతీయులకు తెలియదు. వేద జ్ఞానానికి మూలపురుషుడైన వేద వ్యాసమహర్షిని 'వ్యాసుడనే ఋషి నాలుగు వేదాలను వర్గీకరించాడంట' అని వ్యంగంగా చెప్పడం వెనుక భారతీయ రుషి పరంపర పైన వ్యాసకర్తకు ఉండే వ్యతిరేక భావన అర్థమైంది.

మతం హఠాత్తుగా మొదలవుతుందని ఒకచోట చెప్పి, మానవ నాగరికతలో ఒక పనిముట్టు, ఒక వ్యవస్థ రూపాంతరము చెందినట్లు, మత భావనలు కూడా రకరకాలు రూపాలు తీసుకుంటాయని మరో చోట చెప్పడాన్ని బట్టి వ్యాసకర్త భారతీయ సాంస్కృతిక విషయాలలోని క్లిష్టతను అర్థం చేసుకోలేదనిపిస్తోంది. అసలు మతాన్ని చరిత్ర రూపంలోకి ఎందుకు తీసుకొచ్చినట్టు? శివుడిని లింగ రూపంలో ఎందుకు ప్రతిష్ఠిస్తారు? దీనికి ఆధ్యాత్మికపరమైన కోణాన్ని అర్థం చేసుకోకుండా, చిత్త చాంచల్యంతో, లైంగిక పరిభాషలో విశ్లేషించడం విజ్ఞత అనిపించుకోదు.

■ **కొండా సుమంత్ రెడ్డి**
సామాజిక విశ్లేషకులు



ఎండ

వేలవేల అద్దాలు బద్దలైనట్టు,
సముద్రాలు ఆవిరై
ఒంటి మీద ఊరుతున్నట్టు.

ఉపమానాలన్నీ పాతబడ్డ పోలికలై
తూలికల్లా ఎగిరిపోతున్నట్టు
నీడ విలువ
నీటి విలువ
చెట్ల విలువ
తెలియజెప్పే ఒక కఠోర పాఠం ఎండ.

గాలి నిశ్చేష్టితమౌతుంది
జాలి అనార్ద్రమౌతుంది
ఎండలో కాయకష్టం
మరింత భారమౌతుంది
పక్క వీధి కూడా దూరమౌతుంది.

ఎటూ తోచదు
కవిత్వం వెలువడుతుంది గాని
అది వేడిగా వుంటుంది.
చంద్రుని గురించిన పాట కూడా
చందనంలా చల్లగా వుండదు.


పిల్లి వేటకు వెళ్లదు
కుక్క వెల్లకిలా పడుకుని
అంగలారుస్తుంది.

కట్టెల మోపు నెత్తుకొని
ఆమె చకచకా నడుస్తుంది.
అవి నెత్తి మీదనే ఎండిపోయాయి.
నాకు ఆమె తలపై
చుట్టకుదురై నలగాలని వుంది.

– డా. ఎన్.గోపి

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా

ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి,
ప్లాట్–76, అశ్వినీ లే ఔట్,
హుడా హైట్స్,
రోడ్ నంబరు–70,
జూబ్లీహిల్స్,
హైదరాబాద్–500033.
మెయిల్:
editpage@andhrajyothy.com



ప్రియుడి కోసం పెద్దమ్మ నగలు చోరీ


- తోడుకోసం తీసుకొస్తే 16 తులాల బంగారు నగలు అపహరణ
- సోషల్ మీడియాలో పరిచయమైన ప్రియుడికి అప్పగింత
- యువకుడి అరెస్టు



పోలీసులు రికవరీ చేసిన బంగారు ఆభరణాలు

బౌద్ధనగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తన పిల్లలకు తోడుగా ఉంటుందని తీసుకొస్తే పెద్దమ్మ నగలనే కాజేసింది. ప్రియుడి మోజులో పడిన బాలిక 16 తులాల నగలు, రూ.1.5 లక్షలను అతడికి ఉదారంగా అందజేసి ఏమీ తెలియనట్లుగా నటించింది. యజమాని ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు యువకుడిని అరెస్ట్ చేశారు. ఈస్ట్‌జోన్ డీసీపీ ఆర్.గిరిధర్, ఏసీపీ జైపాల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ అనుదీప్ మంగళవారం వివరాలు వెల్లడించారు. చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉంటున్న దంపతులు ప్రభుత్వ ఉద్యోగులు. భర్త నగరంలో పనిచేస్తుండగా, భార్య ఆంధ్రప్రదేశ్‌లోని జగ్గయ్యపేటలో ఉద్యోగం చేస్తూ చెల్లెలు ఇంట్లో ఉంటోంది. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు. నగరంలో ఉంటున్న వీరికి తోడు కోసం మహిళా ఉద్యోగి చెల్లెలి కుమార్తెను ఇక్కడకు తీసుకొచ్చారు. ఆమెను స్థానికంగా ఓ ప్రైవేట్ పాఠశాలలో

మిగతా 8వ పేజీలో..





సీతారాముల కల్యాణం చూతము రారండి..!

శ్రీ రామనవమి వేడుకలకు నగరం సిద్ధం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కల్యాణానికి రాములోరు సిద్ధమయ్యారు. సీతమ్మను మనువాడేందుకు ముస్తాబయ్యారు. బుధవారం ఉదయం వేదపండితుల మంత్రోచ్చారణలు, భక్తుల జయజయధ్వానాల నడుమ సీతాదేవికి మూడుముళ్లు వేయనున్నారు. ఇంతటి మహోత్కార్యాన్ని కనులారా వీక్షించేందుకు నగరంలోని శ్రీరామ నవమి ఉత్సవ కమిటీలు, హనుమాన్ భక్త మండళ్ల ఆధ్వర్యంలో నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు. పలుచోట్ల ఎల్ఈడీ, ఎల్‌సీడీ స్ర్కీన్లను పెట్టారు. కాగా, శ్రీరామనవమిని పురస్కరించుకుని మంగళవారం నుంచే నగర వ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది.

నేడు శోభాయాత్ర **ట్రాఫిక్ ఆంక్షలు** 8



రె'ఢీ'!

- రేపటి నుంచి నామినేషన్లు
- వేడెక్కనున్న గ్రేటర్ రాజకీయాలు
- ఇప్పటికే క్షేత్రస్థాయిలో అభ్యర్థులు
- అగ్రనేతల ప్రచారం ఉండేలా ప్రణాళికలు

గ్రేటర్‌లో పార్లమెంట్ ఎన్నికల ప్రచారం ఇక మరింత వేడెక్కనుంది. పోరులో కీలక ఘట్టం రేపు మొదలుకానుంది. నోటిఫికేషన్ విడుదలతో ఈనెల18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్లు దాఖలు చేయనున్నారు. దీంతో ఇప్పటికే వ్యూహ, ప్రతివ్యూహాలు రచించిన అభ్యర్థులు క్షేత్రస్థాయిలో దిగనున్నారు.

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లోని మూడు పార్లమెంట్ స్థానాలకు ప్రధాన పార్టీలు అభ్యర్థులను(కాంగ్రెస్ హైదరాబాద్ అభ్యర్థి మినహా)ప్రకటించాయి. వారు ఇప్పటికే ప్రచారమూ ప్రారంభించారు. కుల, యువజన, రెసిడెన్షియల్ వెల్ఫేర్, మహిళా సంఘాల సభ్యులతో అభ్యర్థులు సమావేశమవుతున్నారు. గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్ వాసులతోనూ మీటింగ్‌లు ఏర్పాటుచేసి గెలిస్తే తాము ఏం చేస్తామన్నది వివరిస్తున్నారు. బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు నియోజకవర్గాల వారీగా పార్టీ శ్రేణులతో సమన్వయ సమావేశాలు నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థులూ పలు అసెంబ్లీల పరిధిలో పార్టీ కేడర్‌ను ఎన్నికలకు సమాయత్తం చేస్తున్నారు. నామినేషన్ దాఖలు అనంతరం ఇంటింటి ప్రచారానికి శ్రీకారం చుట్టేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. నిత్యం ప్రచారంలో ఉండాలని నియోజకవర్గంలోని కీలక నేతలను అభ్యర్థులు కోరుతున్నారు.

అగ్రనేతలు ప్రచారం చేసేలా...

తమ ప్రచారంతోపాటు అగ్రనేతలు పాల్గొనేలా అభ్యర్థులు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కాంగ్రెస్ తరఫున సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు ప్రచారంలో పాల్గొనే అవకాశముందని నేతలు చెబుతున్నారు. రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీలతో పలు ఏరియాల్లో రోడ్ షోలు నిర్వహించే అవకాశం లేకపోలేదని ఓ నాయకుడు పేర్కొన్నారు. బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా కేంద్ర మంత్రులు, ఇతర రాష్ట్రాల సీఎంలు, వీలైతే మోదీ కూడా రోడ్ షోలో పాల్గొనే అవకాశముంది. బీఆర్ఎస్ నుంచి మాజీ సీఎం, పార్టీ అధ్యక్షుడు కేసీఆర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మరో నేత హరీ‌ష్‌రావులు ప్రచారం చేయనున్నారు.

వివరాలివి..	
● నామినేషన్ల దాఖలు -	18 నుంచి 25వ తేదీ వరకు
● పరిశీలన -	26న
● ఉపసంహరణకు చివరి తేదీ -	29 వరకు
● పోలింగ్ -	మే 13న
● ఓట్ల లెక్కింపు -	జూన్ 4న
● హైదరాబాద్ జిల్లాలో ఓటర్లు -	45,70,138
(అనుబంధ జాబితాతో ఓటర్ల సంఖ్య పెరుగుతుంది)	
● పోలింగ్ కేంద్రాలు -	3,986
● ప్రాంతాలు -	1,675
పార్లమెంట్ ఎన్నికల కోసం..	
● బ్యాలెట్ యూనిట్లు	8,713
● కంట్రోల్ యూనిట్లు	5,383
● వీవీ ప్యాట్లు	6,217
కంటోన్మెంట్ ఉప ఎన్నికకు..	
● బ్యాలెట్ యూనిట్లు	493
● కంట్రోల్ యూనిట్లు	497
● వీవీ ప్యాట్లు	495

విధులకు గైర్హాజరైతే కఠిన చర్యలు

ఎన్నికల విధులకు రాని ఉద్యోగులపై చట్ట ప్రకారం చర్యలుంటాయని రోనాల్డ్ హెచ్చరించారు. 1700 మంది పీఓ, ఏపీఓలు, 2 వేల మంది ఓపీఓలు శిక్షణకు రాలేదని, వారందరికీ ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని, 18వ తేదీ నుంచి పోలీసులు సదరు ఉద్యోగులకు అందిస్తారన్నారు. గర్భిణులు, దివ్యాంగులు, అనారోగ్యం వంటి సహేతుక కారణాలుంటే మినహాయింపు ఇస్తున్నట్టు చెప్పారు.

అధికార యంత్రాంగం సిద్ధం : కమిషనర్
సజావుగా నిర్వహించాలి: కలెక్టర్ 8



ఊపిరాడని ప్రయాణం

మండే ఎండల్లో కిటకిటలాడుతున్న మెట్రో రైళ్లు

- సామర్థ్యానికి మించి రాకపోకలు
- బోగీల్లో పిల్లలు, మహిళల ఇబ్బందులు
- అదనపు కోచ్‌లను పెంచడంలో నిర్లక్ష్యం

ఎండలు ముదరడంతో మెట్రో రైళ్లలో ప్రయాణానికి డిమాండ్ ఏర్పడింది. సామర్థ్యానికి మించి ప్రయాణికులు తరలివెళ్తుండడంతో విపరీతమైన రద్దీ ఉంటోంది. సాధారణ రైళ్లలోని జనరల్ బోగీల మాదిరిగా ఊపిరాడని స్థితిలో ప్రయాణించాల్సి వస్తోంది. పిల్లలు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా అదనపు కోచ్‌లను పెంచడంలో ఎల్అండ్‌టీ, మెట్రో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహానగరంలో ఎండలు మండిపోతున్నాయి. 40 డిగ్రీలకు పైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ఇంటి నుంచి బయటకు వెళ్లేందుకు ప్రజలు వణికిపోతున్నారు. అత్యవసర పనులకు మాత్రమే కొందరు గడప దాటుతున్న పరిస్థితి కనిపిస్తోంది. అయితే, ఉద్యోగులు, విద్యార్థులతోపాటు పనుల నిమిత్తం బయటకు వెళ్తున్న సాధారణ ప్రజలు మెట్రోరైళ్లనే ఆశ్రయిస్తుండడంతో స్టేషన్లలో ఎప్పుడు చూసినా రద్దీనే కనిపిస్తోంది.

5.30 లక్షలకు చేరిన ప్రయాణికులు..

మెట్రో రైళ్లలో ఈ ఏడాది ఊహించని విధంగా ప్రయాణికులు పెరుగుతున్నారు. ప్రధానంగా మార్చి 15 నుంచి రోజూ సగటున 4.90 లక్షల నుంచి 5.10 లక్షల మంది

మిగతా 8వ పేజీలో..

సమ్మర్ డిమాండ్ తగ్గే వరకు అలర్ట్..! ● విద్యుత్ సబ్‌స్టేషన్‌ల ఆకస్మిక తనిఖీలు 8

విజయవాడ - హైదరాబాద్ రూట్లో

విమాన సర్వీసు ప్రారంభం

- పోటీకి తెరలేపిన ఎయిర్ ఇండియా


విమానం దగ్గర పైలట్స్, ఎయిర్‌హోస్టెస్, ఇతర స్టాఫ్

విజయవాడ /గన్నవరం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): విజయవాడ - హైదరాబాద్‌ల నడుమ ఎయిర్‌ఇండియా ఎక్స్‌ప్రెస్ నూతన బోయింగ్ విమాన సర్వీసును ప్రవేశపెట్టింది. సోమవారం విజయవాడ ఎయిర్‌పోర్టు నుంచి 186 సీట్లతో కూడిన భారీ బోయింగ్ విమాన సర్వీసు ప్రారంభమైంది. దీనిని ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎం.లక్ష్మీకాంత్ రెడ్డి ప్రారంభించారు. ప్రయాణికులకు బోర్డింగ్ పాస్‌ను అందించారు. రోజూ ఉదయం 8.55 గంటలకు బయలుదేరి 10 గంటలకు హైదరాబాద్ చేరుతుంది. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ నూతన సర్వీసుతో ఈ మార్గంలో ఇతర విమానయాన సంస్థలతో పోటీ ప్రారంభమైంది. హైదరాబాద్ రూట్‌లో 8 విమానాలు నడుస్తుండగా అందులో ఏడు 'ఇండిగో' విమానాలే ఉన్నాయి. ఒకటి అలయెన్స్ ఎయిర్ విమానం నడుస్తోంది. ప్రస్తుతం ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ నూతన సర్వీసుతో హైదరాబాద్ రూటులో ఇండిగోకు అసలైన పోటీ ఏర్పడనుంది. దీంతో ధరలు దిగి వచ్చే పరిస్థితి ఉంటుంది. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎయిర్ ఇండియా స్టేషన్ మేనేజర్ ఎం.పార్థసారధి, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ మేనేజర్ సుబ్రమణ్యేశ్వర్ పాల్గొన్నారు.



ఎంఎంటీఎస్ - ఆర్టీసీ కంబైన్డ్ పాస్ రూ.1,350

- పునరుద్ధరించిన రైల్వే

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): జంట నగరాల ప్రయాణికులకు ఎంఎంటీఎస్-ఆర్టీసీ కంబైన్డ్ బస్‌పాస్‌ను దక్షిణమధ్యరైల్వే పునరుద్ధరించింది. అటు ఎంఎంటీఎస్ రైళ్లల్లో ఇటు టీఎస్ ఆర్టీసీ బస్సుల్లోనూ ప్రయాణించేందుకు వీలుగా కంబైన్డ్ బస్‌పాస్‌ను రైల్వే, ఆర్టీసీ సంస్థలు సంయుక్తంగా ప్రవేశపెట్టాయి. గతంలో ఉన్న కంబైన్డ్ పాస్ ధర(రూ.1,050)ను ఇటీవల రూ.1,350కు పెంచారు. కంబైన్డ్ బస్‌పాస్‌ను జంటనగరాల్లోని అన్ని ఎంఎంటీఎస్ స్టేషన్ల(టికెట్ కౌంటర్ల)లో జారీచేస్తారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు ఈ కంబైన్డ్ పాస్ ఎంతో ప్రయోజనకరంగా ఉందని ఎంఎంటీఎస్ ప్రయాణికుల సంఘం ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కుస్తీ పోటీల్లో ఓడించాడని..

- మద్యం మైకంలో అందరూ కలిసి దాడి
- తండ్రి, సోదరుడి ముందే కత్తితో పొడిచి హత్య


ఖలీల్(ఫైల్)

మదీన, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తాగిన మైకంలో స్నేహితుల మధ్య తలెత్తిన చిన్నవివాదం హత్యకు దారి తీసింది. అప్పటి వరకు తమతో కలిసి మద్యం తాగిన స్నేహితుడినే కత్తితో పొడిచి దారుణంగా హత్య చేశారు. ఈ సంఘటన సోమవారం అర్ధరాత్రి బహదూర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కిషన్‌బాగ్ అసద్‌బాబానగర్‌కు చెందిన మహ్మద్ మహమూద్ కుమారుడు మహ్మద్ ఖలీల్(21) డ్రైవర్. అదే ప్రాంతానికి చెందిన ఖలీల్‌తోపాటు అజ్జూ, లడ్డూ, ముజమ్మిల్, షోయబ్, ఫారూఖ్ స్నేహితులు. వీరంతా సోమవారం అర్ధరాత్రి అసద్‌బాబానగర్ నాలా వద్ద కూర్చుని మద్యం తాగారు. అనంతరం కుస్తీ మాదిరి పోటీలు పెట్టి కొట్లాడుకున్నారు. ఖలీల్ మిగతా వారితో కుస్తీ పడి వారిని ఓడించాడు. దీంతో అందరూ ఒక్కటై ఖలీల్‌ను విచక్షణా రహితంగా కొట్టారు. ఈ విషయం తెలుసుకున్న ఖలీల్ తండ్రి మహమూద్, సోదరుడు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈలోపు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లు కూడా అక్కడికి రావడంతో వారిని చూసి అందరూ పారిపోయారు. దీంతో ఖలీల్‌ను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి.. మిగతా వారిని పట్టుకొని స్టేషన్‌కు

మిగతా 8వ పేజీలో..

550 మద్యం పరీక్షలో రీడింగ్

తప్పతాగి బీభత్సం సృష్టించిన టెకీ


మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

రాయదుర్గం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి తన కారుతో రోడ్డుపై సోమవారం విధ్వంసం సృష్టించాడు. ఓ పాదచారితో పాటు రోడ్డుపై వెళ్తున్న పలు వాహనాలను ఢీ కొడుతూ దూసుకెళ్లాడు. దీంతో ఒకరు మృతి చెందగా.. పలువురికి గాయాలయ్యాయి. ఈ కేసులో పోలీసులు అరెస్ట్ చేసిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి క్రాంతికుమార్ యాదవ్‌కు బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించగా, 550 రీడింగ్ వచ్చినట్లు తెలిసింది. ఆ స్థాయి మద్యం మత్తులో రోడ్డుపై నిర్లక్ష్యంగా, అతివేగంగా కారును నడిపి 12.30 నుంచి 1.30 గంటల మధ్యలో ఏకంగా ఆరు రోడ్డు ప్రమాదాలు చేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తన నిర్లక్ష్యం కారణంగా ఓ వ్యక్తి మరణించినప్పటికీ క్రాంతి తన వాహనాన్ని ఆపకుండా పారిపోతూ రాయదుర్గం పోలీస్‌స్టేషన్ సమీపంలోని కిమ్స్ ఆస్పత్రి వద్ద మరోబైక్‌ను ఢీ కొట్టాడు. ఈ ఘటనలో ఇద్దరికి స్వల్పగాయాలు అయ్యాయి.

'సివిల్స్' సంబరాలు


ఓ అకాడమీలో ర్యాంకర్ల విజయసంకేతం

చిక్కడపల్లి/కవాడిగూడ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): యూపీపీఎస్సీ మంగళవారం విడుదల చేసిన సివిల్స్ ఫలితాలలో తమ విద్యార్థులు ర్యాంకులు సాధించడంతో అశోక్‌నగర్‌లోని కోచింగ్ సెంటర్లలో సంబరాలు జరిగాయి. ర్యాంకర్లను అభినందిస్తూ సన్మానాలు చేశారు. కేకులు కట్ చేస్తూ ర్యాంకర్లతో కలిసి హోరెత్తించారు. కష్టపడి, ఇష్టపడి చదివితే సివిల్స్ సర్వీసెస్ పరీక్షల్లో ర్యాంకు సాధించడం కష్టమేమీ కాదని ప్రముఖ విద్యావేత్త మల్లవరపు బాలలత తెలిపారు. అశోక్‌నగర్‌లోని లా ఎక్సలెన్స్ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో 703 ర్యాంకర్ రాజ్‌కుమార్ చౌహాన్‌తో పాటు పలువురు ర్యాంకర్లను సన్మానించారు. ఈ సందర్భంగా ర్యాంకర్ రాజ్‌కుమార్ చౌహాన్ మాట్లాడుతూ తల్లిదండ్రులు ప్రోత్సాహంతో ఆదిలాబాద్ జిల్లాకు గిరిజన చెందిన తాను సివిల్స్ పరీక్షఫలితాల్లో సెలక్ట్ కావడం సంతోషంగా ఉందన్నారు. అలాగే.. ఆలిండియా 887 ర్యాంక్ సాధించిన హనిత వేములపాటిని అనలాగ్ ఐఏఎస్ ఆకాడమీ ఆధ్వర్యంలో శాలువా కప్పి పూలబొకే అందజేసి సన్మానించారు.

చోరీ చేసిన వాహనాలతో స్టంట్లు
- సోషల్ మీడియాలో పోస్టింగులు
- ఫేమస్ అవుదామని అరెస్ట్ అయ్యారు
- బేగంపేటలో ఇద్దరి అరెస్ట్.. 9 వాహనాలు స్వాధీనం

7

ముంపు ముప్పు లేకుండా ముందస్తు చర్యలు.. 8

రాజస్థాన్ టూ హైదరాబాద్ డ్రగ్స్

● అంతర్రాష్ట్ర ముఠాను అరెస్ట్ చేసిన పోలీసులు

ఉప్పల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వారిద్దరూ డ్రైవర్లు. డబ్బు సంపాదించేందుకు మత్తు పదార్థాల రవాణా మార్గాన్ని ఎంచుకున్నారు. రాజస్థాన్ నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ సరఫరా చేస్తూ ఉప్పల్ ప్రాంతంలో రాచకొండ ఎస్‌వోటీ పోలీసులకు మంగళవారం పట్టుబడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన మనోజ్ వైష్ణోయ్(23) గ్యాస్ డెలవరీ బాయ్. అదే రాష్ట్రానికి చెందిన బుధన్ రామ్(32) ట్రక్ డ్రైవర్. ఇద్దరూ కలిసి రాజస్థాన్ నుంచి మత్తు పదార్థాలు హైదరాబాద్‌కు సరఫరా చేసి డబ్బు సంపాదించాలని ప్రణాళిక వేసుకున్నారు. ఎండీఎంఏ మత్తు పదార్థాలను రూ.2వేలకు కొనుగోలు చేసి హైదారాబాద్ యువతకి రూ.10-12వేలకు విక్రయిస్తున్నారు. నిందితుల వద్ద 600గ్రా. డ్రగ్స్‌తోపాటు నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. యువత పెడదారి పట్టొద్దని రాచకొండ సీపీ తరుణ్‌జోషి సూచించారు.

● వినూత్న ప్రచారం



హైదరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవీలత మంగళవారం చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో పర్యటించారు. బ్యాండ్ మోగిస్తూ, కుండలు చేస్తూ వినూత్నంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు - చాంద్రాయణగుట్ట, ఆంధ్రజ్యోతి

నాలుగేళ్ల తర్వాత బీజేపీ ప్రభుత్వం

● ఎమ్మెల్యే రాజాసింగ్

● మజ్లిస్ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ వ్యాఖ్యలకు కౌంటర్ వీడియో

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): 'నాలుగేళ్ల తర్వాత తెలంగాణలో బీజేపీ సర్కార్ ఏర్పడుతుంది. అప్పుడు నిన్ను, మీ సోదరుడిని ఏం చేయాలో ఆలోచిస్తాం.. మీరు అంటున్నట్లుగా తుపాకీతో పేల్చి చంపడం, జైల్లో పెట్టి విషమిచ్చి చంపడం వంటివి చేయం, అంత వరకు ఫికర్ చేయకండి.. ఈ నాలుగేళ్లు ఎంత దోపిడీ చేసుకుంటారో, ఎంతమందిని మోసం చేస్తారో.. చేసుకోండి.. మా సర్కార్ ఏర్పడడం ఖాయం' అని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. తనతో పాటు అన్న అసదుద్దీన్ ఒవైసీని చంపే ప్రయత్నాలు జరుగుతున్నాయని మజ్లిస్ పార్టీ శాసన సభా పక్షనేత, చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలకు గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ కౌంటర్‌గా వీడియో విడుదల చేశారు. మైనార్టీ ఓట్లతో గెలుస్తున్న మీరు వాళ్ల కోసం ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇక్కడ ఏ ప్రభుత్వం ఏర్పడితే వారి కాళ్లు పట్టుకుని, కబ్జాలు చేయడం అలవాటుగా మారిందని, బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు సంపాందించుకోవడం మీరు చేస్తున్నదే కదా.. అని ఆరోపించారు.

ముస్లింల సమస్యలపై గళమెత్తేది ఎంఐఎం

● అక్బరుద్దీన్ ఒవైసీ

మదీన, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ముస్లింలకు ఎలాంటి సమస్యలు వచ్చినా చట్టసభల్లో అయినా, బయట అయినా గళమెత్తేది మజ్లిస్ పార్టీయేనని చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. సోమవారం రాత్రి మిస్రీగంజ్ అలీనగర్‌లో గల అక్బర్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ఈద్‌మిలాప్ కార్యక్రమంలో పాల్గొని మజ్లిస్‌పార్టీ కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించారు. మజ్లిస్ పార్టీ ఎల్లప్పుడూ పేదల పక్షమేనన్నారు. కార్యక్రమంలో బహదూర్‌పురా ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్, దూద్‌బౌలి కార్పొరేటర్ మహ్మద్ సలీంతోపాటు నాయకులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న అక్బరుద్దీన్ ఒవైసీ



బీజేపీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న కిషన్‌రెడ్డి

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టాలి

మంగళ్‌హట్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ బీజేపీకి ఓటు వేసి పట్టం కట్టాలని కేంద్ర మంత్రి, రాష్ట్ర అధ్యక్షులు జి. కిషన్‌రెడ్డి అన్నారు. మంగళవారం నాంపల్లి నియోజకవర్గం రెడ్‌హిల్స్ డివిజన్‌లో బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కిషన్‌రెడ్డి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిసి బీజేపీకి ఓటు వేసి మరోసారి అవకాశం కల్పించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్ ప్రధాన శిష్యుడు కాసర్ల శ్రీనివాస్ బీజేపీ తీర్థం పుచ్చుకోవడంతో ఆయనకు కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో డాక్టర్ గౌతమ్‌రావు, రాహుల్ చంద్ర, క్రాంతి కిరణ్, దిలీప్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



తులసీరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

మాజీ ఎంపీ తులసీరాం సేవలు మరువలేనివి

రాజేంద్రనగర్, ఏప్రిల్16 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ సభ్యుడిగా వి.తులసీరాం రాజేంద్రనగర్ పరిసర ప్రాంతాలలో చేసిన సేవలు మరిచిపోలేనివని బాబూ జగ్జీవన్‌రాం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు పచ్చ నర్సింగ్‌రావు కొనియాడారు. దివంగత మాజీ ఎంపీ తులసీరాం 4వ వర్ధంతి వేడుకలు మంగళవారం రాజేంద్రనగర్‌లోని డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం ఆవరణలో నిర్వహించారు. నర్సింగ్‌రావు, జయంతి ఉత్సవాల కమిటీ మాజీ అధ్యక్షుడు మంత్రి చంద్రశేఖర్, పంబాల రాజు, గుడిసే యాదయ్య, క్యాసారం శంకర్‌రావు తదితరులు తులసీరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ శివరాంపల్లిలో జాతీయ పోలీస్ అకాడమీ రావడం, శివరాంపల్లి నుంచి శంషాబాద్ మీదుగా షాద్‌నగర్ వరకు విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయడం తులసీరాం కృషి ఫలితమే అన్నారు. నవజ్యోతి యూత్ క్లబ్ అధ్యక్షుడు వేముల వెంకటేశ్, మాజీ అధ్యక్షుడు ఎస్.జగదీశ్వర్, స్థానిక నాయకులు రవీందర్, కరణం నారాయణ ముదిరాజ్, కొమిరె గణేశ్, పత్యార రాజు తదితరులు నివాళులర్పించారు.

వీసా, పాస్‌పోర్ట్ గడువు ముగిసినా నగరంలోనే తిష్ఠ

- డ్రగ్స్ విక్రేతలతో కలిసి పలు కేసుల్లో నిందితుడు
- మొరాకో దేశ వాసిని స్వదేశానికి పంపిన హెచ్‌న్యూ పోలీసులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వీసా గడువు ముగిసినా, నగరంలోనే తిష్ఠవేసి, అక్రమార్కులతో కలిసి ఉంటున్న మొరాకోవాసిని హెచ్‌న్యూ పోలీసులు అదుపులోకి తీసుకొని స్వదేశానికి పంపారు. బషీర్‌బాగ్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మీ పెరుమాళ్ వివరాలు వెల్లడించారు. నిందితుడు డ్రగ్స్ సేవించడంతోపాటు పలువురు డ్రగ్ పెడ్లర్లతో సన్నిహితంగా ఉంటున్నాడని, ఇతడిని స్వదేశానికి పంపేందుకు విదేశాంగశాఖ, మొరాకో ప్రభుత్వంతో చర్చలు జరిపామని తెలిపారు. అచీబిల్ అమీనీ తల్లిదండ్రులు కింగ్‌డమ్ ఆఫ్ మొరాకోకు చెందిన వారు. వీరి కుటుంబం సౌదీఅరేబియాకు వలస వెళ్లింది. అమీనీ సౌదీ అరేబియాలోని తాయిఫ్ సిటీలో స్కూల్ విద్య పూర్తిచేశాడు. తర్వాత ఉన్నత చదువుల కోసం ఇండియా వచ్చి, ఉస్మానియా వర్సిటీలో బీసీఏ కోర్సులో చేరాడు. క్లాసులకు సరిగా వెళ్లని ఇతడు డ్రగ్స్‌కు అలవాటుపడ్డాడు. ఇతడి వీసా 2018లో ముగిసింది. పాస్‌పోర్ట్ గడువు కూడా 2021లో ముగిసింది. అయినా అక్రమంగా నగరంలో ఉంటూ డ్రగ్స్ విక్రేతలతో సన్నిహితంగా ఉంటున్నాడు. డ్రగ్స్ కేసులో ఇటీవల పంజాగుట్ట పోలీసులు పాలస్తీనాకు చెందిన డ్రగ్ పెడ్లర్ సయాద్ అలీ మహమ్మద్ అల్ కఫ్రీ పట్టుబడ్డాడు. ఇతడిపై కేసు నమోదు చేసిన పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడితో సన్నిహితంగా ఉంటూ సహకరిస్తున్న అమీనీ అదుపులోకి తీసుకున్న హెచ్‌న్యూ పోలీసులు అతడు అక్రమంగా నివసిస్తున్నాడని గుర్తించారు. అక్రమంగా నగరంలో నివసిస్తూ నేరగాళ్లకు సహకరిస్తున్న అచీబిల్ అమీనీ స్వదేశానికి పంపుతున్నామని డీసీపీ తెలిపారు. సరైన వివరాలు తీసుకోకుండా ఇల్లు అద్దెకు ఇచ్చే వారిపై కూడా చర్యలు తీసుకుంటామని డీసీపీ హెచ్చరించారు. ఈ సమావేశంలో హెచ్‌న్యూ ఇన్‌స్పెక్టర్‌లు కె. శ్రీనివాస్, జీఎస్. డానియేల్, సి. వెంకటరాములుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

మందుల అక్రమ నిల్వ కేంద్రాలపై దాడులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): లైసెన్స్ లేకుండా అక్రమ అమ్మకాలు చేస్తున్న ఓ మెడికల్ దుకాణంపై ఔషధ నియంత్రణ అధికారులు దాడులు చేసి విలువైన మందులను స్వాధీనం చేసుకున్నారు. చార్మినార్ పరిధిలోని ఖాన్ బజార్‌లో మీర్ హుస్సేన్ హైదర్ రజ్వీ డ్రగ్ లైసెన్స్ లేకుండా ఎస్‌ఎజేఎం ఫార్మసీ పేరుతో మెడికల్ షాప్‌ను నిర్వహిస్తున్నారు. దుకాణంలో అక్రమంగా మందులను నిల్వ చేసి విక్రయిస్తున్నారనే సమాచారం అందడంతో ఔషధ నియంత్రణ సంస్థ అధికారులు దుకాణంపై మంగళవారం దాడులు చేశారు. అనుమతి లేకుండా నిల్వ ఉంచిన యాంటీ బయాటిక్స్, యాంటీ అల్సర్ మందులు, దగ్గు సిరప్ తదితర 36 రకాల మందులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

నిర్ణయించిన ధర కంటే అధికంగా...

ఉప్పల్ మండలం కొత్తపేట గ్రామంలో ఓ మెడికల్ దుకాణంలో నిర్ణయించిన ధర కంటే ఎక్కువ అమ్ముతున్న మెడికల్ దుకాణంపై అధికారులు దాడులు చేసి కేసు నమోదు చేశారు. యాంటి డయాబెటిక్ మందు టినెబెటిక్-20 మాత్రలు (టినెలిగ్లిప్టిన్ మాత్రలు ఐపీ 20 ఎంజీ)లను ఉత్పత్తి ధర కంటే రెట్టింపు ధరకు ఎక్కువకు విక్రయిస్తున్నట్లు అధికారులు దాడుల్లో తేలింది. దీంతో ఆ మెడికల్ దుకాణంపై కేసు నమోదు చేశారు.

దోపిడీకి పాల్పడిన ఆటోడ్రైవర్ అరెస్ట్

అఫ్జల్‌గంజ్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఆటోలో ప్రయాణిస్తున్న వ్యక్తి మెడలో బంగారు గొలుసును అపహరించిన డ్రైవర్‌ను అరెస్ట్ చేశారు. అతడి నుంచి గొలుసును స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. అడ్డగుట్టకు చెందిన సగ్గం రాకేష్ ఈనెల 14న రాత్రి 12.30 గంటల సమయంలో కేపీహెచ్‌బీకి వెళ్లేందుకు మలక్‌పేట్ యశోద హాస్పిటల్ ముందు నిలబడ్డాడు. ఈ సమయంలో దిల్‌సుఖ్‌నగర్ వైపు నుంచి వస్తున్న ఒక ఆటోను ఆపి కేపీహెచ్‌బీకి వెళ్లాలని కోరారు. దీనికి ఆటో డ్రైవర్ అంగీకరించి ఆటోలో ఎక్కించుకున్నాడు. అయితే రాకేష్ మద్యం సేవించిన విషయం పసిగట్టిన డ్రైవర్ అతడి మెడలో ఉన్న బంగారు గొలుసును అపహరించాలని భావించాడు. ఆటోను నాంపల్లి వైపు తీసుకెళ్లి అటు నుంచి చిన్నచిన్న గల్లీల్లో తిప్పుతున్నాడు. ఉస్మానియా జనరల్ ఆస్పత్రి వెనక వైపు నుంచి అఫ్జల్‌గంజ్ రోడ్డులో వస్తుండడాన్ని గమనించిన రాకేష్ టాయిలెట్‌కు వెళ్లేందుకు ఆటోను ఆపాలని కోరారు. ఆటోను ఆపివేసిన తర్వాత ఆయన భయంతో అఫ్జల్‌గంజ్ నయాపూల్ బ్రిడ్జిపైకి పరుగెత్తుతుండగా.. డ్రైవర్ అతడిని వెంబడించి మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసును లాక్కొని పారిపోయాడు. బాధితుడు అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశాడు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఎం. మధుకుమార్, ఎస్సై, పోలీసులు సీసీ కెమెరాలు, టెక్నికల్ ఆధారాలతో నిందితుడిని గుర్తించారు. ఆటోడ్రైవర్‌ను నల్గొండ జిల్లాలోని చింతపల్లి మండలానికి చెందిన ఆదిమల్ల మహేష్‌గా గుర్తించి అరెస్ట్ చేశారు. 36 గంటలలో కేసును ఛేదించినందుకు పోలీసులను తూర్పు మండల డీసీపీ రావుల గిరిధర్ ప్రశంసించారు.

మరో కేసులో దారిదోపిడీ దొంగలు..

నార్సింగ్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఆటోలో ప్రయాణికుడిని దోచుకున్న ఇద్దరు దోపిడీ దొంగలను నార్సింగ్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నార్సింగ్ ఏసీపీ రమణగౌడ్ కథనం ప్రకారం.. ఈ నెల 14వ తేదీ రాత్రి నార్సింగ్ నుంచి ఆటోలో గచ్చిబౌలి ఇంటికి వెళ్లేందుకు కోకాపేట్‌కు చెందిన రాజు షేరింగ్ ఆటోలో ఎక్కగా, హఫీజ్‌పేట్‌కు చెందిన సయ్యద్ ఫారుక్, సయ్యద్ మస్తాన్‌ను.. రాజుని బెదిరించి రూ.5,500 నగదు దోచుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నార్సింగ్ పోలీసులు ఆటో డ్రైవర్‌లుగా ఉన్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి సెల్‌ఫోన్, రూ.5,500 నగదు స్వాధీనం చేసుకున్నారు.

సైబర్ నేరాలకు వెబినార్‌లతో చెక్

- జాగ్రత్తలు తీసుకోవాలి: రిజిస్ట్రార్ వెంకటరమణ

రాజేంద్రనగర్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, వాటికి వెబినార్‌లతో చెక్ పెట్టవచ్చని, సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ ఎం. వెంకటరమణ పేర్కొన్నారు. రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం కంప్యూటర్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం 'ఇంటర్నెట్ అండ్ ఈ-మెయిల్ సెక్యూరిటీ' పై వెబినార్ నిర్వహించారు. వెబ్‌నార్‌ను ప్రారంభించిన రిజిస్ట్రార్ వెంకటరమణ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం పరిధిలోని అన్ని కళాశాలలో విద్యార్థులకు, అధ్యాపకులకు ఇంటర్నెట్, ఈ-మెయిల్ సెక్యూరిటీపై అవగాహన కల్పించేందుకు వెబినార్‌లను, సెమినార్‌లను నిర్వహించాలని సూచించారు. హైదరాబాద్ సీ-డాక్‌కు ప్రాజెక్టు మేనేజర్ ఎం.జగదీశ్‌బాబు ఇంటర్నెట్ అండ్ ఈ-మెయిల్ సెక్యూరిటీపై అవగాహన కల్పించారు. ఫేక్ మెసేజ్‌లను ఎలా గుర్తించాలో వివరించారు. ఈ-మెయిల్‌లకు వచ్చే జంక్ మెసేజ్‌లు, స్పామ్ మెసేజ్‌లకు దూరంగా ఉండాలన్నారు.

ఫేక్ యూఆర్ఎల్‌లను గుర్తించేందుకు అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లపై అవగాహన కల్పించారు. ఇంటర్నెట్, ఈ-మెయిల్ సెక్యూరిటీ అవశ్యకత గురించి కంప్యూటర్ సెంటర్ ఇన్‌చార్జి, వర్సిటీ గ్రంథ పాలకులు డాక్టర్ ఎస్‌పీ రవి కుమార్ వివరించారు. వెబినార్‌లో 150 మంది అధ్యాపకులు, వివిధ పరిశోధన కళాశాలల నుంచి పలువురు పాల్గొన్నారు.



వర్చువల్‌గా మాట్లాడుతున్న వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ .వెంకటరమణ

హైదరాబాద్ పార్లమెంట్ సీటు మజ్లిస్‌దే : అక్బరుద్దీన్ ఒవైసీ

చార్మినార్ ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికలలో ఎవరు ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసినా మజ్లిస్ పార్టీ హైదరాబాద్ స్థానాన్ని హస్తగతం చేసుకుంటుందని అక్బరుద్దీన్ ఒవైసీ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం రియాసత్‌నగర్ డివిజన్‌లోని దర్గా బర్హనాషాలో ప్రార్థనలు చేసిన ఆయన, ఫసల్ కెఫే ఒవైసీ కాలనీ, రియాసత్ నగర్, రియాసత్‌నగర్ బజార్, రాజనర్సింహ కాలనీ హబీబ్ నగర్ బస్తీలలో పాదయాత్ర ద్వారా ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలోనే చంద్రయాణగుట్ట నియోజకవర్గం అభివృద్ధిలో మొదటి స్థానంలో ఉందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు మజ్లిస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఆయన వెంట కార్పొరేటర్లు సలీంబేగ్, అజమ్ షరీఫ్, అబ్దుల్ రెహమాన్, అబ్దుల్ వహాబ్, హాఫిజ్ పటేల్, అబ్దుల్ రెహమాన్‌షా, సమద్ బిన్ అబ్దాద్, ముజిబ్ తదితరులు ఉన్నారు.



రియాసత్ నగర్ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న అక్బరుద్దీన్ ఒవైసీ

విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయాలి: ఐపీఎస్ రేమా రాజేశ్వరి



కాలేజీ యాజమాన్యం, విద్యార్థులతో అతిథులు

రవీంద్రభారతి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసి వారిని ప్రోత్సహించాల్సిన అవసరముందని పిల్లలు కూడా తమ శక్తిని తెలుసుకుని ముందుకు సాగాలని విమెన్ సేఫ్టీ వింగ్ డీఐజీ, ఐపీఎస్ రేమా రాజేశ్వరీ అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో అనిబిసెంట్ ఉమెన్స్ కాలేజ్ 30వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజీ విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఐపీఎస్ రేమా రాజేశ్వరి విద్యార్థులను సత్కరించి అభినందించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మన జీవితం ఒక ప్రయోజనం కోసం ఉండాలని సూచించారు. జీవితంలో ఎన్నో సవాళ్లు వస్తాయని వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవాలని చెప్పారు. విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. అమ్మాయిలు విద్యతోపాటు సాంస్కృతిక, క్రీడారంగాల్లో రాణించాలని అన్నారు. కాలేజ్ ప్రిన్సిపాల్ రాజవల్లి మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా తమ కళాశాల ప్రోత్సహిస్తోందని తెలిపారు. మరో ప్రిన్సిపాల్ సృజన తమ కళాశాలలో జరుగుతున్న పలు కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఉస్మానియా వర్సిటీ కామర్స్ విభాగాధిపతి రజని, ప్రముఖ కార్టూనిస్ట్ శ్రీధర్, డాక్టర్ శ్యామ్‌సుందర్, దయాకర్ పాల్గొన్నారు.

రంజిత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి

పహాడిషరీఫ్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికలలో చేవెళ్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి భారీ మెజారిటీతో గెలిపించాలని టీపీసీసీ కార్యదర్శి ఎలిమేటి అమరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మల్లాపూర్‌లోని వైఏఆర్ కన్వెన్షన్ హాల్‌లో కాంగ్రెస్ జల్‌పల్లి మున్సిపాలిటీ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన అమరేందర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ నాయకులు కార్యకర్తలు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలు, అమలు చేసిన పథకాలు గురించి ప్రజలకు వివరించి కాంగ్రెస్ పార్టీకి ఓటేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ఇన్‌చార్జి నిజాముద్దీన్, దేపా భాస్కర్‌రెడ్డి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ,కో -ఆర్డినేటర్ షైక్ జహంగీర్, యూసుఫ్ పటేల్, ఇక్బాల్ బిన్ ఖలీఫ్, అహ్మద్ బాబ్, అబ్దుల్ భారీ, జాకీర్, వంగేటి మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న అమరేందర్‌రెడ్డి

తెలంగాణలో కాంగ్రెస్‌కు 10 సీట్లు ఖాయం

- టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్

అఫ్జల్‌గంజ్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ 10 సీట్లను కైవసం చేసుకోవడం ఖాయమని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ పేర్కొన్నారు. మంగళవారం గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోదీ అధికారంలోకి రాకముందు విదేశాల్లోని నల్లధనం తెస్తామని, నల్ల చట్టాలను తీసుకొచ్చారని విమర్శించారు. నిరుద్యోగ నిర్మూలన అని ఇంటికో నిరుద్యోగిని తయారు చేసిన ఘనత కూడా ప్రధాని మోదీకి దక్కుతుందన్నారు. కనీసం రైతులకు మద్దతు ధర కూడా ఇవ్వలేని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ రాకేశ్‌యాదవ్, చరణ్, కౌశిక్, శ్రీకాంత్ యాదవ్, గోవర్ధన్ యాదవ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధం

- హైదరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్

గోషామహల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఓటర్లు ఈసారి బీఆర్ఎస్‌కు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని హైదరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం జాంబాగ్ డివిజన్‌లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతీ ఇంటింటికి వెళ్లి తనకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జి.నరేందర్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

ఎల్బీ స్టేడియంలో వేసవి శిక్షణ శిబిరం



శిక్షణ తీసుకుంటున్న క్రీడాకారులు

హైదరాబాద్, (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఎల్బీ స్టేడియంలో శాట్స్ (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ) మెగా వేసవి శిక్షణ శిబిరం మొదలైంది. బాక్సింగ్, రెజ్లింగ్, హ్యాండ్‌బాల్, వాలీబాల్, టెన్నిస్, స్విమ్మింగ్, పికిల్‌బాల్, యోగా, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, జిమ్నాస్టిక్స్ సహా మొత్తం 22 క్రీడాంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. ప్రస్తుతం 500 మంది క్రీడాకారులు ఈ శిబిరాల్లో తమ పేర్లను నమోదు చేసుకొని, పాల్గొంటున్నారని స్టేడియం అడ్మినిస్ట్రేటర్ రవి తెలిపారు. 45 రోజులపాటు జరుగనున్న ఈ వేసవి శిబిరంలో ఆసక్తిగల వారు పాల్గొనవచ్చునని చెప్పారు. వివరాలకు ఎల్బీ స్టేడియంలోని కోచ్‌లను సంప్రదించవచ్చు.

చోరీ చేసిన వాహనాలతో స్టంట్లు

- సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు
- ఫేమస్ అవుదామని అరెస్టయ్యారు..

బేగంపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వాహనాలతో విన్యాసాలు చేసి ఫేమస్ కావాలనుకున్నారు.. పలు రకాల వాహనాలతో విన్యాసాలు చేసి.. వాటిని వీడియో తీసి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టింగులు పెట్టారు... ఇంత వరకు బాగానే ఉంది. అయితే వీరు విన్యాసాలు చేసిన వాహనాలు చోరీ చేసినవని గుర్తించిన పోలీసులు ఇద్దరిని అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టి వారి వద్ద నుంచి 9ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నార్త్‌జోన్ డీసీపీ రోహిణి ప్రియదర్శిని ఏసీపీ గోపాల కృష్ణమూర్తి, ఇన్‌స్పెక్టరు రామయ్య, డీఐ మల్లేష్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. చాంద్రాయణగుట్ట సమీపంలోని షాహీన్‌నగర్‌కు చెందిన షేక్ ఇబ్రహీం(19), బేగంపేట పాటిగడ్డకు చెందిన బాలుడు కలిసి నగరంలోని పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో పార్క్ చేసిన ద్విచక్రవాహనాలను చోరీ చేస్తున్నారు. దొంగిలించిన వాహనాల నంబరు ప్లేట్లను తొలగించి షాహీన్‌నగర్‌లోని నగర శివారు ప్రాంతాల్లో స్టంట్లు నిర్వహించేవారు. వీరు చేసిన విన్యాసాలను వీడియో తీసి ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ గ్రూపులతో పోస్టు చేస్తుండేవారు. బేగంపేటలోని తన వాహనం చోరీకి గురైందని స్మిత పటేల్ ఈ నెల 13న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ ఫుటేజీలను విశ్లేషించగా చోరీకి గురయిన వాహనాలు షాహీన్‌నగర్‌లో నంబరు ప్లేట్లు లేకుండా తిరుగుతున్నాయని గుర్తించారు. దీంతో అడ్మిన్ ఎస్సై గంగాధర్ నేతృత్వంలో క్రైం పోలీసులు షాహీన్‌నగర్ వెళ్లి వాహనాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు నిందితులు షేక్ ఇబ్రహీం, మరో బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. వాహనాలను చోరీచేసి వాటి మీద విన్యాసాలు చేస్తూ ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌లో పోస్టులు పెట్టి తద్వారా ఫేమస్ కావాలనుకున్నామని వీరు పోలీసులకు తెలిపారు. ఎస్సార్‌నగర్ పరిధిలో రెండుసార్లు, సనత్‌నగర్‌లో 3సార్లు హుమాయున్‌నగర్, రాంగోపాల్‌పేట, ఫిల్మ్‌నగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఒక్కొక్కసారి వాహనాల చోరీలకు పాల్పడినట్లు వీరు పోలీసుల విచారణలో వెల్లడించారు. నిందితుల నుంచి డియో వాహనాలు 7, జుపిటర్ 1, యమహా ఆర్‌ఎక్స్ 1 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

గోషామహల్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ వార్షికోత్సవం

అఫ్జల్‌గంజ్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గోషామహల్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ పార్కు ఏర్పాటు తొమ్మిదేళ్లు పూర్తి అయినది. మంగళవారం ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో 9వ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ హరీష్ మాట్లాడుతూ... ఈ ట్రాఫిక్ పార్కు వల్ల దాదాపు 2లక్షల మందికిపైగా ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించామని అన్నారు. ఇందుకు హోండామోటార్ సైకిల్, స్కూటర్ ఇండియా సహకారం అందించిందన్నారు. ఇక్కడికి వచ్చే వాహనదారులకు వారికి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించడంలో కీలకపాత్ర పోషించామని ఇన్‌స్పెక్టర్ జి.హరీష్ తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే సంపత్ క్షమాపణలు చెప్పాలి

బర్కత్‌పుర, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మాదిగల మనోభావాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే సంపత్... మాదిగ జాతికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని మాదిగ రాజ్యాధికార పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు తిమ్మన నవీన్‌రాజ్ డిమాండ్ చేశారు. సంపత్ వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం బషీర్‌బాగ్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపత్ తన వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని, లేకపోతే మాదిగల ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. మాదిగలకు ఒక్క ఎంపీ సీటు కూడా ఇవ్వని కాంగ్రెస్ పార్టీని, సీఎంను పొగడ్తలతో ముంచివేయడం అభ్యంతరకరమన్నారు.



బషీర్‌బాగ్‌లో ధర్నా నిర్వహిస్తున్న రాజ్యాధికార పోరాట సమితి ప్రతినిధులు

కుమార్తెతో ఆడుకోవద్దంటూ ఓ కుటుంబంపై హోంగార్డు దాడి

మదీన, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తన కుమార్తెతో ఆడుకోవద్దంటూ ఓ హోంగార్డు మరో చిన్నారి కుటుంబంపై దాడిచేసి విచక్షణారహితంగా కొట్టాడు. గర్భిణీ, బాలిక అని కూడా చూడకుండా కాలుతో తన్నాడు. హోంగార్డుపై బండ్లగూడ పోలీసులు కేసు నమోదుచేశారు. ఫలక్‌నుమాలో ట్రాఫిక్ హోంగార్డుగా పనిచేస్తున్న ఇస్మాయిల్.. సాదత్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. అతడికి ఐదేళ్ల కుమార్తె ఉన్నది. అదే బస్తీలో ఉంటున్న మరో చిన్నారితో ఇస్మాయిల్ కుమార్తె ఆడుకుంటుంది. ఇది నచ్చని ఇస్మాయిల్, మరో బాలికి తల్లి గుల్‌నాజ్ బేగం చెప్పాడు. ఈ నెల 15న హోంగార్డు కుమార్తె, గుల్‌నాజ్ బేగం కుమార్తె ఇద్దరు ఆడుకుంటుండగా, హోంగార్డు మరో బాలిక తల్లిని మందలించి ఆమెపై దాడి చేసి చేయి చేసుకున్నాడు. గమనించిన బస్తీవాసులు హోంగార్డుపై దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు బండ్లగూడ పోలీసులు ట్రాఫిక్ హోంగార్డు ఇస్మాయిల్‌పై కేసు నమోదు చేశారు.

'ఎస్ఎంసీల స్థానంలో ఏఏపీసీల ఏర్పాటు విద్యాహక్కు చట్టాన్ని ఉల్లంఘించడమే'

బర్కత్‌పుర, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో ఎస్ఎంసీల స్థానంలో ఏఏపీసీల ఏర్పాటు చేయడం విద్యాహక్కు చట్టాన్ని ఉల్లంఘించడమేనని తల్లుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జి. భాగ్యలక్ష్మి, కార్యదర్శి కె.సాయిలక్ష్మి మండిపడ్డారు. దీనిని తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత నెలలో జీవో 5 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం కమిటీలను ఏర్పాటు చేసిందన్నారు. అమ్మ పాఠశాలల కమిటీ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని విద్యాహక్కు చట్టం 2009లోని సెక్షన్ 21, 22 ప్రకారం పాఠశాలల యాజమాన్య కమిటీలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఏపీసీల ఏర్పాటును ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు శోభ, రామలీల, మీనాక్షి, లలిత, అనిత పాల్గొన్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/DXhRLHS లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

ఇండియన్ ఫైటో పాథాలజికల్ సొసైటీ సెంట్రల్ జోన్ అధ్యక్షుడిగా విద్యాసాగర్



డాక్టర్ విద్యాసాగర్

రాజేంద్రనగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఫైటో పాథాలజికల్ సొసైటీ(ఐపీఎస్) సెంట్రల్‌జోన్ అధ్యక్షుడిగా రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం అధ్యాపకుడు డాక్టర్ బి.విద్యాసాగర్ నియమితులయ్యారు. ఐపీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాజల్ కుమార్ బిస్వాస్ నియామక పత్రాన్ని లేఖ ద్వారా మంగళవారం విద్యాసాగర్‌కు పంపించారు. డాక్టర్ విద్యాసాగర్ రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ వర్సిటీ కళాశాలలో ప్లాంట్ పాథాలజీ విభాగం అధిపతిగా పనిచేస్తున్నారు. రాజేంద్రనగర్‌లోని చిరుధాన్యాల పరిశోధనా శాస్త్రవేత్త జి.రాజేశ్ జోనల్ కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు.



పవన్‌రాజుకు నియామకపత్రం అందజేస్తున్న బాబురావు

బీజేపీ రాజేంద్రనగర్ డివిజన్ ఉపాధ్యక్షుడిగా పవన్‌రాజు

రాజేంద్రనగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాజేంద్రనగర్ డివిజన్ ఉపాధ్యక్షుడిగా మాణిక్యమ్మ కాలనీకి చెందిన రెంటాల పవన్‌రాజు నియమితులయ్యారు. మంగళవారం డివిజన్ బీజేపీ అధ్యక్షుడు గుంజ బాబురావు ఆయనకు నియామక పత్రాన్ని రాజేంద్రనగర్‌లోని బీజేపీ పార్టీ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, వై.గోపాల్, ఎస్.పెంటయ్య, టి.మల్లేశ్, జంగయ్య పాల్గొన్నారు.

బీజేపీ శాలిబండ డివిజన్ అధ్యక్షుడిగా సాయినాథ్ సూర్యవంశీ



చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ (బీజేపీ) శాలిబండ డివిజన్ అధ్యక్షుడిగా సాయినాథ్ సూర్యవంశీ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన తనకు బాధ్యతలు అప్పగించిన పార్టీ ముఖ్య నాయకులు భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, బహదూర్‌పురా నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రశాంతకుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ కమిషనర్ రవికుమార్

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి

రాజేంద్రనగర్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె. రవికుమార్ అన్నారు. రాజేంద్రనగర్‌కు చెందిన కరణం నారాయణ ముదిరాజ్, తన తల్లిదండ్రులు సత్తమ్మ, సత్తయ్య జ్ఞాపకార్థం సొంత డబ్బుతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయగా, డిప్యూటీ కమిషనర్ కె.రవి కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో నిర్వాహకులు కరణం నారాయణ ముదిరాజ్, స్థానిక నాయకులు ఎం.రాజు, వేముల వెంకటేశ్, కొమిరె గణేశ్, ఎస్.జగదీశ్వర్, శ్రీకాంత్, అర్జున్, రవి ముదిరాజ్ పాల్గొన్నారు.

IN THE COURT OF THE
HON BLE I SENIOR CIVIL
JUDGE COURT, CITY CIVIL
COURTS, AT: HYDERABAD
DISTRICT
O.S. No. 143 OF 2024
Between:
Mohini Shankar Mutha and Another
Plaintiffs
AND
Smt. Ambati Mangamma and Others
Defendants
To,
All Concerned,
Please take notice that the plaintiffs herein have filed th[e] above suit for declaration to declare the plaintiffs as the [legal] heirs and successors of late Ambati Srinivas Varma s/o. late Ambati Sri Kishan pertaining to house property H.No.11-5-283/5, admeasuring 93.00 Sq. Yds., or 78.12 Sq. Mts., consis[ting] of Ground floor + 3 floors + Pe[nt] House, total measuring 3848 Sq. Fts, Situated at RED HILLS, Hyderabad, T.S. If any persons have any objections or claims, may appear before Hon ble court on 02/05/2024 at 10:30 either in person or through advocate, other wise the matter will be decided [in] your absence.
(By Order Of the Hon ble Cour[t])
K. RAJESH,
ADVOCATE & ASSOCIATES
4-10-105, Himagiri Nagar


మధుయాష్కీగౌడ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, శ్రీశైలంగౌడ్

మధుయాష్కీగౌడ్‌కు రాహుల్ పరామర్శ

హయత్‌నగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ తల్లి అనసూయమ్మ సోమవారం మృతిచెందిన విషయం తెలిసిందే. ఆయనను ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీ మంగళవారం ఫోన్‌లో పరామర్శించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే, పలు రాజకీయ పార్టీల ప్రముఖులు హయత్‌నగర్‌లోని ఇంటి వద్ద మధుయాష్కీగౌడ్‌ను పరామర్శించారు. సీనియర్ కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నరసింహారెడ్డి, హరివర్ధన్‌రెడ్డి, తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

సమ్మర్ డిమాండ్ తగ్గే వరకు అలర్ట్

● సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ● కళ్యాణ్‌నగర్‌లో సబ్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): సమ్మర్ పూర్తయి విద్యుత్ డిమాండ్ తగ్గే వరకు విద్యుత్ ఇంజనీర్లు, సబ్‌స్టేషన్లలో సిబ్బంది అలర్ట్‌గా ఉండాలంటూ దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ అధికారులను ఆదేశించారు. కళ్యాణ్‌నగర్‌లో సబ్‌స్టేషన్, స్కాడా కార్యాలయాన్ని మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్(పీటీఆర్)పై పడుతున్న లోడ్, 33/11కేవీ ఫీడర్లలో ఏర్పడుతున్న ఇంటరప్షన్ వివరాలు నమోదుచేసే లాగ్‌బుక్ వివరాలు పరిశీలించారు. కార్యాలయాల్లో ఫైర్‌సేఫ్టీ పరికరాలను తనిఖీ చేశారు. సబ్‌స్టేషన్లలో పనిచేసే ఆపరేటర్లు విధిగా హెల్మెట్, ఎర్త్‌రాడ్స్ వినియోగించాలని సూచించారు. సబ్‌స్టేషన్లలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్లపై అదనపు లోడ్ పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్కాడా కార్యాలయం ఆపరేషన్స్ పనితీరును ఉన్నతాధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రేటర్‌జోన్‌వ్యాప్తంగా స్కాడా విస్తరణకు తీసుకోవాల్సిన చర్యలపై ఓ ప్రత్యేక రిపోర్ట్ సిద్ధం చేయాలన్నారు. తనిఖీల్లో ఆపరేషన్స్ ఇన్‌చార్జి డైరెక్టర్ నర్సింహులు స్కాడా సీజీఎం కామేష్, ఐటీ సీజీఎం శివాజీ, బంజారాహిల్స్ సర్కిల్ ఎస్ఈ టి.చంద్రశేఖర్, డీఈ నరేందర్‌రెడ్డితోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.


కళ్యాణ్‌నగర్ సబ్‌స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న ముషారఫ్ ఫరూఖీ

ముంపు ముప్పు లేకుండా ముందస్తు చర్యలు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో నగరంలో ముంపు ముప్పు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిషోర్ అధికారులను ఆదేశించారు. మాన్‌సూన్ కార్యాచరణ ప్రణాళికపై మంగళవారం జీహెచ్‌ఎంసీ, వాటర్‌బోర్డు అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. వరదలు వచ్చినప్పుడు ఏం చేయాలన్న సన్నద్ధత తెలిపేలా జీహెచ్‌ఎంసీ, వాటర్‌బోర్డు, ఫైర్, పోలీస్ విభాగాలు మే చివరి వారం లేదా జూన్ మొదటి వారంలో మాక్ డ్రిల్ నిర్వహించాలన్నారు. డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్(డీఆర్ఎఫ్) అన్ని వేళలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో 125 వరదనీరు నిలిచే ప్రాంతాలు గుర్తించగా.. 22 చోట్ల సమస్య పరిష్కారమైందన్నారు. 40 ఏరియాల్లో యుద్ధప్రాతిపదికన వర్షపు నీరు తొలగించేలా ఏర్పాట్లు చేశామని అధికారులు వివరించగా.. ఇతర చోట్ల అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జూన్ మొదటి వారం లోగా నాలాల పూడికతీత పూర్తి చేయాలన్నారు. వ్యర్థాల తొలగింపునకు సంబంధించి ప్రజల అవగాహన కోసం ఎగ్జిబిషన్ నిర్వహించాలని చెప్పారు. నాలాల ఆడిట్ చేపట్టి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నాలాల్లో చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు.. చెత్త డబ్బాలు ఏర్పాటు చేయాలన్నారు. వరదముంపు తప్పేలా చేపడుతోన్న వర్షాకాల సన్నద్ధత కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం బంజారాహిల్స్ పెన్షన్ ఆఫీస్ నుంచి అహ్మద్‌నగర్ వరకు నాలా పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. సమావేశంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్, వాటర్ బోర్డు ఎండీ సుదర్శన్‌రెడ్డి, ఇంజనీర్ ఇన్ చీఫ్ జియావుద్దీన్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న దానకిషోర్

ఊపిరాడని ప్రయాణం

(5వ పేజీ తరువాయి)

వరకు రాకపోకలు సాగిస్తున్నట్లు ఎల్అండ్‌టీ వర్గాలు చెబుతున్నాయి. కాగా, ఆదివారం 5.20లక్షల మంది ప్రయాణించగా.. సోమవారం 5.30 లక్షల మంది వరకు మెట్రో రైళ్లలో తిరిగినట్లు వెల్లడించాయి. ప్రతి 6 నిమిషాలకోసారి రైలును అందుబాటులోకి తీసుకొస్తున్నప్పటికీ అవి సరిపోవడంలేదని స్టేషన్లలో పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది చెబుతున్నారు. ఒకరినొకరు తోసుకుంటూ ఎక్కుతుండడంతో రైలు కిందపడుతారేమోనని భయపడుతున్నామని తెలిపారు.

ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలి..

రోజురోజుకు పెరుగుతున్న ప్రయాణికులను దృష్టిలో ఉంచుకుని ఎల్అండ్‌టీ అధికారులు తక్షణమే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని రవాణా రంగ నిపుణులు కోరుతున్నారు. గతంలో ప్రతిపాదించిన విధంగా ప్రతి రైలుకు అదనంగా మూడు బోగీలను ఏర్పాటు చేస్తే రద్దీని త్వరగా నియంత్రించే అవకాశం ఉంటుందని వారు చెబుతున్నారు. రద్దీ వేళల్లో ప్రతి 3 నిమిషాలకోసారి రైలును నడిపించాలని, లేకుంటే రానున్న రోజుల్లో ప్రయాణికుల తాకిడితో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుందని వారు హెచ్చరిస్తున్నారు.

శ్రీరామ శోభాయాత్ర సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని, నగరంలో నిర్వహించే శోభాయాత్ర సందర్భంగా బుధవారం ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలుంటాయని హైదరాబాద్ సీపీ కె.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శోభాయాత్ర ఉదయం 9గంటలకు సీతారాంబాగ్ ఆలయం నుంచి ప్రారంభమవుతోంది. సుల్తాన్‌బజార్, బోయిగూడ కమాన్, మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ రోడ్, జాలీ హనుమాన్, ధూల్‌పేట్, పురానాపూల్, జుమ్మేరాత్ బజార్, చుడీబజార్, బేగంబజార్ ఛత్రి, బర్తన్ బజార్, సిద్ది అంబర్ బజార్, శంకర్ శేర్ హోటల్, గౌలిగూడ చమన్, గురుద్వారా, పుత్లీబౌలి క్రాస్‌రోడ్, కోఠి, సుల్తాన్‌బజార్ క్రాస్‌రోడ్స్ మీదుగా హనుమాన్ వ్యాయామశాలకు చేరుకుంటుంది. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 11.30 గంటల వరకు యాత్ర జరిగే రూట్‌లో వాహనాలకు అనుమతి ఉండదని తెలిపారు.

● సౌత్‌వెస్ట్‌జోన్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈస్ట్‌జోన్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 11.30 వరకు ట్రాఫిక్ ఆంక్షలుంటాయి.

● యాత్ర సుల్తాన్‌బజార్ నుంచి హనుమాన్ టేక్డీ వైపునకు వెళ్తున్న సమయంలో నారాయణగూడ, కాచిగూడ వైపు నుంచి వచ్చే వాహనాలను కాచిగూడ క్రాస్‌రోడ్స్ వైపునకు పంపుతారు. రామ్‌కోఠి వైపు నుంచి వచ్చే వాహనాలను బొగ్గులకుంట క్రాస్‌రోడ్స్ వైపునకు పంపుతారు. యాత్ర జరుగుతున్న రూట్లలో ప్రయాణించే వాహనదారులు ట్రాఫిక్ ఆంక్షలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించి, రద్దీని నివారించాలని సీపీ శ్రీనివాస్ రెడ్డి కోరారు.

కేబుల్ బ్రిడ్జిపై వాహనాలు నిషేధం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): దుర్గంచెరువు కేబుల్ బ్రిడ్జిపై వాహనాలు నిలపడాన్ని నిషేధిస్తూ మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్ ఆదేశాలు జారీ చేశారు. అకారణంగా బ్రిడ్జిపై వాహనాలను నిలపడం, సెల్ఫీలు, ఫొటోలు తీసుకోవడం, పాదాచారుల వంతెన దాటి బ్రిడ్జి మీదకు రావడం, గ్రిల్స్, రెయిలింగ్‌పై కూర్చోవడంపై నిషేధం విధించారు.

నిథిమ్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్(నిథిమ్) కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పర్యాటక శాఖ సంచాలకులు నిఖిల తెలిపారు. బీఎస్సీ, బీబీఏ, ఎంబీఏ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంబీఏ రెండేళ్లు, బీబీఏ నాలుగేళ్లు, బీఎస్సీ మూడేళ్లు ఉంటుందని, ఇంటర్న్‌షిప్ కోసం విదేశాలకు కూడా పంపిస్తామని పేర్కొన్నారు. అడ్మిషన్, ఇతర వివరాల కోసం హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పర్యాటకశాఖ అధికారులు ప్రభాకర్, హారతిపాటిల్ 94408-16071, 78424-55581, 95537-00035 నంబర్లలో సంప్రదించాలని ఆమె సూచించారు.

ప్రియుడి కోసం పెద్దమ్మ నగలు చోరీ

(5వ పేజీ తరువాయి)

8వ తరగతిలో చేర్పించి చదివిస్తున్నారు. అయితే, కడప జిల్లా పెంటలమర్రి మండలంలోని వేలూరుపాడు గ్రామానికి చెందిన చెప్పలి విజయ్ కుమార్‌రెడ్డి (19) బెంగళూరులో పీజీ హాస్టల్‌లో ఉంటూ డిగ్రీ చదువుతున్నాడు. బాలిక అతనికి స్నాప్‌చాట్‌లో పరిచయమైంది. ఆ పరిచయంతో అతడు నగరానికి వచ్చి తరచూ ఆమెను కలిసేవాడు. ఈ క్రమంలో వారిద్దరి మధ్య చనువు పెరిగింది. అయితే, అనారోగ్యంతో ఉన్న తన తల్లిదండ్రులను ఆస్పత్రిలో చూపించాలంటే డబ్బులు అవసరమని బాలికకు మాయమాటలు చెప్పి నమ్మించేవాడు.

16 తులాల బంగారం అప్పగింత..

అతడి మాయమాటలను నమ్మిన సదరు బాలిక పెద్దమ్మ ఇంట్లోని ఆమె నగలను తస్కరించి స్నేహితురాలి సాయంతో కుదువపెట్టింది. పలు దపాలుగా విజయ్‌కుమార్‌రెడ్డికి రూ.1.5లక్షలను యూపీఐ ద్వారా పంపించింది. తర్వాత మరికొద్ది రోజులకు మరో 16 తులాల బంగారాన్ని యువకుడికి ఇచ్చింది. కాగా, ఏప్రిల్ రెండో తేదీన బాలిక పెద్దనాన్న తన జేబులో ఉన్న రూ.3వేల నగదు కనిపించకపోవడంతో అప్రమత్తమయ్యాడు. బాలికపై అనుమానమొచ్చిన అతను తన భార్య, మరదలకు ఫోన్ ద్వారా విషయాన్ని తెలిపాడు. ఈ మేరకు అతడి భార్య చిలకలగూడలోని తన ఇంటికి వచ్చి బంగారు ఆభరణాలను వెతకగా.. ఒక్కటి కూడా కనిపించలేదు. దీంతో వారు ఇంట్లో బంగారు నగలు కనిపించడంలేదని ఏప్రిల్ 2న చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలో దిగిన పోలీసులు బాలిక సెల్‌ఫోన్‌ను చెక్ చేయగా స్నాప్‌చాట్‌లో విజయ్‌కుమార్‌రెడ్డితో చాటింగ్ చేసినట్లు గుర్తించి ఆధారాలను సేకరించారు. అనంతరం బాలికను విచారించగా నగదు, నగలు యువకుడికి ఇచ్చినట్లు అంగీకరించింది. ఈ క్రమంలో సోమవారం రాత్రి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న విజయ్‌కుమార్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. అతడి నుంచి రూ.9.06 లక్షలు విలువజేసే 16తులాల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. కాగా, బాలిక పంపిన డబ్బులు, బంగారు నగలను కుదువపెట్టి తీసుకున్న డబ్బులతో విజయ్‌కుమార్‌రెడ్డి ఆన్‌లైన్ బెట్టింగ్, బైక్ రైడింగ్, ధూమపానం, మద్యం సేవిస్తూ జల్సాలు చేసేవాడని పోలీసులు తెలిపారు. విజయ్‌కుమార్‌రెడ్డిపై పోక్సోతో పాటు దొంగతనం కేసును నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసును చాకచక్యంగా ఛేదించిన ఇన్‌స్పెక్టర్, ఎస్సైలు, సిబ్బందిని డీసీపీ, ఏసీపీ అభినందించారు. ఈ సమావేశంలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌గౌడ్, డీఎస్సై అంజనేయులు, ఎస్సై కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పోలీసులతో మాట్లాడుతున్న అనుదీప్ దురిశెట్టి

సజావుగా నిర్వహించాలి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నామినేషన్ల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. నామినేషన్ల స్వీకరణ జరిగే కలెక్టర్ కార్యాలయంలోని స్ఫూర్తి భవన్ ఫస్ట్‌ఫ్లోర్‌ను మంగళవారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్ వేసే అభ్యర్థితోపాటు ఐదుగురికి మాత్రమే కేంద్రంలోనికి అనుమతి ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో డీసీపీలు ఆకాంక్షయాదవ్, సాయిచైతన్య, ఆర్. సంజయ్‌కుమార్, డీఆర్‌ఓ వెంకటాచారి, ఆర్డీఓ మహిపాల్‌రెడ్డి, ఏఓ సదానందం, తదితరులు పాల్గొన్నారు.

ఆర్వో ఆఫీస్‌ల వద్ద 144 సెక్షన్

పార్లమెంట్ ఎన్నికల నామినేషన్‌ల ప్రక్రియ ప్రారంభం కానున్న తరుణంలో సైబరాబాద్ పరిధిలోని రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల వద్ద 144 సెక్షన్ విధిస్తూ సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి ఆదేశాలు జారీ చేశారు. మల్కాజిగిరి పార్లమెంట్ స్థానానికి మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం, చేవెళ్ల పార్లమెంట్‌కు సంబంధించి రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. కార్యాలయానికి 100 మీటర్ల సమీపంలో ఐదుగురు కంటే ఎక్కువ మంది గుమిగూడటం, ర్యాలీ, సభల పై నిషేధం విధించారు. ఈ ఆంక్షలు ఈనెల 18 నుంచి 29 వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉంటాయి. ఇదిలా ఉండగా, లోక్‌సభ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించడానికి ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి అన్నారు. క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన భద్రత ఏర్పాట్లపై గచ్చిబౌలి కమిషనరేట్‌లో మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా విజిబుల్ పోలీసింగ్ కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

ఓటింగ్ శాతం పెరగడానికి చర్యలు చేపట్టాలి

హరిహరకళాభవన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఓటింగ్ శాతం పెరగడానికి చర్యలు చేపట్టాలని రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. అత్యంత తక్కువ శాతం ఓటింగ్ నమోదైన కేంద్రాలలో ఓటర్లకి అవగాహన కల్పించాలని, ఇంటింటికి తిరిగి ఓటు విలువ తెలియజేయాలని సూచించారు. సికింద్రాబాద్, హరిహరకళాభవన్‌లో మంగళవారం సికింద్రాబాద్ పార్లమెంట్, నియోజకవర్గంలోని సెక్టోరల్ ఆఫీసర్స్, సూపర్‌వైజర్ల సమావేశం నిర్వహించారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదు

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ ఉల్లంఘించే ఉపేక్షించబోమని, కఠిన చర్యలు తీసుకుంటామని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక హెచ్చరించారు. మంగళవారం రాజేంద్రనగర్ ఆర్వో కార్యాలయంలో ఆమె పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఎన్నికల నియమావళి అమలు తీరు పర్యవేక్షణకు జిల్లా స్థాయిలో ఇంటెలిజెన్స్ కమిటీని నెలకొల్పనున్నట్లు చెప్పారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజక వర్గ పరిధిలో 29,28,186 మంది ఓటర్లు ఉన్నారని అన్నారు. 2,824 పోలింగ్ కేంద్రాలు, 53 సహాయక పోలింగ్ కేంద్రాలు మొత్తం 2,877 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. చేవెళ్లలోని బండారి శ్రీనివాస్ ఇనిస్టిట్యూషన్ ఆఫ్ టెక్నాలజీలో కౌంటింగ్ కేంద్రం ఉంటుందని తెలిపారు.

ఇప్పటి వరకు రూ.2.61 లక్షల నగదు సీజ్

ఇప్పటి వరకు జిల్లాలో రూ.2.61 లక్షల నగదును, రూ.4.18 లక్షల విలువగల వెండి,1.28 లక్షల విలువగల ఫ్యాబ్రిక్స్, 69.51 లక్షల విలువగల మద్యం, 3.28 లక్షల విలువగల డ్రగ్స్/నార్కొటిక్ సీజ్ చేయడం జరిగిందని తెలిపారు.

అధికార యంత్రాంగం సిద్ధం

● అభ్యర్థులు క్రిమినల్ కేసులు ప్రకటించాలి : రోనాల్డ్‌రోస్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికలకు జిల్లా అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని, రేపటి నుంచి మొదలయ్యే నామినేషన్ల దాఖలుకు ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ తెలిపారు. హైదరాబాద్ పార్లమెంట్‌కు సంబంధించి లక్డీకపూల్‌లోని కలెక్టర్ కార్యాలయంలో, సికింద్రాబాద్ స్థానం నామినేషన్ సికింద్రాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ జోనల్ కార్యాలయం, కంటోన్మెంట్ ఉప ఎన్నిక నామినేషన్ కంటోన్మెంట్ సీఈఓ కార్యాలయంలో దాఖలు చేయవచ్చన్నారు. మంగళవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. గతంలో నియోజకవర్గం పరిధిలో ఒకే వ్యక్తికి రెండు, మూడు చోట్ల ఉన్న ఓట్లను గుర్తించి తొలగించామన్నారు. నగరంలో పోలింగ్ శాతం తగ్గడానికి మరణించిన, చిరునామా మారిన, డూప్లికేట్ ఓటర్ల పేర్లు జాబితాలో ఉండడమూ ఒక కారణమన్నారు. అభ్యర్థులు తమపై ఉన్న క్రిమినల్ కేసుల వివరాలను పత్రికలు, ప్రసార మాధ్యమాల్లో ప్రకటించాల్సి ఉంటుందన్నారు. ప్రచారంలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు ఎవరు చేసినా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఆ ఓట్లు తొలగించలేం..

హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలో 6.5 లక్షల బోగస్ ఓటర్లు ఉన్నారన్న ఫిర్యాదులపై రోనాల్డ్ స్పందించారు. బోగస్ ఓట్లపై ఇప్పుడు చర్యలు తీసుకునే అవకాశం లేదని, ఎన్నికల షెడ్యూల్ విడుదల అనతరం జాబితా నుంచి పేర్లు తీసేయడం కుదరదని చెప్పారు.

అంతా సిద్ధం..

పార్లమెంట్ ఎన్నికల కోసం అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు. బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్ల ర్యాండమైజేషన్ పూర్తయ్యిందని, ఫస్ట్ లెవల్ చెకింగ్ పూర్తయ్యిందన్నారు. 371 బీయు, సీయు, వీవీ ప్యాట్లను శిక్షణ కోసం ప్రత్యేకంగా ఉంచినట్టు చెప్పారు.

కుస్తీ పోటీల్లో ఓడించాడని..


(5వ పేజీ తరువాయి)

తీసుకువస్తామని కానిస్టేబుళ్లు చెప్పి గాలింపు చర్యలు చేపట్టారు. మహమూద్ తన కొడుకును స్కూటర్‌పై కూర్చోబెట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు వెళ్తుండగా పారిపోయిన యువకులంతా వచ్చి స్కూటర్‌పై నుంచి ఖలీల్‌ను లాగి కిందపడేశారు. అజ్జూ తన దగ్గర ఉన్న కత్తితో విచక్షణా రహితంగా అతన్ని పొడిచాడు. కన్న తండ్రి, సోదరుడు అడ్డుకోవడానికి ప్రయత్నించినా సాధ్యపడలేదు. తీవ్ర గాయాల పాలైన ఖలీల్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారమందుకున్న డీసీపీ సాయి చైతన్య సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బహదూర్‌పురా ఇన్‌స్పెక్టర్ రఘునాథ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి

కొత్తపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) సభ్యులు డా.డి.మనోహర్ ములే పిలుపునిచ్చారు. మంగళవారం కొత్తపేట మోహన్‌నగర్‌లోని చిన్నారుల ఆరోగ్య వైకల్యాల అధ్యయన సంస్థ 'మానస'లో 'దివ్యాంగుల మానవ హక్కులను సమర్థించడం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కుల్లో స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం అందరికీ అందుబాటులో ఉండాలని, ఇవి దివ్యాంగులకూ వర్తించాలని స్పష్టం చేశారు. దివ్యాంగుల హక్కుల ఉల్లంఘనపై వెబ్‌సైట్ nhrc.nic.in లో ఫిర్యాదు చేయాలని సూచించారు. వైకల్యం కారణంగా వివక్షతకు గురికాకుండా ఉండడం ప్రస్తుత చట్టబద్ధమైన హామీ అని, దీనిని రాజ్యాంగ హామీ స్థాయికి పెంచాల్సిన సమయం ఆసన్నమైందని ఉస్మానియా విశ్వవిద్యాలయం న్యాయశాస్త్ర ప్రొఫెసర్ జీబీ రెడ్డి స్పష్టం చేశారు. మేధో వైకల్యం గల పిల్లల సంఖ్య పెరుగుతుండడం గమనించామని ఎర్రగడ్డ ప్రభుత్వ మానసిక వైద్యశాల ప్రొ.డా. ఆర్.అనిత తెలిపారు. మానస స్పెషల్ స్కూల్ విద్యార్థి విష్ణు భట్ భక్తి గీతాలు పాడి అందరినీ ఆకట్టుకున్నారు. దివ్యాంగ చిన్నారుల కోసం మానస న్యూరో డెవలప్‌మెంటల్ క్లినిక్‌లో స్పీచ్ థెరపీ, ఫిజియో థెరపీ అందుబాటులో ఉన్నాయని మానస డైరెక్టర్ మెర్సీ మధురిమ తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యులు ఎస్.విజయ భారతి, సంస్థ కార్యదర్శి శ్రీహరి, కోశాధికారి టి.మదన్‌మోహన్‌రెడ్డి, స్పెషల్ స్కూల్ ప్రిన్సిపాల్ లింగాల లక్ష్మి, సిబ్బంది, లైఫ్ మెంబర్స్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి 9
నవ్య
కుటుంబ కదంబం



రామాయణం... వేల సంవత్సరాలుగా కోట్ల మందిని ప్రభావితం చేస్తున్న కావ్యం. దీనిని సులభంగా అందరి దగ్గరకు తీసుకువెళ్లటానికి జరుగుతున్న ప్రయత్నాలెన్నో! అలాంటిదే ఒక ప్రయత్నం చేస్తున్నారు నీలిమ పెనుమర్తి. 'స్టోరీ హవర్' పేరిట ఆడియో బుక్కులు.. తోలుబొమ్మలాట ద్వారా ఆమె చేస్తున్న ప్రయత్నాలకు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ లభిస్తోంది. బీబీసీలోనే కాదు... బ్రిటిష్ ఎయిర్‌వేస్, ఖతార్ ఎయిర్‌వేస్ వంటి సుప్రసిద్ధ వైమానిక సంస్థలు కూడా తమ విమానాలలో ఆమె ఆడియో బుక్స్‌ను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువచ్చాయి. నేడు శ్రీరామనవమి సందర్భంగా ఆమె తన ప్రస్థానాన్ని 'నవ్య'కు వివరించారు.



మన రామాయణాన్ని విదేశాల్లో వినిపిస్తోంది



"మాది హైదరాబాద్. నేను ఉప్పల్‌లోని కేంద్రీయ విద్యాలయంలో చదువుకున్నా. అందువల్ల తెలుగుతో పాటుగా నాకు హిందీ, ఇంగ్లీషు భాషలు స్పష్టంగా వచ్చు. ఈ భాషల వల్ల అనేక ప్రయోజనాలున్నాయని.. ఈ భాషలు నా సాంస్కృతిక ప్రస్థానంలో ఒక భాగమవుతాయని చిన్నప్పుడు ఎప్పుడూ అనుకోలేదు. ఉన్నత విద్య కోసం కోసం లండన్ వెళ్లాను. వివాహం తర్వాత అక్కడే స్థిరపడ్డాం. నాకు చిన్నప్పటి నుంచి రామాయణం అంటే చాలా ఇష్టం. అది నా మనస్సులో ఒక చెరగని ముద్ర వేసింది. బ్రిటన్‌లో ఉత్తరాది వారి సంఖ్య ఎక్కువ. ముఖ్యంగా గుజరాతీయులు ఎక్కువ మంది ఉంటారు. ఉత్తర భారతీయుల కోసం- అక్కడి స్కూళ్ల సిలబస్‌లో రామాయణ కథ కూడా ఉంటుంది. దీనిని మా పిల్లలు కూడా చదువుతూ ఉండేవారు. అయితే మన రామాయణానికి.. ఉత్తర భారతీయుల రామాయణానికి మధ్య తేడా ఉంటుంది. పండగలను చేసుకోవటంలో కూడా తేడా ఉంటుంది. ఉదాహరణకు రావణుడిపై రాముడి విజయానికి గుర్తుగా దీపావళి చేసుకుంటారు. మనకు అలాంటి సంప్రదాయం ఉండదు. మా చిన్నవాడు ఆయుర్- నాలుగేళ్ల వయస్సులో రామాయణం స్కిట్ కూడా వేశాడు.



తొలి ప్రయత్నం...

ఒక రోజు మా అబ్బాయి వచ్చి- "రామాయణం చాలా సంక్లిష్టమైన ఇంగ్లీషు భాషలో ఉంటోంది. లేదా బొమ్మల కథల మాదిరిగా ఉంటోంది" అన్నాడు. ఆ మాటలు నాలో ఆలోచన రేకెత్తించాయి. అందరికి సులభంగా అర్థమయ్యే భాషలో.. రామాయణ కథకు ఎక్కడా అన్యాయం జరగకుండా రామాయణాన్ని ఒక ఆడియోబుక్ చేస్తే ఎలా ఉంటుందనే ఆలోచన వచ్చింది. ఈ మధ్యకాలంలో ఆడియో బుక్‌లను ఎక్కువ మంది వింటున్నారు. వాటికి మంచి ఆదరణ కూడా లభిస్తోంది. దీనితో రామాయణ కథను ఇంగ్లీషులో మా పిల్లల చేత- 'రామాయణ- యాన్ ఏన్షియంట్ ఎపిక్' అనే ఆడియోబుక్ చేయించాను. దీనికి విశేషమైన ఆదరణ లభించింది. 'ది టైమ్స్' పత్రిక వారు దీనిని రివ్యూ చేశారు. ముందు ఈ పుస్తకాల బ్రాండ్‌కు పురాణాస్ అని పెట్టాం. ఆ తర్వాత 2020లో దీనిని 'స్టోరీ అవర్' అని పేరు మార్పు చేశాం. ఒక గంటలో అయిపోయే స్టోరీలు కాబట్టి వీటికి ఆ పేరును పెట్టాం. కేంద్రీయ విద్యాలయానికి చెందిన అరుగురు పిల్లలు హిందీలో.. తెలుగులో దేవగిర్ బ్లైండ్ స్కూలుకు చెందిన ముగ్గురు పిల్లలతో ఆడియో బుక్స్ విడుదల చేశాం. ఇంగ్లీషు ఆడియో పుస్తకాన్ని- బ్రిటిష్ ఎయిర్‌వేస్, ఖతార్ ఎయిర్‌వేస్ వైమానిక సంస్థలు తమ ప్రయాణికుల సౌకర్యార్థం - ఆడియోబుక్ సెక్షన్‌లో ఉంచారు. ఒక వైపు ఈ ప్రయత్నాలు జరుగుతుండగానే- ఈ పుస్తకాన్ని అందరికి తెలియజేయటానికి వీలుగా- రామాయణంపై ఒక తోలుబొమ్మలాటను రూపొందించాను. నా దృష్టిలో ఒక ఉద్దాత్తమైన కథను.. హృద్యంగా అందరి మనస్సులో చొచ్చుకుపోయే రీతిలో చెప్పగల సామర్థ్యం తోలుబొమ్మలాటకు ఉంది. అందుకే దానిని ఎంచుకున్నాను. అయితే లండన్‌లో ఇలాంటి సృజనాత్మక కళల ప్రదర్శలను అయ్యే నిర్వాహణ వ్యయం చాలా ఎక్కువ ఉంటుంది. అందుకే తోలుబొమ్మలాటను 15 నిమిషాలకు కుదించి- మూడు భాగాలుగా చేశాం. దీనికి కూడా మంచి ఆదరణ లభించింది. దీనికి కొన్ని పాటలు.. సంగీతాన్ని కూడా జోడించాం. ఆ తర్వాత ఇది 25 నిమిషాలకు చేరుకుంది. లండన్‌లో నెహ్రూ సెంటర్‌లో ఈ తోలుబొమ్మలాటను అనేక ప్రాంతాల్లో ప్రదర్శించాం. దీనిని ఒక ఫిల్మ్‌గా రూపొందించాం. ప్రతి చోట దీనికి మంచి ఆదరణ లభించింది.



స్వాతంత్ర్య పోరాటంపై...

ఆ తర్వాత కోవిడ్ వచ్చింది. ఆ సమయంలో మా అమ్మనాన్నలతో 'తాతమ్మ కథలు' అనే కథలు రాయించాను. వాటిని మేమే ఆడియో పుస్తకాల రూపంలో తీసుకువచ్చాం. మా పిల్లలిద్దరికి చరిత్ర అంటే చాలా ఇష్టం. బ్రిటిష్‌వారిపై జరిపిన స్వాతంత్ర్యపోరాటానికి సంబంధించిన అనేక పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. అయితే మొఘలుల కాలం నుంచి మనకు స్వాతంత్ర్యం పూర్తయ్యే దాకా జరిగిన ముఖ్యమైన విషయాలన్నింటినీ పూసగుచ్చి చెప్పే కథల కొరత అయితే ఉంది. దీనిని గుర్తించి మా అబ్బాయి అయుర్.. వాళ్ల స్నేహితుడు అయుష్ కలిసి- ' ఫ్రమ్ ది మొఘల్స్ టూ మహాత్మ' అనే ఆడియో బుక్‌ను తయారుచేశారు. దీనికి కూడా మంచి ప్రశంసలు వచ్చాయి. ఈ ఆడియో బుక్ ప్రముఖ దౌత్యవేత్త, పార్లమెంట్ సభ్యుడు శశి థరూర్ రివ్యూ కూడా రాశారు. ఈ పుస్తకాన్ని హిందీలో బ్లైండ్ రిలీఫ్ అసోషియేషన్ ద్వారా ఇద్దరు అంధ బాలల ద్వారా అనువాదం చేయించాం.

చివరగా...

రామాయణం ఆడియో పుస్తకాలకు ఇంగ్లీషులో విపరీతమైన ఆదరణ లభించింది. అయితే ఇంగ్లీషులో లభించినంత ప్రోత్సాహం ప్రాంతీయ భాషల్లో లభించటం లేదు. వాస్తవానికి పిల్లలపై మాతృభాష ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఇంట్లో తెలుగు మాట్లాడుతుంటే- వారికి తెలుగు సులభంగా వచ్చేస్తుంది. అంతే కాకుండా ఒక భాష వచ్చిన వారికి ఇతర భాషలు రావటం సులభం అవుతుంది కూడా! మాతృభాషలో సంస్కృతిని నేర్చుకున్నవారు సంస్కారవంతులు అవుతారనటంలో ఎటువంటి సందేహం కూడా లేదు.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

శ్రీరామనవమికి ముస్తాబవుతున్న అయోధ్య రామమందిరానికి ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలోని రామ్‌ఘాట్ ప్రాంతంలో... నిరాడంబరంగా కనిపిస్తుంది శ్రీ రామ్ జానకీ మందిర్. అక్కడ పూజాదికాలు, నిర్వహణ... ఇలా సమస్త బాధ్యతలూ నిర్వర్తించేది మహిళలే. 150 సంవత్సరాల ఈ సంప్రదాయం మాయీవాడ ఆశ్రమం ఆధ్వర్యంలో కొనసాగుతోంది. దాదాపు 120 మందికి ఆశ్రయం ఇస్తున్న మాయ్‌వాడ గురించి, ఆలయ నిర్వహణ గురించి ప్రధాన అర్చకురాలు కృష్ణదాసి మాటల్లో...

అయోధ్యలో...
ఈ రాముడికి మహిళలే పూజారులు

"అయోధ్య ప్రాంతంలో ఆధ్యాత్మికతకు అంకితమై, మోక్షాన్ని కోరుతూ, వైరాగ్యంతో జీవించే మహిళలకు కొదవలేదు. స్థానికంగా వినిపించే ఒక కథ ప్రకారం... శ్రీరాముడితో వివాహం అయ్యాక... సీతమ్మ మొదటిసారి అయోధ్యకు వచ్చినప్పుడు ఆమెతో పాటు వచ్చిన మహిళా పరివారం ఒక చోట విడిది చేసింది. ఆ తరువాత దాన్నే తమ నివాస ప్రాంతంగా మార్చుకుందట. ఆ ప్రాంతం 'జానకీ బాగ్'గా ప్రసిద్ధి చెందింది. కాలక్రమేణా అదే 'మాయీవాడ' అయిందంటారు. అప్పటి నుంచి వివిధ కారణాల వల్ల కుటుంబాలకు దూరమై లేదా భౌతిక బంధాలపై విరక్తి చెంది... ఆధ్యాత్మిక మార్గంలో జీవించాలని నిర్ణయించుకున్నవారికి ఇది గమ్యంగా మారిపోయింది. ఆధునిక కాలానికి వస్తే... 150 ఏళ్ళ క్రితం... పద్దెనిమిదో శతాబ్దం చివర్లో... మహిళా సన్యాసినులకు, సాధువులకు నిలువ నీడలేని పరిస్థితి ఏర్పడింది. దాంతో వారు సరయూనదీ తీరాన ఒక గుడారాన్ని ఏర్పాటు చేసుకొని, అందులో నివసించేవారు. తరువాత విరాళాలతో కొంత డబ్బును పోగు చేసి, ఆలయాన్ని నిర్మించారు. అదే శ్రీ రామ జానకీ మందిర్. నాటి నుంచీ బాధ్యతలన్నీ మహిళలే నిర్వహిస్తున్నారు.



ఆహారం, వసతి, ఆధ్యాత్మికత...

నా స్వస్థలం మధ్యప్రదేశ్‌లోని రేవా. నలభై రెండేళ్ళ క్రితం నేను భక్తి మార్గానికి మళ్ళాను. ఆధ్యాత్మిక ఉన్నతి కోసం అయోధ్యకు చేరుకున్నాను. మాయీవాడ ఆశ్రమంలో చేరాను. 2017లో ప్రధాన పూజారిణిగా బాధ్యతలు చేపట్టాను. మేమందరం రామానంది సంప్రదాయానికి చెందినవాళ్ళం. అయోధ్యలో ఎక్కువ ఆలయాలు ఈ సంప్రదాయం ప్రకారమే నడుస్తాయి. పూజా కార్యక్రమాలు నిర్వహించే పురుషులను పిలిచినట్టే.. మమ్మల్ని కూడా 'మహంత్'లని వ్యవహరిస్తారు. మాయ్‌వాడ అంటే 'తల్లుల ప్రాంగణం' అని అర్థం. ఇక్కడ మూడు ఆలయాలున్నాయి. సుమారు 45 మంది మహిళా మహంత్‌లు, సంరక్షకులు ఉన్నారు. ఆ ఆలయాలన్నీ వేటికవే స్వతంత్రంగా నడుస్తున్నాయి.



వితంతువులు, అనాథలు, అభాగ్యులు, కుటుంబానికి దూరమైన మహిళలు... దాదాపు 120 మంది వరకూ ఇక్కడ ఆశ్రయం పొందుతున్నారు. వారిలో... ఇంతకుముందు మహంత్‌గా ఉన్న రేష్మాదాసి దత్తత తీసుకున్న పదిహేనేళ్ళ బాలిక నుంచి... తొంభయ్యేళ్ళ రామ్‌స్నేహిదాసి వరకూ అన్ని వయసులవారూ ఉన్నారు. వారికి రెండు పూటల భోజనం, వసతి అందిస్తున్నాం. అందరూ సన్యాసినులుగా... భక్తి మార్గంలో జీవనం గడుపుతున్నారు. ఈ చుట్టుపక్కల ప్రాంతాల్లో పేదరికం ఎక్కువ. అలాగే మహిళలపై పురుషుల అఘాయిత్యాలూ ఎక్కువే. భర్తలు వదిలేసినవారికి, గృహహింస భరించలేక ఇల్లు వదిలి వచ్చినవారికి మేము అండగా నిలుస్తున్నాం. వారి ఆధ్యాత్మిక ఉన్నతికి దోహదం చేస్తున్నాం. వైష్ణవ సంప్రదాయాలు పాటించే ఆలయాల్లో సాధారణంగా పూజారులందరూ పురుషులే ఉంటారు. కానీ మా ఆలయాల్లో అన్ని కార్యకలాపాలూ మహిళల చేతుల మీదుగానే సాగుతాయి. పూజలకు పురుషులను అనుమతించం. తెల్లవారుజామునే ధ్యానం, పూజ, ఉదయం వేళలో హోమం, ప్రసాద నివేదన, రోజూ సాయంత్రం భజన కార్యక్రమాలు ఉంటాయి.

మాకు ఆహ్వానం లేదు...

అయోధ్యలో మా గురించి ప్రతి ఒక్కరికీ తెలుసు. ఈ ఏడాది అయోధ్య రామమందిర ప్రారంభోత్సవానికి ఎక్కడెక్కడివారినో పిలిచారు. కానీ మాకు ఆహ్వానం అందలేదు. ఇదే కాదు... రాజకీయ నాయకుల ప్రమేయం ఉన్న ఏ ఆధ్యాత్మిక కార్యక్రమంలోనైనా... మగ సాధువులకు, మహంత్‌లకు తప్ప మాకు ఆహ్వానం రావడం చాలా అరుదు. ఆఖరుకు నిధులు, సబ్సిడీలు, ఇతర ప్రభుత్వ సహాయాలన్నీ పురుషుల ఆధిపత్యంలో ఉన్న సంస్థలకే అందుతూ ఉంటాయి. ఎందరికో ఆశ్రయం కల్పిస్తూ... ప్రస్తుతం దుస్థితికి చేరుకుంటున్న మాయ్‌వాడ లాంటివాటిని ఎవరూ పట్టించుకోరు. మాయ్‌వాడను, ఆలయాలను ఒక ట్రస్టుగా రిజిస్టర్ చెయ్యాలనే ప్రతిపాదనలు, వత్తిడులు వచ్చాయి. కానీ దాని వల్ల... మా ముందు తరాలవారు ఎంతో కష్టపడి సమకూర్చుకున్న భూమిని కోల్పోతామేమోననే భయంతో... వాటిని తిరస్కరించాం. భక్తులు ఇచ్చే దక్షిణలు, కొందరు దాతలు ఇచ్చే విరాళాలతో నెలవారీ సరుకుల కొనుగోలు, బిల్లుల చెల్లింపు చేస్తున్నాం. ఇప్పుడు నా వయసు డెబ్భై నాలుగేళ్ళు. సేవలోనే మోక్షం దొరుకుతుందనేది జీవితం నాకు నేర్పిన పాఠం. అందుకే... ఓపిక ఉన్నంత వరకూ అభాగ్యులకు సేవ చేస్తాను. మానవ సేవే మాధవ సేవ కదా!"

రక్తహీనత తగ్గించే దానిమ్మ

పండ్లలో దానిమ్మ కథే వేరు. ముఖ్యంగా దానిమ్మలో పోషకాలు, ప్రొటీన్లు, విటమిన్లు, మినరల్స్ పుష్కలం. ఒక్క మాటలో చెప్పాలంటే ఇదో పోషక విలువల గని. యాపిల్‌కు సమానమైన పండు అని పరిశోధకులు చెబుతారు. దానిమ్మను తింటే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయి.

- ఇందులో యాంటీ ఆక్సిడెంట్స్ ఉండటం వల్ల వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుంది. దీని ఫలితంగా దగ్గు, జలుబు లాంటివి దరిచేరవు.
- దానిమ్మ గింజలు తినటం వల్ల కడుపు నిండినట్లు ఉంటుంది. వీటిని డైట్‌లో చేర్చుకుంటే కచ్చితంగా బరువు తగ్గుతారు.
- ఇందులోని పీచుపదార్థం వల్ల తిన్న ఆహారం సులువుగా జీర్ణమవుతుంది. జీర్ణప్రక్రియ సాఫీగా జరుగుతుంది.
- దానిమ్మ పండు లేదా దానిమ్మ రసం తాగినా డీహైడ్రేషన్ నుంచి కోలుకోవచ్చు.
- ఈ పండులో ఐరన్ ఎక్కువగా ఉండటం వల్ల రక్తహీనత సమస్య తగ్గుతుంది. ముఖ్యంగా రక్తం సాఫీగా ప్రసరించటంతో పాటు రక్తపోటు అదుపులో ఉంటుంది. ఇందువల్ల గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది దానిమ్మపండు.



- కండరాలు, నరాలు ఆరోగ్యంగా ఉంటాయి. ముఖ్యంగా ఈ గింజలను తింటే వాపులు రావు.
- మధుమేహగ్రస్తులకు ఈ పండు ఎంతో మేలు చేస్తుంది. దానిమ్మ గింజలు తినాలి. ఒకవేళ జ్యూస్ చేస్తే అందులో పంచదార కలపకుండా తాగేయాలి.
- దానిమ్మ గింజలను తినటం వల్ల నోటిలో బ్యాక్టీరియా నశిస్తుంది. దంతాల ఆరోగ్యానికి మేలు చేస్తుంది.
- చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. ఎర్ర రక్తకణాలను పెంచుతుంది. ముఖ్యంగా చెప్పాలంటే మెదడు ఆరోగ్యానికీ మంచిది.
- ఫ్రీరాడికల్స్ నుంచి రక్షణ కల్పించి వృద్ధాప్య ఛాయలు త్వరగా రాకుండా చేస్తాయివి.
- దానిమ్మ గింజలే కాదు తొక్క కూడా మేలు చేస్తుంది. జుట్టు ఆరోగ్యంతో పాటు చర్మ ఆరోగ్యాన్ని రక్షించే గుణం దానిమ్మ తొక్కకు ఉంది.



ఫ్యాషన్

దంచే ఎండల్లో ఒంటికి మెత్తగా తగులుతూ, చమటను పీల్చేసే కాటన్ చుడీదార్‌లు ఎంతో సౌకర్యంగా ఉంటాయి. తేలికగా, అనువుగా ఉండే అలాంటి కొన్ని లేటెస్ట్ కాటన్ చుడీదార్ల మీద ఓ లుక్కేద్దామా!

ఎండల్లో చలచల్లగా...



యాక్సెసరీస్

కాటన్ చుడీదార్‌తో ఫ్లాట్స్ ధరించాలి. కొల్హాపురి చెప్పులు కూడా చాలా బాగుంటాయి. అలాగని వెడ్జెస్, పెన్సిల్ హీల్స్ ధరించకూడదని అనుకోకూడదు. ఈవినింగ్ పార్టీలకు ఇలాంటి ఫుట్ వేర్ బాగుంటుంది. ఫ్యాన్సీ జ్యూవెలరీ, చేతికి వాచ్ ధరించడం కూడా తప్పనిసరి.



స్టైలింగ్ ఇలా...

చుడీదార్ పాత ఫ్యాషన్ అని కొట్టి పారేయడానికి వీల్లేదు. వేసవిలో సౌకర్యవంతమైన వస్త్రధారణలో చీరల తర్వాతి స్థానం ఎప్పటికీ కాటన్ చుడీదార్లదే! కాబట్టి కొత్త హంగులు జోడించి, కాటన్ చుడీదార్లలోనే ఫ్యాషనబుల్‌గా కనిపించే ప్రయత్నం చేయాలి. అందుకోసం డోరీలు, లట్‌కాన్‌లను డ్రస్‌కు జోడించాలి. అలాగే కుట్టించేటప్పుడు డ్రస్ డిజైనింగ్ చేయించాలి. కాంట్రాస్ట్ కలర్స్ ఎంచుకోవాలి. చున్నీ, డ్రస్‌కు పూర్తి భిన్నంగా ఉండేలా చూసుకోవాలి.



జైపూర్ కాటన్

రంగులు వెలిసిపోకుండా, కుంచించుకుపోకుండా ఉండే జైపూర్ కాటన్‌ను అందరూ ఇష్టపడతారు. ప్రింటెడ్ కాటన్ జైపూర్ చుడీదార్‌లు రెడీమేడ్‌గా దొరుకుతాయి. వీటికి బదులుగా నచ్చిన మోడల్‌లో కుట్టించుకోవాలనుకుంటే, మెటీరియల్‌ను కూడా ఎంచుకోవచ్చు. అయితే సాదాసీదా చుడీదార్‌లకు బదులుగా మోడర్న్‌గా ఉండే మోడల్స్ ఎంచుకుంటే అటు ఆఫీసులకూ, ఇటు ఈవినింగ్ గెట్ టు గెదర్స్‌కూ సూటవుతాయి.

జుట్టు ఆరోగ్యం కోసం...

వేసవిలో జుట్టు సంరక్షణ కోసం మంచి పోషకాహారం తీసుకోవాలి. దీంతో పాటు కొన్ని హెయిర్ ప్యాక్స్‌నూ వేసుకొంటే... మంచి ఫలితం ఉంటుంది.



- వేపాకును మెత్తగా నూరి.. ఆ రసాన్ని మాత్రం జుట్టు కుదుళ్లతో పాటు వెంట్రుకలకు పట్టించాలి. బాగా ఆరిన తర్వాత తక్కువ గాఢత కలిగిన షాంపూతో కడిగేయాలి. దీని వల్ల జుట్టులో మంటల కలగవు. నొప్పులు, ఇన్‌ఫెక్షన్లు దరిచేరవు.
- టేబుల్ స్పూన్ పొట్టు మినపగుళ్ల మిశ్రమం.. అంతే పరిమాణంలో మెంతిపొడి, ఉసిరి పొడిని సమపాళ్లలో తీసుకోవాలి. దీనికి రెండు టేబుల్ స్పూన్ల పెరుగును చేర్చి పల్చటి మిశ్రమంగా చేయాలి. ఈ మిశ్రమాన్ని జుట్టుకు పట్టించాలి. అర గంట తర్వాత జుట్టును శుభ్రంగా కడిగేయాలి. ఇలా తరచూ చేస్తుంటే జుట్టు పెరుగుతుంది.
- ఒక బౌల్‌లో టేబుల్ స్పూన్ కలబంద గుజ్జు , టేబుల్ స్పూన్ శీకాయపొడిని కలపాలి. ఇందులో అవసరం అనుకుంటే కొద్దిగా నిమ్మరసం వేయాలి. ఈ మిశ్రమాన్ని జుట్టుకు పట్టించి ఆరిన తర్వాత మంచి నీటితో శుభ్ర పరచుకోవాలి. శీకాయ ఉంది కాబట్టి షాంపూతో కడగాల్సిన అవసరం లేదు. ఇలా తరచూ చేస్తుంటో జుట్టు గట్టిగా ఉంటుంది. తలలో చుండ్రు సమస్య తగ్గిపోతుంది.

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
బుధవారం • 17 ఏప్రిల్ 2024
cinema@andhrajyothy.com

త్వరలోనే సెట్స్‌పైకి
అఖండ-2



'సింహ', 'లెజెండ్', 'అఖండ' సినిమాలతో బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబో హ్యాట్రిక్ హిట్స్ కొట్టింది. మాస్ ప్రేక్షకులను ఉర్రూతలూగించే వీరి కలయికలో మరో చిత్రం ఎప్పుడెప్పుడా అని అభిమానులు ఎదురుచూస్తున్నారు. తాజాగా ఈ విషయమై బోయపాటి శ్రీను మీడియాతో మాట్లాడారు. 'అఖండ'కు సీక్వెల్ ఎప్పుడని నన్ను ఎంతో మంది అడుగుతున్నారు. ప్రస్తుతం ఎటుచూసినా ఎన్నికల హడావుడే కనిపిస్తోంది. కాబట్టి ఎన్నికలు ముగిశాక ఈ సీక్వెల్‌పై అధికారిక ప్రకటన విడుదల చేస్తాం. వీలైనంత త్వరలో ఈ సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్తాం. 'అఖండ'లో పసిబిడ్డ, ప్రకృతి, పరమాత్మ అంశాలను చూపించాం. 'అఖండ-2'లోనూ సమాజానికి అవసరమైన మంచి సందేశాన్ని చూపించబోతున్నాం. దైవత్వం మనందరిలో ఒక భాగం. ఈ విషయాన్ని తెరపైకి తీసుకు వస్తే ప్రేక్షకులను కచ్చితంగా ఆకట్టుకుంటుంది" అని చెప్పారు.

టాలీవుడ్‌లోకి అక్షయ్



బాలీవుడ్ హీరో అక్షయ్‌కుమార్ టాలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప'లో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారు. ఒక తెలుగు చిత్రంలో నటించడం ఆయనకు ఇదే మొదటిసారి. ఈ సినిమా షూటింగ్‌లో పాల్గొనడానికి హైదరాబాద్‌కు వచ్చిన అక్షయ్‌కు డాక్టర్ మోహన్‌బాబు, విష్ణు స్వాగతం పలికారు. భారీ అంచనాలతో, నిర్మాణంలో ఎక్కడా రాజీ పడకుండా మోహన్‌బాబు నిర్మిస్తున్న ఈ చిత్రం ఇప్పటికే న్యూజిలాండ్‌లో రెండు భారీ షెడ్యూల్స్ పూర్తి చేసుకుంది. ప్రస్తుతం రామోజీ ఫిల్మ్ సిటీలో అక్షయ్‌కుమార్ పాల్గొనే సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. 'కన్నప్ప' చిత్రంలో మోహన్‌లాల్, ప్రభాస్, శరత్‌కుమార్, బ్రహ్మానందం తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. హై టెక్నికల్ స్టాండర్డ్స్‌తో రూపుదిద్దుకుంటున్న 'కన్నప్ప' చిత్రానికి ముఖేశ్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. పరుచూరి గోపాలకృష్ణ, బుర్రా సాయిమాధవ్, తోట ప్రసాద్ ఈ చిత్రానికి రచయితలు. కన్నప్ప కథను అందరికీ తెలిసే విధంగా ఇటీవల కామిక్ బుక్స్‌ను విడుదల చేయగా, వాటికి మంచి స్పందన వచ్చింది.

యాక్షన్ ఊచకోత



విశాల్ హీరోగా నటించిన తాజా చిత్రం 'రత్నం' ఈ నెల 26న విడుదల కానుంది. హరి దర్శకత్వంలో కార్తికేయన్ సంతానం నిర్మించారు. ఈ సినిమాను సీహెచ్ సతీశ్ కుమార్, కె. రాజ్‌కుమార్ తెలుగులో విడుదల చేస్తున్నారు. తాజాగా విడుదల చేసిన ఈ సినిమా ట్రైలర్ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారింది. ఏపీ, తమిళనాడు సరిహద్దు గొడవల ఆధారంగా ఈ చిత్రం రూపుదిద్దుకుందని ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది. హీరోయిన్ కోసం హీరో చేసే ఊచకోత మాస్ యాక్షన్ జానర్లు ఇష్టపడే ప్రేక్షకులను అలరిస్తుంది. యాక్షన్‌తో పాటు లవ్ సీన్లకు కూడా సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ మంచి రీరికార్డింగ్ ఇచ్చారు.



మలయాళ సినిమాపై మన కథానాయికలకు మనసైంది. ఇన్నాళ్లు పేరు, పారితోషికం లెక్కలు వారిని అటువైపు వెళ్లనివ్వలేదు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మారింది. బాక్సాఫీసు దగ్గర మలయాళ సినిమా సత్తా చాటుతోంది. అందుకే ఒక్కొక్కరుగా మన హీరోయిన్లు మలయాళ చిత్ర రంగంలో కర్చీఫ్ వేస్తున్నారు. ఇప్పటికే కొందరు ఈ ఏడాది కథానాయికలుగా మలయాళ ఎంట్రీ ఇస్తుండగా మరికొందరు ప్రయాణానికి సిద్ధమవుతున్నారు.



మలయాళ సినిమాపై మనసిలాయో

దాదాపు 20 ఏళ్ల తన కెరీర్‌లో ఇప్పటివరకూ తెలుగు, తమిళ చిత్రాలకు మాత్రమే ప్రాధాన్యం ఇచ్చారు అనుష్కశెట్టి. ఇప్పుడు ఆమె చూపు మలయాళ సినిమాపై పడింది. 'కథనార్ - ది వైల్డ్ సోర్సెరర్' చిత్రంలో అనుష్క లీడ్‌రోల్‌లో నటిస్తున్నారు. ఆమెతో సినిమాలు చేసేందుకు తెలుగులో అగ్రహీరోలు, దర్శకులు సిద్ధంగా ఉన్నారు. అయినా ఆమె ఈ మలయాళ చిత్రానికి పచ్చజెండా ఊపారంటే ఆ సినిమాలో ఏదో ప్రత్యేకత ఉన్నట్లే. హారర్ కథాంశంతో రూపొందే ఈ చిత్రానికి రోజిన్ థామస్ దర్శకత్వం వహిస్తున్నారు. జయసూర్య హీరోగా నటిస్తున్నారు. 'కథనార్'ను 14 భాషల్లో విడుదల చేస్తున్నట్లు దర్శకుడు తెలిపారు. మార్చిలో చిత్రీకరణ మొదలైంది. కేరళలో జరిగిన కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతోన్న ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదలవుతుంది. తొలిభాగాన్ని ఈ ఏడాది చివర్లో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు.

సాక్షి ఎంట్రీకి సిద్ధం

అఖిల్ హీరోగా నటించిన 'ఏజెంట్' సినిమాతో కథానాయికగా పరిచయమయ్యారు సాక్షి వైద్య. అందగత్తెగా గుర్తింపు దక్కింది కానీ ఆ సినిమా కాస్తా బాక్సాఫీసు దగ్గర పరాజయాన్ని మూటగట్టుకోవడంతో సాక్షి కెరీర్ మందగించింది. ఆ తర్వాత వరుణ్‌తేజ్‌తో 'గాండీవధారి అర్జున' చిత్రం చేశారు. రెండో ప్రయత్నంలోనూ ఆమె ఖాతాలో హిట్ పడలేదు. ప్రస్తుతం ఆమె తెలుగులో శర్వానంద్ హీరోగా రామ్ అబ్బరాజు దర్శకత్వం వహిస్తున్న చిత్రంలో కథానాయికగా నటిస్తున్నారు. ఒకవైపు టాలీవుడ్‌లో వరుసగా చిత్రాలు చేస్తూనే మలయాళ పరిశ్రమలోనూ ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమయ్యారు సాక్షి. 'హాల్' అనే మలయాళ చిత్రంలో నటించబోతున్నట్లు ఇటీవలే సోషల్ మీడియా ద్వారా తెలిపారు. ప్రశాంత్ విజయ్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈతరం యువతను ఆకట్టుకునే ప్రేమకథతో రూపొందుతున్న ఈ చిత్రంలో షేన్ నిగమ్ హీరో. మేలో సెట్స్‌పైకి వెళ్లనుంది. ఈ ఏడాది చివర్లో విడుదల చేయనున్నట్లు నిర్మాణసంస్థ జేవీజే ప్రొడక్షన్స్ తెలిపింది.

మరో ప్రయత్నం

ఆకట్టుకునే అందం, మెప్పించే అభినయం రాయ్ లక్ష్మి సొంతం. కానీ హీరోయిన్‌గా ఆమెకు దక్కాల్సినంత గుర్తింపు రాలేదు. తన రూటు మార్చి ప్రత్యేక గీతాల్లోనూ నర్తించారు రాయ్ లక్ష్మి. ఇప్పుడు ఆమె ఆరేళ్ల తర్వాత మరోసారి మలయాళ సినిమా చేస్తున్నారు. ఇందులో ఆమె ఐపీఎస్ అధికారిణి రేచల్ పున్నూస్ పాత్రలో కనిపించనున్నారు. ఈ సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్‌కు టీఎస్ సురేశ్‌బాబు దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవలే ఈ చిత్రం షూటింగ్ ప్రారంభమైంది.

టోవినోతో త్రిష

20 ఏళ్లుగా కథానాయికగా మెప్పిస్తున్నారు త్రిష. అగ్రహీరోలందరితోనూ సినిమాలు చేశారు. ఇన్నేళ్లలో ఆమె నటించిన వాటిలో తెలుగు, తమిళ చిత్రాలే అధికం. ఆమె కెరీర్‌లో "హే జూడ్" అనే ఒకే ఒక మలయాళ చిత్రంలో నటించారు. కానీ ఇప్పుడు ఆమె చేతిలో రెండు మలయాళ చిత్రాలున్నాయి. మోహన్‌లాల్ సరసన ఆమె 'రామ్' అనే చిత్రం చేస్తున్నారు. 'దృశ్యం' సిరీస్‌ను తెరకెక్కించిన జీతూ జోసెఫ్ దర్శకత్వం వహిస్తున్నారు. సంయుక్తా కీలకపాత్ర పోషిస్తున్నారు.







తెలుగు, తమిళ చిత్రాలపైనే ప్రధానంగా దృష్టి సారించారు నయనతార. షారూఖ్‌ఖాన్ 'జవాన్'తో బాలీవుడ్‌లోనూ అదిరే ఎంట్రీ ఇచ్చారు. ఎంత బిజీగా ఉన్నా కథ బాగుంటే, మలయాళంలోనూ సినిమాలు చేస్తున్నారు నయనతార. చివరగా ఆమె 2022లో 'గోల్డ్' చిత్రంలో కథానాయికగా కనిపించారు. చిన్న విరామం తర్వాత మరో మలయాళ చిత్రానికి నయన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. 'డియర్ స్టూడెంట్స్' చిత్రంలో ఆమె హీరోయిన్‌గా నటిస్తున్నారు. నివిన్‌పాలీ కథానాయకుడు. సందీప్‌కుమార్, జార్జ్ ఫిలిప్‌రాయ్ దర్శకత్వం వహిస్తున్నారు.





కృతి తొలి అడుగు

'ఉప్పెన' చిత్రంతో ఒక్కసారిగా తెలుగు ప్రేక్షకుల ఫేవరేట్ హీరోయిన్‌గా మారారు కృతిశెట్టి. ఆ తర్వాత అగ్రహీరోలతో సినిమాలు చేసినా, ఆమెకు 'ఉప్పెన' స్థాయి విజయాలు దక్కలేదు. ప్రస్తుతం ఆమె శర్వానంద్ సరసన 'మనమే' అనే చిత్రం చేస్తున్నారు. టాలీవుడ్‌లో స్పీడ్ తగ్గినా కృతీ కోలీవుడ్‌లో జోరు చూపిస్తున్నారు. ఏకంగా మూడు చిత్రాలు ఆమె చేతిలో ఉన్నాయి. ఇక త్వరలోనే మలయాళంలోనూ ఎంట్రీ ఇవ్వబోతున్నారు. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న మలయాళ చిత్రం 'అజయంతే రణదం మోషనం'లో ఆమె కథానాయికగా నటిస్తున్నారు. టోవినో థామస్ కథానాయకుడిగా నటిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. జితిన్‌లాల్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ చిత్రంలో ఐశ్వర్యా రాజేశ్ మరో హీరోయిన్‌గా నటిస్తున్నారు. దీంతో పాటు ఐశ్వర్య 'హర్' అనే మలయాళ చిత్రం చేస్తున్నారు.

ఐదేళ్ల తర్వాత...

సంచలన విజయం సాధించిన మలయాళ చిత్రం 'ప్రేమమ్'తో కుర్రకారు హృదయాల్లో చోటు దక్కించుకున్నారు అనుపమా పరమేశ్వరన్. ఆ తర్వాత మాత్రం ఆమె తెలుగు, తమిళ చిత్రాలతో బిజీ అయ్యారు. మలయాళ అమ్మాయి అయినా అక్కడ అడపా దడపా సినిమాలు చేస్తూ వచ్చారు. చివరగా ఆమె నటించిన మలయాళ చిత్రం 'మనియరాయలే అశోకన్'. ఐదేళ్ల క్రితం విడుదలైంది. ఇప్పుడు మళ్లీ ఇన్నేళ్ల తర్వాత ఓ మలయాళ చిత్రం చేయబోతున్నారు అనుపమ. సురేశ్‌గోపీ హీరోగా నటిస్తున్న 'జేఎస్‌కే' చిత్రంలో ఆమె హీరోయిన్‌గా నటిస్తున్నారు. ప్రవీణ్ నారాయణన్ దర్శకత్వం వహిస్తున్నారు.

తమన్నా నటించిన మలయాళ చిత్రం 'బాంద్రా' గతేడాది విడుదలైంది. ఈ చిత్రం బాక్సాఫీసు దగ్గర యావరేజీగా నిలిచింది. దాదాపు 20 ఏళ్ల కెరీర్‌లో ఆమెకు ఇది తొలి మలయాళ చిత్రం కావడం విశేషం. అలాగే ప్రణీతా సుభాష్ కథానాయికగా నటించిన 'తంకమణి' చిత్రం గతనెల్లో విడుదలైంది.



జర్నలిస్ట్ మాస్ నంబర్



నారా రోహిత్ హీరోగా నటించిన 'ప్రతినిధి 2' చిత్రం ఈ నెల 25న విడుదల కానుంది. ప్రముఖ జర్నలిస్ట్ మూర్తి దేవగుప్తపు ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. కుమార్ రజాబత్తుల, ఆంజనేయులు శ్రీతోట, సురేంద్రనాథ్ బొల్లినేని నిర్మాతలు. ఈ సినిమా నుంచి 'గల్లా యెత్తి' అనే మాస్ సాంగ్‌ను రిలీజ్ చేశారు. సమాజంలోని మంచి చెడుల గురించి ఆలోచింపజేసే విధంగా కాసర్ల శ్యామ్ ఈ పాట రాశారు. రామ్ మిరియాల పాడారు. మహతి స్వరసాగర్ సంగీత దర్శకుడు. భాను మాస్టర్ కొరియోగ్రఫీలో నారా రోహిత్ ఉత్సాహంగా డాన్స్ చేశారు. ఇందులో ఆయన న్యూస్ రిపోర్టర్ పాత్ర పోషించారు. సిరీ లెల్లా కథానాయిక.

కన్నడ నటుడు ద్వారకేశ్ కన్నుమూత



ప్రముఖ కన్నడ నటుడు ద్వారకేశ్ (81) కన్నుమూశారు. వయోసహజ ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న ద్వారకేశ్ మంగళవారం ఉదయం తన నివాసంలోనే తుదిశ్వాస విడిచారు. ఆయన పూర్తి పేరు బంగ్లే షామారావు ద్వారకానాథ్. అయితే 'ద్వారకేశ్' గా చిత్ర పరిశ్రమలో ఆయన సుపరిచితులు. ఆయన 1964లో 'వీరసంకల్ప' ద్వారా సినీరంగంలో ప్రవేశించారు. కన్నడ కంఠీరవ రాజ్‌కుమార్ సహా ఎందరో ప్రముఖ నటులతో ఆరు దశాబ్దాలపాటు కలసి నటించారు. హాస్యంతోపాటు విభిన్నమైన పాత్రల్లో రాణించారు. 15 సినిమాలకు దర్శకత్వం వహించడమే కాకుండా 50 సినిమాలు నిర్మించారు. ఆయన భార్య అంబుజా సరిగ్గా మూడేళ్లకిందట ఇదే రోజున మృతి చెందారు. ద్వారకేశ్‌కు ఆరుగురు సంతానం. మొదటి భార్యకు ఐదుగురు కుమారులు కాగా రెండో భార్య శైలజకు ఒక కుమారుడు ఉన్నారు. 'నా చిరకాల మిత్రుడిని కోల్పోయాను' అంటూ రజనీకాంత్ ఎక్స్ ఖాతా ద్వారా పేర్కొన్నారు. 'స్వశక్తితో ఎదిగిన గొప్ప నిర్మాత, దర్శకుడు ద్వారకానాథ్. ఆయన జ్ఞాపకాలు నా మదిలో పదిలంగా ఉన్నాయి' అని ఆయన పేర్కొన్నారు. ద్వారకేశ్ పార్థివదేహాన్ని సినీ, రాజకీయ ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు. అభిమానుల సందర్శన కోసం రవీంద్రకళాక్షేత్రలో బుధవారం ఆయన పార్థివ దేహాన్ని ఉంచి, ఆ తర్వాత అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

సినిమా నేపథ్యంలో రుద్రాక్షపురం



మణి సాయితేజ, వైడూర్య హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'రుద్రాక్షపురం'. ఆర్.కె.గాంధీ దర్శకత్వం వహించగా, కొండ్రాసి ఉపేందర్ నిర్మించారు. ప్రముఖ నటుడు నాగ మహేశ్, ఫిల్మ్ జర్నలిస్ట్ సురేశ్ కొండేటి, బి.వీరబాబు, అప్పాజీ కీలక పాత్రలు పోషించారు. సినిమా నేపథ్యంలో సాగే 'రుద్రాక్షపురం' చిత్రం ఈ నెల 26న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మంగళవారం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ చిత్రానికి ఎడిటర్:డి.మల్లి, కెమెరామెన్: నాగేంద్రకుమార్, సంగీతం: ఎం.ఎల్ రాజా, ఘంటాడి కృష్ణ, జయసూర్య బొంపెం. ఈ కార్యక్రమంలో తెలుగు నిర్మాతల మండలి ప్రధాన కార్యదర్శి టి.ప్రసన్నకుమార్, దర్శకనిర్మాత లయన్ సాయివెంకట్, తదితరులు పాల్గొని సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు.

జానపద బాణీలతో యాదమ్మ



బాలాచారి కూరెళ్ల దర్శకత్వంలో తెరకెక్కిన హారర్ థ్రిల్లర్ 'భవనమ్'. సప్తగిరి, ధన్‌రాజ్, షకలక శంకర్, అజయ్, మాళవిక సతీషన్, స్నేహ ఉల్లాల్ ప్రధాన పాత్రలలో నటించారు. ప్రముఖ నిర్మాణ సంస్థ సూపర్‌గుడ్ ఫిల్మ్స్ సమర్పణలో ఆర్.బి.చౌదరి, వాకాడ అంజన్ కుమార్, వీరేంద్ర సిర్వి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇటీవలే విడుదల చేసిన ఫస్ట్ లుక్, టీజర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. మంగళవారం ట్రైలర్‌ను, జానపద బాణీలతో సాగే 'యాదమ్మ' పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత ఆర్.బి.చౌదరి మాట్లాడుతూ "దర్శకుడు బాలాచారి ఈ సినిమాను అద్భుతంగా తీశారు. ఇందులో ఉన్న అన్ని పాటలు ఆకట్టుకుంటాయి" అని చెప్పారు. దర్శకుడు బాలాచారి కూరెళ్ల మాట్లాడుతూ "దాదాపు 20ఏళ్ల తర్వాత ఈ నిర్మాణ సంస్థతో కలసి పనిచేయడం ఎంతో ఆనందంగా ఉంది. ఈ సినిమా అందరినీ అలరిస్తుంది" అని అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర బృందం పాల్గొన్నారు.

కొత్త పాయింట్‌తో మార్కెట్ మహాలక్ష్మి



'కేరింత' మూవీ సినిమాలో కామెడీ టైమింగ్‌తో మంచి గుర్తింపు తెచ్చుకున్న నటుడు పార్వతీశం. ఆయన నటించిన లేటెస్ట్ చిత్రం 'మార్కెట్ మహాలక్ష్మి'. ప్రణీకాన్వికా హీరోయిన్‌గా నటించారు. వియస్ ముఖేశ్ దర్శకత్వం వహించగా, అఖిలేశ్ కిలారు నిర్మించారు. ఈ నెల 19న 'మార్కెట్ మహాలక్ష్మి' విడుదలవుతోన్న సందర్భంగా చిత్ర దర్శకుడు మీడియాతో ముచ్చటించారు. "ఈ సినిమాలో ఆడియెన్స్ ఇప్పటివరకు చూడని ఓ కొత్త పాయింట్‌ను టచ్ చేశాం. ప్యూర్ లవ్ స్టోరీతో వస్తోన్న ఈ సినిమాను కుటుంబసమేతంగా చూసేలా తెరకెక్కించాం. సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేసే నా ఫ్రెండ్ ఒకరు కూరగాయలు అమ్మే అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఈ సంఘటన స్ఫూర్తితో ఈ సినిమా కథను రాసుకున్నాను" అని చెప్పారు.

సినిమా చూస్తూ నవ్వుతూనే ఉంటారు



చైతన్యా రావు, సునీల్, శ్రద్ధా దాస్, మాళవిక సతీశన్ ప్రధాన పాత్రలు పోషించిన క్రైమ్ కామెడీ 'పారిజాత పర్వం'ఈ నెల 19న విడుదల కానుంది. సోమవారం రాత్రి జరిగిన ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టీజీ విశ్వప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని బిగ్ టికెట్‌ను లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో నటుడు వైవా హర్ష మాట్లాడుతూ రెగ్యులర్ సినిమాలు కాకుండా ఇలాంటి డిఫరెంట్ చిత్రాలు రావాలంటే నిర్మాతలకు గట్స్ ఉండాలి. నేను ఎంజాయ్ చేస్తూ నటించిన సినిమా ఇది' అన్నారు. ఒక పది, పదిహేను నిముషాలు తప్ప మిగతా సినిమా చూస్తూ నవ్వుతూనే ఉంటారని సహ నిర్మాత అనంత్ సాయి చెప్పారు. ఏపీ, తెలంగాణ, కర్నాటక ప్రాంతాల్లో ఈ సినిమాను 125కి పైగా థియేటర్లలో విడుదల చేస్తున్నట్లు డిస్ట్రిబ్యూటర్ విశ్వనాథ్ చెప్పారు. దర్శకుడు సంతోష్ కంభంపాటి మాట్లాడుతూ 'కన్ఫ్యూజ్ కిడ్నాప్ డ్రామా ఇది. దానికి ఒక చిన్న థిన్ లైన్ ఉంది. ఆ లైన్ దాటితే ఆడియన్స్ కన్ఫ్యూజ్ అవుతారు. అందుకే నా మీద నమ్మకం ఉంచి సినిమా తీసిన నిర్మాతలకు ధన్యవాదాలు' అన్నారు. సినిమా బాగా వచ్చిందనీ, థియేటర్లలో ఈ నెల 19న చూడండి అని నిర్మాతలు మహీధర్ రెడ్డి, దేవేశ్ చెప్పారు. ఈ చిత్రం తప్పకుండా విజయం సాధిస్తుందని హీరో చైతన్యా రావు తెలిపారు.



వైభవంగా ఒలింపిక్ జ్యోతి ప్రజ్వలన

● టార్చ్ రిలే ఆరంభం ● 100 రోజుల కౌంట్‌డౌన్

ఒలింపియా (గ్రీస్): ఒలింపిక్స్ క్రీడల పుట్టినిల్లు గ్రీస్‌లోని ప్రాచీన ఒలింపియాలో.. పారిస్ విశ్వక్రీడాజ్యోతిని ప్రజ్వలన చేశారు. సంప్రదాయం ప్రకారం మతాధికారి పాత్రను పోషించిన గ్రీస్ నటి మేరీ మినా ఒలింపిక్ టార్చ్‌ను వెలిగించింది. మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉండడంతో పారాబోలిక్ మిర్రర్ నుంచికాకుండా ముందు రోజు రిహార్సల్ సందర్భంగా ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన అగ్ని నుంచి జ్యోతిని వెలిగించింది. తర్వాత ఈ జ్యోతిని తొలి టార్చ్ బేరర్‌గా వ్యవహరించిన టోక్యో క్రీడల స్వర్ణ విజేత అయిన గ్రీస్ రోయర్ స్టెఫనోస్ డౌస్కోకు అందించింది. జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని వీక్షించడానికి భారీ సంఖ్యలో వీక్షకులు హాజరయ్యారు. కాగా 11 రోజులపాటు గ్రీస్‌లో ఒలింపిక్ టార్చ్ రిలే జరగనుంది. ఆ తర్వాత ఓడలో పారిస్‌కు పయనం కానుంది. అయితే, ఒలింపిక్స్ ఆరంభోత్సవాన్ని స్టేడియంలో కాకుండా సెన్ నదిలో నిర్వహించేందుకు నిర్వాహకులు సన్నాహకాలు చేస్తున్నారు. కాగా జులై 26 నుంచి ఆగస్టు 11 వరకు జరిగే ఈ పోటీల 100 రోజుల కౌంట్‌డౌన్‌కు పారిస్ సిద్ధమైంది. నేటినుంచి ఈ క్రీడలకు ఇంకా 100 రోజుల సమయం ఉంది.

కాంస్య పోరులో ఓడిన రోహిత్

బిష్కెక్ (కిర్గిస్థాన్): ఆసియా చాంపియన్‌షిప్స్‌లో భారత గ్రీకో రోమన్ రెజ్లర్ రోహిత్ దహియా కాంస్య పతక పోరులో పరాజయం పాలయ్యాడు. మంగళవారం జరిగిన 82 కిలోల విభాగం బౌట్‌లో వరల్డ్ నెంబర్ వన్ రసులోవ్‌తో తలపడిన రోహిత్ పోరాడి ఓడాడు.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	7	6	1	0	12	0.677
కోల్‌కతా	6	4	2	0	8	1.399
చెన్నై	6	4	2	0	8	0.726
హైదరాబాద్	6	4	2	0	8	0.502
లఖ్‌నవూ	6	3	3	0	6	0.038
గుజరాత్	6	3	3	0	6	-0.637
పంజాబ్	6	2	4	0	4	-0.218
ముంబై	6	2	4	0	4	-0.234
ఢిల్లీ	6	2	4	0	4	-0.975
బెంగళూరు	7	1	6	0	2	-1.185

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

భళిరా..బట్లర్

సూపర్ సెంచరీతో సత్తా చాటిన జోష్
కోల్‌కతాకు నిరాశ
నరైన్ శతకం వృథా

224 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన రాజస్థాన్

కోల్‌కతా: ఐపీఎల్ తాజా సీజన్‌లో మరో అదిరిపోయే మ్యాచ్. 224 పరుగుల భారీ ఛేదనలో వరుసగా వికెట్లు నేలకూలుతున్నా.. ఓపెనర్ జోష్ బట్లర్ (60 బంతుల్లో 9 ఫోర్లు, 6 సిక్సర్లతో 107 నాటౌట్) వీరోచిత పోరాటం అబ్బురపరిచింది. ఒంట్లో నిస్సత్తువ ఆవరిస్తున్నా.. తుదికంటా నిలిచి, టెయిలెండర్ల అండతోనే అసాధ్యమనుకున్న విజయాన్ని రాజస్థాన్ రాయల్స్ ఖాతాలో వేశాడు బట్లర్. దీంతో ఈడెన్ గార్డెన్స్‌లో హ్యాట్రిక్ గెలుపు ఖాయమనుకున్న కోల్‌కతా నైట్‌రైడర్స్ షాక్‌లో మునిగింది. 2 వికెట్ల తేడాతో గెలిచిన ఆర్‌ఆర్ పట్టికలో అగ్రస్థానాన్ని పటిష్టం చేసుకుంది. అటు టీ20 కెరీర్‌లో తొలి సెంచరీ సాధించిన సునీల్ నరైన్ (56 బంతుల్లో 13 ఫోర్లు, 6 సిక్సర్లతో 109) షో వృథా అయ్యింది. మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా కోల్‌కతా 20 ఓవర్లలో 6 వికెట్లకు 223 పరుగులు చేసింది. రఘువంశీ (18 బంతుల్లో 5 ఫోర్లతో 30) రాణించాడు. అవేశ్, కుల్దీప్ సేన్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో రాజస్థాన్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 224 పరుగులు చేసి నెగ్గింది. రియాన్ పరాగ్ (14 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 34), పోవెల్ (13 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సర్లతో 26) కీలక ఇన్నింగ్స్ ఆడారు. నరైన్, వరుణ్, హర్షిత్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా బట్లర్ నిలిచాడు.

ఆఖర్లో మలుపు: భారీ ఛేదనలో రాజస్థాన్ అదరగొడుతూ కేకేఆర్‌కు విఎంచిన వేగంతో ఇన్నింగ్స్ ఆరంభమైంది. అయితే వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయిన వేళ ఓటమి ఖాయమనిపించింది. కానీ పట్టువదలని బట్లర్ మాత్రం ఆఖరి వరకు పోరాడి గెలిపించగా, పరాగ్ సహకరించాడు. ధనాధన్ ఇన్నింగ్స్‌తో జైస్వాల్ (19) రెండో ఓవర్‌లోనే వెనుదిరిగినా మూడు ఫోర్లు, ఓ సిక్సర్‌తో మెరిశాడు. ఇక కెప్టెన్ సంజూ శాంసన్ (12) స్వల్ప స్కోరుకే ఐదో ఓవర్‌లో వెనుదిరిగాడు. అయితే ఆరో ఓవర్‌లో రియాన్ 4,6,4.. బట్లర్ సిక్సర్‌తో 23 పరుగులు రావడంతో పవర్‌ప్లేలో ఆర్‌ఆర్ 76/2 స్కోరుతో పటిష్టంగా కనిపించింది. అలాగే మరో 6,4తో జోరు చూపిన పరాగ్‌ను హర్షిత్ అవుట్ చేయడంతో మూడో వికెట్‌కు 50 పరుగుల మెరుపు భాగస్వామ్యం ముగిసింది. పరాగ్ ఉన్నంత సేపు విజయం వైపు సాగిన జట్టు ఆ తర్వాత లయ తప్పింది. ధ్రువ్ జురెల్ (2) ఇలా వచ్చి అలా వెళ్లాడు. 8.2 ఓవర్లలోనే వంద పరుగులు సాధించిన వేళ బాధ్యతంతా బట్లర్‌పై పడింది. అటు అశ్విన్ (8), హిట్టర్ హెట్‌మయెర్ (0)లను రెండు బంతుల్లోనే స్పిన్నర్ వరుణ్ పెవిలియన్‌కు చేర్చాడు. పరుగులు నెమ్మదించిన వేళ 15వ ఓవర్‌లో బట్లర్ నాలుగు ఫోర్లతో 17 రన్స్ అందించాడు. అయినా 11-15 ఓవర్ల మధ్య 36 పరుగులే రావడంతో ఒత్తిడి పెరిగింది. ఈ దశలో పావెల్ వరుసగా 4,6,6తో వణికించినా నరైన్‌కు చిక్కాడు. కానీ 19వ ఓవర్‌లో బట్లర్ 6,4,6తో ఒక్కసారిగా రాయల్స్ పోటీలోకొచ్చింది. ఇక 6 బంతుల్లో 9 పరుగులు కావాల్సిన వేళ బట్లర్ తొలి బంతినే సిక్సర్‌గా మలవగా, సింగిల్స్ వద్దనుకోవడంతో సమీకరణం 3 బంతుల్లో 3 రన్స్‌కు మారింది. కానీ టెన్షన్ లేకుండా చివరి రెండు బంతుల్లో కావాల్సిన పరుగులు పూర్తి చేసిన బట్లర్ మ్యాచ్‌ను ముగించాడు.

నరైన్ శతక బాదుడు: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా ఇన్నింగ్స్‌లో ఓపెనర్ నరైన్ మరోసారి విశ్వరూపం చూపాడు. బౌలర్ ఎవరైనా మైదానం నలువైపులా చక్కటి షాట్లతో ఆకట్టుకుంటూ జట్టుకు భారీ స్కోరందించాడు. అతడికి యువ బ్యాటర్ రఘువంశీ చక్కగా సహకరించాడు. అయితే తొలి నాలుగు ఓవర్లలో రాజస్థాన్ బౌలర్లు ప్రభావం చూపడంతో 26 పరుగులే రాగా, మరో ఓపెనర్ సాల్ట్ (10) వికెట్‌ను సైతం కోల్పోయింది. కానీ ఐదో ఓవర్‌లో రఘువంశీ మూడు ఫోర్లతో 14 పరుగులు రాబట్టి పరుగుల వేగానికి తెర లేపాడు. దీన్ని నరైన్ కొనసాగిస్తూ తర్వాతి ఓవర్‌లోనే 6,4తో 16 రన్స్ సమకూర్చడంతో పవర్‌ప్లేలో కేకేఆర్ స్కోరు 56/1కి చేరుకుంది. ఇక ఆ తర్వాత నరైన్ దూకుడు మరింతగా పెరిగింది. ప్రతీ బౌలర్‌ను బాదేస్తూ సునాయాసంగా బౌండరీలు రాబట్టడంతో ఓవర్‌కు పది రన్‌రేట్‌తో స్కోరు దూసుకెళ్లింది. అటు 29 బంతుల్లోనే సునీల్ ఫిఫ్టీ కూడా పూర్తి చేసుకున్నాడు. ఈ ఇద్దరి ఆటతీరుకు పది ఓవర్లలోనే జట్టు స్కోరు వందకి చేరింది. అయితే 11వ ఓవర్‌లో రఘువంశీని కుల్దీప్ సేన్ అవుట్ చేయడంతో రెండో వికెట్‌కు 43 బంతుల్లో 85 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అటు నరైన్ మాత్రం 12వ ఓవర్‌లో 6,4,4తో చెలరేగాడు. కెప్టెన్ శ్రేయాస్ (11)ను స్పిన్నర్ చాహల్ ఎల్బీ చేయడంతో హిట్టింగ్ కోసం రస్సెల్‌ను ముందుగానే బరిలోకి దించారు. అయితే అతను షాట్లు ఆడడంలో ఇబ్బంది పడ్డాడు. మరో ఎండ్‌లో నరైన్ బ్యాట్‌కు పనిచెబుతూ 16వ ఓవర్‌లో వరుసగా 6,4,6,4 బాదగా 49 బంతుల్లోనే తొలి శతకాన్ని అందుకున్నాడు. డెత్ ఓవర్లలో ఆర్‌ఆర్ బౌలర్లు చకచకా వికెట్లు తీసి ఫర్వాలేదనిపించారు. 17వ ఓవర్‌లో రస్సెల్‌ను అవేశ్, ఆ తర్వాతి ఓవర్‌లో పేసర్ బౌల్ట్ చక్కటి యార్కర్‌తో నరైన్‌ను బౌల్డ్ చేశాడు. కానీ 19వ ఓవర్‌లో రింకూ (9 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సర్లతో 20 నాటౌట్) 6,4.. వెంకటేశ్ (8) ఫోర్‌తో 16 రన్స్ వచ్చాయి. ఆఖరి ఓవర్‌లో వెంకటేశ్ అవుట్ కాగా, కోల్‌కతా తొమ్మిది రన్స్‌తోనే సంతృప్తి చెందింది.



7 బట్లర్‌కిది ఓవరాల్‌గా ఏడో ఐపీఎల్ సెంచరీ. ఈ సీజన్‌లో రెండోది.

జోస్ బట్లర్ (60 బంతుల్లో 9 ఫోర్లు, 6 సిక్సర్లతో 107 నాటౌట్)

1 గతంలో (2020లో పంజాబ్‌పై) తమ పేరిటే ఉన్న రికార్డు ఛేదనను సమం చేసిన రాజస్థాన్.



నరైన్ (56 బంతుల్లో 109)

నరైన్‌కు ఇది టీ20 కెరీర్‌లోనే తొలి సెంచరీ

ఐపీఎల్‌కు మ్యాక్స్‌వెల్ దూరం

బెంగళూరు: రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ ఐపీఎల్ నుంచి తప్పుకొంటున్నట్టు ప్రకటించాడు. మానసికంగా, శారీరకంగా విశ్రాంతి తీసుకునేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపాడు. ఈ సీజన్‌లో ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో అతను చేసింది కేవలం 32 పరుగులే. ఇందులో మూడు డకౌట్లున్నాయి. అందుకే సోమవారం సన్‌రైజర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కూడా మాక్సీ ఆడలేదు. తన స్థానంలో మరో ఆటగాడిని తీసుకోవాలని కెప్టెన్ డుప్లెసికి చెప్పాడట. అయితే గత నవంబరు నుంచి మ్యాక్సీ ఆడిన 17 అంతర్జాతీయ టీ20ల్లో 552 పరుగులతో భీకర ఫామ్‌లోనే ఉన్నా, ఐపీఎల్‌లో మాత్రం ఘోరంగా విఫలమయ్యాడు.



పాండ్యాపై కీలక నిర్ణయం!

రోహిత్, ద్రవిడ్, అగార్కర్ భేటీ

న్యూఢిల్లీ: టీ20 వరల్డ్‌కప్‌లో పాల్గొనే భారత జట్టు ఎంపికపై సెలెక్టర్లు సమాలోచనలు ఆరంభించినట్టు సమాచారం. ఇటీవలే బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్, కోచ్ రాహుల్ ద్రవిడ్‌లతో రోహిత్ శర్మ సమావేశమైనట్టు తెలిసింది. ఈ సందర్భంగా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా విషయంలో కీలక నిర్ణయం తీసుకొన్నారట. ఐపీఎల్‌లో ఎలా బౌలింగ్ చేస్తాడనే దానిపైనే పాండ్యాకు జట్టులో చోటు కల్పించాలన్న నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. పాండ్యా.. ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో 11 ఓవర్లు వేసి మూడు వికెట్లు మాత్రమే పడగొట్టాడు.

నేటి మ్యాచ్

రాత్రి 7.30 గం.

గుజరాత్ X ఢిల్లీ

ఇప్పటికి వీరే..

పరుగులు	వికెట్లు
విరాట్ కోహ్లి (బెంగళూరు)	చాహల్ (రాజస్థాన్)
361 పరుగులు	12 వికెట్లు




స్కోరుబోర్డు

కోల్‌కతా: సాల్ట్ (సి అండ్ బి) అవేశ్ 10, నరైన్ (బి) బౌల్ట్ 109, రఘువంశీ (సి) అశ్విన్ (బి) కుల్దీప్ సేన్ 30, శ్రేయాస్ (ఎల్బీ) చాహల్ 11, రస్సెల్ (సి) జురెల్ (బి) అవేశ్ 13, రింకూ (నాటౌట్) 20, వెంకటేశ్ (సి) జురెల్ (బి) కుల్దీప్ సేన్ 8, రమణ్‌దీప్ (నాటౌట్) 1, ఎక్స్‌ట్రాలు: **21; మొత్తం: 20 ఓవర్లలో 223/6; వికెట్ల పతనం:** 1-21, 2-106, 3-133, 4-184, 5-195, 6-215; **బౌలింగ్:** బౌల్ట్ 4-0-31-1, అవేశ్ ఖాన్ 4-0-35-2, కుల్దీప్ సేన్ 4-0-46-2, చాహల్ 4-0-54-1, అశ్విన్ 4-0-49-0.

రాజస్థాన్: జైస్వాల్ (సి) వెంకటేశ్ (బి) అరోరా 19, బట్లర్ (నాటౌట్) 107, శాంసన్ (సి) నరైన్ (బి) హర్షిత్ 12, రియాన్ (సి) రస్సెల్ (బి) హర్షిత్ 34, ధ్రువ్ జురెల్ (ఎల్బీ) నరైన్ 2, అశ్విన్ (సి) రఘువంశీ (బి) వరుణ్ 8, హెట్‌మయెర్ (సి) శ్రేయాస్ (బి) వరుణ్ 0, పావెల్ (ఎల్బీ) నరైన్ 26, బౌల్ట్ (రనౌట్) 0, అవేశ్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 16; మొత్తం: 20 ఓవర్లలో 224/8; వికెట్ల పతనం:** 1-22, 2-47, 3-97, 4-100, 5-121, 6-121, 7-178, 8-186; **బౌలింగ్:** స్టార్క్ 4-0-50-0, వైభవ్ అరోరా 3-0-45-1, హర్షిత్ 4-0-45-2, నరైన్ 4-0-30-2, వరుణ్ 4-0-36-2, రస్సెల్ 1-0-17-0.

రెండో స్థానానికి గుకేష్



టొరంటో: క్యాండిడేట్స్ చెస్‌లో నెపోమ్నియాచి (రష్యా)తో జరిగిన పదో రౌండ్ గేమ్‌ను భారత జీఎం గుకేష్ డ్రా చేసుకున్నాడు. ఈ రౌండ్ అనంతరం ఇరువురు 6 పాయింట్లతో సమానంగా నిలిచినా, మెరుగైన టైబ్రేక్ స్కోరుతో నెపో టాప్‌లో, గుకేష్ రెండో స్థానంలో ఉన్నారు. ప్రజ్ఞానంద-విదిత్, హంపి-టాన్ జాంగీ (చైనా) మధ్య గేమ్‌లు డ్రాగా ముగియగా, సాలిమోవా (బల్గేరియా) చేతిలో వైశాలి ఓటమిపాలైంది. ప్రజ్ఞానంద 5వ, విదిత్ 6వ స్థానంలో.. మహిళల్లో హంపి 5వ వైశాలి, 8వ స్థానాల్లో కొనసాగుతున్నారు.

వడ్డీ రేట్ల తగ్గింపు ఇప్పట్లో లేనట్టే

మోర్గాన్ స్టాన్లీ ఇండియా

న్యూఢిల్లీ: దేశంలో కీలక వడ్డీ రేట్లు ఇప్పట్లో తగ్గే సూచనలు కనిపించడం లేదు. అసలు ఈ ఆర్థిక సంవత్సరం (2024-25)లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక రెపో రేటును ప్రస్తుత 6.5 శాతం నుంచి తగ్గించే అవకాశమే లేదని బ్రోకరేజీ సంస్థ మోర్గాన్ స్టాన్లీ ఇండియా తన తాజా నివేదికలో తెలిపింది. జీడీపీ వృద్ధి రేటు జోరు మీద ఉండడం, అమెరికా కేంద్ర బ్యాంక్ 'ఫెడ్ రిజర్వ్' జూన్‌లో కూడా కీలక వడ్డీ రేట్లు తగ్గించే అవకాశం లేకపోవడం ఇందుకు ప్రధాన కారణమని మోర్గాన్ స్టాన్లీ ఇండియా ప్రధాన ఆర్థికవేత్త ఉపాసన చక్ర, ఆర్థికవేత్త బనీ గంబీర్ తమ నివేదికలో పేర్కొన్నారు. ఈ రెండు కారణాలతో ప్రస్తుత అధిక రెపో రేటు కొనసాగించడమే మేలని ఆర్‌బీఐ భావిస్తున్నట్టు వీరు తెలిపారు. అమెరికాలోనూ ప్రస్తుతం ద్రవ్యోల్బణం అధికంగా ఉండటంతో పాటు వృద్ధి రేటు కూడా అధికంగా ఉన్న విషయాన్ని వారు గుర్తు చేశారు.

ఈ ఏడాది వృద్ధి 6.8 శాతం

అంచనాలు పెంచిన ఐఎంఎఫ్

న్యూఢిల్లీ: అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) 2024 సంవత్సరంలో భారత వృద్ధి రేటు అంచనాను జనవరిలో ప్రకటించిన 6.5 శాతం నుంచి 6.8 శాతానికి పెంచింది. వస్తు సేవలకు అంతర్గత డిమాండ్ బలంగా ఉండడంతో పాటు పనిచేసే వయసులోని జనాభా పెరగడం ఇందుకు కారణమని తాజా నివేదికలో తెలిపింది. ఈ వృద్ధి రేటుతో భారత్ ప్రపంచంలోనే వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ కొనసాగుతుందని కూడా పేర్కొంది. చైనా వృద్ధి 4.6 శాతంగా అంచనా వేసింది. అయితే వర్ధమాన ఆసియా ఆర్థిక వ్యవస్థల్లో వృద్ధి రేటు 2023 సంవత్సరంలోని 5.6 శాతం నుంచి ఈ ఏడాది 5.2 శాతానికి, 2025 నాటికి 4.9 శాతానికి తగ్గుతుందని అంచనా వేసింది. ప్రపంచ వృద్ధి కూడా 2023 నాటి 3.2 శాతం స్థాయిలోనే కొనసాగవచ్చని పేర్కొంది.

రెండేళ్లలో రూ.1,000 కోట్ల టర్నోవర్

ది స్లీప్ కంపెనీ టార్గెట్

హైదరాబాద్: కంఫర్ట్- టెక్ బ్రాండ్, స్లీపింగ్ సొల్యూషన్స్ సంస్థ ది స్లీప్ కంపెనీ.. దేశవ్యాప్తంగా కార్యకలాపాలు విస్తరించేందుకు సిద్ధమవుతోంది. కార్యకలాపాల విస్తరణలో భాగంగా కంపెనీ హైదరాబాద్‌లో 75వ స్టోర్‌ను ప్రారంభించింది. ఈ సందర్భంగా ది స్లీప్ కంపెనీ సహ వ్యవస్థాపకురాలు ప్రియాంక సలోట్ మాట్లాడుతూ.. వచ్చే ఏడాది కాలంలో మొత్తం స్టోర్ల సంఖ్యను 200కు చేర్చాలని నిర్ణయించినట్లు చెప్పారు. మెట్రో నగరాలతో పాటు ద్వితీయ శ్రేణి నగరాల్లో ఈ స్టోర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కంపెనీ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 12 స్టోర్లను నిర్వహిస్తోందని, ఇందులో 8 స్టోర్లు హైదరాబాద్‌లో ఉండగా మిగిలిన స్టోర్లు విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, వరంగల్ నగరాల్లో ఉన్నాయన్నారు. విస్తరణలో భాగంగా వచ్చే ఏడాది మార్చి నాటికి తెలుగు రాష్ట్రాల్లో కొత్తగా 16 స్టోర్లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రియాంక వెల్లడించారు. దేశీయ మ్యాట్రెసెస్ మార్కెట్ రూ.16,000 కోట్లుగా ఉండగా అందులో బ్రాండెడ్ కంపెనీల వాటా రూ.6,000 కోట్లుగా ఉందన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ టర్నోవర్ రూ.360 కోట్లుగా ఉందని, వచ్చే రెండేళ్ల కాలంలో ఇది రూ.1,000 కోట్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్లు ప్రియాంక తెలిపారు. కాగా కంపెనీ మొత్తం రెవెన్యూలో తెలుగు రాష్ట్రాల వాటా 15 శాతంగా ఉందని పేర్కొన్నారు.

కిమ్స్ అనుబంధ సంస్థకు ఐటీ నోటీస్

రూ.307 కోట్లు చెల్లించాలని డిమాండ్

హైదరాబాద్: కిమ్స్ హాస్పిటల్ అనుబంధ సంస్థ స్పానవీ మెడిసెర్చ్ లైఫ్‌సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఆదాయ పను (ఐటీ) శాఖ నుంచి రూ.306.97 కోట్ల పన్ను చెల్లింపు కోసం డిమాండ్ నోటీసు అందింది. 2022-23 అసెస్‌మెంట్ సంవత్సరానికి సంబంధించి ఈ డిమాండ్ నోటీస్ అందుకున్నట్లు కిమ్స్ తెలిపింది. సంబంధిత అసెస్‌మెంట్ ఇయర్‌లో కంపెనీ అందుకున్న షేర్ క్యాపిటల్, షేర్ ప్రీమియం వివరాలు, అన్‌సెక్యూర్డ్ లోన్ చెల్లింపు వివరాలు సరిగా సమర్పించక పోవడంతో ఈ నోటీస్ అందినట్లు కిమ్స్ హాస్పిటల్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలిపింది. ఆ అసెస్‌మెంట్ ఇయర్‌లో స్పానవీ తమ అనుబంధ సంస్థ కాకపోవడంతో, ఈ పన్ను డిమాండ్ నోటీస్ ప్రభావం తమపై ఏ మాత్రం పడదని కిమ్స్ హాస్పిటల్ తెలిపింది.

22న మోదీతో మస్క్ భేటీ!

అనంతరం టెస్లా ఎంట్రీపై ప్రకటన



న్యూఢిల్లీ: ఈ నెల 21న భారత్‌కు రానున్న ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్.. ఆ మరుసటి రోజున (22) ప్రధాని మోదీతో భేటీ కానున్నారని సీనియర్ ప్రభుత్వాధికారి ఒకరు తెలిపారు. అనంతరం తన విద్యుత్ కార్ల కంపెనీ టెస్లా భారత ప్రవేశంపై మస్క్ అధికారిక ప్రకటన చేయవచ్చన్నారు. అయితే, టెస్లా ప్లాంట్‌ను ఎక్కడ ఏర్పాటు చేయబోతున్నదన్న విషయంపై స్పష్టత రాకపోవచ్చన్నారు. ఎందుకంటే, ఈ విషయాన్ని ప్రకటించేందుకు టెస్లా బోర్డు అనుమతి అవసరం. అది ఇప్పటికిప్పుడే సాధ్యపడకపోవచ్చని సీనియర్ అధికారి పేర్కొన్నారు.

టెస్లా వంటి అంతర్జాతీయ ఈవీ కంపెనీలకు మార్గం సుగమం చేసేందుకు గత నెలలో కేంద్ర ప్రభుత్వం కొత్త ఈవీ పాలసీని ప్రకటించింది. కనీసం 50 కోట్ల డాలర్ల (సుమారు రూ.4,150 కోట్లు) పెట్టుబడితో భారత్‌లో ఈవీల ప్లాంట్‌ను ఏర్పాటు చేసే గ్లోబల్ కంపెనీలకు ప్రభుత్వం దిగుమతి సుంకం రాయితీలు కల్పించనుంది. కంపెనీకి అనుమతి మంజూరు చేసిన తేదీ నుంచి ఐదేళ్ల వరకు 35,000 డాలర్లు (రూ.29 లక్షలు) అంతకు పైగా విలువ చేసే కార్లను 15 శాతం కస్టమ్స్ సుంకం చెల్లించి దిగుమతి చేసుకునేందుకు అనుమతించనున్నారు. ప్రస్తుతం కంప్లీట్లీ బిల్ట్ యూనిట్ (సీబీయూ) కార్ల దిగుమతిపై చెల్లించాల్సిన కస్టమ్స్ సుంకం.. ఇంజన్ సైజు, ధర, బీమా, రవాణా విలువ ఆధారంగా 70-100 శాతం స్థాయిలో ఉంది.

పరిశీలనలో స్టార్‌లింక్ దరఖాస్తు

టెస్లాతో పాటు తన శాటిలైట్ ఆధారిత ఇంటర్నెట్ సర్వీస్ కంపెనీ స్టార్‌లింక్ సేవల ప్రారంభంపైనా మస్క్ ప్రకటన చేయవచ్చన్న అంచనాలున్నాయి. భారత్‌లో శాట్‌కామ్ సేవలను ప్రారంభించేందుకు అనుమతి కోరుతూ స్టార్‌లింక్ సమర్పించిన దరఖాస్తు ప్రస్తుతం పరిశీలన దశలో ఉందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కంపెనీ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులతో పాటు ఇతర ఆర్థిక ప్రతిపాదనలు టెలికాం, సమాచార సేవల శాఖ నిబంధనలకు అనుగుణంగానే ఉన్నాయని, ప్రస్తుతం భద్రత పరమైన అంశంపై గృహ మంత్రిత్వ శాఖ సమీక్ష జరుగుతోందన్నారు. మస్క్ భారత పర్యటనకు ముందే (ఈ వారాంతంలోగా) స్టార్‌లింక్‌కు అనుమతి మంజూరు చేసే అవకాశాలు అధికంగా ఉన్నాయి. దేశంలో లోక్‌సభ ఎన్నికలు జరగనున్న తరుణంలో.. మళ్లీ ఎన్‌డీయేనే అధికారం రావచ్చన్న అంచనాలున్న నేపథ్యంలో మస్క్ భారత పర్యటన రాజకీయంగానూ ప్రాధాన్యం సంతరించుకుంది.

'టాటా'తో టెస్లా డీల్

సెమీకండక్టర్ల (చిప్‌లు) సమీకరణ కోసం టాటా ఎలక్ట్రానిక్స్‌తో టెస్లా వ్యూహాత్మక ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిసింది. ఈ రెండు కంపెనీల మధ్య ఒప్పందం కొన్ని నెలల క్రితమే జరిగిందని, టెస్లా తన సరఫరాదారుల వివరాలను రహస్యంగా ఉంచుతుందని ఓ ఆంగ్ల దిన పత్రిక కథనం పేర్కొంది. కొవిడ్ సంక్షోభం తర్వాత కార్ల తయారీకి అవసరమైన విడిభాగాలు, ఇతర పరికరాల సమీకరణ విషయంలో టెస్లా వ్యూహాన్ని మార్చుకుంది. కేవలం చైనాపైనే ఆధారపడకుండా ఇతర దేశాల కంపెనీల నుంచీ వీటిని సమీకరిస్తోంది. అందులో భాగంగానే టాటా ఎలక్ట్రానిక్స్‌తో ఒప్పందం జరిగినట్లు సమాచారం. కాగా, టెస్లాకు భారత్‌లో ఇప్పటికే కనీసం 8 మంది సరఫరాదారులున్నారని, సంవర్ధన మదర్సన్ ఇంటర్నేషనల్, సుప్రజిత్ ఇంజనీరింగ్, సోనా బీఎల్‌డబ్ల్యూ ప్రెసిషన్ ఫోర్జింగ్స్, వర్రోక్ ఇంజనీరింగ్, బాష్ లిమిటెడ్, హిండాల్కో ఇండస్ట్రీస్, గుడ్‌లక్ ఇండియా, వాలియంట్ కమ్యూనికేషన్స్ ఈ జాబితాలో ఉన్నట్లు తెలిసింది. భారత సరఫరాదారుల నుంచి టెస్లా ఏటా 100-200 కోట్ల డాలర్ల విలువైన వాహన పరికరాలు, ఇతర ఉత్పత్తులను సేకరిస్తోందన్న అంచనాలున్నాయి.

3 రోజుల్లో రూ. 8 లక్షల కోట్లు ఫట్

- భారీగా తరిగిన మార్కెట్ సంపద
- సెన్సెక్స్ మరో 456 పాయింట్లు డౌన్

ముంబై: ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య ఉద్రిక్తతతో పాటు అంతర్జాతీయ మార్కెట్లో బలహీన ట్రెండ్ నేపథ్యంలో భారత స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా మూడో రోజూ నష్టపోయాయి. ఐటీ షేర్లలో అమ్మకాలు, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల ఉపసంహరణ కారణంగా మంగళవారం సెన్సెక్స్ మరో 456.10 పాయింట్లు క్షీణించి 72,943.68 వద్దకు జారుకుంది. ఒకదశలో సూచీ 714.75 పాయింట్ల మేర పతనమైనప్పటికీ, చివర్లో మళ్లీ కోలుకుంది. నిఫ్టీ విషయానికొస్తే, 124.60 పాయింట్ల నష్టంతో 22,147.90 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లోని 30 లిస్టెడ్ కంపెనీల్లో 23 నష్టపోగా.. ఇన్ఫోసిస్ షేరు 3.65 శాతం పతనమై సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. బీఎస్ఈలోని ఐటీ, టెక్ సూచీలు రెండు శాతానికి పైగా క్షీణించాయి. కాగా, గడిచిన మూడు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 2,094.47 పాయింట్లు (2.79 శాతం) నష్టపోయింది. దాంతో ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ 3 రోజుల్లో రూ.7.93 లక్షల కోట్లకు పైగా తగ్గి రూ.394.26 లక్షల కోట్లకు (4.75 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది.

ఐపీఓకు నెఫ్రో కేర్: హెచ్‌డీఎఫ్‌సీ మాజీ చైర్మన్ దీపక్ పరేఖ్ సహా పలువురు కార్పొరేట్ ప్రముఖుల పెట్టుబడులు కలిగిన కిడ్నీ సంరక్షణ సేవల సంస్థ నెఫ్రో కేర్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కు రాబోతోంది. ఇందుకోసం ఎన్ఎస్ఈలోని స్మాల్, మీడియం కంపెనీ లిస్టింగ్ వేదికైన ఎన్ఎస్ఈ ఎమర్జ్‌కు ప్రాథమిక ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఐపీఓ ద్వారా 45.84 లక్షల తాజా ఈక్విటీ షేర్ల జారీ ద్వారా సమీకరించే నిధులతో కోల్‌కతాలో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఏర్పాటు చేయనున్నట్లు కంపెనీ వెల్లడించింది.

రికార్డు కనిష్ఠానికి రూపాయి: భారత కరెన్సీ విలువ రికార్డు కనిష్ఠ స్థాయికి పతనమైంది. ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 17 పైసలు క్షీణించి 83.61 వద్ద ముగిసింది. ఈ మార్చి 22న కూడా డాలర్-రూపీ మారకం రేటు ఇదే స్థాయి వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా మిగతా కరెన్సీలతోనూ పోల్చినా డాలర్ బలపడటం తోపాటు అంతర్జాతీయ ప్రతికూలతలు, మన ఈక్విటీ మార్కెట్లో నష్టాలు, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు తరలిపోవడం వంటి అంశాలు ఇందుకు కారణమయ్యాయి.

నేడు మార్కెట్లకు సెలవు

శ్రీరామ నవమి సందర్భంగా బుధవారం (17వ తేదీ) స్టాక్ ఎక్స్ఛేంజీలైన బీఎస్ఈ, ఎన్ఎస్ఈలకు సెలవు. మళ్లీ గురువారం (18న) మార్కెట్లు యధావిధిగా పనిచేస్తాయి.

సరికొత్త కార్టన్ ప్యాక్స్‌లో 'హెరిటేజ్' ఉత్పత్తులు


హైదరాబాద్: హెరిటేజ్ ఫుడ్స్ పానీయాలు సరికొత్త కార్టన్ ప్యాక్స్‌లో లభించనున్నాయి. ఇందుకోసం కంపెనీ ఎస్ఐజీ అనే కంపెనీకి చెందిన అధునాతన టెక్నాలజీని అందుకుంటోంది. ఇప్పటికే ఈ టెక్నాలజీ మెషిన్లను హెరిటేజ్ ఫుడ్స్ తన మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని ప్లాంట్‌లో ఉపయోగిస్తోంది. ఈ అధునాతన మెషిన్ సాయంతో గంటకు 12,000 ప్యాక్స్‌లో పానీయాలు నింపవచ్చు. ఒకేసారి వివిధ రకాల సైజుల ప్యాక్స్‌లో పానీయాలు నింపడం ఈ మెషిన్ ప్రత్యేకత. ఈ మెషిన్ ద్వారా నింపే ప్యాక్స్‌లో సూక్ష్మ జీవులుగానీ, క్రిమి కీటకాలుగానీ చొరబడలేవని హెరిటేజ్ ఫుడ్స్ తెలిపింది.

కీపాయింట్ టెక్నాలజీ ప్రొడక్ట్‌కు పేటెంట్

హైదరాబాద్: కీపాయింట్ టెక్నాలజీస్ కంపెనీ అభివృద్ధి చేసిన కాంటెక్స్చువల్ డిస్కవరీ టెక్నాలజీకి భారత పేటెంట్ కార్యాలయం (ఐపీఓ) పేటెంట్ మంజూరు చేసింది. ఇది తమ కంపెనీ చరిత్రలో ప్రధాన మైలురాయి అని కంపెనీ తెలిపింది. కీపాయింట్ టెక్నాలజీస్ ఇప్పటికే కృత్రిమ మేధ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్), ఎన్ఎల్‌పీ, ఇన్‌పుట్, లాంగ్వేజ్ టెక్నాలజీ రంగాల కోసం అనేక పేటెంటెడ్ ప్రొడక్ట్స్‌ను అభివృద్ధి చేసింది. కాంటెక్స్చువల్ డిస్కవరీ టెక్నాలజీతో తమ పేటెంటెడ్ ప్రొడక్ట్స్ సంఖ్య 39కి చేరినట్టు తెలిపింది.

అంచనాలు మించిన చైనా వృద్ధి రేటు

బీజింగ్: మార్చితో ముగిసిన తొలి త్రైమాసికంలో చైనా జీడీపీ వృద్ధి రేటు అంచనాలను మించి వృద్ధి చెందింది. ఈ కాలానికి జీడీపీ ఐదు శాతం వృద్ధి చెందాలని చైనా ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయిస్తే 5.3 శాతం వృద్ధి రేటు నమోదు చేసినట్టు చైనా గణాంకాల బ్యూరో (ఎన్‌బీఎస్) తెలిపింది. స్థిరాస్తి రంగం కుప్పకూలి, దేశీయ డిమాండ్ అంతంత మాత్రంగానే ఉన్నా, చైనా జీడీపీ వృద్ధి రేటు అంచనాలు మించి పెరగడం విశేషం.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	74,130 ▲	67,950 ▲	90,500 ▲
ముంబై	73,302 ▲	67,145 ▲	83,213 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

17వ తేదీ



హైదరాబాద్	405	విజయవాడ	404
చిత్తూరు	483	విశాఖపట్నం	419
గోదావరి	404	వరంగల్	407
		డజను గుడ్లు రూ.60	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	128	గోదావరి	129
వరంగల్	128	విజయవాడ	129
కరీంనగర్	128	గుంటూరు	129
మహబూబ్‌నగర్	128	ఒంగోలు	129
కర్నూలు	128	చిత్తూరు	132
విశాఖపట్నం	116		

జగన్‌కు ఏమని చెప్పావ్ అవినాశ్?

- వివేకాది గుండెపోటు అని చెప్పావా?
- హత్యకు గురయ్యారని చెప్పావా?
- హత్య అంటే డీజీపీని జగన్ అలర్ట్ చేయాలి కదా
- వివేకా కుమార్తె వైఎస్ సునీత వ్యాఖ్యలు



కడప, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): "మీ ఫోన్ తీసుకెళ్లి సీబీఐకి ఇవ్వండి. కడిగిన ముత్యంలా బయటకు వస్తారు కదా. తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె కవిత తన ఫోన్లను దర్యాప్తు సంస్థకు అప్పగించారు. మీ ఫోన్ ఇచ్చేదానికి ఏమైంది?" అని మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు నిందితుడు, కడప ఎంపీ అవినాశ్ రెడ్డిని వైఎస్ సునీత ప్రశ్నించారు. మంగళవారం సాయంత్రం ఆమె కడపలో మీడియా సమావేశంలో మాట్లాడారు. "జగన్‌కు అవినాశ్ ఏమని చెప్పాడు? గుండెపోటుతో వివేకానందరెడ్డి చనిపోయారని చెబితే.. అక్కడి దృశ్యం చూస్తే ఆయన గుండెపోటుతో చనిపోలేదని ఎవరికైనా తెలుస్తుంది? ఒకవేళ హత్య అని చెబితే వెంటనే ఆయన డీజీపీని ఎందుకు అప్రమత్తం చేయలేదు?" అని సునీత ప్రశ్నించారు. తనకు ఈర్ష్య అంటున్నారని, అవినాశ్ రెడ్డితో పెద్ద పరిచయం లేని తనకు ఆయనపై ఎందుకు ఈర్ష్య ఉంటుందని ఆమె ప్రశ్నించారు. "నేను 2008లో అమెరికా నుంచి వచ్చాను. ఇక్కడ స్పెషలిస్టుగా పనిచేస్తున్నాను. నాకు రాజకీయ ఆసక్తులు లేవు. అలాంటప్పుడు ఈర్ష్య ఎందుకు ఉంటుంద"న్నారు. వైఎస్ వివేకా హత్య కేసు రాజకీయంగా వెళ్లకుండా ఉంటే ఒక హెడ్‌కానిస్టేబుల్ పరిష్కరించే కేసు అని, అన్ని ఆధారాలు ఉన్నా ఐదేళ్లు కావస్తున్నా రాజకీయ నేతల వల్ల ఇప్పటికీ పోరాడాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. "వైఎస్ వివేకా తమ కోసం చాలా కృషి చేశారని అవినాశ్ రెడ్డి అన్నారు. వివేకా అంత దారుణంగా హత్యకు గురైతే ఆయన సంగతి, ఆయన కుటుంబం పరిస్థితి ఏమిటని ఎప్పుడైనా అడిగారా? పోలీసుల వద్దకెళ్లి కేసు గురించి ఆరా తీశారా? ఢిల్లీకి అన్నిసార్లు వెళుతుంటారు కదా.. ఒక్కసారైనా సీబీఐ ఆఫీసుకు పోయి వివేకా కేసు గురించి మాట్లాడారా? ఆయన గురించి ఒక్కరోజైనా మంచిగా జగన్ పత్రికలో రాశారా?" అని ప్రశ్నించారు. "వివేకాకు ఆస్తుల సమస్య లేదు. ఆయన ఆఖరి కోరిక షర్మిలను ఎంపీగా చేయడమే. వివేకా హత్య విషయంలో నాకంటే ముందే పులివెందుల ప్రజలందరికీ తెలుసు. కానీ, అవినాశ్‌రెడ్డి ఏమీ తెలియనట్లు ఉంటారు. ఆయన వెనుక ఇంత కుట్ర ఉంటుందని నాకు తెలియదు" అని సునీత అన్నారు.

ఎవరితో మాట్లాడినా రాజకీయమేనా?

"ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ నేను ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ సతీమణి చనిపోతే ఆయన ఇంటికి వెళ్లానని చెబుతున్నారు. అవును.. ఆమె నా పేషెంట్ కాబట్టే వెళ్లాను. సజ్జల వాళ్ల అన్న కూడా చనిపోయారు.. అదేవిధంగా వాళ్ల ఇంటికి వెళ్లాను.. అది ఆయనకు గుర్తుకు రాలేదు. డాక్టర్ ఈసీ గంగిరెడ్డి చనిపోయినపుడు భారతిని కూడా కలిశాను.. అది గుర్తుకు రాలేదా? ఇది మానవత్వానికి సంబంధించింది" అని వైఎస్ సునీత పేర్కొన్నారు.

ఏపీలో 'మద్యం మాస్టర్' వాసుదేవ రెడ్డిపై వేటు

బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీని పక్కకు తప్పించాలని ఈసీ ఆదేశం

(అమరావతి-ఆంధ్రజ్యోతి): ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డిపై ఎన్నికల కమిషన్ బదిలీ వేటువేసింది. ఆది నుంచీ జగన్ సేవలో తరిస్తూ.. ఎన్నికల వేళ మరింత బరితెగిస్తున్న ఆయనకు షాక్ ఇచ్చింది. కొత్త ఎండీ నియామకా నికి వీలుగా ముగ్గురు ఐఏఎస్‌ల పేర్లు ప్రతిపాదించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించడం గమనార్హం. వాసుదేవ రెడ్డి ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీసు అధికారి. తాను అధికారంలోకి వచ్చిన వెంటనే జగన్ ఏరికోరి ఆయనను రాష్ట్రానికి డిప్యుటేషన్‌పై తీసుకొచ్చారు. కీలకమైన మద్యం అమ్మకాల బాధ్యత తను ఆయన చేతుల్లో పెట్టారు. అంతే.. ఆ రోజు నుంచి జగన్ ఆదేశాలే శిరోధార్యంగా వాసుదేవ రెడ్డి వ్యవహరిస్తున్నారు. ఆయన బేవరేజెస్ కార్పొరేషన్ పనితీరును మార్చేశారు. మద్యం వ్యాపారంపై జగన్ మార్కు వేయించారు. కోడ్ అమల్లోకి వచ్చాక ఎన్నికలు సమీపిస్తున్న వేళ వైసీపీ శ్రేణులకు మద్యం ధారాళంగా అందేలా చేయడంలోనూ ఆయన కీలక పాత్ర పోషించారు. ఎన్నికల్లో ప్రభావం చూపే కీలకమైన మద్యాన్ని వాసుదే వరెడ్డి అధికార పార్టీకి అడిగినంత ఇస్తున్నారంటూ ఇటీవల ప్రతిపక్షాలు ఈసీకి ఫిర్యాదు చేశాయి. దీనిపై ఎన్నికల కమిషన్ స్పందించింది. ఆయనను పక్కకు తప్పించాలని ఆదేశించింది. దీంతో.. ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీగా వాసుదేవ రెడ్డిని తప్పిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. సాధారణ పరిపాలన విభాగంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు.

కేసీఆర్ నివాసం వద్ద క్షుద్రపూజలు

బంజారాహిల్స్ ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి):బంజారాహిల్స్‌లోని మాజీ సీఎం కేసీఆర్ నివాసం పక్కన క్షుద్రపూజలు జరిగినట్లు ఆనవాళ్లు లభించాయి. కేసీఆర్ ఇంటి పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో ఓ బొమ్మ, ఎర్రటి వస్త్రం, నిమ్మకాయలు, వెంట్రుకలు కనిపించాయి. రోడ్డు నంబరు 14 నందినగర్‌లో కేసీఆర్ నివాసం ఉంది. భవనం పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో మంగళవారం ఉదయం కొంత మంది పిల్లలు ఆడుకుంటుండగా బొమ్మ, ఇతర వస్తువులను గుర్తించి, విషయాన్ని తమ కుటుంబసభ్యులకు చెప్పారు. వారిచ్చిన సమాచారం మేరకు బంజారాహిల్స్ పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి ఆధారాలు సేకరించారు. సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు. ఆకతాయిల పనా? లేదంటే ఎవరైనా ఉద్దేశపూర్వకంగా చేశారా? అనే కోణంలో విచారణ చేస్తున్నారు.

ముదిరాజులను బీసీ ఏలో చేర్చొద్దు

- సీఎం తన ప్రకటనను వెనక్కితీసుకోవాలి
- బీసీ ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ముదిరాజులను బీసీ ఏలో చేర్చవద్దని బీసీ ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి కోరింది. ముదిరాజులను బీసీ ఏలో చేరుస్తామన్న సీఎం రేవంత్.. తన ప్రకటనను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసింది. బీసీ ఏ జాబితాలో ముదిరాజులను చేరిస్తే సుమారు 57 కులాలకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంత రామన్ కమిషన్ ఎన్నో సర్వేలు చేసిన తర్వాతే బీసీ ఏ,బీ,సీ,డీ వర్గాలుగా విభజించిందని గుర్తు చేశారు. మీడియాతో మాట్లాడిన వారిలో సంఘం గౌరవ అధ్యక్షుడు, ప్రొఫెసర్ భాగయ్య, ప్రధాన కార్యదర్శి ముత్యాల నర్సింహులు తదితరులు ఉన్నారు.

నా సస్పెన్షన్ చెల్లదు!

- గత ఆరోపణలు చట్ట విరుద్ధమన్న సుప్రీం
- మళ్లీ అలాంటి ఆరోపణలతోనే సస్పెండ్ చేశారు
- తన సస్పెన్షన్‌పై క్యాట్‌లో ఏబీవీ వాదనలు

హైదరాబాద్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): తన సస్పెన్షన్ చట్ట విరుద్ధమని ఒకసారి సుప్రీంకోర్టు చెప్పిన తర్వాత మళ్లీ అవే ఆరోపణలతో రెండోసారి కూడా తనను సస్పెండ్ చేశారని ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు(ఏబీవీ) పేర్కొన్నారు. రెండోసారి తనను సస్పెండ్ చేస్తూ ఏపీ ప్రభుత్వ తీసుకున్న నిర్ణయాన్ని హైదరాబాద్‌లోని సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్(క్యాట్)లో ఆయన సవాల్ చేశారు. ఈ నేపథ్యంలో ఏబీవీ పిటిషన్‌పై మంగళవారం విచారణ జరిగింది. పిటిషనర్ ఏబీవీ తరఫున సీనియర్ న్యాయవాది ఆదినారాయణరావు వాదనలు వినిపించారు. ప్రభుత్వం దాఖలు చేసిన లిఖిత పూర్వకవాదనల్లో వాస్తవ విరుద్ధమైన విషయాలు ఉన్నాయని పేర్కొన్నారు. అఖిలభారత అధికారుల సర్వీస్ రూల్స్‌లో పేర్కొన్న ప్రకారం ఒక అధికారిపై ఉన్న సస్పెన్షన్‌ను ఎప్పటికప్పుడు అధికారుల కమిటీ రివ్యూ చేయాలని తెలిపారు. అయితే, అంశంపై లీగల్ పొజిషన్‌ను వెల్లడించడంలో రాష్ట్ర ప్రభుత్వ విఫలమైందని పేర్కొన్నారు. సర్వీస్ రూల్స్ ప్రకారం సమీక్షించలేదు కాబట్టి సదరు సస్పెన్షన్ చెల్లదని తెలిపారు. సస్పెన్షన్‌ను ఏకపక్షంగా కొనసాగించడానికి వీల్లేదన్నారు. వాదనల అనంతరం ఏపీ ప్రభుత్వం సమర్పించిన కేసు ఫైల్‌ను పరిశీలించిన క్యాట్.. పిటిషనర్ సాక్షులను బెదిరించారన్న ఆరోపణలకు సంబంధించిన మెటీరియల్(ఆధారం) ఎక్కడ ఉందని ప్రశ్నించింది. దీనికి ప్రభుత్వ న్యాయవాది ఎలాంటి సమాధానం చెప్పలేదు. వాదనలు ముగియడంతో తీర్పును ఈ నెల 23న వెలువరించనున్నట్లు క్యాట్ పేర్కొంది.

బీఆర్ఎస్ బీ ఫారాలు 18న

- అభ్యర్థులకు 95 లక్షల చెక్కులు కూడా
- అదేరోజు పార్టీ నేతలతో కేసీఆర్ సమీక్ష
- ఎన్నికల ప్రచారం, బస్సు యాత్రపై నిర్ణయం
- 2 వారాలపాటు యాత్రకు ప్రణాళికలు

హైదరాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పార్లమెంటు స్థానాల్లో బీఆర్ఎస్ తరఫున పోటీ చేయనున్న అభ్యర్థులతో ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఈనెల 18న తెలంగాణ భవన్‌లో సమావేశం కానున్నారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయి పరిస్థితులు, పార్టీపరంగా తీసుకోవాల్సిన చర్యలు, ఇతర అంశాలపై అభ్యర్థులతోపాటు పార్టీ ముఖ్య నేతలతో సమీక్ష జరపనున్నారు. అదేరోజు అభ్యర్థులకు కేసీఆర్ బీ ఫారాలు అందజేస్తారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం.. ఖర్చులకు రూ.95 లక్షల చొప్పున ప్రతి అభ్యర్థికి చెక్కులను అందజేయనున్నారు. అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పార్టీ అనుసరించాల్సిన విధానాలు, ఎన్నికల ప్రచారం, ప్రత్యర్థులను తిప్పికొట్టే విధంగా ప్రజలకు ఏం చెప్పాలన్న దానిపై కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు. ప్రచార కార్యక్రమాలతోపాటు రాష్ట్రంలో పంటలు నష్టపోయి అవస్థలు పడుతున్న రైతాంగానికి భరోసా కల్పించేందుకు చేపట్టనున్న బస్సు యాత్ర రూట్ మ్యాప్‌పై సమావేశంలో చర్చించనున్నారు. సమావేశంలో ఎంపీ అభ్యర్థులతోపాటు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ జిల్లా అధ్యక్షులు, జడ్పీ చైర్మన్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొననున్నారు.

రెండు వారాలపాటు కేసీఆర్ బస్సు యాత్ర

అసెంబ్లీ ఎన్నికల తర్వాత ప్రజల్లో బీఆర్ఎస్ గ్రాఫ్ పడిపోయిందని, జనంలో ఏమాత్రం సానుభూతి లేదంటూ రాజకీయ వర్గాలు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టేందుకు కేసీఆర్ వ్యూహ రచన చేస్తున్నట్లు సమాచారం. ఓవైపు లోక్‌సభ ఎన్నికల ప్రచారం కొనసాగిస్తూనే.. మరోవైపు, జనంలో మమేకమయ్యేవిధంగా ప్రణాళికలు రచిస్తున్నారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటించే విధంగా బస్సు యాత్ర చేపట్టాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఆయా పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలో బహిరంగ సభలు నిర్వహించడంతోపాటు ప్రధానంగా పంట నష్టపోయిన రైతులను పరామర్శిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టాలని ఆయన భావిస్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని అధిక సంఖ్యలో మండలాలను కలుపుకొని బస్సు యాత్ర చేపట్టే విధంగా రూట్ మ్యాప్‌ను సిద్ధం చేయాలని కేసీఆర్ కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. అలాగే, అన్ని వర్గాల ప్రజలకు చేరువయ్యేలా కార్నర్ మీటింగ్‌లు కూడా నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన కార్యాచరణను కేసీఆర్ ఈనెల 18న వెల్లడించే అవకాశం ఉంది.

ఏడాది కూడా ఉండదు

(మొదటి పేజీ తరువాయి)





ప్రజాఆశీర్వాద సభలో మాట్లాడుతున్న కేసీఆర్; సభకు హాజరైన జనం

తొక్కుతానని, ముడ్డి మీద చెడ్డీ లేకుండా గుంజుకుంటామని లిల్లీపుట్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడడం ఏమిటని మండిపడ్డారు. ముఖ్యమంత్రి అయి ఉండి అలా మాట్లాడడం ఏమిటంటూనే.. తాను ఏ రోజైనా ఇలాంటి భాష వాడానా? అని ప్రశ్నించారు. పోలీసుల తీరుపైనా కేసీఆర్ మండిపడ్డారు. పోలీసులు అరాచకాలను బంద్ చేయాలని, గ్యారంటీగా మళ్లీ తాము అధికారంలోకి వస్తామని, అప్పుడు వాళ్ల సంగతి చూస్తామని హెచ్చరించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సంగారెడ్డి జిల్లా సుల్తాన్‌పూర్ వద్ద మంగళవారం సాయంత్రం మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ ప్రసంగించారు. "ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా 125 ఫీట్ల అంబేడ్కర్ విగ్రహాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేసుకున్నాం. కానీ, ఆ మహనీయుని జయంతి రోజున ఈ లిల్లీపుట్ గాళ్ల ప్రభుత్వం ఆ విగ్రహం వద్దకు పోలేదు. ఒక్క పువ్వు కూడా పెట్టలేదు. పూలమాల వేయలేదు. అంజలి ఘటించలేదు. ఇంత అహంకారమా? కండకావరమా? అజ్ఞానమా? ఆ విగ్రహం వద్దకు ఎవరూ వెళ్లకుండా ప్రహరీకి తాళం వేశారు. అలా అయితే.. సచివాలయం కూడా ఆ మహనీయుని పేరిటే ఉంది. మరి సిగ్గు లేకుండా సచివాలయానికి వెళ్లి ఎలా కూర్చుంటున్నారు. యాదగిరిగుట్టను బీఆర్ఎస్సే తీర్చిదిద్దింది. అక్కడికి ఎందుకు పోతున్నారు!?" అని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ రెండు ఎంపీ సీట్ల కంటే ఎక్కువ రావని అన్ని సర్వే రిపోర్టులు చెబుతున్నాయన్నారు.

బీఆర్ఎస్ గెలవకపోతే మీకే నష్టం

తమ ప్రభుత్వ హయాంలో ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు మెరుగైన పీఆర్సీ ఇచ్చామని, భారీగా వేతనాలు చెల్లించామని, సమాజంలో సముచిత గౌరవం కల్పించామని, కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏం జరుగుతోందో ఒక్కసారి ఆలోచించాలని ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాలకు కేసీఆర్ విజ్ఞప్తి చేశారు. "కాంగ్రెస్ హామీలు నెరవేర్చాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిచి తీరాలి. లేకపోతే మీరే నష్టపోతారు. బీఆర్ఎస్‌కు వచ్చే నష్టమేమీ లేదు. 24 గంటలపాటు కరెంట్ సరఫరా కావాలన్నా, 2 లక్షల రూపాయల రుణ మాఫీ అమలు చేయాలన్నా, మీ హక్కులు సాధించాలన్నా బీఆర్ఎస్ గెలవాలి" అని వ్యాఖ్యానించారు. గత డిసెంబరు 9న రుణ మాఫీ చేస్తామని, ఆడబిడ్డలకు రూ.2,500 చెల్లిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కటైనా అమలు చేసిందా? అని ప్రశ్నించారు. రైతు బంధు ఇప్పటికీ రాలేదని, బోనస్ ఇస్తామన్న మాట బోగస్సే అయ్యిందని విమర్శించారు.

పోలీసుల తీరును రికార్డు చేస్తున్నాం

"మీ డ్యూటీ మీరు చేయండి. అంతేగానీ అతిగా ప్రవర్తించవద్దు" అని పోలీసులను కేసీఆర్ హెచ్చరించారు. అమాయకులను బెదిరించడం, కొట్టడం, తమ పార్టీ ఫ్లెక్సీలు లేకుండా చేయడం ఏమిటని ప్రశ్నించారు. పోలీసుల మితిమీరిన పనులన్నింటినీ రికార్డు చేస్తున్నామన్నారు. పెద్దపల్లి జిల్లా ధర్మారంలో సోషల్ మీడియాలో పోస్టు చేసినందుకు తమ కార్యకర్త మాధవరావుపై దౌర్జన్యం చేసి అరెస్ట్ చేశారని, అతనిపై దౌర్జన్యం చేసిన సీఐ, ఎస్సైలపై చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరారు. సభలో మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, హరీశ్‌రావు తదితరులు ప్రసంగించారు. కాగా, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) మంగళవారం నోటీసులు జారీ చేసింది. సిరిసిల్లలో కేసీఆర్ తమ పార్టీ నేతలను దుర్భాషలాడారని కాంగ్రెస్ నేత నిరంజన్ ఈసీకి ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం ఉదయం 11 గంటలలోగా కేసీఆర్ వివరణ ఇవ్వాలని ఈసీ నోటీసులు జారీ చేసింది.

రైతాంగ సమస్యల పరిష్కారానికి పోస్టుకార్డు ఉద్యమం

రైతాంగ సమస్యల పరిష్కారం కోరుతూ పోస్టుకార్డు ఉద్యమం చేపట్టాలని కేసీఆర్ కోరారు. సిద్దిపేట నియోజకవర్గంలో ఇప్పటికే ఈ ఉద్యమం సాగుతోందని, సిద్దిపేటను ఆదర్శంగా తీసుకొని రైతు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. తమ ప్రభుత్వ హయాంలో ఎక్కడ చూసినా వరి కోతలు సాగేవని, ఇప్పుడు కరెంట్ కోతలు, క్రాప్ హాలీడేలు కనిపిస్తున్నాయని ఎద్దేవా చేశారు. ఎన్నికల కోడ్ ఉన్నా రైతులకు బోనస్ ఇవ్వవచ్చని, తామేమీ ఫిర్యాదు చేయమని, ఒకవేళ ఇబ్బంది అనుకున్నా ఎన్నికలు ముగిసిన మరుసటి రోజైనా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇక, బీజేపీ మనకు అక్కరకు రాని చుట్టమన్నారు. ఆ పార్టీ కేంద్రంలో పదేళ్ల అధికారంలో ఉన్నా ఒక్క మెడికల్ కాలేజ్ కానీ, ఒక్క నవోదయ స్కూల్ గానీ, ఒక్క జాతీయ ప్రాజెక్టు కానీ ఇవ్వలేకపోయిందని విమర్శించారు.

నామినేషన్‌కు ముహూర్త బలం!

- మంచిరోజుల కోసం అభ్యర్థుల వెతుకులాట
- 18, 19, 24 తేదీల్లో

మంచి రోజులున్నాయంటున్న పండితులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారం ఊపందుకుంటోంది. ఆయా పార్టీల నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులు ప్రచారంలో తలమునకలయ్యారు. అయితే బరిలో నిలిచిన అభ్యర్థులు నామినేషన్ పత్రాలను దాఖలు చేసేందుకు శుభ ముహూర్తాల కోసం వెతుకుతున్నారు. ఈ మేరకు పండితులను ఆశ్రయిస్తూ తమ పేరిట ఏరోజు బాగుందని తెలుసుకుని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. కాగా, గురువారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానున్నందున.. పండితులు అభ్యర్థులకు మంచి ముహూర్తాలను సూచిస్తున్నారు. 18న గురువారం దశమి, ఆశ్లేష నక్షత్రం, 19న శుక్రవారం ఏకాదశి, మఖ నక్షత్రం ఉన్నందున ఈ రెండు రోజుల్లో అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చని చెబుతున్నారు. 24న బుధవారం పాడ్యమితో పాటు స్వాతి నక్షత్రం చాలా బాగుందని, ఈ రోజు నామపత్రాలు సమర్పిస్తే లాభం జరుగుతుందని పండితులు పేర్కొంటున్నారు. కాగా, 21న త్రయోదశి, ఉత్తర నక్షత్రం పైన పేర్కొన్న తేదీల కంటే ఇంకా బాగుందని, ఈ రోజున లక్షలాది పెళ్లిళ్లకు ఇప్పటికే ముహూర్తాలు పెట్టుకున్నారని చెబుతున్నారు. అయితే 21న ఆదివారం సెలవు రోజు కాబట్టి నామినేషన్ పత్రాలు దాఖలు చేసే అవకాశం ఉండకపోవడంతో అభ్యర్థులు నిరుత్సాహానికి గురవుతున్నారని పండితులంటున్నారు.

సాదాసీదాగా నామినేషన్!

గతంలో నామినేషన్ పత్రాలను దాఖలుకు చేసేందుకు అభ్యర్థులు వేలాది మందితో భారీ ర్యాలీలు నిర్వహించేవారు. నామినేషన్ సమయంలో విజయాన్ని సాధించినట్లుగా ఓటర్లను ఆకట్టుకునేవారు. అయితే ప్రస్తుతం నగరంలో ఎండలు మండిపోతున్న తరుణంలో అభ్యర్థులు సాదాసీదాగా వెళ్లి తమ నామపత్రాలను దాఖలు చేయాలని భావిస్తున్నారు. నిప్పులు కురుస్తున్న ఎండల నడుమ ర్యాలీలు నిర్వహించడం అసాధ్యమని, దానికంటే నలుగురైదుగురితో ఎన్నికల కార్యాలయానికి వెళ్లి పత్రాలను సమర్పిస్తే బాగుంటుందని అభ్యర్థులు పార్టీ ముఖ్యులతో చర్చిస్తున్నట్లు తెలుస్తోంది.

ఒవైసీ సోదరులను హతమార్చే కుట్ర!

- అక్బరుద్దీన్ ఒవైసీ సంచలన వ్యాఖ్యలు



చార్మినార్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మజ్లిస్ పార్టీ శాసనసభాపక్ష నేత, చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. "ఒవైసీ సోదరులు ఏదైనా కేసులో జైలుకు వెళితే అక్కడ విషం పెట్టి లేదా చికిత్స పేరుతో ఆస్పత్రికి తీసుకొని వెళుతూ కాల్చి చంపేందుకు కుట్ర జరుగుతోంది" అని ఆరోపించారు. యాకుత్‌పురాలో సోమవారం రాత్రి జరిగిన ఈద్ మిలాప్ కార్యక్రమానికి హాజరైన అక్బరుద్దీన్.. ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఉత్తరప్రదేశ్‌లో పోలీసుల కాల్పులో షాబుద్దీన్ మృతి చెందగా, ఆస్పత్రికి చికిత్స కోసం వెళ్లి వస్తున్న అతిక్ సోదరులను కాల్చి చంపిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ముక్తార్ అన్సారీకి జైల్లో విషం పెట్టారన్న ఆరోపణల నేపథ్యంలో అక్బరుద్దీన్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈద్ మిలాప్‌లో అక్బరుద్దీన్ మాట్లాడుతూ.. తనతో పాటు అన్న అసదుద్దీన్ ఒవైసీని హతమార్చేందుకు కుట్రలు జరుగుతున్నాయన్నారు. 13 ఏళ్ల కిందట ఇదే నెలలో తనపై హత్యాయత్నం జరిగిందని గుర్తుచేశారు. అప్పుడు ప్రజలు కులమతాలకతీతంగా ప్రార్థనలు చేయడం వల్లే తాను బతికి బయటపడ్డానని చెప్పారు. పాతబస్తీ ప్రజలు ఆలోచించుకోవాలని, తమ (ఒవైసీ సోదరులు)ను హత్య చేస్తే.. వారికి ఎవరు అండగా ఉంటారని అడిగారు. హైదరాబాద్ ప్రజల మద్దతు, ఆశీస్సులతోనే తాము ఈ స్థాయికి వచ్చామని తెలిపారు. తమ వల్ల ఏమైనా తప్పులు జరిగి ఉంటే క్షమించాలని కోరారు. దేశవ్యాప్తంగా మజ్లిస్ పార్టీ ఎదగడాన్ని తట్టుకోలేని కొందరు నేతలు మజ్లిస్‌ను బీజేపీకి బీ టీమ్ అంటూ నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు సంఘటితంగా ఉండాలని సూచించారు. హైదరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి అసదుద్దీన్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

కాంగ్రెస్ ఏమైనా వాయిదాల పార్టీనా?: లక్ష్మణ్

హైదరాబాద్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఏమైనా వాయిదాల పార్టీనా.? అని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్, సీఎం రేవంత్‌ను నిలదీశారు. ఆగస్టు 15 వరకు రూ. 2 లక్షల రైతు రుణమాఫీ చేస్తాం అంటూ రేవంత్ ప్రకటించడం.. ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టడానికే అని విమర్శించారు. సోనియా గాంధీ పుట్టినరోజైన డిసెంబరు 9న ఏక కాలంలో రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి చేయలేదని, వరి పంటకు మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తామని ఇవ్వలేదని.. ఇప్పుడేమో ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం పేరుతో ముందుకొస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల కోడ్ పేరుతో హామీలు అమలు చేయలేకపోతున్నామని తప్పించుకుంటున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు అవినీతిపరులు అని అనేక సార్లు విమర్శించిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు ఆ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఎలా కాంగ్రెస్ లో చేర్చుకుంటున్నారు? కాంగ్రెస్ లో చేరగానే అవినీతి తొలగిపోతుందా? అని ప్రశ్నించారు.

ఎంపీ ఎన్నికలపైనే బీఆర్ఎస్ భవిష్యత్

పదవులు అనుభవించినవారే జారుకుంటున్నారు.. అసలైన ఉద్యమకారులే మిగిలారు

- పార్లమెంట్ ఎన్నికల తర్వాత.. తెలంగాణలో రాజకీయ మార్పులు
- రాముణ్ని మొక్కుదాం.. బీజేపీని తొక్కుదాం: కేటీఆర్



ఆదిలాబాద్ బీఆర్ఎస్ సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

ఆదిలాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పార్లమెంటు ఎన్నికలు.. బీఆర్ఎస్ భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మంత్రి పదవి, పెద్ద పెద్ద పదవులు అనుభవించిన వారంతా అధికారం పోగానే పార్టీ నుంచి జారుకుంటున్నారని విమర్శించారు. మంగళవారం ఆదిలాబాద్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ పార్లమెంట్ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశానికి కేటీఆర్ హాజరై మాట్లాడారు. "రాసి పెట్టుకోండి.. పార్లమెంట్ ఎన్నికల తర్వాత తెలంగాణలో భారీ రాజకీయ మార్పులు చోటుచేసుకుంటాయి. గెలిచిన ఎంపీలతో కలిసి సీఎం రేవంత్ బీజేపీలోకి జంప్ అవడం ఖాయం" అని కేటీఆర్ అన్నారు. అరచేతిలో వైకుంఠం చూపి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. వంద రోజులు గడిచినా వాటిని నెరవేర్చలేదని విమర్శించారు. డిసెంబరు 9న అధికారంలోకి రాగానే రూ.2లక్షల రుణమాఫీపై సంతకం చేస్తానని చెప్పిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు పంద్రాగస్టు వరకు మాఫీ చేస్తానంటూ కొత్త కథ చెబుతున్నారని మండిపడ్డారు. రైతుబంధు ఏమైందని ప్రశ్నిస్తే మంత్రి వెంకట్‌రెడ్డి చెప్పుతో కొడతానంటున్నారని, మే 13న రైతులు కాంగ్రెస్‌ను చెప్పుతో కొట్టే పరిస్థితి వచ్చిందని వ్యాఖ్యానించారు. "రేవంత్‌రెడ్డి జేబులో కత్తెర పెట్టుకుని తిరుగుతూ పేగులను మెడలో వేసుకుంటా అంటాడు.. అసలు నువ్వు ముఖ్యమంత్రివా? లేక బోటికొట్టే వాడివా?' అని కేటీఆర్ ఎద్దేవా చేశారు.

ఉద్యమం పని చేసినవారే మిగిలారు..

తమ పార్టీ నుంచి పోయిన వారంతా ఉద్యమంలో పనిచేసిన వారు కాదని, అసలు ఉద్యమం చేసినవారే ఇప్పుడు పార్టీలో మిగిలారని కేటీఆర్ తెలిపారు. దేశంలో అత్యధికంగా లక్షా 60 వేల 283 మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చింది తెలంగాణ రాష్ట్రమేనని, దీనిని ఎన్నికల్లో ప్రజలకు చెప్పుకోలేక పోయామని పేర్కొన్నారు. ఈ ఎన్నికలు బీఆర్ఎస్ రాజకీయ భవిష్యత్తును నిర్ణయిస్తాయని, ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తామే ఇచ్చినట్లు చెప్పుకొంటున్న 32 వేల ఉద్యోగాలను కేసీఆర్ ప్రభుత్వమే ఇచ్చిందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదన్నారు. మందికి పుట్టిన బిడ్డను వారి బిడ్డగా చెప్పుకోవడం కాంగ్రెస్‌కు అలవాటైందని ఎద్దేవా చేశారు. కరోనా పరిస్థితుల నేపథ్యంలో సంక్షేమ పథకాలను ఆపకుండా ఉండేందుకు.. ఉద్యోగుల వేతనాల చెల్లింపుల్లో కొంత ఆలస్యమైన మాట వాస్తవమేనన్నారు. అంతే తప్ప.. ఉద్యోగులు, ఉపాధ్యాయులతో తమకు ఎలాంటి శత్రుత్వం లేదన్నారు. బీజేపీకి మెజారిటీ వస్తే రాజ్యాంగాన్ని మార్చడంతో పాటు ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు లేకుండా మాయం చేసే ప్రమాదం ఉందన్నారు. "రాముడు ఏ పార్టీ వాడు కాదు. రాముణ్ని మొక్కుదాం.. పైసా పని చేయని బీజేపీని పండబెట్టి తొక్కుదాం" అని కేటీఆర్ అన్నారు. ఇదిలా ఉండగా.. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పలు పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లకు పార్టీ సమన్వయకర్తలను నియమించినట్లు కేటీఆర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

తోట త్రిమూర్తులుకు జైలు

- మరో ఎనిమిది మందికి కూడా...
- దళితుల శిరోముండనం కేసులో 27ఏళ్ల తర్వాత ప్రత్యేక కోర్టు తీర్పు



తోట త్రిమూర్తులు

విశాఖపట్నం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్రంలో 27ఏళ్ల క్రితం సంచలనం కలిగించిన దళితుల శిరోముండనం కేసులో విశాఖపట్నం ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు మంగళవారం కీలక తీర్పు వెలువరించింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వెంకటాయపాలేనికి చెందిన దళితులను తిట్టి, కొట్టి, శిరోముండనం చేశారనే ఆరోపణలపై వైసీపీ ఎమ్మెల్సీ, ప్రస్తుత మండపేట అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి తోట త్రిమూర్తులు(ఏ-1)తో పాటు మరో తొమ్మిది మందిపై 324, 342, 506, తదితర సెక్షన్ల కింద 1996 డిసెంబరు 12న పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో 27 ఏళ్లపాటు సుదీర్ఘ విచారణలు, వాదనల అనంతరం న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. ప్రధాన ఆరోపణలను కొట్టివేసి, స్వల్పంగా గాయపరిచి, దూషించారనే నేరంపై నిందితులకు ఏడాదిన్నర జైలుతో పాటు ఒక్కొక్కరికి రూ.42వేలు చొప్పున జరిమానా విధించింది. ఈ కేసులో ఇద్దరు బాధితులకు చెరో రూ.1.5లక్షలు చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని ఆదేశించింది. జరిమానా చెల్లించకపోతే మరో ఆరు నెలల జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడు తోట త్రిమూర్తులు కాగా ఆయనతో పాటు తోట బాబులు, తోట రాము, పుండరీకాక్షుడు(జేబీ); పుండరీకాక్షుడు(డాక్టర్ బాబు), దవళ కిశోర్, తోట శ్రీను, మోహన ప్రకాశ్, అనంతరమా సత్యనారాయణ ఉన్నారు. మరో నిందితుడు తోట మురళీమోహన్ మరణించారు. ఈ సందర్భంగా తోట త్రిమూర్తులు మీడియాతో మాట్లాడుతూ.. కోర్టు తీర్పును గౌరవిస్తున్నామని, దీనిపై హైకోర్టులో అప్పీల్ చేసుకుంటామని తెలిపారు. నిర్దోషులుగా బయటకు వస్తామనే విశ్వాసం ఉందని చెప్పారు.

కంటోన్మెంట్ బీజేపీ అభ్యర్థిగా వంశ తిలక్

న్యూఢిల్లీ, సికింద్రాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజవర్గ ఉప ఎన్నిక అభ్యర్థిని బీజేపీ అధిష్ఠానం ప్రకటించింది. బీజేపీ తరఫున డాక్టర్ టీఎన్ వంశ తిలక్ బరిలో నిలుస్తారని వెల్లడించింది. తెలంగాణలో ఖాళీగా ఉన్న ఒక స్థానంతో పాటు ఉత్తరప్రదేశ్‌లోని నాలుగు అసెంబ్లీ స్థానాలకు జరిగే ఉప ఎన్నికలకు సంబంధించిన అభ్యర్థుల జాబితాను బీజేపీ కేంద్రకార్యాలయం మంగళవారం విడుదల చేసింది. కాగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి ఎస్సీ స్పీకర్‌గా బాధ్యతలు నిర్వర్తించిన టీ.ఎన్. సదాలక్ష్మి, స్వాతంత్ర్య సమర యోధుడు డాక్టర్ టీ.ఎన్. నారాయణ కుమారుడే వంశ తిలక్. కంటోన్మెంట్ సీటు కోసం పలువురు పోటీ పడినా.. ఆర్ఎస్ఎస్ నేపథ్యం, రాజకీయ కుటుంబ నేపథ్యం ఉన్న తిలక్‌నే బరిలో దించేందుకు బీజేపీ నిర్ణయించింది. లోక్‌సభ ఎన్నికలతోపాటే మే 13న కంటోన్మెంట్ ఎన్నిక కూడా జరగనుంది. అదేవిధంగా.. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి 12వ జాబితాను కూడా బీజేపీ ప్రకటించింది. మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఏడు లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది.

లోక్‌సభ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ ఖతం

» రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయం:మంత్రి ఉత్తమ్



నడిగూడెం, ఏప్రిల్ 16: లోక్‌సభ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ ఖతం కావడం ఖాయమని భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా నడిగూడెంలో మునగాల, మోతె, నడిగూడెం మండలాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన బీఆర్ఎస్, 100 రోజుల కాంగ్రెస్ పాలనకే సరితూగక ఈ ఎన్నికల్లో నామమాత్రంగా మిగిలిందన్నారు. తెలంగాణ అభివృద్ధికి ఏమాత్రం సహకరించని బీజేపీకి రాష్ట్రంలో ఓటు అడిగే అర్హత లేదన్నారు. దేశంలోనే నల్గొండ పార్లమెంటు స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించి రాహుల్ గాంధీకి కానుకగా ఇస్తామన్నారు. జూన్‌లో రాహుల్ ప్రధాని కావడం ఖాయమని జోస్యం చెప్పారు.

ఆర్ఎస్ ప్రవీణ్‌పై మంద జగన్నాథం పోటీ

» నేడో రేపో బీఎస్పీలో చేరనున్న మాజీ ఎంపీ

నాగర్‌కర్నూల్/ఎర్రవల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): లోకసభ ఎన్నికల వేళ నాగర్‌కర్నూల్ పార్లమెంటు స్థానంలో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. మొన్నటి వరకు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న ఆర్ఎస్. ప్రవీణ్ కుమార్ అనూహ్యంగా బీఆర్ఎస్‌లో చేరడం.. ఆ పార్టీ నుంచి లోక్‌సభ అభ్యర్థిగా పోటీ చేయనుండటం తెలిసిందే. ఈ క్రమంలో నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ మంద జగన్నాథం ఒకటి రెండు రోజుల్లో బీఎస్పీలో చేరబోతుండటం ఆసక్తికరంగా మారింది. బీఆర్ఎస్‌లో కొనసాగిన ఆయన అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరారు. ఆ పార్టీ నుంచి నాగర్‌కర్నూల్ ఎంపీ టికెట్ కోసం చివరి దాకా ప్రయత్నించారు. కాంగ్రెస్ అధిష్ఠానం మల్లు రవిని అభ్యర్థిగా ప్రకటించడంతో జగన్నాథం కినుక వహించారు. కొద్ది రోజులుగా మౌనంగా ఉన్న ఆయన బీఎస్పీలో చేరాలని నిర్ణయించుకున్నారు.

సీఎం రేవంత్ రెడ్డి ఓ గజినీ: ఏలేటి

హైదరాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి ఓ గజినీ.. ఎప్పుడు ఏ స్టేట్‌మెంట్ ఇస్తారో ఆయనకే తెలీదని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. మైక్ దొరికితే బాలకృష్ణ, ఎన్టీయార్ డైలాగులు కొడతారు తప్ప ఏదీ అమలు చేయరని అన్నారు. పంద్రాగస్టుకు రుణమాఫీ అమలు చేయకపోతే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో రేవంత్‌కి ఓటమి భయం పట్టుకుందని పేర్కొంటూ, మళ్లీ బూటకపు మాటలతో రైతులను మోసం చేసేందుకు సిద్ధమయ్యారని మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. "రంగారెడ్డి జిల్లాలోని ఖానామెట్‌లో సాయి సింధు ఫౌండేషన్‌కు కేటాయించిన భూమికి సంబంధించి జీఓ నంబర్ 37 మీద నేను చేసిన ఆరోపణలపై ప్రభుత్వంలోని ఎవరూ మాట్లాడకపోవడం చూస్తేనే అందులో అవినీతి జరిగిందని అర్థమవుతోంది. ఆధారాలు బయటపెట్టాను, జీవో 37 రద్దు చేసి ఆ భూమిని ప్రభుత్వ పరమయ్యేవరకు పోరాటం చేస్తాం" అని ప్రకటించారు.

మాలలంతా కాంగ్రెస్‌కే ఓటేయాలి

» మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి. చెన్నయ్య

పంజాగుట్ట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం.. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మాలలంతా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి. చెన్నయ్య పిలుపునిచ్చారు. బంజారాహిల్స్‌లోని మాల మహానాడు జాతీయ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బీజేపీ అంబేడ్కర్ వాదులను అణగ దొక్కాలనే లక్ష్యంతో తెలంగాణలో ఒక్క పార్లమెంటు సీటు కూడా మాల సామాజిక వర్గానికి కేటాయించలేదని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో ఉన్న ఆ పార్టీలోని మాలలు బీజేపీకి వ్యతిరేకంగా ఓటు వేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ద్వారానే దేశంలో సామరస్యత, సామాజిక న్యాయం, లౌకికవాదం నెలకొంటుందని పేర్కొన్నారు. త్వరలో జిల్లాల వారీగా బస్తీలు, పల్లెల్లో పర్యటించి "బీజేపీని ఓడించు-ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించు" అనే నినాదంతో దళిత బహుజనులను చైతన్యవంతం చేసి ఆ పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేయిస్తామని చెన్నయ్య తెలిపారు.

కేసీఆర్ కుటుంబం జైలుకు ఖాయం:రాజగోపాల్

యాదాద్రి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అవినీతికి పాల్పడి రూ.వేల కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్న కేసీఆర్ కుటుంబాన్ని జైలుకు పంపడం ఖాయమని కాంగ్రెస్ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలో పార్లమెంట్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గడీలను బద్దలు కొట్టి ప్రజాపాలన తెచ్చుకున్నామని, ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమన్నారు. విభజన హామీల కోసం ఏనాడూ మాట్లాడని కేసీఆర్‌ను ఈ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి నోటిని అదుపులో పెట్టుకోవాలన్నారు. యాదాద్రి థర్మల్ ప్లాంట్ నిర్మాణ పనుల్లో రూ.10వేల కోట్ల కుంభకోణం జరిగిందని, జ్యుడీషియల్ విచారణకు సిద్ధంగా ఉండాలని, త్వరలోనే జగదీశ్ రెడ్డి జైలుకు వెళ్లడం ఖాయమన్నారు.

'సీపెట్'లో ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణా కోర్సులు

కుషాయిగూడ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): చర్లపల్లిలోని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ(సీపెట్)లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు చెందిన నిరుద్యోగులకు ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణా కోర్సులు నిర్వహిస్తున్నట్లు సంస్థ యాజమాన్యం తెలిపింది. మెషీన్ ఆపరేటర్ ప్లాస్టిక్ ప్రాసెసింగ్, మెషీన్ ఆపరేటర్ ఇంజక్షన్ మౌల్డింగ్ అంశాలలో ఆరు నెలల శిక్షణ ఉంటుందని, కోర్సు పూర్తయిన తర్వాత వివిధ సంస్థల్లో ఉద్యోగావకాశాలు కూడా కల్పిస్తామని వెల్లడించారు. కనీసం పదో తరగతి చదివి, 30ఏళ్ల లోపు వయసు ఉన్నవారు తమ బయోడేటాతో పాటు కుల ధ్రువీకరణ పత్రం, విద్యార్హత సర్టిఫికెట్లు, నాలుగు ఫొటోలతో సంస్థ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. ఆసక్తి ఉన్న నిరుద్యోగులు ఇతర వివరాల కోసం 9959333417, 8978480207 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

శిశు విక్రయాన్ని అడ్డుకున్న తల్లి!

» బిడ్డను పోషించడం తన కుమార్తెకు కష్టమవుతుందని ఆందోళన చెందిన తండ్రి
» కుమార్తెకు చెప్పకుండా విక్రయించేందుకు ఒప్పందం
» కన్నతల్లి ప్రతిఘటించడంతో ఆగిన విక్రయం

సూర్యాపేటక్రైం, ఏప్రిల్ 16: ధరణికి గిరి భారం కాదు.. ఆ గిరికి తరువు భారం కాదు.. మరి, తల్లికి కన్నబిడ్డ భారమెలా అవుతుంది? తానెంత పేదరికంలో మగ్గుతున్నా పేగుతెంచుకొని పుట్టిన బిడ్డను వదులుకునేందుకు ఏ తల్లి అయినా ప్రయత్నిస్తుందా? ఆ తల్లి కూడా వదులుకునేందుకు ఇష్టపడలేదు. నవమాసాలు మోసి కన్న బిడ్డను తనకు తెలియకుండా తనవాళ్లే విక్రయించేందుకు ప్రయత్నిస్తుంటే అడ్డుకునేందుకు కేకలు వేసింది. బిగ్గరగా రోదిస్తూ ప్రతిఘటించింది! బిడ్డపై ఆ తల్లి అనురాగమే 'శిశువు విక్రయాన్ని' ఆపింది. నిందితులను కటకటాల్లోకి నెట్టించింది. సూర్యాపేట జిల్లాలో ఈ ఘటన జరిగింది. శిశువును అమ్మేందుకు ప్రయత్నించింది సాక్షాత్తు ఆ బిడ్డ తాతే కావడం గమనార్హం. తన కూతురు, అల్లుడికి ఆడ శిశువును పోషించడం కష్టమవుతుందని భావించే అతడు ఈ పనికి పాల్పడ్డాడు. కేసు వివరాలను సూర్యాపేట జిల్లా ఎస్పీ రాహుల్‌హెగ్డే వివరించారు. నల్లగొండ జిల్లా తిరుమలగిరి (సాగర్) మండలం నాయకునితండాకు చెందిన మెగావత్ పూల్‌సింగ్.. తన కుమార్తె రాజేశ్వరిని అదే మండలంలోని జువ్విచెట్టుతండాకు చెందిన సపావత్ కొండానాయక్‌కు ఇచ్చి పెళ్లిచేశాడు. రాజేశ్వరి-కొండానాయక్ దంపతులకు తొలి కాన్పులో ఆడబిడ్డ జన్మించింది. రాజేశ్వరి మళ్లీ గర్భం దాల్చగా 20 రోజుల క్రితం ఆమెకు మళ్లీ ఆడపిల్ల పుట్టింది. ఇద్దరు ఆడపిల్లలను పోషించడం రాజేశ్వరికి కష్టం అవుతుందని ఆమె తండ్రి పూల్‌సింగ్ భావించాడు. రెండోకాన్పులో పుట్టిన బిడ్డను విక్రయించాలని నిర్ణయించాడు. తన మేనకోడలు మెగావత్ దుర్గను సంప్రదించారు. ఈ క్రమంలో రూ.3 లక్షలకు శిశువును విక్రయించేలా ఒప్పందం జరిగింది. ఈ నెల 15న పూల్‌సింగ్, రాజేశ్వరికి మాయమాటలు చెప్పి సూర్యాపేట-విజయవాడకు మధ్యలో మొద్దులచెరువు స్టేజీ వద్దకు తీసుకొచ్చాడు. అక్కడ తనకు పరిచయం లేని వాళ్లు రావడం.. తన చేతుల్లోంచి శిశువును బలవంతంగా లాక్కునేందుకు ప్రయత్నించడంతో రాజేశ్వరికి విషయం తెలిసింది. తన బిడ్డను వారికి ఇచ్చేందుకు ఆమె నిరాకరించడంతో గొడవ జరిగింది. స్థానికులు చూసి.. పోలీసులకు సమాచారమిచ్చారు. వారొచ్చి ప్రధాన నిందితుడు పూల్‌సింగ్‌తో పాటు దుర్గ, సైదాబీ, రాజుసింగ్, నాగమణి, విజయలక్ష్మి, అశోక్‌కుమార్‌ను అరెస్టు చేశారు.

కాంగ్రెస్‌లో చేరికల జాతర

» హస్తం గూటికి వేణుగోపాలా చారి, మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు..
» రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్ కూడా

హైదరాబాద్/హయత్‌నగర్/జహీరాబాద్/చేర్యాల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌లో చేరికల జాతర కొనసాగుతూనే ఉంది. మంగళవారం వివిధ పార్టీలకు చెందిన పలువురు నేతలు హస్తం గూటికి వెళ్లారు. కేంద్ర మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత సముద్రాల వేణుగోపాలా చారి మం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావూ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. రేవంత్‌రెడ్డి తన నివాసంలో వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే సరూర్‌నగర్ మాజీ కార్పొరేటర్ అనిత, ఆమె భర్త దయాకర్‌రెడ్డిలు సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఇదిలా ఉంటే గాంధీభవన్‌లో పార్టీ ఎమ్మెల్సీలు జీవన్‌రెడ్డి, మహేష్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్‌ల సమక్షంలో కోరుట్ల నియోజకవర్గానికి చెందిన పలువురు బీజేపీ నేతలు కాంగ్రెస్‌లో చేరారు. అలాగే రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంకు చెందిన పలువురు బీజేపీ నేతలూ హస్తం గూటికి వెళ్లారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య బీఆర్ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్ సమక్షంలో ఆయన కాంగ్రెస్‌లో చేరారు.



సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య

హస్తం గూటికి టీఎస్ఐడీసీ మాజీ చైర్మన్

జహీరాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ నేత, టీఎస్ఐడీసీ మాజీ చైర్మన్ మహమ్మద్ తన్వీర్ తన అనుచరగణంతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహ, రాష్ట్ర ఫిలిం కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మునిసిపల్ మాజీ చైర్మన్ మంకాల్ సుభాష్ తదితరులు కూడా హస్తం గూటికి వెళ్లారు. ఇటీవల బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణానికి చెందిన నాగపురి కిరణ్‌కుమార్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.

గల్ఫ్ కార్మికుల కోసం ప్రత్యేక బోర్డు..!

సమస్యల పరిష్కారానికి సెప్టెంబరు 17లోగా ప్రత్యేక వ్యవస్థ .. ఇప్పటికే పాలసీ ముసాయిదా సిద్ధం

» ఏజెంట్ల మోసాలు అరికట్టేందుకు చర్యలు
» దళారులు ప్రభుత్వం వద్ద పేర్లు నమోదు చేసుకునేలా విధానం
» గల్ఫ్ కార్మిక సంఘాల నేతలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



సీఎం రేవంత్‌తో జరిగిన సమావేశంలో పాల్గొన్న గల్ఫ్ కార్మిక సంఘాల నేతలు

ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నుంచి గల్ఫ్, ఇతర దేశాలకు వలస వెళ్లే కార్మికుల రక్షణ, సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఆయా కార్మికుల కోసం ప్రత్యేకంగా ఓ బోర్డు ఏర్పాటుకు అధ్యయనం జరుగుతోందని వెల్లడించారు. గల్ఫ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి సెప్టెంబరు 17లోగా ఓ ప్రత్యేక వ్యవస్థను తీసుకువస్తామని తెలిపారు. అలాగే, గల్ఫ్ వెళ్లే కార్మికులు ఏజెంట్ల చేతిలో మోసపోకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గల్ఫ్ కార్మిక సంఘాల నేతలతో సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గల్ఫ్ కార్మికుల్లో ఉత్తర తెలంగాణ ప్రాంతానికి చెందిన వారే అధికంగా ఉన్నారని అన్నారు. వీళ్లలో కొందరు ఏజెంట్ల బారిన పడి, మరి కొందరు యజమానుల చేతిలో ఇరుక్కొని ఇబ్బందులు పడుతున్నారని సీఎం రేవంత్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో గల్ఫ్ దేశాలతో పాటు ఇతర దేశాలకు వెళ్లే కార్మికుల కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటుకు అధ్యయనం జరుగుతుందని చెప్పారు. అలాగే, గల్ఫ్ కార్మికులకు సాయం చేసేందుకు ప్రజాభవన్‌లో ఒక ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని అన్నారు. ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి ఆధ్వర్యంలో ఈ వ్యవస్థ పని చేస్తుందని తెలిపారు. అలాగే, ఓ టోల్ ఫ్రీ నెంబర్‌ను కూడా అందుబాటులోకి తెస్తామని చెప్పారు. గల్ఫ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి సెప్టెంబరు 17 లోగా ఒక వ్యవస్థను అందుబాటులోకి తెచ్చే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. ఇందుకోసం ఫిలిప్పీన్స్ దేశం, కేరళ రాష్ట్రంలో అమలులో ఉన్న ప్రవాసీ సంక్షేమ విధానాలను అధ్యయనం చేసి ఒక ముసాయిదాను రూపొందించామని చెప్పారు. ప్రధాన మంత్రి కార్యాలయంలో విదేశీ మంత్రిత్వ శాఖ వ్యవహారాలను ఎనిమిదేళ్ల పాటు పరిశీలించిన శేషాద్రి అనే సీనియర్ అధికారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతోందన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత గల్ఫ్ కార్మిక సంఘాలను ఆహ్వానించి.. పాలసీ డాక్యుమెంట్‌పై అభిప్రాయ సేకరణ చేపట్టి ముందడుగు వేస్తామని చెప్పారు. గల్ఫ్ కార్మికులకు న్యాయ సహాయం అందించేందుకు అవసరమైన చర్యలు కూడా తీసుకుంటున్నామని వివరించారు. ముఖ్యంగా ఏజెంట్ల చేతిలో జరిగే మోసాల అడ్డుకట్టపై దృష్టి పెట్టామని రేవంత్ రెడ్డి చెప్పారు. ప్రతి ఏజెంటూ రాష్ట్ర ప్రభుత్వం వద్ద తమ పేరు నమోదు చేసుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే, గల్ఫ్ వెళ్లే కార్మికులకు వివిధ అంశాలపై ఓ వారం రోజులు శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. రైతు బీమా మాదిరిగా గల్ఫ్ కార్మికులకు కూడా బీమా సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గల్ఫ్ కార్మికుల తరఫున పార్లమెంటులో గొంతు వినిపించేందుకు నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డిని గెలిపించాలని ముఖ్యమంత్రి కోరారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రాజ్యాధికార సమితి హర్షం

గల్ఫ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చొరవపై బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ హర్షం వ్యక్తం చేశారు. గతంలో 'బొగ్గుబాయి-ముంబాయి-దుబాయి" అంటూ గల్ఫ్ వాసులకు తియ్యటి మాటలు చెప్పిన కేసీఆర్ పదేళ్ల కాలంలో గల్ఫ్ వలస కార్మికులను పట్టించుకోలేదని పేర్కొన్నారు. గల్ఫ్ కార్మికులు వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు, రాజకీయ నేతలుగా ఎదిగేందుకు సీఎం రేవంత్ రెడ్డి చొరవ తీసుకోవాలని కోరారు. గల్ఫ్ బాధితులను కాపాడేందుకు దుబాయ్ కాన్సులేట్ సౌజన్యంతో రెస్క్యూ టీం ఏర్పాటు చేయాల్సిన అవసరముందన్నారు. అలాగే, బాధిత కుటుంబాల కోసం టోల్‌ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటుచేయాలని కోరారు.

సీఎం రేవంత్ సుడిగాలి ప్రచారం

» నియోజకవర్గానికి 3 చొప్పున సభలు

హైదరాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లోనూ సీఎం రేవంత్‌రెడ్డి తన మార్కు ప్రచారాన్ని చేయబోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుడిగాలి పర్యటనలు చేయనున్నారు. 19 మొదలుకుని పోలింగ్ తేదీ ముందు రోజు వరకూ నియోజకవర్గానికి మూడు సభల్లో పాల్గొనేందుకు ఆయన రంగం సిద్ధం చేసుకున్నారు. జనజాతర వంటి సభలైతేనేమీ, కార్నర్ మీటింగ్‌లు అయితేనేమీ 50కి పైగా సమావేశాల్లో ప్రజలతో ఆయన అనుసంధానం అయ్యేలా షెడ్యూల్ రూపొందింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో మాజీ సీఎం కేసీఆర్‌కు దీటుగా రేవంత్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా తిరిగి పార్టీ అభ్యర్థుల తరఫున ప్రచారం చేసిన సంగతి తెలిసిందే. ఆయ ప్రచారం చేసిన తీరు.. సీఎం పదవి దక్కడానికి ఒక కారణంగా నిలిచింది. రాష్ట్ర ప్రభుత్వ పనితీరుకు లోక్‌సభ ఎన్నికలు రిఫరెండమంటూ స్వయంగా ప్రకటించిన సీఎం రేవంత్.. మొత్తం 17 సీట్లలో 14 సీట్లు గెలుచుకోవాలన్న లక్ష్యాన్ని పెట్టుకున్నారు. లోక్‌సభ ఎన్నికల్లోనూ సుడిగాలి ప్రచారానికి ప్లాన్ చేసుకున్నారు. ఈ నెల 18న నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. అభ్యర్థుల నామినేషన్ల కార్యక్రమాలనూ సభలు, కార్నర్ మీటింగ్‌లుగా మలచి.. ఆయా సభల్లో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొననున్నట్లు చెబుతున్నారు. ఈ నెల 19న మహబూబ్‌నగర్, మహబూబాబాద్‌లలో జరిగే అభ్యర్థుల నామినేషన్ల కార్యక్రమాల్లో పాల్గొని అనంతరం ఆయా చోట్ల జరిగే జన జాతర బహిరంగ సభల్లో రేవంత్‌రెడ్డి పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపాయి అలాగే 21న భువనగిరి అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమంలోనూ పాల్గొంటున్నారు.

కేరళ, కర్ణాటకల్లోనూ ప్రచారం

కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లోనూ సీఎం రేవంత్ ప్రచారానికి షెడ్యూల్ ఖరారైంది. కేరళ రాష్ట్రంలో కాంగ్రెస్ అభ్యర్థుల తరఫున ప్రచారం చేయడం కోసం బుధవారం ఆ రాష్ట్రానికి వెళుతున్నారు. రెండు రోజుల పాటు అలప్పుజ, రాహుల్ గాంధీ పోటీ చేస్తున్న వయనాడ్ నియోజకవర్గాల్లో ప్రచార కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. శనివారం కర్ణాటక ఎన్నికల ప్రచారానికి వెళ్లనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.



ఫుడ్‌పార్కులో ప్రాసెసింగ్ యూనిట్లు

» ఖమ్మం జిల్లా బుగ్గపాడులో ఏర్పాటు
» కేంద్ర ప్రభుత్వ నిధుల కోసం ప్రణాళికలు
» ఆయిల్‌పామ్ మొక్కలు సిద్ధంగా ఉంచాలి
» అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం

హైదరాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బుగ్గపాడులో గతంలో ఏర్పాటు చేసిన మెగా ఫుడ్‌పార్కుకు అనుసంధానంగా ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అధికారులను ఆదేశించారు. 60 ఎకరాల విస్తీర్ణంలో రూ.109.59 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ ఫుడ్ పార్కుపై గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. వృధాగా ఉన్న ఈ పార్కులో అన్నిరకాల మౌలిక వసతులు కల్పించి.. ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. దీనిపై మంగళవారం సచివాలయంలో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే కొంతమేర కోల్డ్ స్టోరేజీ సౌకర్యాలు, ప్యాకింగ్ హౌస్, గిడ్డంగులు, అడ్మినిస్ట్రేటివ్ కాంప్లెక్సులు, ట్రైనింగ్ సెంటర్, రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, సైట్ డెవలప్‌మెంట్, కాంపౌండ్ వాల్, పవర్ సబ్ స్టేషన్ మొదలైన వసతులు కల్పించినట్లు చెప్పారు. వాటిని పూర్తిస్థాయిలో వృద్ధి చేసి.. ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటును నిరంతరం పర్యవేక్షించాలన్నారు. మెగాఫుడ్ పార్కులో ఆయిల్‌పామ్, కొబ్బరి, కోకో, మామిడి పంటల ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు కోసం సంబంధిత కంపెనీలతో ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతోందని, ఇప్పటికే 6 కంపెనీలు యూనిట్లు నెలకొల్పడానికి ముందుకు వచ్చాయని మంత్రి వెల్లడించారు. ఫుడ్ పార్కులో ఖాళీగా ఉన్న ప్లాట్లలో లీజు ప్రాతిపదికన యూనిట్లు నెలకొల్పడానికి ముందుకు వచ్చే సంస్థలకు అనుమతులు వేగంగా ఇవ్వాలని మంత్రి తుమ్మల సూచించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యాన పథకాలను కేసీఆర్ ప్రభుత్వం వినియోగించుకోలేదని, కేంద్రం నుంచి వచ్చే రాష్ట్ర వాటాను రాబట్టుకునేందుకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఆయిల్‌పామ్ కంపెనీలు ప్లాంటేషన్ పురోగతిని వేగవంతం చేయాలన్నారు. తక్కువ ఎత్తు పెరిగే ఆయిల్‌పామ్ మొక్కలు అంతరపంటల సాగుకు అనుకూలంగా ఉంటాయని, వాటికి సంబంధించిన విత్తన మొలకలను కూడా దిగుమతి చేసుకొని, మొక్కలను రైతులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

విద్యుత్ సౌధ జప్తు!

ఎలక్ట్రికల్ సంస్థకు చెల్లింపుల వివాదంలో కోర్టు తీర్పు

» రూ.2.56 కోట్లు చెల్లించాల్సిందేనన్న ప్రత్యేక న్యాయస్థానం
» విద్యుత్ సౌధలో నోటీసులు అంటించిన కోర్టు ఉద్యోగి

హైదరాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): సబ్‌స్టేషన్లు, లైన్ల నిర్మాణానికి సంబంధించిన చెల్లింపుల వివాదంలో విద్యుత్ సౌధ (ట్రాన్స్‌కో, జెన్‌కో ప్రధాన కార్యాలయం)ను జప్తు చేస్తూ వాణిజ్య వివాదాల పరిష్కార ప్రత్యేక కోర్టు తీర్పు వెలువరించింది. తదుపరి విచారణ జరిగే లోపు విద్యుత్‌సౌధ ఉన్న స్థలాన్ని విక్రయించడం, బదలాయించడం, గిఫ్ట్ ఇవ్వడం వంటివి చెల్లవని స్పష్టం చేసింది. ఈ తీర్పు నేపథ్యంలో ఖైరతాబాద్‌లో ఇంటి నంబరు 6-3-572లోని 3వేల చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న విద్యుత్ సౌధను జప్తు చేస్తున్నట్లు పేర్కొంటూ కోర్టు ఉద్యోగి నోటీసు అంటించారు. 1999లో పూర్వ నల్లగొండ జిల్లాలోని తొమ్మిది గ్రామాల్లో సబ్‌స్టేషన్లు, లైన్ల ఏర్పాటుకు సంబంధించిన వివాదంలో ఈ తీర్పు వెలువడింది. ఆ గ్రామాల్లో 33/11 కేవీ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయడంతోపాటు 33/11 కేవీ లైన్లు వేయడానికి వీలుగా విద్యుత్తు శాఖ టెండర్లు పిలవగా.. దీనిని విజయ్ ఎలక్ట్రికల్స్ దక్కించుకుంది. నిర్మాణ అంచనా వ్యయాన్ని రూ.2.63 కోట్లుగా ఖరారు చేస్తూ విజయ్ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్‌కు వర్క్ ఆర్డర్ ఇచ్చారు. ఆర్నెల్ల లోపు పనులు పూర్తిచేయాలని టెండరు షరతుల్లో పొందుపరిచారు. అయితే సబ్‌స్టేషన్ల నిర్మాణానికి స్థలాలను సకాలంలో అప్పగించకపోవడం, సకాలంలో మెటీరియల్‌ను అందించకపోవడం, చెల్లింపులు చేయకపోవడంతో నిర్ణీత వ్యవధిలో పనులు పూర్తికాలేదు. పనులను ఆలస్యంగా 2002 జనవరి 2న పూర్తిచేసిన సంస్థ.. అదనంగా రూ.98.30 లక్షలు చెల్లించాలని కోరింది. అయితే అప్పటికి కొంత మొత్తం చెల్లించిన విద్యుత్తు సంస్థలు.. నిర్ణీత వ్యవధిలో పనులు పూర్తి చేయనందున మిగిలిన మొత్తాన్ని చెల్లించడానికి నిరాకరించాయి. దాంతో సదరు సంస్థ న్యాయస్థానాన్ని ఆశ్రయించగా.. సుదీర్ఘ పోరాటం అనంతరం పిటిషన్‌దారుకు రూ.2.56 కోట్లు చెల్లించాలంటూ ప్రత్యేక కోర్టు తీర్పు వెలువరించింది. ఈ మేరకు మంగళవారం కోర్టు ఉద్యోగి.. విద్యుత్తు శాఖ అధికారులకు నోటీసు ఇవ్వడానికి ప్రయత్నించగా దానిని తీసుకునేందుకు వారు నిరాకరించారు. దాంతో విద్యుత్ సౌధ ప్రవేశమార్గంలో ఉన్న ద్వారానికి నోటీసును అంటించారు. తాజా నిర్ణయంతో నిర్ణీత వ్యవధిలోగా పిటిషనర్‌కు రూ.2.56 కోట్లను చెల్లించకపోతే విద్యుత్ సౌధ ఉన్న స్థలాన్ని వేలం వేసేలా తీర్పు ఇచ్చే అవకాశాలున్నాయి. ఇక తదుపరి విచారణను జూన్ 5వ తేదీకి వాయిదా వేశారు.



విద్యుత్ సౌధ కార్యాలయానికి నోటీసులు అంటిస్తున్న కోర్టు ఉద్యోగి



సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కొమరబండ శ్రీవేంకటేశ్వర రైస్ మిల్లులో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

రూ.90 కోట్ల సీఎంఆర్ ధాన్యం మాయం

» అధికారుల విచారణలో గుర్తింపు
» సూర్యాపేట జిల్లా కొమరబండలో ఆరు గంటల పాటు తనిఖీలు

కోదాడ రూరల్, ఏప్రిల్ 16: సూర్యాపేట జిల్లాలోని ఓ మిల్లులో రూ.90 కోట్ల మేర కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ధాన్యం దారి మళ్లినట్లు తనిఖీల్లో వెలుగుచూసింది. మంగళవారం కోదాడ మండలం కొమరబండలోని శ్రీవేంకటేశ్వర పార్ బాయిల్డ్ రైస్‌మిల్లుపై విజిలెన్స్, సివిల్ సప్లయిస్, రెవెన్యూ అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించారు. ఆరు గంటలకు పైగా సాగిన తనిఖీల్లో సుమారు రూ.90 కోట్ల ధాన్యం మాయమైందని గుర్తించారు. సీఎంఆర్‌లో ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి బియ్యం ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఇవ్వలేదు. ప్రభుత్వం ఇటీవల ఈ రైస్ మిల్లులో ఉన్న 15,237 టన్నుల ధాన్యాన్ని టెండర్ల ద్వారా విక్రయించింది. టెండర్‌లో దక్కించుకున్న వారు ఇంకా తీసుకోకముందే ఆ ధాన్యంలో కూడా కొంత మాయమైందని అధికారులు విచారణలో గుర్తించారు. తనిఖీల్లో సుమారు 50 మంది పాల్గొన్నారని ఆర్డీవో సూర్యనారాయణ చెప్పారు. అధికారులు మొదట మిల్లు యజమానిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించాలని భావించినా ఆయన అందుబాటులో లేరు. దాంతో ఇక్కడి నుంచి వెళ్లిన సమాచారంతో హైదరాబాద్‌లో ఉన్న ఆయన ఇంట్లో కూడా అధికారులు తనిఖీలు నిర్వహించారు. అక్కడా ఆయన అందుబాటులో లేనట్లు తెలిసింది. కాగా, రైస్‌మిల్లులో అక్రమాలపై విచారణ ఇంకా కొనసాగుతుందని సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్ బీ లత తెలిపారు. రాష్ట్ర సివిల్ సప్లయిస్ కమిషనర్‌కు నివేదిక అందజేస్తామని తెలిపారు. తదుపరి చర్యలు కమిషనర్ తీసుకుంటారన్నారు. మిల్లు యాజమాన్యం నుంచి ప్రభుత్వానికి రూ.80 నుంచి రూ.90 కోట్ల విలువైన బియ్యం రావాల్సి ఉందని తెలిపారు.

గురుకులంలో కలుషిత ఆహారం..
విద్యార్థి మృతి

» ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించిన ఆరో తరగతి విద్యార్థి ప్రశాంత్

భువనగిరి టౌన్, ఏప్రిల్ 16: యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని భువనగిరి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం ఘటనలో అస్వస్థతకు గురైన విద్యార్థి మృతి చెందాడు. సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆరో తరగతి విద్యార్థి చినలచ్చి ప్రశాంత్ (12) మంగళవారం రాత్రి మరణించాడు. భూదాన్ పోచంపల్లి మండలం జిబ్లక్‌పల్లి గ్రామానికి చెందిన ప్రశాంత్.. గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తిని తీవ్ర అస్వస్థతకు గురి కావటంతో చికిత్స కోసం తొలుత భువనగిరి జిల్లా ఆస్పత్రికి తీసుకొచ్చారు. కానీ, అతడి పరిస్థితి విషమిస్తుండటంతో సికింద్రాబాద్‌లోని రెయిన్‌బో ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్య చికిత్స అందినప్పటికీ ప్రశాంత్ కోలుకోలేకపోయాడు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఆస్పత్రిలో ప్రశాంత్ మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు భువనగిరి ఇన్‌స్పెక్టర్ కే.సురేష్ కుమార్ తెలిపారు. ప్రశాంత్ మృతితో గురుకుల పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొన్నది. ఈ నెల 13వ తేదీన కలుషిత ఆహారం తిని 20మందికి పైగా విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. కొందరికి ఇప్పటికే స్వస్థత చేకూరగా, వేర్వేరు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న మరో 10 మంది విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి మెరుగవుతోందని అధికారులు తెలిపారు.

3 కిలోవాట్లు దాటితే సబ్సిడీ బంద్

» 2 కిలోవాట్లకే 60 శాతం సబ్సిడీ

» కేంద్రం 'సోలార్' మార్గదర్శకాలు

హైదరాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన కింద ఫిబ్రవరి 13 తర్వాత దరఖాస్తు చేసుకున్న వారికి 3 కిలోవాట్ల దాకానే సబ్సిడీ ఇవ్వాలని కేంద్రం నిర్ణయించింది. కేంద్ర పునరుద్ధరణీయ ఇంధన మంత్రిత్వ శాఖ మంగళవారం ఈ పథకం మార్గదర్శకాల ముసాయిదా విడుదల చేసింది. దీనిపై ఈ నెల 23వ తేదీలోగా సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరింది. ఈ ముసాయిదా ప్రకారం 2 కిలోవాట్ల దాకా మొత్తం వ్యయంలో 60 శాతం (గరిష్ఠంగా రూ.60 వేలు) సబ్సిడీ ఇస్తారు. ఆ తర్వాత కిలోవాట్‌కు రూ.18 వేలు లభిస్తుంది. అంటే 3 కిలోవాట్లకు రూ.78 వేలు సబ్సిడీ వస్తుంది. దేశవ్యాప్తంగా కోటి ఇళ్లకు సౌర విద్యుత్ అందించడం ఈ పథకం లక్ష్యం. ఇళ్లపై సౌర ఫలకాలు అమర్చుకోవడానికి కేంద్రం సబ్సిడీ ఇస్తుంది. కాలనీల్లో 20 ఇళ్లు కలిసి 100 కిలోవాట్ల ప్లాంట్ పెట్టుకుంటే గరిష్ఠంగా రూ.10.80 లక్షలు, 50 ఇళ్లు కలిసి 100 కిలోవాట్ల దాకా పెట్టుకుంటే రూ.18 లక్షలు సబ్సిడీ లభిస్తుంది

142 చెరువులకు 380 కోట్లతో పునరుజ్జీవం

హైదరాబాద్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మురుగునీటి శుద్ధి ప్లాంట్ల (ఎస్టీపీ) నుంచి వెలువడుతున్న వ్యర్థాల వల్ల అనేక చెరువులు కలుషితమవుతున్నాయి. అలాంటి చెరువుల పునరుజ్జీవానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. రాష్ట్రంలో 130 మునిసిపాలిటీల పరిధిలోని 142 చెరువులను గుర్తించి అమృత పథకం కింద ప్రతిపాదనలు పంపగా రూ.380.11 కోట్ల విడుదలకు కేంద్రం ఆమోదం తెలిపింది. త్వరలో ఈ నిధులు మంజూరవుతాయని పురపాలక శాఖ అధికారులు తెలిపారు. దేశవ్యాప్తంగా అనుసరిస్తున్న ఉత్తమ విధానాలను అధ్యయనం చేయించి అవసరమైన చర్యలు తీసుకుంటామని పురపాలక శాఖ సంచాలకులు దివ్య తెలిపారు.

'బాబ్లీ' కేసులో కోర్టుకు హాజరైన ప్రజాప్రతినిధులు

బోధన్ రూరల్, ఏప్రిల్ 16: బాబ్లీ కేసులో పలువురు ప్రజాప్రతినిధులు మంగళవారం మహారాష్ట్రలోని బిలోలి కోర్టుకు హాజరయ్యారు. 2010లో గోదావరి నీటి కోసం మహారాష్ట్ర ప్రభుత్వంతో పోరాటం చేసినందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అప్పటి సీఎం చంద్రబాబుతో పాటు ఆనాటి పలువురు శాసనసభ్యులపై మహారాష్ట్ర ప్రభుత్వం పలు సెక్షన్ల కింద కేసులు పెట్టింది. 14 ఏళ్లుగా మహారాష్ట్రలోని ధర్మాబాద్ కోర్టులో కొనసాగిన ఈ కేసు విచారణ ప్రస్తుతం బిలోలి కోర్టుకు బదిలీ అయినట్లు టీడీపీ లీగల్ టీమ్ న్యాయవాది సీహెచ్‌వీ హన్మంత్‌రావు తెలిపారు. మంగళవారం ఈ కేసు విచారణ నిమిత్తం ఏపీ మాజీ మంత్రులు దేవినేని ఉమా, నక్కా ఆనంద్‌బాబుతో పాటు అప్పటి ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, హన్మంత్ షిండే, రత్నం తదితరులు కోర్టుకు హాజరయ్యారని ఆయన చెప్పారు.

ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగుల సస్పెన్షన్

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 16: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కోడ్ ఉల్లంఘించి రాజకీయ నేతలకు శుభాకాంక్షలు తెలుపుతూ ప్రకటన ఇచ్చినందుకు ఇద్దరు ఉద్యోగులపై ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ సస్పెన్షన్ వేటు వేశారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని టీఎన్జీవో నాయకులు షేక్ అఫ్జల్‌హసన్, ఆర్వీఎస్ సాగర్ ఓ పత్రికకు ప్రకటన ఇచ్చారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి సీఎంతో పాటు మంత్రుల ఫొటోలతో వారు ఆ ప్రకటన ఇచ్చారని కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. విచారణ జరిపిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్.. ఆ ఉద్యోగులిద్దరిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నిథిమ్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

హైదరాబాద్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అద్భుతమైన ఉపాధి అవకాశాలున్న టూరిజం అండ్ హాస్పిటాలిటీ రంగంలో డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం అర్హులైన, ఆసక్తి గల అభ్యర్థులు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్(నిథిమ్)కు దరఖాస్తులు చేసుకోవాలని పర్యాటకశాఖ డైరెక్టర్ కే నిఖిల తెలియజేశారు. ప్రధానంగా టూరిజం, హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి మూడు కోర్సులు... బీఎస్సీ(మూడేళ్లు), బీబీఏ(నాలుగేళ్లు), ఎంబీఏ(రెండేళ్లు)లు ఉండగా, వాటిల్లో ప్రవేశాల కోసం ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు. కోర్సు పూర్తయిన తర్వాత క్యాంపస్ సెలక్షన్స్ ద్వారా దేశ, విదేశాల్లో మంచి వేతనాలతో ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. వివరాల కోసం పర్యాటక అధికారి 9440816071 లేదా నిథిమ్- 7842455581/ 9553700035లను సంప్రదించవచ్చని సూచించారు.

ప్రత్యేక విద్య టీచర్ల అర్హతల్లో జోక్యానికి హైకోర్టు నిరాకరణ

హైదరాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌లోని ప్రత్యేక విద్య ఉపాధ్యాయుల పోస్టుల నియామకాలకు నిర్దేశించిన కనీస అర్హత మార్కుల విషయంలో తాము జోక్యం చేసుకోలేమని మంగళవారం హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు పలువురు అభ్యర్థులు దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టేసింది. ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు విద్యనందించేందుకు సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ) కేటగిరీలో 796 స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు ఇంటర్‌లో 50 శాతం (ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ అభ్యర్థులకు 45 శాతం) తోపాటు రెండేళ్ల ప్రాథమిక లేదా ప్రత్యేక విద్య డీఈడీ డిప్లొమో ఉండాలని నోటిఫికేషన్‌లో పేర్కొంది. అర్హతలకు సంబంధించిన జీవో నెంబర్ 4ను సవాల్ చేస్తూ పలువురు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది నాయకవాది రమేశ్ వాదనలు వినిపిస్తూ.. పాఠశాల విద్యకు సంబంధించిన సవరించిన రూల్స్‌ను పట్టించుకోకుండా జీవో 4 ద్వారా కనీస అర్హతను నిర్ణయించారని తెలిపారు. వాదనలు నమోదు చేసుకున్న చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం.. నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీటీఈ) నిర్దేశించిన విధంగానే రూల్స్ ఉన్నాయని తెలిపింది. అందులో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది.

కాంగ్రెస్‌కు 10.. బీజేపీకి 5

(మొదటిపేజీ తరువాయి)

వేసింది. మరోవైపు, ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అఖండ విజయం సాధిస్తుందని, ఆ రాష్ట్రంలోని మొత్తం 25 సీట్లకుగాను ఈ కూటమి 20 సీట్లలో విజయ కేతనం ఎగురవేయనుందని ఏబీపీ-సీ ఓటర్ సర్వే వెల్లడించింది. అధికారపక్షం వైఎస్సార్‌సీపీ కేవలం ఐదు సీట్లకు పరిమితమవుతుందని తెలిపింది. టీడీపీ కూటమిలో పార్టీల వారీగా చూస్తే టీడీపీ, జనసేన కలిపి 15 సీట్లను కైవసం చేసుకుంటాయని, బీజేపీ ఐదు స్థానాల్లో విజయం సాధిస్తుందని పేర్కొంది. ఓట్ల పరంగా టీడీపీ కూటమి 46.7 శాతం ఓట్లను, వైసీపీ 39.9% ఓట్లను సాధిస్తాయని తెలిపింది. ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ కూటమి విజయం తథ్యమని ఈ సర్వే ద్వారా స్పష్టమవుతోంది.

ఇండియా టీవీ-సీఎన్‌ఎక్స్ ఒపీనియన్ పోల్

లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఇండియా టీవీ-సీఎన్‌ఎక్స్ ఒపీనియన్ పోల్ ఫలితాలు కూడా వెల్లడయ్యాయి. వీటి ప్రకారం తెలంగాణలో కాంగ్రెస్ 8, బీజేపీ 6, బీఆర్‌ఎస్ 2, ఎంఐఎం ఒక స్థానాన్ని గెల్చుకోనున్నాయి. ఏపీలో టీడీపీ 12, బీజేపీ 3, వైసీపీ 10 స్థానాలను కైవసం చేసుకుంటాయి. ఏపీలో కాంగ్రెస్ ఖాతా తెరవబోదని ఈ సర్వే పేర్కొంది. కాగా, దేశంలో బీజేపీ మరోసారి ప్రభంజనం సృష్టించనుందని, ఆ పార్టీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి 393 సీట్లతో హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేయనుందని, ఇండియా కూటమి 100 సీట్లను మించి సాధించలేదని సర్వే వెల్లడించింది.

అనన్య ప్రతిభ

(మొదటిపేజీ తరువాయి)

శాఖల్లోని 1,105 పోస్టుల భర్తీకి యూపీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది. గత ఏడాది మే 28న ప్రిలిమ్స్ నిర్వహించారు. ఇందులో అర్హత సాధించిన వారు సెప్టెంబరులో మెయిన్స్‌కు హాజరయ్యారు. డిసెంబరు 8న మెయిన్స్ ఫలితాలు వెల్లడించారు. ప్రతిభ చూపినవారికి జనవరి 2- ఏప్రిల్ 9న మధ్య ఇంటర్వ్యూలు నిర్వహించారు. 1,016 మందిని ఎంపిక చేశారు. జనరల్ అభ్యర్థులు 347, ఈడబ్ల్యూఎస్ నుంచి 115, ఓబీసీ 303, ఎస్సీలు 165, ఎస్టీలు 86 మంది సివిల్ సర్వీసులకు ఎంపికయ్యారు. 15 రోజుల్లో మార్కులను వెబ్‌సైట్ www.upsc.gov.in లో ఉంచుతామని యూపీఎస్సీ ప్రకటించింది. కాగా, 2022లో తెలంగాణకే చెందిన ఉమా హారతి మూడో ర్యాంకు సాధించారు. తాజా ఫలితాల్లో టాప్-25లో పది మంది మహిళలున్నారు. ఈ 25 మందిలోనూ ఐఐటీ, ఐఐఎం, ఎన్ఐటీ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల నుంచి డిగ్రీలు పొందిన పలువురు ఉన్నారు. సివిల్స్ విజేతలకు ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు. వారి శ్రమ, పట్టుదల, అంకితభావం కారణంగానే ప్రజా సేవకు అవకాశం లభించిందని కొనియాడారు. 'మీ కృషి దేశ భవిష్యత్తును తీర్చిదిద్దుతుందని' పేర్కొన్నారు.

నిరుడు ఐపీఎస్.. ఇప్పుడు ఐఏఎస్

సివిల్స్ టాపర్ ఆదిత్య శ్రీవాత్సవ యూపీలోని లఖ్‌నవూకు చెందినవారు. గతేడాది 236 ర్యాంకుతో ఐపీఎస్‌కు ఎంపికై హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ అకాడమీలో శిక్షణ పొందారు. ప్రస్తుతం పశ్చిమ బెంగాల్‌లో ట్రైనీ ఐపీఎస్‌గా ఉన్నారు. శ్రీవాత్సవ ఐఐటీ కాన్పూర్‌లో బీటెక్, ఎంటెక్ చదివారు. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ ఆప్షనల్ సబ్జెక్టుగా ఈసారి సివిల్స్ రాసి టాపర్‌గా నిలిచారు. దీనికిముందు ఆయన ప్రయివేటు సంస్థలో కొన్నాళ్లు ఉద్యోగం చేశారు. అయితే, సివిల్స్ సాధించాలన్న లక్ష్యంతో దానిని వదులుకున్నారు. శ్రీవాత్సవ తండ్రి అజయ్ ఆడిట్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగి. తల్లి అభా గృహిణి.

అమ్మ చనిపోయిన బాధను అధిగమించి..

రెండో ర్యాంకర్ అనిమేష్ ప్రధాన్‌ది ఒడిశాలోని అంగుల్ జిల్లా తల్చార్ పట్టణం. కేంద్రీయ విద్యాలయంలో చదివారు. రూర్కెలా ఎన్ఐటీ నుంచి కంప్యూటర్ సైన్స్‌లో డిగ్రీ పూర్తి చేశారు. సోషియాలజీ ఆప్షనల్‌గా సివిల్స్ సాధించారు. అనన్యలాగానే ఎలాంటి కోచింగ్ లేకుండా తొలి ప్రయత్నంలోనే సివిల్స్ కొట్టారు. 2022లో సాధన మొదలుపెట్టానని, రోజుకు 5 నుంచి 6 గంటలు చదివానని ఆయన తెలిపారు. కాగా, గత నెలలో సరిగ్గా అనిమేష్ ఇంటర్వ్యూకు హాజరయ్యే సమయంలో ఆయన తల్లి మృతిచెందారు. తండ్రి 2015లోనే చనిపోయారు. అయినా మనోధైర్యంతో ముందుకెళ్లి అనుకున్నది సాధించారు. సొంత రాష్ట్రంలో వెనుకబడిన వర్గాలకు సేవ చేయడమే తన లక్ష్యమని వివరించారు.

ఐపీఎస్ శిక్షణలో అమ్మానాన్నకు చెప్పకుండా

కేరళకు చెందిన పీకే సిద్ధార్థ్ రామ్‌కుమార్ చిన్నప్పటి నుంచి ఆటలు, చదువులో ప్రతిభావంతుడు. ఐఏఎస్ సాధించాలన్న లక్ష్యం పెట్టుకున్నా.. గత ఏడాది 121వ ర్యాంకులో నిలిచారు. దీంతో ఐపీఎస్‌కు ఎంపికయ్యాడు. కానీ, తన లక్ష్యాన్ని మాత్రం మరువలేదు. హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ పోలీస్ అకాడమీలో శిక్షణలో ఉంటూనే సివిల్స్‌కు సన్నద్ధమయ్యారు. అయితే, ఇదంతా అతడు తల్లిదండ్రులకు ఏమాత్రం చెప్పలేదు. తాజాగా ఫలితాల్లో సిద్ధార్థ్ 4వ ర్యాంకు సాధించాడని తెలిసి, టీవీలో ఫొటో, పేరు చూసి వారు అమితాశ్చర్యానికి గురయ్యారు. సిద్ధార్థ్ బీఆర్క్ చదివారు. ఆంత్రోపాలజీని ఆప్షనల్ సబ్జెక్టుగా తీసుకున్నారు. కాగా, రుహానీ ఢిల్లీ సెయింట్ స్టీఫెన్స్ కాలేజీలో బీఏ (ఆనర్స్) పూర్తిచేశారు. ఎకనామిక్స్ ఆప్షనల్‌గా తీసుకుని సివిల్స్ సాధించారు.



కుటుంబ సభ్యులతో అనన్యారెడ్డి

సేవే లక్ష్యం.. అది సివిల్స్ ద్వారానే సాధ్యం: అనన్య

"సమాజానికి సేవ చేయాలనేది నా చిన్ననాటి కల. అది సివిల్ సర్వీసెస్ ద్వారానే సాధ్యమని గట్టిగా నమ్మాను. అలా బలంగా నాలో నాటుకున్న కోరిక నెరవేరింది. మా ఇంట్లో సివిల్ సర్వీసెస్‌లో ఉన్నవారు ఎవరూ లేరు. అయినా లక్ష్యాన్ని ఆత్మవిశ్వాసంతో అందుకున్నా. ఎంతో గర్వంగా ఉంది" అని తెలిపారు అనన్యరెడ్డి. ఇంటర్వ్యూ తర్వాత మంచి ర్యాంకు వస్తుందని భావించానని, మూడో స్థానంలో ఉంటానని అసలు ఊహించలేదని వివరించారు. కాగా, అనన్య గత సంవత్సరమే డిగ్రీ పూర్తి చేశారు. ఏడాది వ్యవధిలోనే సివిల్స్‌లో ప్రతిభ చూపారు. ఈమె పదో తరగతి వరకు మహబూబ్‌నగర్‌లోని గీతం హైస్కూల్‌లో చదివారు. హైదరాబాద్‌లో నారాయణ ఐఏఎస్ అకాడమీలో ఇంటర్ పూర్తిచేశాక ఢిల్లీలోని మెరిండా హౌస్ కాలేజీలో జాగ్రఫీ ప్రధాన సబ్జెక్టుగా డిగ్రీ చదివారు. వెంటనే సివిల్స్ ప్రిపరేషన్‌పై దృష్టిసారించారు. "రోజుకు 12 నుంచి 14 గంటలు చదివా. సిలబస్ మొత్తం కవర య్యేలా సన్నద్ధత వ్యూహాన్ని రూపొందించుకున్నాను. సివిల్స్‌లో నా ఆప్షనల్ ఆంత్రోపాలజీ. దీనికి మాత్రమే కోచింగ్ తీసుకున్నా. సొంత నోట్స్ ఆధారంగానే పరీక్షలకు హాజరయ్యాను. మా అమ్మ మంజులత గృహిణి, నాన్న సురేష్‌రెడ్డి సెల్ఫ్ ఎంప్లాయి. నేను వారి రెండో కుమార్తెను. సివిల్స్ పట్ల నా ఆసక్తిని గమనించి చాలా ప్రోత్సహించారు" అని వివరించింది. అనన్య సాధించిన ఘనత పట్ల పాలమూరుకు చెందిన విద్యావేత్తలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సివిల్స్ ర్యాంకర్లకు సీఎం రేవంత్ అభినందన

హైదరాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): సివిల్స్ 2023 ఫలితాల్లో మెరిసిన తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి ఈ సారి దాదాపు 40 మందికి పైగా సివిల్ సర్వీస్‌లకు ఎంపిక కావడం పట్ల ముఖ్యమంత్రి ఆనందం వ్యక్తం చేశారు. కాగా పాలమూరు జిల్లాకు చెందిన దోనూరి అనన్యరెడ్డి జాతీయ స్థాయిలో మూడో ర్యాంకు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమెకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.



అనన్య



పృథ్వీ



నరేంద్ర



సాయి

యూపీఎస్సీలో 'నారాయణ' సత్తా!

హైదరాబాద్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): దేశంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే సివిల్స్‌లో తమ విద్యార్థులు సంచలన విజయం సాధించినట్లు నారాయణ విద్యా సంస్థల డైరెక్టర్లు సింధూర నారాయణ, శరణి నారాయణలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ విద్యార్థులు జాతీయ స్థాయిలో 3వ ర్యాంకుతో పాటు, 493వ, 545వ, 919వ ర్యాంకులను సాధించారని వెల్లడించారు. సివిల్స్ ఫలితాల్లో దోనూరు అనన్యరెడ్డి 3వ ర్యాంకు, దొనక పృథ్వీరాజ్ కుమార్ 493వ ర్యాంకు, నరేంద్ర పడాల్ 545వ ర్యాంకు, ధరావత్ సాయిప్రకాష్ 919వ ర్యాంకులను సాధించినట్లు వారు చెప్పారు. సివిల్స్ కష్టతరమైన లక్ష్యంగా నేటి తరం భావిస్తోందని, అయితే పట్టుదల, నిరంతర కృషి ఉంటే సాధించలేనిది ఏమీ లేదని పేర్కొన్నారు. ఐఏఎస్ కలను నెరవేర్చేందుకు తమ విద్యా సంస్థ ఇంటిగ్రేటెడ్ ఐఏఎస్ అకాడమీని తీర్చిదిద్దామని, ఇప్పుడు సాధించిన విజయమే అందుకు సాక్ష్యమని డైరెక్టర్లు చెప్పారు.

సివిల్స్‌లో మెరిసిన తెలంగాణ యువత

27వ ర్యాంకుతో కరీంనగర్ బిడ్డ సాయికిరణ్ సత్తా.. తల్లి బీడీ కార్మికురాలు.. కోచింగ్ లేకుండానే కొలువు

» 22 ఏళ్లకే ఐఏఎస్ అయిన వికారాబాద్ వాసి తరుణ్

» కటిక పేద కుటుంబం.. తల్లిదండ్రులు రోజు కూలీలు







కౌశిక్ (82వ ర్యాంకు), జయసింహారెడ్డి (103), ధీరజ్‌రెడ్డి (173)

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): యూపీఎస్సీ విడుదల చేసిన సివిల్స్ ఫలితాల్లో తెలంగాణ యువత ప్రతిభ కనబరిచారు. వందలోపు ర్యాంకుల్లో ముగ్గురు అభ్యర్థులు స్థానం సంపాదించి జయకేతనం ఎగరేశారు. తండ్రిని కోల్పోయి.. తల్లి బీడీలు చుడుతూ కష్టపడితే వచ్చిన డబ్బులతో చదువుకున్న కరీంనగర్ యువకుడు సాయికిరణ్ 27వ ర్యాంకు సాధించి ఆదర్శంగా నిలిచారు. కటిక పేదరికంలో పెరిగి.. తల్లిదండ్రులు ఇచ్చిన కూలీ పైసలతో చదువుకుని.. 22 ఏళ్లకే ఐఏఎస్ కొలువు సాధించి.. వికారాబాద్ కుర్రాడు దయ్యాల తరుణ్ శభాష్ అనిపించారు. జనగామ జిల్లా కేంద్రానికి చెందిన మెరుగు కౌశిక్ మొదటి ప్రయత్నంలోనే 82వ ర్యాంకు సాధించారు. ఉస్మానియా యూనివర్సిటీలో బీటెక్ పూర్తి చేసిన ఆయన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్స్‌లో (ఐఐఎఫ్‌టీ)లో ఎంబీఏ పూర్తి చేశారు. ఢిల్లీలో సివిల్స్ కోచింగ్ తీసుకున్నారు. సివిల్స్ ప్రిపరేషన్‌లో రోజుకు 12 గంటలకు పైగా చదివానని కౌశిక్ తెలిపారు. హనుమకొండ జిల్లా కేంద్రంలోని విద్యుత్ నగర్‌కు చెందిన రావుల జయసింహారెడ్డి 103వ ర్యాంకు సాధించారు. గత ఏడాది 217వ ర్యాంకు సాధించిన ఆయన ఐపీఎస్ శిక్షణలో ఉన్నారు. నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలం అల్వాలకు చెందిన పెంకీస్ ధీరజ్‌రెడ్డి 173వ ర్యాంకు సాధించారు. ఆయన 2015లో ఐఐటీ జేఈఈలో ఆల్ ఇండియా 64వ ర్యాంకు సాధించి ఐఐటీ ఢిల్లీలో చేరారు. సివిల్స్‌పై ఆసక్తితో కొద్ది నెలలకే బీటెక్ ఆపేశారు. ఉస్మానియా యూనివర్సిటీ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ విభాగం ద్వారా 2015లో బీఏ కోర్సులో చేరారు. సివిల్ సర్వీసెస్ పరీక్షకు సన్నద్ధమవుతూ మూడుసార్లు యూపీఎస్సీ పరీక్ష రాశారు. ప్రస్తుతం ఐపీఎస్ లేదా వనపర్తి జిల్లా ఆత్మకూరుకు చెందిన ఏక్ ద ముషాసిర్ 278వ ర్యాంకు సాధించారు. న్యూఢిల్లీలోని లేడీ శ్రీరామ్ కాలేజీలో డిగ్రీ చదివిన ఆమె టాపర్‌గా నిలిచారు. అనంతరం ఇంట్లోనే సివిల్స్‌కు సిద్ధమయ్యారు. వరంగల్ జిల్లా గీసుగొండ మండలం అనంతారం గ్రామానికి చెందిన సైంపు కిరణ్‌కుమార్ 568వ ర్యాంకు సాధించారు. గతంలో వచ్చిన ర్యాంకుతో ప్రస్తుతం ఇండియన్ పోస్టల్ సర్వీస్‌లో విజయవాడ, విశాఖ నగరాల్లో పనిచేస్తున్నట్టు ఆయన చెప్పారు.

పేద బిడ్డలు.. చదువులో మెరికలు..

సిద్దిపేట జిల్లా కొండపాక మండల కేంద్రానికి చెందిన బుద్ధి అఖిల్ 321వ ర్యాంకు సాధించారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన ఆయన ఎలాంటి కోచింగ్ తీసుకోలేదు. 2019లో ప్రిలిమ్స్‌లో.. 2020లో మెయిన్స్‌లో ఫెయిల్ అయ్యారు. 2021లో 566వ ర్యాంకు సాధించి.. ప్రస్తుతం ఢిల్లీలో ఏసీపీగా పనిచేస్తున్నారు. జనగామ జిల్లా రఘునాథపల్లికి చెందిన నిరుపేద అభ్యర్థి కొయ్యడ ప్రణయ్ 554వ ర్యాంకు సాధించారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో పాలిటెక్నిక్ వరకు చదివిన ఆయన.. కూకట్‌పల్లి జేఎన్‌టీయూలో బీటెక్ ఎలక్ట్రానిక్స్ చదివారు.

పట్టు వదలకుండా శ్రమించి..

నాగర్‌కర్నూలు జిల్లా వెల్దండ మండలం పోచమ్మగడ్డ తండాకు చెందిన వడ్త్యావత్ యశ్వంత్‌నాయక్ 627వ ర్యాంకు సాధించారు. మొదటిసారి ఇంటర్వ్యూలో విఫలమైన యశ్వంత్ పట్టుదలతో రెండోసారి పరీక్ష రాశారు. మంచిర్యాల జిల్లా జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ కుమారుడు ఆరె విశాల్ 718వ ర్యాంకు సాధించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌కు చెందిన కొలనుపాక సహన నాలుగో ప్రయత్నంలో 739వ ర్యాంకు పొందారు. వరంగల్ జిల్లా కేంద్రంలోని శివనగర్‌కు చెందిన కోటే అనిల్‌కుమార్ 764వ ర్యాంకు పొందారు. గతేడాది 4వ ప్రయత్నంలో 584 ర్యాంకు రాగా, కోల్‌కతాలో ఇండియన్ పోస్టల్ సర్వీస్‌లో పనిచేస్తున్నానని చెప్పారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌కు చెందిన శశికాంత్ 891వ ర్యాంకు సాధించారు. ప్రస్తుతం ఆయన అస్సాంలో ఐఆర్ఎస్ అధికారిగా పనిచేస్తున్నారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం గోవిందాపురం(ఎల్) గ్రామానికి చెందిన సాయి అలేఖ్య ఐదో ప్రయత్నంలో 938వ ర్యాంకు సాధించారు.

మెరిసిన తెలుగు తేజాలు..

సివిల్స్‌లో తెలుగు రాష్ట్రాలకు చెందిన సుమారు 23 మంది వెయ్యిలోపు ర్యాంకులు పొందారు. అక్షయ్ దీపక్ 196వ ర్యాంకు, లక్ష్మీ అన్నపూర్ణ(198), అనూష పిళ్లై(202), ఓంకార్(202), సయ్యద్ ముస్తాఫా హాష్మీ(312), ఎన్.ప్రదీప్‌రెడ్డి(382), నందిరాజు శ్రీమేఘన దేవ్(411), కృష్ణ శ్రీవాస్తవ్(444), బన్న వెంకటేశ్(467), హరి ప్రసాద్‌రాజ్(475), పూల ధనుష్(480), ఏ.మౌనిక(487), పృథ్వీరాజ్(493), కె.శ్రీనివాసులు(526), నెల్లూరు సాయితేజ(558), కిరణ్(568), నాగభరత్(580), భార్గవ్(590), కె.అర్పిత(639), సాక్షి కుమారి(679), రాజ్‌కుమార్ (703), గాదె శ్వేత(711), వి. ధనుంజయ్‌కుమార్(810), లక్ష్మీ బానోతు(828), ఆదా సందీప్ కుమార్(830), రాహుల్(873), హనిత వేముల పాటి(887), కె.శశికాంత్(891), కే.మీన(899), గోవడ నవ్యశ్రీ 995వ ర్యాంకులు సాధించారు.

కడు పేదరికం నుంచి.. కలెక్టర్ స్థాయికి..



నిరుపేద కుటుంబానికి చెందిన దయ్యాల తరుణ్ 22 ఏళ్ల వయసులో తొలి ప్రయత్నంలోనే 231వ ర్యాంకు సాధించారు. వికారాబాద్ జిల్లా పూడూరు మండలం మంచన్‌పల్లికి చెందిన తరుణ్ కుటుంబం కటిక పేదరికంలో ఉంది. తరుణ్ తల్లిదండ్రులు బాబయ్య, శశికళ ప్రభుత్వం ఇచ్చిన ఎకరా భూమిలో సాగు చేసుకుంటూ, కూలి పనులకు వెళుతున్నారు. తరుణ్ 1 నుంచి 10వ తరగతి వరకు హైదరాబాద్ బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో చదివారు. మొయినాబాద్‌లోని వీజేఐటీ కళాశాలలో 2023లో బీటెక్ పూర్తి చేశారు. హైదరాబాద్‌లో బాబాయ్ వద్ద ఉంటూ సివిల్స్ పరీక్షలకు సిద్ధమయ్యారు. బీటెక్ చదువుకునే రోజుల్లోనే ఐఏఎస్ కావాలని లక్ష్యాన్ని నిర్ణయించుకున్నానని తరుణ్ చెప్పారు.

చేనేత బిడ్డ.. చాటాడు సత్తా



కరీంనగర్ జిల్లా రామడుగు మండలం వెలిచాల గ్రామానికి చెందిన నంద్యాల సాయికిరణ్ 27వ ర్యాంకు సాధించారు. నిరుపేద చేనేత కుటుంబానికి చెందిన సాయికిరణ్ తండ్రి కాంతయ్య పవర్‌లూమ్ కార్మికుడిగా పనిచేస్తూ ఎనిమిదేళ్ల క్రితం క్యాన్సర్ బారినపడి చనిపోయారు. తల్లి లక్ష్మి బీడీ కార్మికురాలు. తండ్రి మృతి చెందడంతో తల్లి కుటుంబాన్ని పోషిస్తూ ఇద్దరు పిల్లలను చదివించింది. వరంగల్ ఎన్ఐటీలో బీటెక్ పూర్తి చేసిన సాయి కిరణ్.. హైదరాబాద్‌లో సీనియర్ హార్డ్‌వేర్ ఇంజనీర్‌గా పని చేశారు. ఉద్యోగం చేస్తూనే సివిల్స్‌కు సిద్ధమయ్యారు. కోచింగ్ లేకుండానే రెండో ప్రయత్నంలో విజయం సాధించారు. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. తన కష్టానికి తగిన ఫలితం దక్కిందన్నారు. తనలాగే కష్టపడే వారికి సంపూర్ణ సహకారం అందిస్తానని చెప్పారు. సాయి కిరణ్ అక్క స్రవంతి ఆర్‌డబ్ల్యూఎస్‌లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పని చేస్తున్నారు.

సీఐ అవమానించడంతో.. ఉద్యోగానికి రాజీనామా


» నాలుగో ప్రయత్నంలో 780వ ర్యాంక్

» కానిస్టేబుల్ ఉదయ్‌కృష్ణారెడ్డి గాథ



చిక్కడపల్లి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): "నా తప్పు లేకున్నా.. వ్యక్తిగత కక్షతో అరవై మంది పోలీసుల ముందు సీఐ నన్ను అవమానించాడు. దీంతో ఆ రోజే కానిస్టేబుల్ ఉద్యోగానికి రాజీనామా చేశా. ఐఏఎస్ సాధించాలని కసితో దీక్ష తీసుకున్నా. ఆ ఏడాది నుంచే సన్నద్ధత ప్రారంభించా. నాలుగో ప్రయత్నంలో 780వ ర్యాంక్ సాధించా" అని ఏపీలోని ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన ఉదయ్‌కృష్ణారెడ్డి తెలిపారు. తన చిన్నప్పుడే తల్లిదండ్రులు చనిపోయారని, నానమ్మ రమణమ్మ పెంపకంలో పెరిగానని వివరించారు. కష్టపడి చదివి కానిస్టేబుల్ కొలువు సాధించానని, 2013-18 మధ్య కానిస్టేబుల్‌గా గుడ్లూరులో కానిస్టేబుల్‌గా పనిచేశానని చెప్పారు. ఆ సమయంలో సీఐ చేసిన అవమానమే సివిల్స్ సాధించేందుకు దోహదపడిందన్నారు. ఐఆర్ఎస్ వస్తుందని.. ఆ జాబ్‌లో చేరి ఐఏఎస్ సాధించేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు. తనకు జంతువులంటే ఎంతో ప్రేమ అని.. వాటికోసం దేశవ్యాప్తంగా 109 సర్వీసు ప్రారంభించేలా ప్రయత్నం చేస్తానని పేర్కొన్నారు.

వెన్నులో ఇన్ఫెక్షన్‌తో కాళ్లు చచ్చుబడినా..



ఏపీలోని విశాఖపట్టణానికి చెందిన అనిత వేములపాటి సివిల్స్ నాలుగో ప్రయత్నంలో 887 ర్యాంక్ సాధించారు. ఖరగ్‌పూర్ ఐఐటీలో రెండో సెమిస్టర్ చదువుతుండగా వెన్నులో ఇన్ఫెక్షన్ రావడంతో రెండు కాళ్లు చచ్చుబడి వీల్‌చైర్‌కు పరిమితమయ్యారు. అయినా నిరాశ చెందకుండా డిగ్రీ పూర్తి చేసి అమ్మానాన్నల ప్రోత్సాహంతో సివిల్స్ సాధించారు. అనిత తండ్రి రామచంద్రరావు రైల్వే శాఖలో ఉన్నతాధికారిగా, తల్లి ఇందిరాదేవి ఐసీడీఎస్‌లో అధికారిగా పనిచేస్తున్నారు.

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: **K. Srinivas**. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. **Managing Director: Vemuri Radha Krishna,** Founder: K.L.N.Prasad.*

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● బుధవారం 17 ఏప్రిల్ 2024
diksuchi@andhrajyothy.com

మాస్టర్స్ డిగ్రీ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్



హైదరాబాద్‌లోని దక్కన్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్(డీఎస్ఎం-ఉస్మానియా యూనివర్సిటీ అనుబంధ కళాశాల)- మాస్టర్స్ డిగ్రీ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ (ఎండీహెచ్ఎం) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. దీనికి ఏఐసీటీఈ గుర్తింపు ఉంది. మొత్తం 60 సీట్లు ఉన్నాయి. వీటిలో 42 సీట్లను ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా, మిగిలిన 18 సీట్లను మేనేజ్‌మెంట్ కోటా కింద భర్తీ చేస్తారు. ఎంట్రెన్స్ టెస్ట్‌ను ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహిస్తుంది. దరఖాస్తుతోపాటు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ మార్కుల పత్రాలను జత చేయాలి.

ప్రోగ్రామ్ వివరాలు: కోర్సులో భాగంగా క్లాస్ రూమ్ లెక్చర్స్, ఆన్‌లైన్ లెక్చర్స్, గెస్ట్ లెక్చర్స్, హాస్పిటల్ విజిట్స్, ప్రాజెక్ట్ వర్క్‌లు, ఇంటర్న్‌షిప్, డిజర్టేషన్ వర్క్, ఇతర రాష్ట్రాల్లోని హాస్పిటల్స్‌కు స్టడీ టూర్స్ ఉంటాయి. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. సమ్మర్ ఇంటర్న్‌షిప్ వ్యవధి ఎనిమిది వారాలు ఉంటుంది. ప్రాజెక్ట్ వర్క్ పూర్తిచేయకుండా రెండో ఏడాది కోర్సులోకి అనుమతించరు.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 50 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు. చివరి సంవత్సర పరీక్షలు రాసి ఫలితాల కోసం చూస్తున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. డాక్టర్స్, పారామెడికల్ ప్రొఫెషనల్స్‌కు ప్రాధాన్యం ఉంటుంది.

ఎంట్రెన్స్ టెస్ట్ వివరాలు: పరీక్ష 100 మార్కులకు ఉంటుంది. రీజనింగ్, న్యూమరికల్ ఎబిలిటీ, ఇంగ్లీష్ కాంప్రహెన్షన్ అండ్ యూసేజ్, హెల్త్ అండ్ హాస్పిటల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ అంశాల నుంచి ఒక్కోదానిలో 20 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. అభ్యర్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద హెచ్‌బీ పెన్సిల్‌తో గుర్తించాలి. పరీక్ష సమయం గంటన్నర. ఈ పరీక్షలో అర్హత సాధించాలంటే కనీసం 25 శాతం మార్కులు రావాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1500; దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** మే 30
- **ఎంట్రెన్స్ టెస్ట్‌కు సంబంధించిన ఫ్రీ కోచింగ్ క్లాసెస్:** జూన్ 25 నుంచి 29 వరకు
- **పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** జూన్ 30
- **ఎంట్రెన్స్ టెస్ట్ ఫలితాలు విడుదల:** జూలై 10
- **చిరునామా:** అడ్మిషన్ సెల్, దారుస్సలాం ఎడ్యుకేషనల్ ట్రస్ట్, దారుస్సలాం, అగాపురా, నాంపల్లి, హైదరాబాద్- 500001
- **వెబ్‌సైట్:** www.dshm.co.in, www.osmania.ac.in

ఐఐటీ రోపార్‌లో ఎంటెక్


రోపార్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)- 'ఎంటెక్ ఇన్ మెటీరియల్స్ ఇంజనీరింగ్' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. గేట్ స్కోర్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ముందుగా కామన్ ఆఫర్ యాక్సెప్టెన్స్ పోర్టల్(సీఓఏపీ) 2024లో రిజిస్టర్ చేసుకోవాలి. ఈ ప్రోగ్రామ్‌లో 8 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి బీటెక్(మెటలర్జీ/మెటీరియల్స్/ మెకానికల్/మైనింగ్/ప్రొడక్షన్/కెమికల్/బయోటెక్నాలజీ/టెక్స్‌టైల్/ఏరోస్పేస్ ఇంజనీరింగ్) లేదా ఎమ్మెస్సీ(ఫిజిక్స్/కెమిస్ట్రీ/మెటీరియల్స్ సైన్స్/ ఎన్విరాన్‌మెంటల్/నానోటెక్నాలజీ) ఉత్తీర్ణులై ఉండాలి. సంబంధిత కోడ్ పేపర్‌లో గేట్ 2022/2023/2024 అర్హత పొంది ఉండాలి. ఐఐటీల నుంచి కనీసం 8 సీజీపీఏతో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన అభ్యర్థులకు గేట్ స్కోర్ అవసరం లేదు.

ఆర్థిక సహకారం: సంస్థ నిబంధనల ప్రకారం నెలకు రూ.12,400 చొప్పున రెండేళ్లపాటు గేట్ ఫెలోషిప్ ఇస్తారు. ఇందుకుగాను అభ్యర్థులు ల్యాబొరేటరీ డిమాన్‌స్ట్రేషన్స్, ట్యుటోరియల్స్, అసైన్‌మెంట్స్, టెస్ట్ పేపర్లు, సెమినార్లు, రీసెర్చ్ ప్రాజెక్టులకు సంబంధించిన వ్యవహారాల్లో వారానికి 8 గంటలు అసిస్టెంట్‌గా వ్యవహరించాల్సి ఉంటుంది.

- జనరల్ అభ్యర్థులకు రూ.500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.250
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 25
- **వెబ్‌సైట్:** iitrpr.ac.in

ఐఐఎస్‌టీలో పీహెచ్‌డీ



తిరువనంతపురంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఐఐఎస్‌టీ)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. రెగ్యులర్, స్పాన్సర్డ్ విధానాలు అందుబాటులో ఉన్నాయి.

విభాగాలు: ఏరోస్పేస్ ఇంజనీరింగ్, ఏవియానిక్స్, కెమిస్ట్రీ, ఎర్త్ అండ్ స్పేస్ సైన్సెస్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, మేథమెటిక్స్, ఫిజిక్స్.

అర్హత: కనీసం 60 శాతం మార్కులతో(ఎంఈ/ఎంటెక్/ఎంఎస్)(ఇంజనీరింగ్/ టెక్నాలజీ)/ మాస్టర్స్ (సైన్స్/హ్యూమానిటీస్/మేనేజ్‌మెంట్/సోషల్ సైన్సెస్) ఉత్తీర్ణులై ఉండాలి. ఇంజనీరింగ్ విభాగాలకు కనీసం 7.5 సీజీపీఏతో బీఈ/బీటెక్ పూర్తి చేసిన వారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. గేట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్ విభాగాలకు నెట్ స్కోర్ ఉండాలి. డీఎస్‌టీ/ఇన్‌స్పైర్ ఫెలోషిప్ లేదా యూజీసీ/సీఎస్ఐఆర్ నెట్ లెక్చరర్‌షిప్ లేదా ఎన్‌బీహెచ్ఎం/జెస్ట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది. ఐఐఎస్‌టీ, ఐఐటీ సంస్థల నుంచి కనీసం 8 సీజీపీఏతో బీఈ/బీటెక్ లేదా డ్యూయెల్ డిగ్రీ(ఇంజనీరింగ్) పూర్తిచేసిన అభ్యర్థులను; విదేశీ యూనివర్సిటీల నుంచి కనీసం 8/10 సీజీపీఏ లేదా 3.6/4 సీజీపీఏతో మాస్టర్ ఆఫ్ సైన్స్ ఇన్ ఇంజనీరింగ్ పూర్తిచేసినవారిని; నెట్/జెస్ట్/ఎన్‌బీహెచ్ఎం స్కోర్ ఉన్నవారిని గేట్ స్కోర్ నుంచి మినహాయించారు. అభ్యర్థుల వయసు దరఖాస్తు నాటికి 35 ఏళ్లు మించకూడదు. స్పాన్సర్డ్ అభ్యర్థులు పనిచేస్తున్న సంస్థ నుంచి నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి.

ఎంపిక: అభ్యర్థులను ఆన్‌లైన్ స్ర్కీనింగ్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేస్తారు. ఫెలోషిప్ అర్హత లేదా నెట్/ఎన్‌బీహెచ్ఎం/జెస్ట్/ గేట్ (2022/2023/2024) స్కోర్ ఉన్నవారిని నేరుగా ఇంటర్వ్యూకి పిలుస్తారు. ఇంటర్వ్యూలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహిస్తారు. స్ర్కీనింగ్ టెస్ట్‌లో రెండు సెక్షన్‌లు ఉంటాయి. మొదటి సెక్షన్‌లో ఆప్టిట్యూడ్, ఇంటర్ స్థాయి మేథమెటిక్స్ నుంచి; రెండో సెక్షన్‌లో సంబంధిత స్పెషలైజేషన్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఈ స్ర్కీనింగ్ టెస్ట్‌లో అర్హత పొందాలంటే జనరల్ అభ్యర్థులకు కనీసం 50 శాతం మార్కులు, రిజర్వ్‌డ్ అభ్యర్థులకు 45 శాతం మార్కులు రావాలి. స్ర్కీనింగ్ టెస్ట్, ఇంటర్వ్యూల్లో మొత్తమ్మీద జనరల్ అభ్యర్థులకు 60 శాతం మార్కులు, రిజర్వ్‌డ్ అభ్యర్థులకు 55 శాతం మార్కులు రావాలి. ఆన్‌లైన్ టెస్ట్ స్కోర్‌కు 70 శాతం, ఇంటర్వ్యూకి 30 శాతం వెయిటేజీ ఉంటుంది.

రీసెర్చ్ ఫెలోషిప్: స్ర్కీనింగ్ టెస్ట్ ద్వారా ప్రవేశం పొందిన అభ్యర్థులకు సంస్థ ఫెలోషిప్ ఇస్తుంది. మొదటి రెండేళ్లు నెలకు రూ.37,000; ఆ తరవాత నెలకు రూ.42,000 చెల్లిస్తారు. అభ్యర్థులు ట్యుటోరియల్స్ విభాగాల్లో, ప్రాక్టికల్ ట్రెయినింగ్ ల్యాబ్స్‌లో, ఇతర అకడమిక్ యాక్టివిటీస్‌లో వారానికి ఆరు గంటలపాటు అసిస్టెంట్‌గా బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుంది.

ముఖ్య సమాచారం

- పురుషులకు రూ.700; మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.350
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 7
- **స్పాన్సర్డ్ అభ్యర్థుల దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** మే 10
- **ఆన్‌లైన్ స్ర్కీనింగ్ టెస్ట్, డైరెక్ట్ ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** రెగ్యులర్ అభ్యర్థులకు మే 16న; స్పాన్సర్డ్ అభ్యర్థులకు మే 21న
- **ఆన్‌లైన్ స్ర్కీనింగ్ టెస్ట్ తేదీ:** మే 29న
- **స్ర్కీనింగ్ టెస్ట్ ఫలితాలు విడుదల:** జూన్ 5న
- **ఇంటర్వ్యూలు:** జూన్ 19 నుంచి 21 వరకు
- **ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూలై 1న
- **అభ్యర్థుల రిపోర్టింగ్:** జూలై 23న
- **పీహెచ్‌డీ తరగతులు ప్రారంభం:** జూలై 29 నుంచి
- **అడ్మిషన్స్‌కు చివరి తేదీ:** ఆగస్టు 14
- **వెబ్‌సైట్:** iist.ac.in

SCHOLARSHIP ALERT

IET India Scholarship Award 2024

Description: The Institution of Engineering and Technology (IET) is inviting applications from undergraduate engineering students to sharpen their creativity, innovation, leadership, and excellence. The scholarship aims to recognise and nurture future engineering leaders in India.

Eligibility: Open for students studying in the 1st, 2nd, 3rd, or 4th year of a full-time regular undergraduate engineering program (in any field) at an AICTE/UGC-approved institution. The scholarship is also open for lateral entry students who join a B.Tech. program in the 2nd year. They must have cleared all regular credit courses in a single attempt. Applicants must have scored at least 60% in aggregate or an equivalent CGPA of at least six on a 10-point scale in the semesters cleared so far.

Prizes & Rewards: Scholarships worth INR 10,00,000

Last Date to Apply: 31-05-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/IET4

Global Scholarship Program AIS 2024

Description: Global Scholarship Program AIS 2024 is an opportunity offered by AIS Technolabs Pvt. Ltd. to undergraduate and postgraduate students. The main objective of this scholarship programme is to provide financial support and leadership opportunities to students in their preferred subjects.

Eligibility: Open for citizens of India or any country/ region. Applicants must have completed secondary school/high school education. Students must have applied for an undergraduate/postgraduate course in any subject from an accredited college/ institution/ university in the world. Candidates must have completed at least one term in the respective course and should not be a college dropout.

Prizes & Rewards: An annual scholarship up to two years and other benefits

Last Date to Apply: 15-05-2024

Application mode: via email only at - sunnyc@aistechnolabs.com

Short Url: www.b4s.in/aj/GSPA6

Kotak Suraksha Scholarship Program

Description: Kotak Securities Limited (KSL) invites applications from students studying in Classes 9 to 12 or pursuing general/professional graduation.

Eligibility: Open to PwD applicants currently studying in Classes 9 to 12 or pursuing general/professional graduation in India. Applicants must have secured at least 55% marks in their previous academic year. PAN India applicants are eligible. Annual family income of the applicants must not exceed INR 3,20,000.

Prizes & Rewards: Scholarship up to INR 1,00,000 per year

Last Date to Apply: 30-04-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/KSSP1



buddy4study.com

జాబ్ కార్నర్

ఆర్‌పీఎఫ్‌లో ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలు

మొత్తం ఖాళీలు: 4,660

రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్)/రైల్వే ప్రొటెక్షన్ స్పెషల్ ఫోర్స్(ఆర్‌పీఎస్ఎఫ్)లో కింద పేర్కొన్న ఉద్యోగాల భర్తీకి రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్ నోటిఫికేషన్ విడుదల చేసింది.

ఆర్ఆర్‌బీ రీజియన్లు: అహ్మదాబాద్, అజ్మీర్, బెంగళూరు, భోపాల్, భువనేశ్వర్, బిలాస్‌పూర్, చండీఘడ్, చెన్నై, గువాహటి, జమ్మూ అండ్ శ్రీనగర్, కోల్‌కతా, మాల్దా, ముంబయి, ముజఫర్‌పూర్, పట్నా, ప్రయాగ్‌రాజ్, రాంచీ, సికింద్రాబాద్, సిలిగురి, తిరువనంతపురం, గోరఖ్‌పూర్.

● **కానిస్టేబుల్: 4,208** ● **సబ్ ఇన్‌స్పెక్టర్: 452**

అర్హత: కానిస్టేబుల్ పోస్టులకు పదో తరగతి, ఎస్ఐ ఉద్యోగాలకు డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.

వయోపరిమితి: 2024 జూలై 1 నాటికి కానిస్టేబుల్ పోస్టులకు 18-28 ఏళ్ల మధ్య, ఎస్ఐ పోస్టులకు 20-28 ఏళ్ల మధ్య ఉండాలి.

ప్రారంభ వేతనం: నెలకు ఎస్ఐ పోస్టులకు రూ.35,400; కానిస్టేబుల్ పోస్టులకు రూ.21,700.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష(కంప్యూటర్ బేస్డ్ టెస్ట్), ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్, మెడికల్ స్టాండర్డ్ టెస్ట్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు ఫీజు: ఎస్సీ, ఎస్టీ, మాజీ సైనికోద్యోగులు, మహిళలు, ట్రాన్స్‌జెండర్, మైనారిటీ, ఈబీసీ అభ్యర్థులకు రూ.250. ఇతరులకు రూ.500.

ఆన్‌లైన్ ఫీజు చెల్లింపు, దరఖాస్తునకు చివరి తేదీ: మే 14

నోట్: రీజియన్ల వారీ ఖాళీలు, విద్యార్హత, రాత పరీక్ష, సిలబస్ తదితర పూర్తి వివరాలు త్వరలో విడుదలకానున్నాయి. సంక్షిప్త ఉద్యోగ ప్రకటనను ఎంప్లాయిమెంట్ న్యూస్ మేగజైన్(మార్చి 2-8)లో చూడవచ్చు.

వెబ్‌సైట్: https://rpf.indianrailways.gov.in/RPF/

బెల్‌లో టీచింగ్ పోస్టులు

మొత్తం ఖాళీలు: 30

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్...తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

టీచింగ్ పోస్టులు: ఎన్‌టీటీ, పీఆర్‌టీ, జీపీటీ, టీజీటీ, పీజీటీ, పీయూసీ, ఎఫ్‌జీసీ, ఆఫీస్ అసిస్టెంట్ ఇతరాలు.

సబ్జెక్టులు: ఇంగ్లిష్, కన్నడ, హిందీ, సంస్కృత్, మేథమెటిక్స్ జనరల్ సైన్స్, సోషల్ సైన్స్, కంప్యూటర్ సైన్స్, బయాలజీ, ఫిజిక్స్ మొదలైనవి.

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, బీఈడీ, బీఈ, బీటెక్, ఎంఏ, ఎంటెక్, పీహెచ్‌డీ మొదలైనవి.

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్‌లో

చిరునామా: సెక్రటరీ, బీఈ, బెల్ హైస్కూల్ బిల్డింగ్, జలహల్లి, పీఓ బెంగళూరు.

దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 23

వెబ్‌సైట్: https://bel-india.in/jobnotifications/

లిటిల్స్



ఎలుగు గర్వం


ఒక అడవిలో ఎలుగు బంటి ఉండేది. దానికి రెండు పిల్లలు ఉండేవి. వాటిని బాగా చూసుకునేది. చెట్లనెక్కడం నేర్పించేది.. దగ్గరుండి మరీ వంకల్లో పిల్లలతో పాటు ఈదేది. అయితే ఆ ఎలుగుకు ఓ మానసిక సమస్య ఉంది. అదేంటంటే.. ఇతరుల బాధను చూసి నవ్వటం, సంతోషంగా ఉండటం చేసేది. ఎందుకో ఇతరులు బాధగా ఉంటే అందులో ఆనందాన్ని పొందేది తెలీకుండా. దీంతో ఎలుగుకు పిచ్చిపట్టిందనేవి మిగతా జంతువులు.

తేనెటీగలు ఉన్న పుల్లను విరిచి జింకల దగ్గర వదిలేది. జింకలను తేనెటీగలు కుడుతుంటే సంతోషడేది. ఎగిరెగిరి నవ్వేది. ఒక గంపలాంటి ఆకు తీసుకొచ్చి అందులో కొన్ని కప్పలు వేసి పెద్ద పాము దగ్గర వదిలేసేది. ఆ పాము కప్పలను తింటుంటే.. ఆ కప్పలు పరిగెత్తుతుంటే ఎంతో సంతోషపడేది. ఆ పాముల దగ్గరకు ముంగిసలను పంపించి.. అవి కొట్లాడుతుంటే లోలోపల ఆనందపడేది. కోతుల దగ్గరకు చింపాజీలను పంపి భయపెట్టించేది. చెల్లా చెదురైన కోతులను చేరదీసి బాధలు వినేది. ఇలాంటి సమయంలోనే లోలోపల ఎంతో తెలీని సంతోషాన్ని ఆస్వాదించేది. ఈ చేష్టలు చూసిన ఓ చిలుక ఒక రోజు ఇలా అంది.. 'అయ్యా.. ఎలుగుబంటి గారు. మీకు మీ జాతిలో ఉండే లక్షణాలే లేవు. కోతుల లక్షణాలివి. ఇంత అల్లరి చేస్తుంటే చూస్తున్నా. మీరు ఎలుగుబంటి.. హుందాగా ఉండండి' అనడిగింది. ప్రతి వొక్కరూ నాకు సలహాలు ఇచ్చేవారే అంటూ కోప్పడింది ఎలుగు. ఒక రోజు వేటకు వెళ్లి ఇంటికి వెళ్తానే.. ఎప్పుడూ ఎదురొచ్చే పిల్లలు రాలేదు. అవి ఎక్కడికి వెళ్లాయోనని బాధపడింది. అడవంతా తిరిగింది. పిల్లలు కనిపించక.. మూర్ఛపోయి పడిపోయింది. ఇంతలో రెండు ఎలుగు పిల్లలు వచ్చి దగ్గరగా కూర్చున్నాయి. కన్నబిడ్డల్ని చూస్తుంటే ఏడుపొచ్చింది ఎలుగుకు. 'ఆపమ్మా..' అంటూ ఎలుగుపిల్లలు గట్టిగా అన్నాయి. 'ఇతరులు బాధపడుతుంటే ఆనందపడ్డావు. మేం చూశాం. మేము కనపడకపోయేసరికి బాధపడుతున్నాం. మేం కావాలనే మన ఇంటి వెనకాల రాతికింద దాక్కున్నాం. నీలా మిగతా జంతువులు బాధపడతాయి కదా!' అన్నవి పిల్లలు. దీంతో ఎలుగుకు గర్వం అణిగిపోయింది. తప్పు తెలుసుకుంది.









డైలీ సుడోకు - 283

			4	3	7			
	2				9	7		5
8		3						
2					6	1		
	8						5	
		1	9					7
						9		8
3		4	8				7	
			7	2	5			

సుడోకు - 282 సమాధానం

4	1	8	9	7	5	2	3	6
6	3	7	4	2	1	9	8	5
5	9	2	3	6	8	4	1	7
1	2	9	6	8	7	3	5	4
8	7	4	5	1	3	6	9	2
3	6	5	2	9	4	8	7	1
7	8	6	1	3	2	5	4	9
9	5	3	7	4	6	1	2	8
2	4	1	8	5	9	7	6	3

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.